



ఫిబ్రవరి-88
రూ. 6
PHISICAL ★ EDUCATION
శంలో అత్యధికంగా కొని చదవబడుతున్న తెలుగు మాస పత్రిక



Savoy Club
BRANDY
Make it your lifesty
VK/MH/AW-108



విశిష్ట సుగంధం
మైమరపించే తాజాదనం
క్రొత్త
ప్రేమ్
మీకోసమే
NEW
PREM
ఇప్పుడు అనువైన ఆకారంలో పరిమళంతో వస్తోంది.
Imageads 2418 Tel

స్థాపకుడు:
వి.వి.రాఘవయ్య

మేనేజింగ్ ఎడిటర్:
లీలావతి రాఘవయ్య

సంపుటి 26 ఫిబ్రవరి-88 సంచిక 1

"ఇదండీ వరస"

ఈ నెల ముఖచిత్రం: బాలకృష్ణ

స్వాతి పి. బి. నెం. 1824, హైదరాబాదు-20. ఫోన్-64104

గౌరవ సంపాదకులు-యర్రంశెట్టి శాయి.

తొలిమాట

జ్యోతి పాఠకులకు, ఏజంట్లకు, ప్రకటన కర్తలకూ, రచయితలకూ, నూతన సంవత్సర శుభాకాంక్షలు.

ఈ సంక్రాంతి మీ ఇంట ఆనంద సంక్రాంతి కావాలనీ, మరో సంక్రాంతి వరకూ ఆ ఆనందం కొనసాగాలనీ జ్యోతి ఆకాంక్ష.

తెలుగు సాహిత్యంలో కలకాలం నిలిచిపోయే విధంగా మీ కోసం రజతోత్సవ కానుకగా రూపొందిస్తున్న ప్రత్యేక సంచిక అందంగా రూపు దిద్దుకొంటుంది. ఈ ప్రత్యేక సంచికలో ప్రచురించ బోతున్న ఆణి ముత్యాలవంటి రచనలు చేసిన సాహితీ దిగ్గజాల పేర్లను ఈ సంచికలో ప్రచురిస్తున్నాం,

జ్యోతి ప్రతి సంచికా ఒక ప్రత్యేక సంచికేనని మీకు తెలుసు. అందుకే ఈ నెల మీ కోసం ఏడు మంచి కథల్ని అందిస్తున్నాం. ఈ కథల్ని 1987 ఉగాదినాడు విశాఖ ఆలిండియా రేడియో వారు ప్రసారం చేశారు. అనివార్య కారణాలవల్ల ఈ సంచికలో 'డిక్టేటర్' సీరియల్ ప్రచురించలేదు.

—ఎడిటర్

రజతోత్సవ ప్రత్యేక సంచిక

జ్యోతి రజతోత్సవ ప్రత్యేక సంచికలో ప్రచురించ బోతున్న సాహితీ మాణిక్యాల సృష్టికర్తలు.

ముళ్ళపూడి వెంకటరమణ
ఆరుద్ర
కొడవటిగంటి కుటుంబరావు
తిలక్
భమిడిపాటి రామగోపాలం
రావిశాస్త్రి
కాళీపట్నం రామారావు
త్రిపుర
బీనాదేవి
ఇచ్ఛాపురపు జగన్నాథరావు
మధురాంతకం రాజారాం
చాగంటి సోమయాజులు
పురాణం సుబ్రహ్మణ్యశర్మ
పాలగుమ్మి పద్మరాజు
రంగనాయకమ్మ

అవసరాల రామకృష్ణారావు
బి. వి. యస్. అమృతవల్లి
కళ్యాణ సుందరీ జగన్నాథ్
భమిడిపాటి జగన్నాథరావు
డి. కామేశ్వరి
గొల్లపూడి మారుతీరావు
హితశ్రీ
రావికొండలరావు
అరిగే రామారావు
కె. వివేకానందమూర్తి
ఆదివిష్ణు
వై. రాంబాబు అండ్ కాయి
శ్రీ సుధా
భానుమతీ రామకృష్ణ

వీరి రచనలు కాక మరెన్నో అద్భుత రసగుళికల్లాంటి కార్టూన్లూ, జోకులతో రూపొందిస్తున్నాం.

బాపురే జ్యోతి

తెలుగు పత్రికల, కార్టూన్ల, బొమ్మల, సినిమాల చరిత్ర గత నలభై ఏళ్ళగా ఓ పెద్ద మనిషి జీవితంతో ముడి పడి ఉంది. ఆ పెద్ద మనిషి ఎవరు? ఆయన ఏం చేసినా జనం బాప్ రే అనడం మర్చిపోయి బాపురే! అంటారు.


అలాగే 'జ్యోతి' జీవితం కూడా గత పాతిక సంవత్సరాలుగా ఆయన కుంచెకు ముడిపడి ఉంది.

"జ్యోతి" ని నిండుగా వెలిగే జ్యోతిగా మలచడానికి ఇండియనింకు పోసి కుంచెలో దీప శిఖని ముట్టించిన వ్యక్తి బాపు!

ఆ—అన్నట్టు వచ్చే నెలలో విడుదలౌతున్న "జ్యోతి" రజతోత్సవ ప్రత్యేక సంచిక బాపు బంగారం లాంటి బొమ్మతో అలంకరిస్తున్నాం.

తెలుగువాడి గుండె కొట్టుకున్నంత కాలం గుండెల్లో దాచుకోవల్సిన ప్రత్యేక సంచిక:

కొనబోతూ రుచెందుకు?
తప్పక కొనండి!
తప్పక చదివి దాచుకోండి.



ఉత్తరాలు

డైనమిక్ యంగ్ హీరో చిరంజీవి ముఖచిత్రంతో (జనవరి 1988) జ్యోతి అందంగా ముస్తాబై మమ్మల్నలరించింది. బాపుగారి హ్యూమరాలజీ-59 బాగుంది. ముఖ్యంగా శ్రీ యం. వి. వి. సత్యనారాయణగారి 'వద్దు బహుమతి వద్దు' కథ నాకు నచ్చడానికి కారణముంది. 1987 జనవరి ఓ పత్రికలో నేను అడిగిన ప్రశ్నకు 'బహుమతి పొందిన ప్రశ్న'గా సపరేట్ కలర్‌లో ప్రింటు మాత్రం చేయించారు. ఓ రెండు నెలలదాకా బహుమతి వస్తుందనే ఎదురుచూపు, నీకేం బహుమతి వచ్చిందో చెప్పమని స్నేహితుల వేధింపు భరించలేక ఓ ఉత్తరం వ్రాశా. బహుమతి పొందిన ప్రశ్నగా మీ పత్రికలో ప్రచురించడమే ఓ బహుమతా! లేక ఏదైనా బహుమతి పంపుతారా అని, దానికి జవాబులేదు. అసలు ఈ పత్రికలన్నీ ఇలాగే చేస్తున్నాయా! అని నాకో అనుమానం కూడా రాక పోలేదు మరి. ఇలాంటి విషయంమీద ఓ కథ వ్రాయాలనే ఆలోచన వచ్చినందులకే రచయిత గారికి ధన్యవాదములు కథలలో శ్రీ యం ఆర్. శేషాద్రిగారి 'తల్లిమనసు' కథ నాకెంతో నచ్చింది. ఆడపిల్లలు పుడితే గడప తొక్కొద్దన్న అత్తలకు, తల్లులకు ఇదో గుణపాఠం. ముఖ్యమైనది ఆడా, మగా కాదు మాతృహృదయం ఎంత క్షోభిస్తుందో తెలుస్తుంది. అలాగే నెలకో మంచి నవల నందిస్తున్న నాలాంటి ఎంతోమంది సాహిత్యాభిమానుల అభిమానాన్ని చూరగొంటున్న జ్యోతికి, థాంక్స్ అలాగే ప్రత్యేక రజితోత్సవ సంచికకోసం ఎదురుచూసే-

పోలోజు వెంకటాచారి
హైదరాబాద్

జ్యోతి మాసపత్రికకు మా నూతన సంవత్సర శుభాకాంక్షలు జనవరి నెలలో సుప్రీంహీరో చిరంజీవి ముఖచిత్రం చాలా ఆకర్షణీయముగా ఉంది. యండమూరిగారి సీరియల్ "మంచుపర్వతం" చాలా బాగుంది. యం. ఆర్. శేషాద్రిగారు వ్రాసిన "తల్లిమనస్సు" మా మనస్సును ఎంతో ఆకట్టుకున్నది చిన్నపిల్లలకు బొమ్మల "సీరియల్" ప్రచురించినచో చాలా బాగుంటుంది. దయచేసి జోక్స్ ఎక్కువగా వేయవలెను.

గొల్లపూడి వేణుగోపాలరావు
బొబ్బిలి

జనవరి సంచికలో దాదాపుగా కథలన్నీ బాగున్నాయ్ ముఖ్యంగా వసుంధరగారి కథ బాగుంది. సీరియల్స్ అన్నీ ఒకదానికొకటి పోటీ పడుతున్నాయ్. ఫీచర్స్ అన్నీ బాగుంటున్నాయ్ యండమూరిగారు, సూర్యదేవరగారు ఇద్దరు రెండు వెరైటీ సబ్‌జెక్ట్స్‌మీద మంచి సీరియల్స్ అందిస్తున్నందుకు ఎడిటర్ గారికి అభినందనలు.

టి. వాసు
ఖమ్మం

ఈ మధ్య పత్రిక చాలా లేటుగా వస్తుంది. దానివల్ల మేము చాలా నిరాశ చెందుతున్నాము. దయచేసి పత్రికను నెల మొదటి వారంలో విడుదల చేయగలరని ఆలోచిస్తున్నాము. యండమూరిగారి 'మంచు పర్వతం' సీరియల్ సింప్లీ సూపర్బ్.

వి. శ్రీరామచంద్రమూర్తి
గుంటూరు

ఈ సంచికలో మీరు ప్రచురించిన నవలానుబంధం 'ఇంటర్వ్యూ' గురించి ఈ ఉత్తరం రాస్తున్నాను. నేను 'జ్యోతి' రెగ్యులర్‌గా చదువుతాను. రచయిత్రి పేరు ఇంతవరకు 'జ్యోతి' లో చూడలేదు కొత్త రచయిత్రి అయినా, అందునా ప్రవాసాంధ్రురాలైనప్పటికీ అద్భుతంగా రాసారు. ఆమెకు మా హృదయపూర్వక అభినందనలు. తెలుగులో ఇంతవరకూ ఎవ్వరూ తీసుకోని సబ్జెక్టుపై చేసిన ఈ ప్రయోగం చాలాబాగుంది. ఇంతమంచి నవల ప్రచురించినందుకు హృదయపూర్వక అభినందనలు.

రమేష్
విజయవాడ

జనవరి 88 సంచికలోని కథలు చాలా బావున్నాయి ఇకపోతే నవల గురించి రాయాలంటే ఓహ్... అద్భుతం ఇటువంటి ప్రయోగం ఇంతవరకూ ఎవ్వరూ చేయలేదు చేయబోరు. తీసుకొన్న సబ్జెక్టు హాండిల్ చేసిన విధం అద్భుతం రచయిత్రి కె. సామ్రాజ్యలక్ష్మికి అభినందనలు.

మాధవి
హైదరాబాద్

తిరుపతి :- ప్రసిద్ధకవి, విమర్శకుడు నూతలపాటిగంగాధరం పేరుతో స్థాపించబడిన "గంగాధరం సాహితీ కుటుంబం (రిజి) ప్రతి సంవత్సరం మే 28 తేదీ రు 1500/- అవార్డు" నూతలపాటి సాహితీ సత్కారం "పేరుతో యిస్తుంది. ఈ సంవత్సరం ఆధునిక సామాజిక జీవనం ప్రతిబింబించే ఉత్తమ వచన కవితా సంకలనానికి లేదా కావ్యానికి యీ అవార్డు యిస్తుంది. ఈ అవార్డుకు రచనలు పంపదలచిన కవులు క్రింది సూచనలు పాటించాలని కార్యదర్శి ఎస్. మునిసుందరం తెలియజేస్తున్నారు,

- సంకలనాలు లేదా కావ్యాలు 1985 జనవరి నుండి 1987 డిశంబరులోగా ప్రథమ ముద్రణ జరిగివుండాలి.
- సంకలనం లేదా కావ్య రచయిత ఒకరే అయివుండాలి.
- ప్రథమ ముద్రణ ప్రతులే పంపాలి.
- అనువాదాలు వ్రాత ప్రతులు స్వీకరించబడవు.
- అవార్డు పొందినవారు సన్మాన సభకు తప్పకరావాలి.

పరిశీలనార్థం నాలుగు పుస్తకాలు "కార్యదర్శి, గంగాధరం సాహితీ కుటుంబం (రిజి), 10-3-190 ఎ2, కోటకొమ్మలవీధి, తిరుపతి 517501 చిరునామాకు 15-3-1988 తేదీలోగా పంపాలి.

సెక్రటరి
గంగాధరం సాహితి కుటుంబం
10/190 ఎ2, కె కె స్ట్రీట్,
తిరుపతి-1.

హ్యూమరాలజీ – 60

— గతసంచిక తరువాయి —

"ఇది అన్యాయం, అక్రమం, అసంబద్ధం" అంటూ అరిచాడు జనార్ధన్ వాళ్ళ మధ్యకెళ్ళి సినిమా పోజులో నిలబడి,

పురోహితులందరూ ఆశ్చర్యంగా చూశారతనివేపు.

"ఏమిటి నువ్ మాట్లాడేది ?" అడిగాడొకతను.

"ఇదే ఈసతి జరపటం మహా దుర్మార్గం ! నా కంఠంలో ప్రాణం ఉండగా ఇలాంటిది జరగటానికి నేనొప్పుకోను" మళ్ళీ అరచాడతను.

"నీ కంఠంలో ప్రాణం ఉంటే మీ ఆవిడెందుకు సతి చేస్తుంది ?" అన్నాడొకతను. "నీ ప్రాణం పోయాకే చేస్తుంది"

"నేననేది నా సంగతికాదు ! ధర్మరాజు భార్య సునీతాదేవి సంగతి !" కోపంగా అన్నాడు.

"అవును ! సునీతాదేవి సతి జరపటానికి వీల్లేదు" అరచాడు రంగారెడ్డి.

"ఇదిగో–దీనికి వ్యతిరేకంగా మా కమిటీ పాస్ చేసిన రిజల్యూషన్ కాపీ" అన్నాడు శాయిరామ్.

"హిందూ మత ధర్మానికి వ్యతిరేకంగా మీలాంటి వాళ్ళు పాస్ చేసిన రిజల్యూషన్స్ చెల్లవ్ నాయినా !" అన్నాడు శ్యామ్‌రావ్ మాకు సర్దిచెప్తూ.

"మేమేకాదు కేంద్రప్రభుత్వం కూడా సతికి వ్యతిరేకంగా బిల్ పాస్ చేసింది" అన్నాడు గోపాల్రావ్

"ప్రభుత్వం చాలా బిల్స్ పాస్

యర్రంశెట్టి సాయి

సతీప్రహసనం

చేస్తుంది నాయినా ! కానీ వాటిని ఎవరు అమలు పరుస్తున్నారు ? వేటిదారి వాటిదే ? ఆ మధ్య ముస్లిమ్స్ మతం విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకోకూడదని వాళ్ళు చెప్తే ప్రభుత్వంవాళ్ళు చెప్పినట్లు చేసిందా లేదా ? మరిప్పుడీ హిందూ మతం జోలికెందుకొస్తున్నట్లు ?" తిరిగి అడిగాడతను.

మాకేం మాట్లాడాలో తెలీలేదు.

"అంతా అబద్ధం. హిందూమతంలో ఇలా చేయాలని ఎక్కడాలేదు" అరచింది పార్వతీదేవి.

"ఉంది ! ఉండబట్టే అలనాటి నుంచీ సతి ఆచారం వస్తోంది"

"లేదు"

"ఉంది"

"అసలు ఆడదానికీ మంటకూ అవినాభావ సంబంధం ఉంది ! ఎలాంటి ఇబ్బంది వచ్చినా ఆడది కిరసనాయిలు పోసుకుని తగలేసుకుని చనిపోవటం మన సంప్రదాయం ! ఆనాటి సీతమ్మ వారి అగ్ని ప్రవేశంనుంచీ ఇవాల్టి వరకట్నాల చావుల వరకూ అంతా అగ్నిమయం–"

రాజేశ్వరికి కోపం పొడుచుకొచ్చింది.

"సీతమ్మ అగ్నిప్రవేశం సీన్ డౌన్ డౌన్ ; వాల్మీకి డౌన్‌డౌన్" అంటూ అరిచింది ఆవేశంగా.


అందరం కలసి పది నిమిషాలపాటు అరచాం.

మా అరుపులు విని శ్యామ్రావుకీ, ధర్మరాజు తల్లిదండ్రులకూ కోపం ముంచుకొచ్చింది.

"సతీ సహగమనం జిందాబాద్ – లోక్‌సభ బిల్ డౌన్ డౌన్" అంటూ అరచారు అతని తరఫున కొందరు.

"ఇదిగో–మీకీ వెధవపని ఆపకపోతే పోలీస్ రిపోర్టిస్తాం !" అన్నాడు శాయిరామ్.

"ఏమిటి ? పోలీసులా ! వాళ్ళేం చేస్తారు వాళ్ళమొఖం ! దియోరాలాలో ఏం చేశారు ? అంతా అయాకవచ్చి ఎఫ్ ఐ ఆర్ రాసుకెళ్ళారు" అన్నాడు



ప్రవర్తనలో తక్కున మార్పు వచ్చేసింది.

"అలాగాసార్ మరి చెప్పరేం ? ఏయ్ సెవన్‌జీరో! వాన్‌లో ఉన్నవాళ్ళిద్దరినీ వదిలేసెయ్" అంటూ నావేపు తిరిగాడు మళ్ళీ.

"ఆ! చెప్పండిసార్! ఏమిటిప్పుడు ప్రాబ్లెమ్ ?" జరిగిందంతా చెప్పాను.

"కానీ మతపరమయిన విషయాల్లో జోక్యం కలుగజేసుకుంటే కొంచెం రిస్క్‌సార్ - అన్నాడు" ఇబ్బందిగా.

"ఓర్నీ ; ఇందులో మతమేమిటండీ! అవతల మర్డర్ జరుగుతుంటేనూ ?" చిరాగ్గా అన్నాడు రంగారెడ్డి.

"నేను అన్నీ ఎంక్వయిరీచేశానండీ! సునీతాదేవి తాత ముత్తాతలు రాజపుట్స్ వంశానికి చెందినవారట. అందుకని వాళ్ళకది పవిత్రమయిన ఆచారం -" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"ఆ ఆచారం ఆంధ్రప్రదేశ్‌లో ఎలా పాటిస్తారండీ! ఇక్కడ కేవలం మన ఆచారాలు మాత్రమే పాటించాలి!" అన్నాడు శాయిరామ్.

"మన ఆచారం ఏమిటి ?" ఆశ్చర్యంగా అడిగాడతను.

"పెళ్ళయిన రెండేళ్ళలోపే భార్యను కట్నంకోసం చంపేయటం మన సాంప్రదాయం! సతీసహగమనం వరకూ భార్య బ్రతికి ఉండకూడదసలు -" అన్నాడు రంగారెడ్డి.

"అవునవును! ఆమాటా నిజమే!" అన్నాడు ఇన్‌స్పెక్టర్ తలగోక్కుంటూ.

"యూ ఆర్ అండర్ అరెస్ట్! ఇక్కడి సంప్రదాయాలను పాటించనందుకు" అన్నాడు శ్యామ్రావ్‌తో.

శ్యామ్రావ్ కొంచెం జంకాడు.

"అదేమిటిసార్ ? ఇలాంటి మహత్తరమయిన సంఘటన మన రాష్ట్రంలో జరుగుతున్నందుకు మనమంతా గర్వించాలి. చూడండి! మన రాష్ట్రంలో సతి గుడి ఒక్కటికూడా లేదు. ఇప్పుడీసతి ఏర్పాటు చేస్తున్నామనేసరికి చూడండి! ఆరులక్షల రూపాయలు విరాళంగా ఇచ్చారు. మన రాష్ట్రంలోని వర్తకులూ, రాజకీయ నాయకులూ! అందులో ఇద్దరు కలెక్టర్లు, పోలీస్ ఆఫీసర్లుకూడా ఉన్నారు-"

మేము తెల్లమొగం వేశాము.

"పోలీస్ ఆఫీసర్లుకూడా ఉన్నారా సార్ ?" భయంగా అడిగాడు ఇన్‌స్పెక్టర్.


"ఇద్దరు" అన్నాడు శ్యామ్రావ్ ధైర్యం పుంజుకుంటూ.

"అయితే" అంటూమళ్ళీ బుర్రగోక్కుని నావేపు తిరిగాడు. "పోనీ ఓపని చేద్దాం! మనకేం తెలీనట్లు మనం వెళ్ళిపోదాం! సతి జరిగిపోయాక వచ్చి అరెస్ట్ చేద్దాం!" అన్నాడు ఆనందంగా.

"అది జరగడానికి వీల్లేదనే కదయ్యా మొత్తుకునేది ?" చిరాగ్గా అన్నాడు రంగారెడ్డి. ఈలోగా జనంలో త్రొక్కిసలాట ప్రా[illegible]

"జరగండి; మంత్రిగారొచ్చారు" అంటున్నారెవరో.

మరుక్షణం మంత్రిగారి అంగరక్షకులు అందరినీ పక్కకు తోసివేస్తూ మంత్రిగారిని లోపలకు సునీతాదేవి ఇంటి దగ్గరకు తీసుకెళ్ళారు.



ఆయన సునీతాదేవికి దణ్ణంపెట్టి, చెంపలేసుకుని బయటికొచ్చారు మళ్ళీ. దాంతో పార్వతీదేవీ, రాజేశ్వరీ, సావిత్రమ్మగారూ పెద్దగా కేకలేసుకుంటూ మినిష్టరుగారికి ఎదురువెళ్ళారు.

"మినిష్టరుగారూ డౌన్‌డౌన్-సతీసహగమనం డౌన్ డౌన్ -" మినిష్టరుగారు చిరునవ్వు నవ్వారు.

"అలా తొందర పడకండి. సతీసహగమనం బాన్‌చేస్తూ 'లా' రాబోతోంది త్వరలో! అంతవరకూ ఓపిక పట్టండి! నిజానికి నేనూ సతికి వ్యతిరేకినే-"

"అంతా అబద్ధం!" అరచాడు శాయిరామ్ ఆవేశంగా "మీరు వ్యతిరేకి అయితే ఇప్పుడు ఇక్కడికొచ్చి సునీతాదేవికి ఎందుకు నమస్కారం పెట్టి పూజలు చేశారు ?"

"అది సీక్రెట్! చెప్పటం కావుంచదు -"

"వీల్లేదు చెప్పాల్సిందే! లేకపోతే మిమ్మల్ని వెళ్ళనీయం ఇక్కడినుంచి "

అయన కొంచెం ఇబ్బందిగా అటూ

శ్యామ్రావ్ హేళనగా.

"గట్లనా! నీపని ఇప్పుడే జెప్తా!" అంటూ సైకిల్‌మీద పోలీస్‌స్టేషన్‌కి వెళ్ళాడు యాదగిరి.

సునీతాదేవికి పెళ్ళినాటి అలంకరణలు చేయసాగారు లోపల గదిలో. అప్పటి కప్పుడే కొంతమంది మగా ఆడా ఆమెకు, కిటికీలోనుంచే దణ్ణాలుపెట్టి చెంపలు వేసు కోసాగారు. మాకు వళ్ళు మండిపోతోంది వాళ్ళను చూస్తుంటే

"ఏయ్, మీకేమయినా బుద్ధుందా? వాళ్ళను నాలుగు తిట్టాల్సిందిపోయి మీరూ మూర్ఖంగా ప్రవర్తిస్తున్నారా?" అన్నాడు రంగారెడ్డి.

"మా ఇష్టమయ్యా! మా నమ్మకాన్ని కాదంటానికి నువ్వెవడివి" అంటూ ఎదురు తిరిగారు వాళ్ళు.

సరిగ్గా అప్పుడే పోలీసులు వచ్చారు వాన్‌లో.

రాగానే మా గోపాల్రావ్ చొక్కా కాలర్ పట్టుకున్నాడు ఇన్‌స్పెక్టర్.

"పద వానెక్కు" అన్నాడు ఇన్‌స్పెక్టర్

గోపాల్రావ్ నివ్వెరపోయాడు.

"ఎందుకు?" అడిగాడు ఆశ్చర్యంగా.

"ఈ స్కూటర్ నీదేనా?"

"నాదే!"

"మరి హెల్మెట్ ఏది?"

"మా ఇల్లు ఇక్కడే అందుకని హెల్మెట్ తేలేదు"

"ఏయి సెవన్ వన్ జీరో - వీడిని వాన్‌లో వేసెయ్"

మరుక్షణం ఇద్దరూ కానిస్టేబుల్స్ వచ్చి గోపాల్రావ్‌ని లాక్కెళ్ళి వాన్‌లో వేసేశారు.

"దిసీజ్ టూమచ్" అన్నాడు రంగారెడ్డి ఇన్‌స్పెక్టర్ దగ్గరకెళ్ళి రెండు చేతులూ నడుమ్మీద పెట్టుకుని.

"వీడినికూడా వాన్‌లోకి తోసెయ్యండి" అన్నాడు ఇన్స్పెక్టర్.

"నన్నా? నన్నెందుకు?"

ఇన్‌స్పెక్టర్‌కి ఏం చెప్పాలో తోచలేదు. రెండుక్షణాలు టోపీతీసి బుర్ర గోక్కున్నాక ఆయిడియా వచ్చింది.

"ఎందుకేమిటి? ఏూంటీ టెర్రరిస్టు యాక్ట్ కింద"

ఇంక లాభంలేదని నేను కల్పించుకున్నాను.

"అది కాదు ఇన్‌స్పెక్టర్‌గారూ! మిమ్మల్ని పిలిపించింది మేము. అవతల ఆ శ్యామ్రావ్ అనేవాడు ఆ సునీతాదేవి బంధువులను రెచ్చగొట్టి సతీసహగమనం చేయిస్తున్నాడు. వాళ్ళసంగతి చూస్తారన్ని మేమనుకుంటూంటే మమ్మల్ని లూ సేస్తానంటారేమిటి?"

"ఏయ్! నువ్వెవరు?" దబాయింపుగా అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"ఈ కాలనీ కమిటీకి వైస్ ప్రెసిడెంట్‌ని -"

"వీణ్ణికూడా లోపలకేసెయ్యండ్రా"

నేను కంగారుగా యాదగిరి వేపు చూశాను.

"ఈయనను లోపల వేశారంటే మీరు లోపటయిపోతారు! ఈయన ఈ కాలనీ లోని 'తెలుగుదేశం' పార్టీ శాఖకు సెక్రటరీ" అన్నాడు యాదగిరి అబద్ధమాడేస్తూ.

ఆమాట వినటంతోనే ఇన్‌స్పెక్టర్ ఇటూ చూసి చెప్పేశాడు.


"మరేంలేదు; మన జనంలో చాలా మంది మూర్ఖులున్నారన్న సంగతి మాకు తెలుసు, వాళ్ళందరికీ సతిలాంటి మూఢా చారాలమీద మాంచి గురివుంది. ఇప్పుడు మేము 'కాదు' అని గట్టిగా అరచామంటే వచ్చే ఎలక్షన్లలో మా ఓట్లు గోవిందా! ఆపోజిషన్‌వాళ్ళు నెమ్మదిగా వాళ్ళను 'దువ్వి' మమ్మల్ని గెలిపిస్తే సతీసహగమనానికి 'భారతరత్న'లాంటి అవార్డులు ఇప్పిస్తాం! టి.వి.లో రోజూ ఓ సతి గుడి గురించి డాక్యుమెంటరీ చూపిస్తాం అనేసి గెలిచి పవర్లోకొచ్చేస్తారు. అంచేత ఎక్కడో ఒకరిద్దరు సతీసహగమనం చేసినంత మాత్రాన మనకు మునిగిపోయిందేముంది? దానికోసమని పదవులు పోగొట్టుకోమంటారా? మమ్మల్నిలా కోరటం మీకు న్యాయమేనా? చెప్పండి" అంటూ కన్నీరు తుడుచుకున్నాడు.

మాకందరికీ ఆయనను చూస్తే జాలి వేసింది.

"మరి మన తెలుగుపాఠం పుస్తకాల్లో కూడా సతి చాలా గొప్పదనిస్తుతించే వాక్యాలు కొన్ని ఉన్నాయ్. అవయినా తీసేస్తారాలేదా?" అదమాయించింది రాజేశ్వరి.

"అరె! అలా మన గవర్నమెంట్ టెక్ట్స్‌బుక్స్‌లో ఉందా? దిసీజ్ టూమచ్ ఇప్పుడే కమిటీ వేయిస్తాను" అంటూ హడావుడిగా వెళ్ళిపోయాడు.

మేము చూస్తూండగానే సునీతాదేవి గాయత్రి మంత్రం జపిస్తూ కాలనీని తిడుతూ నడవసాగింది. కాలనీ మధ్యలోనే చితి ఏర్పాటు చేసేశారు క్షణాల్లో. అంతవరకూ మాతోపాటు సతికి వ్యతిరేకంగా నినాదాలు చేసిన స్త్రీలు చాలా మంది మమ్మల్ని వదిలేసి వెళ్ళి సునీతాదేవికి భక్తితో మొక్కటం ప్రారంభించారు. మరి కాసేపట్లో సునీతాదేవిని తీసుకొచ్చి చితిలో కూర్చోబెట్టి ఆమె భర్త శరీరాన్ని ఆమె వళ్ళో పడుకోబెట్టారు. శ్యామ్రావ్ అదంతా వీడియో తీయిస్తున్నాడు, తర్వాత కాసెట్స్ అమ్ముకోటానికి.



మరుక్షణం చితికి నిప్పంటించారు. సునీతాదేవి కెవ్వున కేకవేసింది. భర్త శరీరాన్ని ఒక్కతోపు తోసి లేచి పరుగుతో రాబోయింది. అయితే చుట్టూ ఉన్న కొంతమంది ఆమెను బలంగా కర్రలతో కొట్టేసరికి చితిలోనే పడిపోయింది.

"దిసీజ్ టూమచ్-ఇది ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా జరుగుతోంది" అంటూ గట్టిగా అరచి ముందుకు ఒక్క దూకు దూకాను నేను.

మా ఆవిడా, పిల్లలు, పక్కింటి వాళ్ళు అందరూ నాచుట్టూ మూగి ఉన్నారు.

'ఏమిటండీ! ఏం జరిగింది? ఎందుకలా కొంపలు మునిగేట్లు కేకల్పెట్టారు?' అడిగింది మాఆవిడ గాబరాగా.

"కలొచ్చింది" అన్నాను మంచం కిందనుంచీ లేచి కూర్చుంటూ.

"ఏం కల!" పక్కింటావిడ అడిగింది నవ్వాపుకుంటూ

"సునీతాదేవి లేదూ-వాళ్ళాయన ధర్మరాజు చచ్చిపోతే సతీ సహగమనం చేసిందట-"

"సిగ్గులేకపోతే సరి! అలాంటి వెధవ కలలు కనడానికి?" అంది మా ఆవిడ.

అప్పుడే రంగారెడ్డి, కాయీరామ్, జనార్ధన్ గోపాల్రావ్, యాదగిరి హడావుడిగా వచ్చారు లోపలకు

"త్వరగా పద! ధర్మరాజు ఇంటికెళ్ళాలి మనం" అన్నాడు కాయీరామ్ ఆత్రుతగా.

"ఎందుకు? చచ్చిపోయాడా?" అడిగాను అనుమానంగా.

"లేదింకా! తలమాత్రం పగిలిందట! వాళ్ళ అమ్మకూ, అక్కకూ మాత్రం గాయాలు బాగా తగిలాయంటున్నారు".


"అదేమిటి? ఏం జరిగింది?" అడిగాను ఆశ్చర్యంగా.

"నీకింకా తెలీదా? సునీతాదేవిని ఎప్పటిలాగానే కట్నకానుకలకోసం చావగొట్టి కిరసనాయిలుపోసి చంపబోయారట ఆమె ఎదురుతిరిగి కత్తిపీట తీసుకుని ఎటాక్ చేసింది-"



దొరలు

చా.సో.



తెల్లదొరగారూ, తెల్లదొరసానమ్మగారూ, వారిపిల్లలూ మనదేశం విడిచి వారిదేశం వెళ్ళిపోయారు.

నల్లదొరగారూ, నల్లదొరసానమ్మగారూ, వారిపిల్లలూ కారులో బంగాళా పోర్టికోలోకి వచ్చిపడ్డారు. పోర్టికోలో ఆరేడు కారులు ఆగొచ్చు. అంతపెద్దది, దాని నాలుగు మూలలనుంచి నాలుగు రకాల రాక్షసి తీగలు పోర్టికోఅంతానిండీ, బంగాళాపైన సగం వెనకవరకూ విస్తరించి ఉన్నాయి.

పెద్దా బంగాళా. బంగాళాచుట్టు చెరువంత తోట – తోటచుట్టూ చుట్టబెడుతూ ఆరడుగుల ఎత్తు ప్రహారీగోడ.

పసందైన బంగాళాని, స్వయంగా తానే పెంచి పోషించిన ప్రశస్తమైన పువ్వులతోటని వదలిపెట్టి తెల్లదొరగారూ దేశం వెళ్ళిపోయారు.

తెల్లదొరగారి ఉద్యోగం నల్లదొరగారి ఉద్యోగం ఒక్కటే? కొండంత హోదా గల ఉద్యోగం. తెల్లతోలుపోయి నల్ల తోలు వచ్చింది,

తోటనిండా పువ్వులు నిండుగా ఉండేవి. ఒక సీజను పువ్వుల మొక్కలు చచ్చిపోయేసరికి తరువాత సీజను పువ్వుల మొక్కలు పువ్వులతో కళకళ్ళాడుతూ వాటి పక్కనే పెరిగి ఉండేవి. వెల్తి కనబడకండా సంవత్సరం పొడుగునా పువ్వుల తోటంతా గంటలు మోగిస్తున్నట్టు ఏరోజూ పూసి ఉండేవి.

నల్లదొరగారొచ్చిన కొద్దిరోజులకి నా మనస్సు చివుక్కుమంది. నల్లదొరగారు తోటమాలిని మానిపించేశారు. పాతికేళ్ళాయి మాతోపాటు తోటపని చేస్తూ బంగళాలో పడివుండేవాడు. తోటమాలి మాకక్కర లేదన్నారు నల్లదొరగారూ నల్లదొరసానమ్మగారూ!

పొద్దున్నే ఓరోజు తోటమాలి చేతులు జోడించుకొని దొరగారి ఎదుట నిలబడ్డాడు.

“చిన్నప్పటినుంచి బంగళాలో ఉన్నానండి. నాకు తెలియని తోటపని లేదు. కటాక్షించాలి” అని మొరపెట్టుకున్నాడు.

“నీ గురించి వాళ్ళకి చెప్పేనే” అన్నారు దొరగారు. ఏమిటి చెప్పేరు? తోటమాలి ఇంక రానక్కరలేదని.

“నువ్వు వెళ్ళు, కావలిస్తే నేనేకబురు పంపుతాను” అన్నారు. వాణ్ణిమరి పిలవలేదు. ఉసూరుమని ఎటుపోయాడో పోయాడు.


తెల్లదొరగారు తోటమాలికి వాళ్ళ ఆఫీసు గుమస్తాలకన్న ఎక్కువ జీతం ఇచ్చేవారు! నల్లదొరగారు ఇస్తారా!

“ఎందుకొచ్చిన తోటమాలి? వాడి మొహం ఏమిటి చేస్తాడు? క్రోటన్సు మొక్కలు, పిచ్చిపిచ్చి పువ్వుల మొక్కలు. పువ్వులు తల్లోపెట్టుకోడానికి పనికిరావు. దేముడిపూజకు పనికిరావు” అన్నాది నల్లదొరసానమ్మ.

“కూరలు పండిస్తాడు!” అన్నారు దొరగారు.

“వెధవ కూరలు. వాడికిచ్చే జీతంలో నాలుగోవంతు పెడితే నెలకి సరిపడా కూరలు మనకి రావూ?” అన్నారావిడ. తోటమాలిపని అయిపోయింది. అడుగువాళ్ళ బతుకులు అంతే.

నల్లదొరసానమ్మని చూస్తే వొళ్ళు మండిపోతూ వొచ్చింది. వాళ్ళు వచ్చిన కొద్దిరోజుల్లో ఆవిడ చేసిన పనికి నాకు



పరమ అసహ్యం వేసింది.

పోర్టికోకి ఎడంపక్కగా ఉన్న స్థలం దొరగారు లాండ్రీవాడికి అద్దెకిచ్చారా అన్నట్లు తయారైంది. నాలుగు వెదుళ్ళు పాతించి పొడుగ్గా ఇనపతీగ కట్టి ఇంటిల్లిపాది బట్టలు ఆరెయ్యటం మొదలుపెట్టేరు. దాని పక్కనే మరోతీగ కట్టి చంటిపిల్లల బట్టలు మరోతోరణం ఆరవేసేవారు. రోడ్డుకెదురుగా పోర్టికోకి పక్కగా! లాండ్రీవాడి ఆటాలాగుండేది. నిత్యం బంగళాకి కట్టిన తోరణాలలాగ ఉండేది. నాకు వొళ్ళుమండిపోయి దొరసానమ్మగారితో అన్నాను.

"అమ్మా! వెనకటి దొరలు బట్టలు వెనక పెరట్లో ఆరేసుకొనేవారు. తమరు ముందు ఆరేస్తున్నారు. బంగళాకి వెనకైతే బాగుంటుందికదా?" అన్నాను. ఆవిడ చర్రునలేచి "ఆ బట్టల్లో వోచీర పోతే డబ్బు నువ్వు ఇచ్చుకుంటావా?" అన్నది.

"చిత్తం చిత్తం చిత్తం! తమరు చెప్పిందే నిజం పెరట్లో బట్టలు ఆరేస్తే పోవచ్చు. తెలియక పెద్ద ఆలోచన లేని వాణ్ణి" అన్నాను.

"పెరట్లో చూడు. గోడ ఇటికలు పీకేసి గుంటవెధవలు పెరట్లోకి వచ్చేస్తున్నారు" అన్నాది.

"నిజమే తల్లీ నిజమే" అన్నాను. నిజమే గోడవతల కొంపల్లో పిల్లలు గోడ ఇటికలు సగానికి తీసేసి తోటలోకి దిగిపోతున్నారు. సీమచింతకాయలు రాళ్ళతో రాలగొట్టి తింటున్నారు.

తెల్లదొరగారున్నప్పుడు. తోటలోకి ఎనడైనా తొంగి చూసేవాడా? వారి పిల్లలు తోటంతా ఆడుతూ గెంతుతూ ఉండేవారు. వారి అల్సేషియను కుక్కలు అడవిలో తోడేళ్ళలాగ తోటంతా తిరుగుతూ ఉండేవి.

నల్లదొరగారు కాస్త కన్నెర్రచేస్తే అంతాకపైపోతుంది. పెరటి పక్కవారు చూడ్డమేలేదు.

అంచేత కొద్దిరోజుల్లోనే గోడ నేల మట్టానికి వాచ్చేసింది. అందులోంచి పశువులు, పందులు, గాడిదలు దొడ్డిలో ప్రవేశించి కొద్దిరోజుల్లో దొడ్డంతా సర్వనాశనం చేసేశాయి. ఇదంతా దొరగారి కంట పడ్డంలేదా? మనకున్న కళ్ళు వారికిలేవా!

ఆ జంతువులు తోటంతా విహరిస్తూ పోర్టికో పక్కనుంచి వచ్చి ఇన్ గేటు లోంచి రోడ్డుమీదికి పోయేవి. పశువులకి పందులకి ఇన్‌గేటులోంచి వెళ్ళకూడదని తెలుస్తుందా?

ఇదే బంగాళాకి ఎవరెవరో వచ్చేవారు. హేమాహేమీలు, ఎమ్పీలు, ఎమ్మెల్లేలు. భూస్వాములు, వ్యాపారస్తులు, చదువుకొన్నవాళ్ళో పెద్దలు తెల్లారే సరికి వచ్చి పడేవారు,


గుమస్తాల్లో గుసగుసలు వినబడుతూనే ఉండేవి. ఓ నాడు నల్లదొరగారు చాలా అగ్గజమైన మొత్తం ఒక వ్యవహారంలో పుచ్చుకున్నారని గుమస్తాలు తేల్చేశారు

ఆనాడు తెల్లదొర తక్కువ తిన్నాడా? సంచులకి సంచులు దొచుకు పోయాడు. పెద్ద పెద్ద పార్టీలు తరచు ఇచ్చేవాడు. ఎక్కడలేని దొరలు, దొరసానులుకారుల్లో ఈనీసీవారు. బంగళా వెనక హాల్లో సంగీతాలు పెట్టుకుని తాగి, తిని, గెంతి గోల గోల చేస్తూ సరదాలు చేసేవారు. దొరలకి డబ్బు బాగా కావాలి. తెల్లవాళ్ళైనా, నల్లవాళ్ళైనా వాళ్ళకి డబ్బూ దానంతట వొచ్చి పడుతూనూ ఉంటుంది.

నల్ల దొరగారు మూడేళ్ళు ఓ ఏలుబడి ఏలేశారు. బదిలీ అయిపోయింది. ఊళ్ళో పెద్దలు పెద్ద మీటింగు పెట్టేసి, తెగ దండలు వేసేసి, తెగ పొగిడేసి నల్ల దొరగారిని మరోవూరు పంపించారు.

మరో నల్లదొరగారు ఇంక దిగుతారు. ఎవరు దిగితే ఏముంది? దొరలు దొరలే.

♦♦♦



కంప్యూటర్ టీజింగ్

బహుమతి పొందిన ప్రశ్న :—

డి. వి. యస్. రాజు — కాకినాడ

ప్ర. ఒకవైపు సూపర్ కంప్యూటర్, సూపర్ కండక్టర్‌లకై ప్రయత్నాలు, వేరొకవైపు సతీసహగమనాలు కుల మత కొట్లాటలు ఇంతకీ భారతదేశ పయనం ఎటువైపు ?

జ విచ్చివాడా ! అసలు ప్రయాణం లేకే ఈ గొడవలు



బహుమతి పొందిన ప్రశ్న :—

కె. ప్రకాష్ — తాళ్ళపూడి

ప్ర అంతా 'సత్యాన్వేషణ' చేయమంటే మీ పత్రిక 'అబద్ధాన్వేషణ' చేయ మంటోందేమిటి ?

జ మనదేశంలో ఏది ఎక్కువగా లభ్యమయితే అదే వెతకటం మంచిదని



కొప్పర్తి జనార్దన్ — నిడవలూరు

ప్ర పార్టీలు మార్చేవారందరు పార్టీలతో పాటు పేర్లను కూడా మార్చుకొంటే?

జ ఇంట్లో కన్‌ఫ్యూజన్ వస్తుంది.

ప్ర ప్రేమించి పెళ్ళి చేసుకోవడము మంచిదా ? లేక పెళ్ళి చేసుకున్నాక ప్రేమించడం మంచిదా !

జ ఎలాగయినా ఫరవాలేదు కానీ మీ ఆవిడకు తెలీకుండా జాగ్రత్తపడు

ప్ర ప్రేమించుకొన్న వాళ్ళందరు ఎప్పుడు పెళ్ళి చేసుకుంటారు కంప్యూటర్‌గారు

జ పదోనెల వచ్చాక

ప్ర జన్మనిచ్చిన తల్లిదండ్రులు తమ కుమారుడు కాని కుమార్తెగాని పెండ్లి విషయములో కులమతాలతో ప్రసక్తి లేకుండా పెండ్లి చేసుకొంటే వారిని అనేకమైన ఇబ్బందులకు గురి చేస్తారు ? ఎందుకని ? జన్మనిచ్చిన తల్లిదండ్రులే ఇలా ఉంటే మరి లోకం పరిస్థితి ఏమిటి ?

జ జన్మతీసుకున్న కొడుకులూ కూతుళ్ళే తమ పెళ్ళి విషయంలో తల్లినిగానీ తండ్రినిగానీ అడగకుండా కుల మతాలతో ప్రసక్తిలేని వివాహాలు చేసుకుని తల్లిదండ్రులను ఎన్నో ఇబ్బందులు పెడుతున్నారెందుకని? సొంతపిల్లలే ఇలా పరాయిపిల్లల్లా హింసిస్తూంటే ఆతల్లిదండ్రుల గతేమిటి ?

చలపాక ప్రకాష్ — విజయవాడ

ప్ర పోలీసుల నెత్తిమీద టోపీలు ఎందుకు ?

జ మెదడుని ఎవరూ బుర్రలోకి ఎక్కించకుండా

ప్ర పోలీసులకు, దొంగలకు తేడా ఏమిటి?

జ పగలొకరు రాత్రి ఒకరు

అన్నపురెడ్డి గంగాధరరెడ్డి — తెనాలి

ప్ర ప్రతి మనిషికి టర్నింగ్ పాయింట్ ఎప్పుడు ?

జ దెబ్బ తినగానే

పి. రమేష్‌బాబు — గురజాడ

ప్ర డబ్బుతో లోకం ఉందా లేక లోకంతో డబ్బు ఉందా !?

జ డబ్బుతో డబ్బు ఉంది

కె. రమేష్‌బాబు — కేశనపల్లి

ప్ర ప్రాణాలొడ్డి దేశంను రక్షించే సైనికునికి, వందనం చేయకుండా వాళ్ళ దగ్గరనుండే వందనాలు పొందుతారెందుకని ?

జ లేపోతే భక్షిస్తామని బెదిరించటానికి

డి. వి. యస్. రాజు — కాకినాడ

ప్ర యన్టీఆర్ శ్రీనివాసులరెడ్డి వివాదం మధ్య లాభం చేకూరేది ఎవరికి ?

జ ఓటరుకి. ఓటు రేటు పెరుగుతుంది కనుక

పత్రికలకు



ప్ర శ్రీనివాసులురెడ్డి వేసే భేతాళ ప్రశ్నలకు సమాధానాలు చెప్పడానికి రామారావుగారు నిన్ను నియమిస్తే ?

జ కంప్యూటర్లు ఎవరేది ఫీడ్ చేస్తే అదే చెయిసారా విచ్చిరాజా !

ప్ర అర్ధరాత్రి స్వాతంత్ర్యం 'స్త్రీ'కేమిచ్చింది ?

జ పాపాయి

ప్ర నేటి ప్రజాప్రతి'నిధులు'కు నచ్చేవి ?

జ ప్రజానిధులు

రాజవనిత — గుంటూరు

ప్ర మనసంటే ?

జ ఎప్పుడూ ఇతరుల గురించి ఆలోచించేది

షేక్ సుభాని — గుంటూరు

ప్ర ఆడవాళ్ళు పోలీసు స్టేషన్‌లకెళితే?

జ తిరిగిరారు

పోలాసి రమేష్‌బాబు — మల్కాజిగిరి

ప్ర రాజకీయ నాయకులచేత ప్రమాణ

స్వీకారాలు చేయిస్తారెందుకు?
జ మిగతావాళ్ళతో చేయిస్తే వాళ్ళు నిజంగానే ప్రమాణం పాటిస్తారు గనుక

తుళ్ళి రాజగోపాల్ రాజమండ్రి
ప్ర మన రాజకీయ నాయకులు రోజూ ఏం తింటారు?
జ తిట్లు

సి. దాశరథి వైజాగ్
ప్ర తెలుగు ప్రకారము 'రాజకీయము' యొక్క అంతరార్ధము 'రాజకీ ఈయము' అని నా అభిప్రాయము. మరి మీ అభిమతము.
జ 'ఈ' జి 'కిరాయము'

కె. శ్రీనివాస్ హైదరాబాద్
ప్ర శాసనసభలు సజావుగా సాగాలంటే?
జ కర్ఫ్యూ పెట్టాలి

పొట్నీడి చక్రరావు విశాఖపట్నం
ప్ర కంప్యూటర్లే మంత్రులైతే....?
జ ఫీడింగ్ పెరిగిపోతుంది

నల్ల నరసింహాచారి బ్రాహ్మణగూడెం
ప్ర ప్రతీ ఊరి గు(ళ్ళ)డిలో తిష్టవేసిన లౌడు స్పీకర్లు మాయంకావాలంటే?
జ పవర్‌కట్ అభివృద్ధి చెందాలి

జె. ఉమామహేశ్వరరావు పాలకొల్లు
ప్ర దేశభక్తి అంటే...?
జ విదేశాలలో కనిపించే వస్తువు

పరదేశమును ప్రేమించుట..



రాగం కనక ఉదయసూర్య భాస్కరరావు (అంగర)
ప్ర ప్రజాసేవ గొప్పదా? దేశభక్తి గొప్పదా?
జ ఏది ఎక్కువ లాభసాటిగా ఉంటే అదే గొప్పది

జె. ఉమామహేశ్వరరావు పాలకొల్లు
ప్ర దేశబంధు అంటే?
జ దేశాన్ని బంధించే వాడు

విదేశీయుడు



కాజ లీలాకుమారి ఏలూరు
ప్ర రాజకీయనాయకుడు మైకు పట్టుకుంటే ఏమి చెబుతాడు?
జ మైక్ ఎడ్జస్టు చేయమని

షేక్ బషీర్ అహమ్మద్ (చిలకలూరిపేట)
ప్ర కనాకఈకప్రకశ్నకకుక బకహుక మకతిక వకస్తుకంకదా?
జ కకకకకక

గుత్తికొండ కోలపల్లి నెల్లూరు
ప్ర స్త్రీలు కూడా క్రికెట్ ఆడితే
జ వికెట్లు ఎప్పటికీ నిలబడేఉంటాయ్

కాకరవర్తి శ్రీనివాసరావు చీరాల
ప్ర 'రాశిఫలాల'వల్ల ఉపయోగం?
జ ప్రియురాలి భర్త సంచిఅ పద ఎప్పుడుందో తెలుసుకోవటం

గుత్తుల సుభాష్ ద్రాక్షారామ
ప్ర రాజకీయ నాయకుల 'రాజీ' కుదిరేదెప్పుడు?
జ స్మశానంలో
ప్ర మనిషి జీవితంలో కోరుకోనిది ఏవిటి?
జ చిన్న ఇల్లు

కాజ హనిత ఏలూరు
ప్ర మనం ఎటు కొట్టుకుపోతున్నాము?
జ ఎన్టీఆర్ ఎస్టేట్స్‌లోకి

జి. బాలగంగాధరశర్మ హైద్రాబాద్
ప్ర రాజకీయాలు "కంపు" కొడుతున్నాయి ఎందువల్ల?
జ ఇ ఎన్ టి స్పెషలిస్టుల లోపంవల్ల

శశికుమార్ మచిలీపట్నం
ప్ర భారతదేశంలో వున్న ప్రజలందరికి ఏ బాధలేకుండా అందరికి తిండి, బట్ట, వసతి, వృత్తి లభించాలంటే ఏం చేయాలి?
జ ఇవ్వాలి

గెడ్డం రమేష్‌బాబు ప్రత్తిపాడు
ప్ర నేటి ప్రజలకు కావలసినది?
జ గెడ్డం, కమండలం, మరియు ఓపిక.

ప్ర నేడు 'మతం' 'మనిషి'ని ఏటువైపు తీసుకువెళ్ళుతుంది?
జ ప్రత్తిపాడు
ప్ర పోలీసులు సమ్మె చేయరెందుకు?
జ పిచ్చివాడా బంగారు గుడ్లు పెట్టే బాతునెవరయినా చంపుతారా?

జె. కృష్ణారావు గుంటూరు
ప్ర సన్యాసికి సంసారికి తేడా ఏమిటి?
జ సంసారికి ఒకటే పెళ్ళాం

కోలపల్లి ప్రియ నెల్లూరు
ప్ర గిన్నిస్ బుక్‌లోకి ఎక్కాలంటే ఏం చేయాలి?
జ మనమే ప్రింట్ చేయాలి

కె. జయశంకర్‌రెడ్డి కాగితాలపెంట
ప్ర రాజకీయ నాయకులందరు కాషాయ వస్త్రాలు వేసుకొంటే, అప్పుడు మన దేశంగతి ఏమిటి?
జ కషాయమే

కాగితాలపెంట...



ఎన్నికైన ఉత్తమ ప్రశ్నలకు బహుమతిగా ఈ క్రింది పుస్తకాలలో మీరు కోరుకున్నది ఇవ్వబడుతుంది. మీకు కావలసిన పుస్తకం పేరు, మీ అడ్రస్ కార్డు వెనుక వ్రాయడం మరిచిపోకండి.-ఎడిటర్.

డబ్బు డబ్బు	యండమూరి వీరేంద్రనాథ్
యుగాంతం	,,
రాక్షసుడు	,,
రాధ-కుంతి	,,
హ్యూమరాలజీ (మూడు భాగాల్లో ఏదైనా)	యర్రంశెట్టి శాయి
రైల్వే జంక్షన్	,,
నవ్వ్వా-నవ్వించు (మూడు భాగాల్లో ఏదైనా)	,,

మైనప్పు ముద్ర

— కుమారి ఎ.వి.శేషారత్నం

రైలు వెళ్ళిపోయింది –

అంతవరకూ సందడిగా ఉన్న ప్లాట్ ఫారం చిన్నబోయింది.

అది ఊరికి చాల దూరంలో ఉన్న స్టేషన్. రైలాగిన కాసేపే ప్రయాణీకుల గోలతో కళకళ్ళాడుతుంది. చిన్న స్టేషనే అయినా వాటరింగ్ స్టేషన్ కావడాన రైలు అక్కడ ఆగక తప్పదు.

పిచ్చిది ఏడుస్తూ ప్లాట్‌ఫాంమీద కూలబడింది. ఆ స్టేషన్లో రైలాగినప్పుడల్లా అది కడుపు, నోరు చూపిస్తూ వెకిలిచేష్టలు చేస్తూ దాని ఆకలిని వెల్లడిస్తూనేవుంది.

దాదాపు రెండ్రోజులుగా నాలుగైదు రైళ్ళు ఆగినా దాని ఆకలి తీరలేదు. ఏ ప్రయాణీకుడి మనసూ కరగలేదు. దాని బొచ్చెలో చిన్న రొట్టెముక్కకూడ పడలేదు.

రైలు వెళ్ళిపోయినప్పుడల్లా కాళ్ళు నేలకు తాటించి కొట్టుకుంటూ ఏడుస్తుంది. 'ఆకలి' తీరలేదనడానికి అదొక నిదర్శనం.

చింపిరిజుట్టు శరీరాన్ని కప్పలేని చింకి మురికిగుడ్డలు, వెర్రిచూపు, ఎప్పుడు పడిందో మోకాలి చిప్పమీద ఎఱ్ఱనిపుండు, ఆకలిలాగే దాని ప్రాణాన్ని కొరుక్కుతింటున్న ఈగలు –

ఆ పిచ్చిదాన్ని చూసి రైల్లోవాళ్ళకి అసహ్యం, చీదరింపు కలిగాయి తప్ప జాలి కలగలేదు. ఫలితం ఆకలి దాన్ని వదలలేదు.

తింటున్న వస్తువుమీదకి ఆకలితట్టుకోలేక చొంగ కారుస్తూ ఎగిరెగిరి పడబోతుంటే విసుగెత్తిన ప్రయాణీకుడు సిగరెట్టు నుసి దానిమీద దులిపాడు. కెవ్వుమని పారిపోయింది పిచ్చిది.

తెలిసీ తెలియని దాని పిచ్చితనాన్ని ఆలంబన చేసుకుని ఏ ధర్మాత్ముడు పుణ్యం కట్టుకున్నాడో దాని ప్రాణానికో చిన్న ప్రాణం – పాలకోసం దాని ప్రాణాలు తోడేస్తోంది. పిచ్చిదయినా ఏ మమకారం దాన్ని కట్టి పడేసిందో – మోకాలు పచ్చి పుండులావున్నా–పిల్ల బరువు లాగేస్తున్నా కడుపులో పేగులు మెలిదిరిగి పోతున్నా పిల్లని మాత్రం భూదేవిలా ఓపిగ్గా గుండెలకు హత్తుకునే ఆడుక్కుంటోంది.

చేతిలో బీడీని ఆఖరి దమ్ములాగి విసరి పారేసి ముందు కడుగేసాడు పైడిరాజు. ఇందాకటి రైల్లో ప్రయాణం

చేస్తున్న వాడల్లా ఎందుకో అక్కడ దిగి పోయాడు, రైలాగిన దగ్గర్నుంచే పిచ్చి దాన్ని. దాని ఆకలిని గమనిస్తూవుంటే అతడికింకో ఆకలి వేసింది. అంతే, దిగి పోయాడు.

'ఆకలేస్తోందా? - జాలిగా - కాళ్ళు తాటిస్తూ ఏడుస్తున్న పిచ్చిదాన్నడిగాడు. అది తలపైకెత్తి ఒక వెర్రిచూపు చూసి వాడి చేతిలోని బన్ను రొట్టెను చూసి కడుపు నోరు చూపించి 'వా - వా -' అంది అలవాటుగా కాళ్ళు పట్టుకుంటూ-కాళ్ళు వెనక్కి లాక్కుని-'రొట్టెపెడతాను నాతోరా'- చుట్టూ చూసి కదిలాడు.

అది తప్పక అనుసరిస్తుందని అతడికి తెలుసు. 'రొట్టె' అన్నమాట చెవిని పడ గానే పిచ్చిదాని కళ్ళు నక్షత్రాల్లా మెరి సాయి. ఛెంగున లేచింది.

పసిపిల్ల దాని చీరకొస లాగింది. ఆదరా బాదరాగా ఆ పిల్లను చంకనేసు కుని మోకాలుమీద చెయ్యేసుకుని కుంటు కుంటూ పైడిరాజువెంట పరిగెడుతుంటే ముసలి పోర్టర్ దాన్ని కేకలేసాడు.

"పాడు ముండా! తిండికి వేళాపాళా లేదు. బయటికిపో. నువ్వేళ్ళబాబూ ఇది లాగే వెంటబడుతుంది. ఏమే! ఈసారి స్టేషన్‌లోపలికి వచ్చావంటే ఈ పిల్లదాన్ని లాక్కుని విసిరేస్తా -"

పిచ్చిదాని చంకలోని పిల్ల ఆకలికో, పోర్టర్ కేకలకో బెదిరి ఏడుపు లంకించు కుంది. పిచ్చిది కోపంగా పోర్టర్‌ని చూసి తర్జనితో బెదిరించి పైడిరాజువెంట మళ్ళీ పరిగెత్తింది.

ముసలిపోర్టర్ నవ్వుకుంటూ వెళ్ళి పోయాడు.

"ఇదే పిచ్చిది. దీనికే తికాణాలేదంటే మళ్ళీ దీనికోపిల్లముండ. ఏందేవుడివయ్యా! ఆకలితో ఛస్తున్నా దాన్నిమాత్రం కింద పెట్టదుకదా!"

ఓ పదినిమిషాల తర్వాత పాడుపడిన రైలువేగన్ వెనుక పైడిరాజుకి దగ్గరగా పిచ్చిది. దాని చేతిలో సగం బన్నురొట్టె. మరో రొట్టెముక్కని పీక్కుంటూ అక్కడే పసిపిల్ల కేరింతలు కొడుతూ ఆడుతోంది.

పైడిరాజు మనోఫలకం మీద-నెల్లాళ్ళ క్రితం ఐదురూపాయల నోట్లు అటూ ఇటూ తిప్పుతున్న వయ్యారి సరసంగా కాలిబూట్లను లాగబోయేసరికి విలవిల్లాడి పోయాడు, నముల్తున్న కారా కిల్లీని తుపుక్కున ఉమ్మి -

'ఏం?' - అంది.

'దెబ్బ!'-

"రెండు కాళ్ళకీనా?"- అని ఏదో అనుమానంతో ముక్కు పుటాలెగరేసి-బూట్లు, చేతులకున్న గ్లవుజు పీకిపారేసి చూసి కెవ్వున అరిచింది. రూపాయల నోట్లు ఆతడి మొహాన విసిరేసింది.


'ఛీ నీ బ్రతుక్కిదొకటే తక్కువ పో!'

అతడి కళ్ళు ఎర్రబడ్డాయి-కాని స్థాన బలం లేని అతను నిరాశగా కదిలాడు,

పైడిరాజు కసిగా తల విదిల్చి పిచ్చి దానికేసి చూసాడు. అతను చీకట్లో చిరు గాలి అతగాడి ఆకలిని రెచ్చగొట్టింది.

పిచ్చిది ఆత్రంగా రొట్టెముక్కను పీక్కుతింటోంది. ఏదో తెలియని వ్యాధి అతని వేళ్ళను తింటున్నట్టు-

బలంగా పిచ్చిదాని తలను తనవైపు తిప్పుకున్నాడు పైడిరాజు - ఎండిన రొట్టె



ముక్కను ఎంత పీకినా ఆకలి తీరని పసి పిల్ల ఏడుపు మొదలెట్టింది. అది చెవిన బడడంతోనే ఒక్క ఉదుటున అతడిని విదిలించి పారేసి పరుగునబోయి మట్టిలో పొర్లుతున్న బిడ్డను గుండెలకు హత్తుకుని ఎండిన రొమ్మునందించింది.

పీనుగాకారంలో పిశాచంలా వున్నపిల్ల కాళ్ళు చేతులు తపతప బాని మొహాన కొడుతున్నా అరమోడ్పు కళ్ళతో ఈ ప్రపంచాన్నే మర్చిపోయిన పిచ్చిదానిని ఆ భంగిమలో చూస్తుంటే పైడిరాజు మనస్సు ఎందుకో కలుక్కుమంది.

అతగాడి కళ్ళముందు లోకమంతా వెలివేసి అసహ్యించుకుంటున్నా మాతృత్వపు మమకారంతో తన ఒళ్ళంతా వేన్నిళ్ళతో ప్రతిరోజూ తుడుస్తూ, ఆర్తిగా గోరుముద్దలు తినిపిస్తున్న తల్లి కదలాడింది. పదిరోజుల క్రితమే ఆమెను భూస్థాపితం చేసి ఈ లోకంలో ఒంటరిగా మిగిలి అంతులేని ఆవేదనతో, కసితో ఊళ్ళుపట్టుకుని తిరుగుతున్నాడు.

కళ్ళెత్తి మరోసారి పిచ్చిదాన్ని చూసాడు. అయితే చిత్రంగా ఈసారి ఆ చూపులో 'కోరిక' లేదు. ఎందుకంటే?

“ప్రవహించేగుణం నీటికి, జ్వలించే గుణం మంటకి ఎలా సహజమో చలించే గుణం మనసుకి అంతే – అయితే ఓ క్షణాన చిరుభావపు జ్వాల ఏ మూలనుంచి తాకినా మైనంలా కరిగి ప్రవహించే మనస్సున్నప్పుడు ఆ జీవితం నూతన తరంగాలలో నిండిన విచిత్ర ప్రవాహమై తీరుతుంది!”

పిల్లదానిచుట్టూ కోటగోడలా రెండు చేతులూ పెనవేసి శిలలా కూర్చున్న పిచ్చిదానిమీదకి జేబులోని ఒకేఒక ఐదురూపాయిలనోటును విసిరి వెనుతిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు పైడిరాజు.


మానవత్వం ఏదోఒకపాలు లేకుండా మనిషి పుట్టుకేరాదు. తేడాఅల్లా కొందరిలో పెద్దక్షరాలతోను మరికొందరిలో చిన్నక్షరాలలోను ఉంటుంది.

వెనుకగా ఆనందంతో పిచ్చిదాని కేరింతలు పైడిరాజును చాలాదూరం సాగనంపాయి.

●



సుప్రసిద్ధ పారిశ్రామికవేత్త, కేంద్ర ఫిలిమ్ సెన్సారుబోర్డు సభ్యులు, చలన చిత్ర నిర్మాత శ్రీ టి. సుబ్బరామిరెడ్డి కుమార్తె చిరంజీవి సౌభాగ్యవతి అపర్ణకు, ప్రముఖ పారిశ్రామికవేత్త కృష్ణా ఒబరాయ్ హోటల్, హైదరాబాదు అధినేత శ్రీ జి. వి.కె. రెడ్డి కుమారుడు చిరంజీవి సంజయ్‌తో నవంబర్ 27న జరిగిన వివాహచిత్రం.



'సిందూర్' పాటల రికార్డింగ్ డిస్క్‌ను విడుదల చేస్తున్న శ్రీ టి. సుబ్బరామిరెడ్డి; మీనాక్షి శేషాద్రి, దర్శకుడు రవి, జయప్రద; నిర్మాత కృష్ణమూర్తి, గోవిందా



యండమూరి వీరేంద్రనాథ్

“నాపేరు మోహన్. ఇక్కడి కెలా వచ్చానని ఆశ్చర్య పడుతున్నట్లున్నారు. వెంకటేష్ స్నేహితుడిని వాళ్ళింటికి వెళ్తే బయటకు వెళ్ళాడని కాస్సేపట్లో వస్తాడనీ అన్నారు. కాలక్షేపానికి యిలా వచ్చాను” వెంకటేష్ తోట మాలి పెద్ద కొడుకు.

జరిగినకథ:-

వైజయంతి, విశాల, అనూరాధ, భార్గవి స్నేహితురాళ్ళు. వైజయింతికి ఎస్.పి.గా ఉత్తరప్రదేశ్‌లో పోస్టింగ్ వస్తుంది. ఆమె సంసారం అంతంత మాత్రంగా ఉంటుంది. ఆ సమయంలో తన స్నేహితురాలు అవంతి గుర్తుకొస్తుంది. ఆమెను చూడ్డానికని అమెరికా వెళుతుంది.

విశాలదో విచిత్ర మనస్తత్వం. ఆ ఇంట్లో తనదే పై చేయి కావాలన్న ఆరాటం. అదే దృక్పథంతో భర్తను ఓ దద్దమ్మగా చేస్తుంది. వాళ్ళింటికి విశాల ఆడబిడ్డ సునీత వస్తుంది. అన్నయ్య సంసారం చూసి బాధపడుతుంది సునీత.

అనూరాధ ఓ భావుకురాలు. ఓ రోజు తోటలో ఆమె కూర్చుని ఉన్నప్పుడు ఓకొత్త వ్యక్తి ప్రవేశిస్తాడు.

-ఇకభథవంధి

మంచు పర్వతం



“అలాగా” రాధకు అక్కడినుంచి వెళ్ళిపోవాలని ఉంది, వెళ్ళకూడదనీ ఉంది అతడు చూపుల బంధంతో తనను ఆపుతున్నట్లుగా ఫీలింగ్. కాని ఏం మాట్లాడాలి? ఎలా మాట్లాడాలి?

“మీ తోట చాలా బావుందండీ. మీరీ బంగ్లాలో ఉంటారనుకుంటాను చాలా అదృష్టవంతులు మీరు. ఎంచక్కా కవితలు చదువుకుంటూ, పాటలు పాడుకుంటూ రోజులు క్షణాల్లా గడిపేయవచ్చు.”

“మీకూ సాహిత్యంఅంటే అభిమానమా?”

“ప్రాణం. కాని షీలా వాడుకోలేననుకోండి, చదువుకోవడానికే టైము దొర

కదు. నా దురదృష్టానికి బాధపడడం తప్ప ఏం చెయ్యలేను."

కాస్సేపు మాట్లాడి అతడు వెళ్ళిపోయాడు. ఆ రాత్రి అనూరాధకి నిద్ర పట్టలేదు. కళ్ళుమూసినా తెరచినా అతడిరూపే. మొదటి చూపులోనే ప్రేమ కలగడం అంటే యిదేనా? అతడి గురించి యేమీ తెలియదు. అతనైనా ఏమీ అడగలేదు, చెప్పలేదు. ఏమీ తెలియని అతడిని తను నిజంగానే ప్రేమిస్తోందా? అదసలు ప్రేమేనా లేక కేవలం ఆకర్షణా? అతడు తనగురించి ఏమీ అడగలేదు. తన అందాన్ని, చదువునీ పొగడలేదు. మాట్లాడిన కాస్సేపు తోటగురించే అడిగాడు. తన అభిరుచులన్నీ తెలిసినట్లుగా మాట్లాడాడు. అందుకే అతడిపట్ల ఆకర్షితురాలయింది. అయిదు నిముషాల పరిచయంతోనే అంతగా ఆలోచించటం అవివేకం అనుకుంది కాని వలపు బాణం తగలడానికి అర సెకండు చాలునన్న విషయం తెలియలేదామెకు.

రాత్రిళ్ళు నిద్రపడితే అతడిరూపమే కలలోకూడా. ఉదయం లేచి తోటలోకి వెళితే అతడి జ్ఞాపకాలే. 'కలనైనా నీ తలపే, కలవరమందైనా నీ వలపే' అన్న పాట గుర్తొస్తోంది పదే పదే. పారిజాతాలన్నీ ఏరి 'రాధా మోహన్' అని దిద్దుకుంది వాటితో. పేర్లుకూడా చక్కగా కుదిరాయనిపించింది.

తన అవివేకత ఆమెకు అర్థం అవుతూనే ఉంది. కాని సెంటిమెంటుకి రీజనింగ్ ఉండనట్టే అనుభూతికి రూపం ఉండదు. రాధ మనసు ఆమె కంట్రోల్లో లేదిప్పుడు. (ఆమె ప్రవర్తన పాఠకులకి పిచ్చిగా అనిపిస్తే క్షమించాలి.)

చాలారోజులవరకూ మోహన్ ఆమెకు మళ్ళీ కనుపించలేదు. సెలవులయిపోయాయి. కాలేజీకి వెళ్ళడంతో రొటీన్‌లో పడిపోయింది. అతడి గురించి మర్చిపోవాలని అనుకుంటున్న సమయంలో మళ్ళీ కనుపించాడు. ఈసారి బస్టాండులో ఎదురుగా ఆగిన కార్లో కూర్చున్న అతడిని చూడగానే ఆమె గుండె లయ తప్పింది.

"రండి డ్రాప్ చేస్తాను" డోరు తెరిచి అన్నాడు.

"పర్వాలేదు. బస్సొచ్చేస్తుంది." అంది, అది సిగ్గో, అన్నాళ్ళూ కనుపించనందుకు కోపమో ఆమెకే తెలియదు.

"అంత సందేహం దేనికి? అటే వెళుతున్నాను రండి." అర్థింపుగా అన్నాడు.

ఎక్కి కూర్చుంది రాధ.


"విమెన్స్ కాలేజీలోనేగా చదివేది?" డ్రైవ్‌చేస్తూ అడిగాడు.

"మీకెలా తెలుసు?"

"మనసుంటే మార్గముంటుంది అంటారు, మీరు నాకు చాలాసార్లు జ్ఞాపకం వచ్చారు. అన్నీ తెలుసుకోవలసి వచ్చింది."

ఆమె హృదయం ఝల్లుమంది తనలాగే అతడూ తన గురించి అంతగా ఆలోచిస్తున్నాడన్నమాట అది అదృష్టం కదా? చూస్తే అతి సాధారణ వ్యక్తిలా అనిపిస్తున్నాడు. కారెలా మెయిన్‌టెయిన్ చేస్తున్నాడో?

"ఈ కారు నాది కాదు. నిజం చెప్పాలంటే నేను చాలా బీదవాణ్ణి. మామూలు



మనిషిని" అన్నాడతడు ఆమె మనసులోని మాట గ్రహించినట్లుగా.

"అంటే?"

"అంటే నేనుకారు మెకానిక్‌ని. ఎస్సెస్సెల్సీ వరకే చదువుకోగలిగాను. బాధ్యతలు నన్ను పై చదువులకు వెళ్ళనివ్వలేదు. సిగ్గు పడాల్సిందేముంది! నాకు చేతనయిన విద్యయిది. కొన్నాళ్లు మరోవర్క్‌షాపులో ట్రయినింగు చేసి తర్వాత స్వంతంగా పెట్టుకున్నాను మరో భాగస్థుడిని కలుపుకుని"

అతడి మాటల్లో నిజాయితీ కనుపించింది. కాలేజీ చేరే వరకు అతడు తన గురించి చెపుతూనే ఉన్నాడు.

అతడికి తండ్రిలేడు. ఆయన ఆకస్మాత్తుగా పోవడంతో ఇద్దరు తమ్ముళ్ళు, ఇద్దరు చెల్లెళ్ళ బాధ్యత ఒక్కసారిగా మీద పడింది. చదువు మానేసి సంపాదనలో పడాల్సిన అవసరం వచ్చింది. ఇంటర్‌కూడా పూర్తికాని చదువుకి ఏ ఉద్యోగం దొరుకుతుంది? అందుకే అయిదేళ్ళపాటు పని నేర్చుకున్నాడు. ఇప్పుడు దాచుకోవడానికి మిగలకపోయినా తన కుటుంబానికి ఏలోటూ లేకుండా జరిగిపోతోంది.

రాధకుఆశ్చర్యం అనిపించింది, చదివింది ఎస్సెస్సెల్సీయే అయినా కృష్ణశాస్త్రినీ, కీట్సునీ ఇంకా గుర్తు పెట్టుకుని ఆరాధించడం! అదే అడిగేసింది.

"సాహిత్యం నా అభిమాన సబ్జెక్టు. పై చదువులు అంటూ చదవగలిగితే లిటరేచర్ తీసుకోవాలనుకునేవాణ్ణి. ఇప్పుడేమో పదహారు గంటలు కష్టపడ్డాక అరగంటసేపు ఏదన్నా చదువుకోవాలన్నా కుదరడంలేదు."

"మరి ప్రైవేటుగా చదవకపోయారా?"

"అదీ వీలుకాదు. నావి ఫిక్సెడ్ టైమింగ్స్‌కాదు. అమ్మా వాళ్ళంతా గుడివాడ దగ్గర ఓ పల్లెటూర్లో ఉంటారు. అందుకే వంట అదీ నేనే చేసుకోవాల్సి వస్తుంది ఆ పైన ఏమీ చదవలేక పోతాను."

అతడి విషయం వింటుంటే ఆమెకు తండ్రి గుర్తొచ్చాడు. ఆయన యితడిని తప్పకుండా యిష్టపడతాడు అనుకుంది.

మోహన్ వారం రోజులపాటు కనుపించక పోయేసరికి ఆమెకు పిచ్చెక్కినట్లనిపించింది. చదువుకోవాలనిపించదు. ఏపనీ చెయ్యబుద్ధికాని పరిస్థితి ఏర్పడిపోయింది. డిగ్రీ చదువుతున్నా ఆమెలో మెచ్యూరిటీ రాలేదనడానికి అదే నిదర్శనం. కల్పనకీ, వాస్తవానికీ ఉన్న తేడా గమనించే స్థితిలో లేదామె. తనకు తెలిసిన అతి చిన్న పరిధినే ప్రపంచమనుకుంది. ఎవరికీ లేని అనుభవాలు తనుమాత్రమే చవిచూశాననే భ్రమలో ఉంది. బయట ప్రపంచంలో జరుగుతున్న మార్పులు తెలియకుండా ఎదుటి వ్యక్తుల్ని విశ్లేషించే జ్ఞానం లేనప్పుడు మెంటల్‌గా మెచ్యూరిటీ రావడం చాలా కష్టం. అన్నీ తనకు తెలుసుననే ఆమె అమాయకత్వం ముఖంలో ప్రతిబింబిస్తూండేది. ఆమెలో కల్మషం లేదు. ఎదుటివారిలో కల్మషం ఆమె కంటికి కనుపించేదికాదు. ప్రేమ గుడ్డిది' అని చాలాచోట్ల చదివింది. అందరూ అనుకున్నట్లే అది తన విషయంలో తప్పు అనుకుంది. ఆమెకు తెలిసింది ఒక్కటే. తను మోహన్ని ప్రేమిస్తోంది అతి గాఢంగా ప్రేమిస్తోంది, అతడు లేకుండా బ్రతకలేదు, అతడితోటే తన సుఖం. ఈ నిశ్చయానికి వచ్చాక ఇక ఆగలేక పోయింది. అతడు చెప్పిన అడ్రస్‌బట్టి వర్క్‌షాప్ వెతుక్కుంటూ వెళ్ళింది.


ఆమెను సంతోషంగా ఆహ్వానించాడు మోహన్.

"ఎందుకోమీరు వస్తారని అనిపించింది. నాకు తెలియకుండానే పొద్దుటినుంచీ మీకోసం ఎదురుచూస్తున్నాను" అన్నాడు. తన రాకను అతడేవిధంగా అర్థం చేసుకుంటాడోనని సంశయిస్తున్న రాధకు అతడామాట అనగానే చెప్పలేనంత సంతోషం కలిగింది. తన రాక ముందుగానే పసిగట్టడం, జన్మ జన్మల క్రితమే తమమధ్య ఏర్పడిన బంధంగా నిరూపణ అయిపోయిందనుకుంది.

"నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నువ్వు లేకుంటే బ్రతకలేను" అన్న డైలాగులు వాళ్ళమధ్య జరగలేదు. కాని ఒకరి మనసు మరొకరికి అర్థం అయిపోయినట్లుగా ఒకరికొకరు అంకితం అయిపోయినట్లుగా, కనుపించని బంధం యిద్దరినీ కట్టేసినట్లుగా అనిపించింది. మనసువిప్పి కబుర్లు చెప్పుకున్నారు.

మనసునిండా సంతోషాన్ని నింపుకుని ఇంటికి తిరిగి వచ్చింది. ఎందుకింత ఆలస్యం అయిందంటే ప్రైవేటు క్లాసుందని అబద్ధం చెప్పింది. అది ఆరంభం. వారానికి రెండు రోజులు ప్రైవేటు క్లాసులు జరిగేవి. మోహన్ ఆమె యింటికి దగ్గరలోనే అనుకూలంగా ఉండే గది అద్దెకు తీసుకున్నాడు. రాధకో డూప్లికేట్ తాళంచెవి ఇచ్చాడు. ఆ గదికి మారాక వాళ్ళకి ఏకాంతం దొరికింది. పెరట్లో నిలబడితే మోహన్ గది కనపడేది. అతడు గుమ్మంలో నిల్చుని సైగచేస్తే వెళ్ళేది.

"నేను చాలా అదృష్టవంతుణ్ణి రాధా! నాలాంటి అతి సాధారణ వ్యక్తిని



నువ్వు కోరుకోవడం నేను కలలోకూడా వూహించుకోలేని సత్యం" అన్నాడు ఆమెను దగ్గరకు తీసుకుంటూ.

"నేనుమాత్రం అదృష్టవంతురాలిని కాదా? నేనూ సామాన్యమైన అమ్మాయినేగా" అంది రాధ.

"నీకు ఒక్క ప్రామిస్ చేయగలను రాధా. ఎలాంటి పరిస్థితుల్లోనయినా నీ మనసు కష్టపెట్టకుండా చూసుకుంటానని."

"అంతకంటె నాకు కావలసిందేముంది మోహన్. నీ కష్టాల్లో నేనూ సమంగా పాలు పంచుకుంటాను. బీదరికం నన్నెప్పుడూ భయపెట్టలేదు."

మనసు అర్పించుకున్నప్పుడు శరీరం అర్పించుకోవడం తప్పుగా అనిపించలేదామెకు. భవిష్యత్తు గురించి తియ్యటి కలల్లో తేలిపోతూ తనను తాను అతడికి అర్పించుకుంది.

ఫైనల్ యియర్ పరీక్షలు దగ్గరకొచ్చాయి. భవిష్యత్తులో డిగ్రీ అవసరం చాలా ఉందనీ, క్లాసు తెచ్చుకోవాలనీ పట్టుదలగా చదివింది. కొన్నాళ్ళపాటు మోహన్‌కి కూడా దూరంగా ఉంది.

పరీక్షలు రాస్తున్నన్ని రోజులూ మోహన్ కాలేజీ దగ్గరకొచ్చి కలసి వెళ్ళేవాడు. ఆ ఉత్సాహంలో పరీక్షలన్నీ బాగా రాసింది. థియరీ చివరి పరీక్ష సంతృప్తికరంగా పూర్తి చేసింది. ప్రాక్టికల్స్‌లో ఆమెకెప్పుడూ మంచి మార్కులే వస్తాయి. ఫస్టుక్లాసు తప్పదని నమ్మకం కలిగేటప్పటికి తన సంతోషాన్ని పంచుకునేందుకు మోహన్ గదికి వెళ్ళింది. అతడూ ఆమె వస్తుందని ఎదురు చూస్తున్నాడు. టైమెలా గడిచిందో తెలియలేదు. ఇంటికి చేరేటప్పటికి చీకటి పడిపోయింది.

ఎదురుగా వరండాలోనే కూర్చున్నాడు ఆమె చిన్నాన్న కొడుకు. అతడుకూడా డిగ్రీ పరీక్షలే వ్రాస్తున్నాడు.

"ఎలా వ్రాశావమ్మయ్యా? నేనయితే బాగా చేశాను. ఫస్ట్‌క్లాస్ ష్యూర్" అంది సంతోషంగా. అతడి ముఖంలో నవ్వు. కాని అది వికృతమైన నవ్వు.

"పెద్దమ్మ పిలుస్తోంది. లోపలకు వెళ్ళు ఫస్ట్‌క్లాసే యిస్తుందిట" అన్నాడతడు సీరియస్‌గా.

జరగ కూడనిదేదో జరిగిందని ఊహించింది. కానీ ఏం జరిగిందో అర్థంకాలేదు. రాధను చూడగానే చేతిలోపని వదిలేసి ఆమెను గదిలోకి లాక్కెళ్ళింది అన్నపూర్ణమ్మ.

"ఎక్కడనుంచి వస్తున్నావ్?" తల్లి స్వరంలో అంత తీవ్రత ఎప్పుడూ చూడ లేదు రాధ.

"ఫ్రెండింటినుంచి" నిబ్బరంగానే సమాధానం చెప్పింది.

"ఎవరా ఫ్రెండు? ఎన్నాళ్ళనుంచీ సాగుతోంది నాటకం?" రాధ చెంప అదిరిపోయింది. తల్లి చేతిలో దెబ్బ తినడం అది రెండోసారి. చేతులు నొప్పి పుట్టేలా కొట్టి తర్వాత ఏడుస్తూ కూర్చున్నదావిడ. రాధ మాత్రం ఏమీ జరగనట్లు ధైర్యంగా కూర్చుంది.

తల్లి తండ్రులకు ఈ విషయం ఎప్పటికయినా తెలియక పోదనీ, జవాబు చెప్పాల్సి వస్తుందనీ సిద్ధపడే ఉందామె. తల్లికాస్త అనునయంగా అడిగితే వివరించి చెప్పేదే. కాని ఆవిడ ముందుగానే చెయ్యి చేసుకోవడం రాధ అహాన్ని దెబ్బ తీసింది. తమ యింట్లో ఉండి తనమీదే డిటెక్టివ్ పనిచేసి తల్లికి లేనిపోనివి కల్పించి చెప్పిన పెదనాన్న కొడుకుమీద అసహ్యం పుట్టింది. తల్లి సాధారణ స్త్రీ! కాని కనీసం తండ్రి తనను బుజ్జగించి అడుగుతాడనీ, మోహన్ విషయం ఆయనయితే బాగా అర్థం చేసుకో గలడనీ ఆమె నమ్మకం. కాని విషయం తెలియగానే పట్టాభిరామయ్య కోపంతో ఎగిరె గిరి పడ్డాడు. అనరాని మాటలూ అన్నాడు. ఆమె చెప్పేదేదీ వినిపించుకోలేదు, రెండు రోజులు ఆమెను గదిలోంచి బయటకురానీయలేదు.

ఆ నాలుగు రోజులూ చిన్నాన్న కూతురు రాజీ మాత్రం మాట్లాడింది.

"అక్కా, మోహన్‌కేదైనా చెప్పమంటావా?" అని అడిగింది.

రాధకి ఆశ్చర్యమేసింది. ఇదంతా ఎవరికీ తెలీదనుకుంది. కానీ అందరికీ తెలిసి పోయింది.


"మోహన్ గది తెలుసా?"

"వెనుక వీధిలోనే కదూ, సరిగ్గా తెలీదు. వెతికి పట్టుకుంటాను. నన్ను గుర్తు పట్టగలడుకదా" అంది రాజీ. అది ఇంటర్మీడియేట్ చదువుతోంది.

"చెప్పు జరిగినదంతా! నాన్న రెండు మూడు రోజుల్లో రాజీకి వస్తాడను కుంటున్నాను. ఎవరూ ఒప్పుకోకపోయినా నేనే వచ్చేస్తానని చెప్పు!"

రాజీ వెళ్ళిపోయింది.

నాలుగో రోజుకి కాస్త చల్లబడ్డాడు పట్టాభిరామయ్య. రాధకు హితబోధ చేశాడు మోహన్ గురించి అన్నీ తెలుసుకున్నాననీ, అతడి గుణం మంచిది కాదనీ, అతడితో



ఆమె సుఖపడలేదనీ వచ్చి చెప్పాడు. తండ్రి అలా దిగి వస్తాడనీ, తనతో అనున యంగా మాట్లాడతాడనీ తెలుసునామెకు.

"ఎన్నాళ్ళనుంచి తెలుసునమ్మా నీకతడు?" అడిగారాయన.

"దాదాపు సంవత్సరంనుంచి"

"ఈ సంవత్సరంలో ఎన్నిసార్లు కలిశావు అతడిని?"

"ఓ ఇరవైసార్లు" అంది ఎందుకయినా మంచిదని.

"జీవితం అంతా కలసివున్నా ఒక మనిషినిగూర్చి పూర్తిగా తెలుసుకోవడం కష్టం. అతడి గురించి మీ అన్నయ్యలద్వారా కాదు అతడి స్నేహితులనుంచే వివరాలు కనుక్కున్నాను నేను. అతడికి వేరే అమ్మాయిలతోకూడా పరిచయం ఉందని తెలిసింది. ఎర్రగా బుర్రగా ఉండగానే సరికాదు. వాళ్ళమ్మకూడా చాలా గయ్యాళి దని విన్నాను. ఆ యింట్లో నువ్వు సుఖపడలేవు. అతడు నీమీద ప్రేమ నటిస్తున్నది నీ డబ్బు గురించి. నీకేదో చాలా ఆస్తి వస్తుందనే భ్రమలో ఉన్నాడు."

రాధ నవ్వుతుంది. ప్రేమించినవాళ్ళకు తప్ప ప్రేమపట్ల ఇంకెవరికీ నమ్మకం వుండదు.

"నాన్నా! నాకెంత ఆస్తివుందో అతనెప్పుడూ నన్నడగలేదు. అసలా విషయం నాకే తెలియదు. అయినా మాకు మీ ఆస్తులు అక్కరలేదు. నేనూ ఉద్యోగం చేస్తాను. మా బ్రతుకులు మేము సంతోషంగా మలచుకోగలం. ఆ నమ్మకం నాకుంది."

"అంత తొందర పడకు. నేను చెప్పినట్లు చెయ్యి. మరో ఏడాదిపాటు అత డిని గమనించు. అతడిలోని అసలు గుణాలను తెలుసుకో. అనవసరంగా జీవితాన్ని పాడుచేసుకోకు. ప్రేమ అన్నం పెట్టదు. నీ వయసు నిన్ను ఆలోచించేలా చేయడం లేదు. తర్వాత బాధ పడతావు."

"నేను మరీ అంత చిన్నపిల్లనూ, అమాయకురాలినీ కానునాన్నా. మోహన్ మీద నాకు పూర్తి నమ్మకం ఉంది. పెళ్ళంటూ చేసుకుంటే అతడినే చేసుకుంటాను. ఇప్పుడు కాకపోయినా కొన్నేళ్ళ తర్వాతయినా. డబ్బుకికాక మనసుకి ప్రాధాన్యత యివ్వాలని నేను నీనుంచే నేర్చుకున్నాను. ఇప్పుడు డబ్బుని మించింది మరేదీ లేద న్నట్లుగా మాట్లాడుతున్నది నువ్వే."

"నేను ప్రాధాన్యత యివ్వమన్నది మనసుకికాదు. 'గుణానికి'. వాడికి డబ్బు లేదనికాదు నా అభ్యంతరం. గుణం మంచిది కాదని. అలాంటి తిరుగుబోతుతో కాపరం చెయ్యడం కష్టం. నిన్ను నువ్వు చంపుకుని బ్రతకాలి."

"నాన్నా! మీకు యిష్టం లేదంటే ఆ విషయం సూటిగా చెప్పండి. అంతేకాని తెలిసీ తెలియకుండా చెప్పుడు మాటలు విని అతడిమీద అభాండాలు వేయకండి"! అంది కోపంగా. పట్టాభిరామయ్యకూ కోపం కట్టలు తెంచుకుంది.

"అంటే ఏమిటి నీ ఉద్దేశ్యం? నేనంత దుర్మార్గుణ్ణా? నువ్వు తెలివి లేకుండా ప్రేమించేశానంటే వాడి కాళ్ళు కడిగి కన్యాదానం చేసేస్తాననుకున్నావా? చూస్తూ చూస్తూ నీ జీవితాన్ని నా చేతులారా నాశనం చేయను. నీకు వాడే కావాలనుకుంటే పోయి చేసుకో."

"అలాగేనాన్నా! నేను ముందే చెప్పాను. నాకు మీ ఆస్థి ఏమీ అవసరం లేదని. ఇలాగే కట్టుబట్టలతో వెళ్ళిపోతాను. నా నిర్ణయం సరయినదేననీ, నేను సంతోషంగా ఉండగలననీ నాకు గట్టి నమ్మకం. అది గుర్తించినప్పుడు నువ్వే నన్ను తిరిగి ఆహ్వానిస్తావు."

అపూటే ఇంట్లోంచి బయట పడింది అనూరాధ. అన్నపూర్ణమ్మ రకరకాలుగా నచ్చచెప్పింది. వినకపోతే ఏడ్చింది. తండ్రీ కూతుళ్ళిద్దరూ మొండిగానే నిలబడ్డారు. "అదే ఆఖరిసారి ఆ ఇంట్లో" అని రాధకి తెలుసు.

కట్టుబట్టలతో వచ్చిన రాధను మనస్ఫూర్తిగా ఆహ్వానించాడు మోహన్. ఆ మర్నాడే గుళ్లో పెళ్ళి చేసుకోవడానికి ఏర్పాట్లు చేసేశాడు. నలుగురయిదుగురి స్నేహి తుల సమక్షంలో వాళ్ళపెళ్ళి జరిగిపోయింది. డబ్బు అప్పుచేసి ఆమెకు కావలసిన వన్నీ కొనుక్కొచ్చాడు.

శారీరకంగా కలవడం మొదటిసారి కాదు వాళ్ళకు. కానీ తమ భవిష్యత్తుని గురించి మాట్లాడుకునేందుకూ, ఒక పథకాన్ని తయారు చేసుకునేందుకూ అదే మొదటి రోజుగా భావించుకుంది. ఆఖరి ప్రాక్టికల్ అయిపోయినరోజు మానసిక సమాగమా నికి మొదటి రాత్రిగా నిర్ణయించుకుంది.

"ముందుగా మీ ఊరువెళ్ళి అందర్నీ చూసివద్దాం. నాకేమిటో గిల్టీగా ఉంది. వాళ్ళకెవరికీ చెప్పకుండా మనం పెళ్ళి చేసుకున్నందుకు అత్తగారు ఎంత బాధపడ తారో. రాగానే ఎక్కడయినా ఉద్యోగం సంపాదించుకుంటాను" అంది రాధ.

"ఇప్పుడు మనం అర్జెంటుగా ఎక్కడికి వెళ్ళాల్సిన అవసరం లేదు. అమ్మ



తప్పక అర్థం చేసుకుంటుంది ముందు నీ ప్రాక్టికల్స్ అయిపోనీ -" అన్నాడు.

"అత్తగారు ఏమయినా అనుకుంటారా మోహన్ ?" దిగులుగా అడిగింది రాధ.

"ఏమీ అనుకోదు. అమ్మకు నేనంటే ప్రాణం. నేను చెపితే అర్థం చేసుకొంటుంది. ముందుగా నేనొకసారి వెళ్ళి మాట్లాడి వస్తాను. తర్వాత యిద్దరం కలిసి వెళ్ళొచ్చు"

ప్రోగ్రాం అంతా ఫిక్స్ చేసేసుకున్నారు ఆ రోజే.

అనుకున్నట్టుగా ప్రాక్టికల్స్ అన్నీ బాగా చేసింది అనూరాధ. పెళ్ళి విషయం రెట్టించి అడిగే స్నేహితురాళ్ళెవరూ లేరామెకు. మోహన్ ఊరు వెళ్ళాడు. ఆమె చివరి పరీక్ష రోజుకి తిరిగి వచ్చేస్తానన్నాడు. అతడు వచ్చేసరికి యింట్లోనే ఉండి ఆహ్వానించాలన్న కోరికలో యింటికి ఉరుకులు పరుగుల మీద వచ్చింది. అతడు ముందుగానే వచ్చేసినట్టున్నాడు తలుపు తాళం తీసుంది. బహుశా అతడు కూడా తనలాగే ఆలోచించి పొన్ను సిద్ధం చేస్తున్నాడేమోనన్న ఆలోచన వచ్చింది. చప్పుడు చెయ్యకుండా చిరునవ్వుతో తలుపు దగ్గరకు చేరింది. చెయ్యి వేయబోయి ఆగిపోయింది. లోపలనుంచి మాటలు వినిపిస్తున్నాయి. అందులో ఒకటి స్త్రీ స్వరం.

అత్తగారు వచ్చేసిందేమిటి ? సందేహంగా తలుపు సందులోంచి చూసింది.

"పెళ్ళయ్యాక నన్నుమర్చిపోయావా మోహన్?" ఓ అమ్మాయి.

"నిన్ను మర్చి పోవటమా ? ఇంపాజిబుల్. మా వూరు వెళ్ళాక నువ్వే నన్ను మర్చిపోవాలి పోతే -" అంటున్నాడు మోహన్.

"ఇప్పుడు బంధుత్వంకూడా కలిసిందిగా. ఇక మర్చిపోవటం ప్రశ్నేలేదులే-" నవ్వు ...

ఆమెకేదో అనుమానం వచ్చి తలుపు సందుల్లోంచి చూసింది.

రా ... జీ .... రాజీ !....


అదంతా కల కాదని, తను విన్నది నిజమేనని తనను తాను నమ్మించుకోవడానికి చాలాసేపు పట్టిందామెకు. లోపల తన చెల్లెలుంది ! ; 'మోహన్ గుర్తు వస్తాడా' అన్న అమాయకత్వపు చెల్లెలు .. ఇంటర్మీడియెట్ చదువుతున్న చె...ల్లె....లు

ఆ అమ్మాయి బయటకు వస్తున్న సవ్వడి వినిపించగానే పక్కకు తప్పుకుంది.

ఆకాశం పగల్లేదు. భూమి ఆగలేదు. అంతా మామూలుగానేవుంది. గుండెల్లో పేలే అగ్ని పర్వతాలే మిగిలాయి.

తను తప్ప మిగతా ప్రపంచమంతా లౌక్యంతో సంతోషంగావుంది. తను మాత్రం ...

"వచ్చేశావా ? ప్రాక్టికల్స్ బాగా చేశావుగదూ ?" ప్రేమగా ఆమెను దగ్గరకు తీసుకున్నాడు మోహన్. రాధ అతడి మొహంలోకి చూసింది. అతడి సంతోషం నటనలా అనిపించలేదు. వాళ్ళ సంఘర్షణ ...



"ఏమిటి అలా చూస్తున్నావ్ ? అమ్మ ఏమందోనని ఆలోచిస్తున్నావా ? నేను చెప్పానుగా. నేను చెపుతే అర్థం చేసుకుంటుందని, నిన్నోసారి తీసుకురమ్మంది."

"ఏమంటుంది రాజీ ?" అతడి నుంచి దూరంగా జరుగుతూ అడిగింది.

"నువ్వు చూశావా ఆమెను ?" అడిగాడు మెల్లగా.

ఆమె మాట్లాడలేదు.

"సారీ రాధా, నీ మనసు కష్టపెట్టుకుంటావని నీకు చెప్పడానికి సందేహించాను. రాజీకి, నాకు ఎలాంటి సంబంధం లేదు. అది ఒక పిచ్చిది. అప్పుడప్పుడు నా గదికి వచ్చేసేది. ఎంత చెప్పినా వినిపించుకునేదికాదు. ఆమెను వదుల్చుకోవడానికి వేరే మార్గంలేక మాట్లాడేవాడిని. లేకపోతే నేనేదో చేశానని అందరికీ చెపుతానని బెదిరించేది. అంత పనీ చేసేదే నేను ఒప్పుకోకపోతే నన్ను నమ్ము నీ పరిచయం కలిగాక ఆమెను సాధ్యమయినంత దూరంగానే ఉంచుతున్నాను. అయినా అప్పుడప్పుడు యిలా వస్తుంటుంది. ఇవ్వాళ మాత్రం యిక రావద్దని చెప్పి పంపేశాను. నువ్వు వినేవుంటావు"

ఆమెకు నవ్వుతోకూడిన దుఃఖం గుండెల్నిండా నిండింది.

"నన్ను క్షమించు రాధా. కాని నా మాట నమ్ము. అదంతా జరిగిపోయిన విషయం. ఇంకెప్పుడూ యిలాంటి పొరపాట్లు జరగవు. నన్ను నమ్ము" ఆమె వంక దీనంగా చూస్తూ అన్నాడు.

రాధ మాట్లాడలేదు. తన శరీరం అర్పించుకున్న మొదటి వ్యక్తిగా అతడే తన భర్త అనుకుంది. కాని మోహన్‌కు తను మొదటి స్త్రీ కాదు. అంటే తనకు అతడు భర్తే గాని అతడికి తను భార్యకాదా ?

"నన్ను క్షమించలేక పోతున్నావా రాధా ? నన్ను నమ్మలేవా ?" అంటూ వచ్చి ఆమె చేతులు పట్టుకున్నాడు. రాధ తలెత్తి అతడి మొహంలోకి చూసింది అతడి

కళ్ళలో ఆవేదన, అర్థింపు.

మెల్లగా అతడి చేతుల్లో వాలిపోయింది రాధ.

స్త్రీకదా.

* * * *

ఆ తర్వాత నాలుగు రోజులపాటు మోహన్ యింట్లోనే ఉండిపోయాడు. క్షణం కూడా విడవకుండా ఆమెను ప్రేమలో ముంచెత్తాడు. జరిగిన సంఘటనని పీడ కలలా మర్చిపోయేలా చేయగలిగాడు.

ఆ నాలుగు రోజులకే వాళ్ళు 'హనీమూన్' అని పేరు పెట్టుకున్నారు. అది కేవలం రెండు గదుల యిల్లే కావచ్చు. కాని ఈ చిన్న కుటీరం కేవలం తమ యిద్దరిదే అదే స్వర్గం. ఆ పిచ్చి మొక్కలే నందనవనంగా మలచుకునే మనసు తమ యిద్దరిలో వుంది.

కాని రాధ పొరపడింది ఒక్క విషయంలో. ఆ యిల్లు కేవలం తమ యిద్దరిదే అనుకోవడంలో.

* * * *

"ఏమిటంత హుషారుగా ఉన్నావ్? మీవాళ్ళెవరైనా కనుపించి పలకరించారా?" అడిగాడు మోహన్ రాధ అందించిన కాఫీకప్పు అందుకుంటూ.

ఉత్సాహంగా వచ్చిన రాధ మొహం ఆ ప్రశ్నతో మ్లానమయింది. పెళ్ళయి నెలరోజులు కావచ్చింది. అమ్మా, నాన్నా ఈ పాటికి మనసు కుదుట పరుచుకుని వచ్చి అహ్వానిస్తారన్న ఆశ అడుగంటి పోయింది. వాళ్ళ విషయం ఏదీ తెలుసుకునే అవకాశమే లేకుండా పోయింది.

"రాధా" మోహన్ పిలిచాడు ఆర్తిగా. "పోనీలే వాళ్ళగురించి బాధపడకు. ఇవ్వాళ కాకపోతే కొన్నాళ్ళకయినా మన ప్రేమను గుర్తిస్తారని నాకు నమ్మకం ఉంది. అంతవరకు ఎదురుచూద్దాం" అన్నాడు అనునయంగా.

తను బాధపడడం అతడు గమనించాడనుకోగానే సిగ్గుపడింది రాధ.


"అసలు విషయం చెప్పనివ్వవేం? నాకు ఉద్యోగం దొరికింది" అంది హుషారుగా.

"ఉద్యోగమా? ఎక్కడ?" ఆశ్చర్యంగా అడిగాడు.

"అమధ్య పేపర్లో పడితే చూసి అప్లై చేశాను. ఈరోజు యింటర్వ్యూకి రమ్మని కార్డు వచ్చింది. వెళ్ళాను. వెంటనే జాయినవమన్నారు. నెలకు రెండువందల యాభై యిస్తారు."

"అప్పుడే ఉద్యోగం దేనికి రాధా? నీ రిజల్ట్సు రానీ, మంచి ఉద్యోగమే దొరక వచ్చు. ఈ చిన్న జీతానికి పొద్దుటినుంచీ సాయంత్రందాకా గొడ్డుచాకిరీ చేయిస్తారు. ప్రైవేట్ వర్క్సు సంగతి నీకు తెలియదు."

"పెళ్ళయిన మరుక్షణంనుంచీ నీ కష్టాల్లో, సుఖాల్లో పాలు పంచుకోవాలని



నిర్ణయించుకున్నాను మోహన్. రిజల్ట్సు వచ్చి మంచి ఉద్యోగం దొరకడానికి ఎన్నాళ్ళు పడుతుందో ... అప్పటివరకు నన్ను వూరికే కూర్చోమనకు. కనీసం నాకు కొంత అనుభవం వస్తుంది. ప్లీజ్ నన్ను కాదనకు" అంది రాధ.

"సరే నీ యిష్టం. నీ మనసు నొప్పించడం నా అభిమతంకాదు. కాని నీకే మాత్రం యిబ్బందిగా అనిపించినా వెంటనే మానేయాలి. నాకు చెప్పడానికి సిగ్గు పడకు."

"అలాగే: రేపేవెళ్ళి జాయినవుతాను" ఉత్సాహంగా అంది రాధ.

* * * *

అనూరాధ జీవితంలో సంపాదనాపర్వం ప్రారంభమయింది.

బయట ప్రపంచంలో పురుషాధిక్యతలో స్త్రీ పడేపాట్లు గమనించడానికి మొదటి మెట్టు ఆ ఉద్యోగం.

పనున్నా లేకపోయినా లోపలకు పిలిచి కూర్చోపెట్టి ముఖం చూస్తూ కూర్చునే యజమాని ముప్ఫయ్యేళ్ళ యువకుడు సుందర్. "నువ్వు నా బిడ్డలాంటి దానివమ్మా ఆ బాస్‌కి దూరంగా ఉండు" అంటూ పని నేర్పించే నెపంమీద, మీద మీద పడే అరవైయ్యేళ్ళ అకౌంటెంట్. బాస్ గదిలోంచి బయటకు రాగానే ఏదో అర్థమయిం దన్నట్టుగా వెకిలిగా నవ్వే ప్యూన్ యాదగిరి.

"ఛీ! ఈ మగవాళ్ళకి స్త్రీలనుచూస్తే ఆ ఆలోచనతప్ప మరేం రాదుకాబోలు" అనుకొనేది. భర్త గుర్తొచ్చేవాడు. రాజీ గుర్తొచ్చేది. మధ్యాహ్నంపూట అకస్మాత్తుగా ఇంటికెళ్ళాలన్న కోర్కెని బలవంతంగా అణుచుకునేది. ఇంట్లో ఏంజరుగుతుందో అన్న ఆలోచన రాగానే మనసు వికలమయ్యేది.

* * *

భార్య వాంతులు చేసుకోవడం, భర్త కంగారుపడి డాక్టర్ని పిలవడం, డాక్టర్ నాడి పరిక్షించి "ఈమె గర్భవతి" అని చెప్పటం, భర్త సంతోషంతో ఆమెను ముద్దుల్లో ముంచెత్తడం లాంటివి సినిమాల్లోనే జరుగుతాయి. ఏ డాక్టరూ చెప్పకుండానే ఆరువారాల్లోనే తను గర్భవతినన్న అనుమానం వచ్చింది రాధకు.

సిగ్గుపడుతూ భర్తతో 'మీరు తండ్రి కాబోతున్నారు' అని చెప్పలేదు, "నాకు అనుమానంగా ఉంది, డాక్టరు దగ్గరకెళ్ళి కన్‌ఫర్మ్ అయితే వెంటనే అబార్షన్ చేయించుకుంటాను" అంది.

"అబార్షనా ? వద్దురాధా నాకిష్టంలేదు" అన్నాడు మోహన్.

"కొంచెం ఆలోచించు మోహన్. మనకా బాధ్యతలు చాలా ఎక్కువ. ఆర్థికంగా నిలదొక్కుకోలేదింకా. నాకు మంచి ఉద్యోగమూలేదు. ఇప్పుడప్పుడే మనకు 'పిల్లలు వద్దు.'"

"నేను భార్యాబిడ్డల్ని పోషించలేనంత అధమ స్థితిలో ఉన్నానని గుర్తుచేస్తున్నావా రాధా ?" బాధగా అన్నాడు మోహన్.

"ఛ ! నా ఉద్దేశ్యం అదికాదు. కొన్నాళ్ళవరకు మనం ఇద్దరమే ఉంటే బావుంటుందని అనిపించింది. ఇంట్లో కావలసినవన్నీ అమర్చుకోవచ్చుగదాని ...."

"నాకు పిల్లలంటే చాలా యిష్టం రాధా. అలాగే మనకు బాబుపుడితే మా అమ్మా నాన్నా కూడా నీకు దగ్గరవుతారని ఒక నమ్మకం కూడా. ఒక్క బిడ్డ మనకేం భారం కాదు. ప్లీజ్ నా మాటవిను."

రాధ ఎన్ని విధాల నచ్చ చెప్పినా లాభం లేకపోయింది. వేవిళ్ళ బాధతో ఉద్యోగం కూడా మానేసింది.

• • • •

"ఇతను మా బాబాయి కొడుకు రమేష్. మా వూరినించి వచ్చాడు ఏదో ఇంటర్వ్యూ కోసం" పరిచయం చేశాడు మోహన్.

రాధకు చాలా సంతోషంగా అనిపించింది తమ పెళ్ళయాక యింటికి వచ్చిన మొదటి అతిధి అతడు. మనస్ఫూర్తిగా అతడిని ఆహ్వానించింది.

ఇంటర్వ్యూ అయిపోయింది. రమేష్‌కి ఉద్యోగం రాలేదు. ఉద్యోగప్రయత్నంలో అతడక్కడే ఉండిపోయాడు.

రెండు గదుల యిల్లు మూడో మనిషి రాకతో యిరుకైపోయింది ఏకాంతం, ప్రశాంతత లేకుండా పోయాయి.

రాధలో నిర్లిప్తత మొదలయింది. అదే సమయంలో మరొకసంఘటన జరిగింది.

(సశేషం)

అనాదిబాధ

మధురాంతకం రాజారాం

మన యూనివర్సిటీల్లో ఎవరైనా 'ఆకలి'ని గురించి రీసెర్చి చేయాలనుకుంటే, వాళ్ళకు నేను సత్తిరాజు పేరు రికమెండ్ చేస్తాను. ఆకలి ఒక సముద్రం లాంటిదైతే దాని లోతుల్ని తాకినవాడు సత్తిరాజు. ఆకలి ఒక మేరువులాంటిదైతే దాని ఎత్తుల్ని కొలిచినవాడు సత్తిరాజు. ఆంధ్ర, కర్ణాటక బార్డర్లో అజ్ఞాత, విస్మృత గ్రామ సీమల్లో ఎక్కడో అతడి పుట్టుక. అన్నాన్ని పరబ్రహ్మమని అనుకోడం నేను విన్నాను. కానీ రాగిపిండి సంకటి, రాగిపిండి ఉప్మా, రాగిపిండి అంబలి, ఇలా సర్వమూ రాగులమయమే అయిన భోజనాన్ని పరబ్రహ్మ స్వరూపంగా భావించ వచ్చునా అని నా అనుమానం! అయితే సత్తిరాజుకు మాత్రం అలాంటి అనుమానం లేశమాత్రమున్నా లేదు. తన చిన్ననాటి భోజన వైభవాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ అతడనేవాడు – 'గోడకు వేసి కొడితే రబ్బరు చెండు మాదిరిగా తిరిగొచ్చి చేతిలో పడాలయ్యా రంగనాథం! రాగి పిండితో చేసిన సంకటి ముద్దంటే అది! దానికొక్కటే అనుపానం. ఎండుమిరప కాయల గొడ్డుకారం. ఆకొన్న కడుపుతో ఆకుముందు కూచుంటే అదే అమృతం. అట్లాగన్జెప్పి మే మెప్పుడూ వరిబియ్యపన్నాన్ని కళ్ళజూశ్చేదనుకోవద్దు. ఏ పండగొచ్చినా, పబ్బమొచ్చినా మా ఆకులో సాక్షాత్తు తుమ్మపువ్వుల కుప్ప మాదిరిగా కనిపించేది అదే గదా! కూడంటే గుండెకాయ, మెతుకంటే మేనమామ మాకు! పెద్దబాలశిక్ష అట్టపైన కొన్ని మందుల ప్రకటనలుండేవిలే! వాటిని బట్టి నా భోజన పదార్థాలకు నేను పేర్లు పెట్టుకున్నా! సంకటంటే ఏమిటో తెలుసునా? అది చ్యవనప్రాస లేహ్యం. మరి వరిబియ్యపన్నం సంగతడగవే! అవేగదటయ్యా మదనానంద గుళికలు!'

కరువు కాటకాల పురిటిగడ్డలో పుట్టి, కడుపెండగట్టుకుంటూ పెరిగిన సత్తిరాజు, ఉండి వుండీ 'పెండోరాస్ బాక్స్' లాంటి తన జ్ఞాపకాల బోషాణాన్ని తెరిచేసేవాడు.

'ఏమయ్యా రంగనాథం! ఆకులలములు మేసి బ్రతకడమంటే ఏమో తెలుసునా?' అనేవాడు.

'అదెలాగయ్యా?' అనేవాణ్ణి.

'మా ఊరికవతల మల్లేశ్వరుడి కొండ. కొండ దాటితే కాటమరాజు కోన. చిక్కం భుజానికి తగిలించుకొని, తెల్లారుజామున్నే బయల్దేరితే – పొద్దు పదిబారలెక్కేటప్పటికి కోనలో వుండాల. మధ్యాన్నానికి ఆకుతో చిక్కం నింపుకోవాల! దేవదారాకంటే ఏమనుకున్నావో! అది మాకు వరప్రసాదం. ఎండకు వెయ్యి. ఉడకబెట్టు. ఉప్పురాళ్ళు వెయ్. ఇంత మిరప్పొడి చిలకరించు. ఉంటే గింటే కాసిన్ని వేరుశనగ్గింజలు నూరి ఆ పొడి



అందులో కలుపుకో! పట్టెడాకు తిని, ఒక లోటా నీళ్ళు పట్టించేసినావంటే – ఇంకొక జాము సేపటిదాకా ఆకలి నీ దగ్గరికి రాదు.'

ఇదయిందా! వెంటనే ఇంకొకటి.

'చూడు రంగనాథం! కలమందగడ్డలు తినినావా ఎప్పుడైనా?'

'అవెక్కడ దొరుకుతాయి నాయనా?' అనేవాణ్ణి.

'మార్కెట్టులో దొరకవులే. మా మిడిశోపుల చుట్టూ ముండ్లపొదలుంటాయి. ఆ పొదల్లో బలిసిపోతూవుంటాయి. కలబంద మొక్కలు. వానాకాలం వచ్చేటప్పటికి మొక్కలోనుంచీ మోను పుడుతుంది. చూస్తూ చూస్తూ వుండగానే అది జండా కొయ్యమాదిరిగా పెరిగిపోతుంది. అప్పుడింక పెరిగిన

మోనును నరికి పారెయ్యాల! గునపంతో తవ్వి గడ్డలు పైకి తియ్యాల. కలమంద గడ్డంటే రంగనాథం, ఆకలి కడుపుకు అది కలకండ పెళ్ళేననుకో ....'

అనోమాద్వష్ట సిద్ధుల్ని గురించి, సిద్ధౌషదాలను గురించి నేను విన్నాను. ఆకలిని జయించడంలో అంతకు మించిన చిట్కాలను కనుగొన్న మానవుల్ని గురించిమాత్రం నాకు సత్తిరాజుమూలంగానే తెలిసొచ్చింది. చెత్తలో నుంచి సత్తు కలిగిన ఆహారాన్ని సృష్టించే ప్రాజెక్టు ఒకటి తలపెడితే దానిద్వారా వాళ్లు మిరకిల్స్ చేసి చూపించగలరని నేను విశ్వసించాను.

వాస్తుశాస్త్రంలో మయుణ్ణి చంపి పుట్టిన మహాశిల్పి ఒకాయన వుండేవాడు. ఆయన పేరు పెరుమాళ్ళ మేస్త్రీ. సదరు మేస్త్రీగారు నిర్మించిన మూడంతస్తుల మాయామందిరంలోని ఒక పావురాల గూడులో సత్తిరాజూ, నేనూ అన్యోన్యంగా అద్దెకుండేవాళ్ళం. చేతివనుల ఎంపోరియంలో సేల్స్‌మన్‌గా సత్తిరాజు, నాలుగైదు కొట్లల్లో పద్దులురాసుకుంటూ నేనూ. తమ చేతిక్రింద పనిచేసే ఉద్యోగి జీవించే వుండాలన్న మహదాశయంతో ఎంపోరియం వాళ్ళిచ్చే నెలజీతం డెబ్భైఅయిదు రూపాయలు సత్తిరాజుకేమాత్రం సరిపోయేది కాదు. తలకు చుట్టుకోడానికైనా చాలని తుండుగుడ్డతో ఒళ్ళంతా దాచుకోవలసినట్టుందే పరిస్థితి. ప్రాణావసరమైన తిండికన్నా ముఖ్యంగా, మరికొన్ని బాదరబందీలు సృష్టించినందుకు మానవ నాగరికతను కసిదీరా తిట్టుకోవాలని ఉండేది సత్తిరాజుకు. ఆదిమ యుగాల్లో మానవుడు ఒక ఆటవిక జంతువుగా బ్రతికిన బంగారు కాలాన్ని గురించి తలపోస్తూ అతడు తన ఆక్రోశాన్ని వెలిబుచ్చేవాడు - 'చూడవయ్యా రంగనాథం! అప్పట్లో మానవుడు పచ్చి మాంసమే పీక్కుతిన్నాడో, కాయగసరులే కబళించినాడో మన కనవసరం! ఒకటి మట్టుకూ నిజం! అతడు అరగడుపుతో, వరగడుపుతోమాత్రం మాడిపోయి వుండడు. అదృష్టవంతుడు! వాడికి ఇంటి బాడుగ చెల్లించాల్సిన బెడద లేదు. హాయిగా ఆకులో, బెరళ్ళో మొలకు చుట్టుకునే వాడుగనుక బట్టలుకొనే తాపత్రయం అసలే లేదు. అలే లేకపోయినాక, ఇక చూలేమిటన్నట్టు ఇక లాండ్రీలను గురించి, సెలూన్లను గురించి వాడికి కాబట్టే వుండదు. నువ్వూ, నేనూ అలా బ్రతగ్గలమా? ఎంతటివాళ్ళకు దొరికేదయ్యా అంతటి భాగ్యం?'

ఉండి, వుండీ ఏ అర్ధరాత్రప్పుడెప్పుడో లేచి కూచునేవాడు సత్తిరాజు. భ్రూమధ్యంలో చూపు నిలిపిన యోగిసత్తముడిలా పైకప్పుకేసి చూస్తుండేవాడు. 'తెల్లవారడానికింకా చాలా టైం వుంది. పడుకోరాదా?' అంటే 'ప్చ్, లాభం లేదులే రంగనాథం! ఆకలిగా వుంది. ఈ రాత్రికింక జాగరణమే' ననేవాడు. 'బాబూ! సత్తిరాజూ! మనబోటి సామాన్యుల కడుపుల్లో ఇంతింతలావు జఠరాగ్ని వుండొచ్చునా? ప్రమాదంగదా!' అని మెత్తగానే మందలించేవాణ్ణి. సత్తిరాజు ముఖంలో ఆగ్రహం పరవళ్ళు ద్రొక్కేది. 'మరి ... రంగనాథం .... నాగ్గనుక .... దేవుడనేవాడు ప్రత్యక్షమైతేనా' హుంకరించినట్టుగా అనేవాడు. 'ఏంచేస్తావని' విస్తుపోతూ ప్రశ్నించేవాణ్ణి.

“ఈభూప్రపంచకంమీద గాడిదలనేవాటిని మాత్రం లేకుండా చేసెయ్యమని కోరుకుంటాను...”

'ఎందుకు నాయనా! ఎనభై నాలుగు లక్షల జీవరాసుల్లో వాటినిగూడా వుండిపోనీరాదా?' అంటూ ప్రాధేయపడేవాణ్ణి.

'ఊహూ, నీకు తెలియదులే రంగనాథం! ఈ అనర్థానికంతా అవే కారణం. నేను పురిటిబిడ్డగా వుండగా మా అమ్మ ఏం చేసిందో తెలుసా? వరుసగా మూడురోజులు నాకు గాడిదపాలు తాగించింది. గాడిదపాలు తాగడమంటే ఏమనుకున్నావు? ఇక చచ్చేదాకా నీ కడుపులో జఠరాగ్ని నిద్రపోదన్నమాటే! అంతా నా కర్మ! అరణ్యాల్లో వుండగా పాండవులకదేదో దొరికిపోయిందట-అక్షయపాత్ర! నాకటువంటిది దొరకరాదా? బూందీ కావాలంటే బూందీ, జిలేబీ కావాలంటే జిలేబీ, గులాబ్‌జాం కావాలంటే గులాబ్‌జాం ....'

'చాల్లేవోయ్ సత్తిరాజూ! అత్యాశకైనా హద్దుండాలి. అదిగో, ఆకుండలో నీళ్ళున్నాయిగానీ, తాగేసి పడుకో,' అంటూ ముఖం నిండుకూ ముసుగు కప్పేసుకునేవాణ్ణి.

నీళ్ళు తాగి పడుకున్నా నిద్ర రాకపోవడం వల్ల, చాపపైన అటూ, యిటూ దొర్లుతూ వుండిపోయేవాడు సత్తిరాజు. సూర్యోదయంతోబాటు అతడికి జ్ఞానోదయంకూడాఅయ్యేది. 'రంగనాథం! రాత్రి గడ్డితినిందిలే! ఇప్పుడొచ్చింది. ఏండి? నా బుద్ధి. పాపం, గాడిదలెట్టాగైనా నోరులేని జీవాలు. దేవుడు కనిపిస్తే వాటిని నాశనం చెయ్యమని కోరుకోను.'

'మరేం కోరుకుంటావు?' కాస్త భయపడుతూనే అడిగేవాణ్ణి.

“పెద్ద కోరికేం కాదులే! మంచి మిలిటరీ హోటల్లో సర్వరుద్యోగం యిప్పించినా చాలు...”

తిండి తినడం, నిద్రపోవడం మొదలైనవి ప్రాణుల సహజ ధర్మాలు. ఆధునిక రాజ్యాంగాలు కర్మ సిద్ధాంతాన్ని ఖాతరు చెయ్యవు గనుక, మానవుడు కడుపునిండా తినాలనుకోడం చట్టరీత్యా నేరమేమీ కాదు. కానీ హక్కుండడంతో ఏమయింది? అవకాశం వుండాలిగదా! అనేవాణ్ణి నేను. అవకాశం తేరగా దొరుకుతుందా, దానికోసం వెదకాలి- అనేవాడు సత్తిరాజు.

అనడమేకాదు, అనతికాలంలో అతనొక అవకాశాన్ని పట్టుకొచ్చేశాడు. ఆలోచించిన కొద్దీ అదొక అమోఘమైన ఉపాయంగానే తోచింది. నీలో ఆకల్ని నువ్వు తీర్చుకోలేనప్పుడు, వాటిని తీర్చగల వ్యక్తి చేతికిగానీ, సంస్థ చేతికిగానీ నీ జీవితాన్ని తీసుకెళ్ళి అప్పగించడంలో తప్పులేదు. కాస్త రిస్కుతో గూడిన వ్యవహారమేగావచ్చునుగాక! అత్యవసర జీవితావసరాలు తీరిపోవడానికి ఢోకా లేనప్పుడు, ఆమాత్రం రిస్కు నిరాఘాటంగా తీసుకోవచ్చు. మరునాటి ఉదయం మేము రిక్రూటింగ్ ఆఫీసు ముందు తచ్చాడుతున్నాము. సాయంకాలానికల్లా లిస్టు వేశారు. లిస్టులో నా పేరుమాత్రం వుంది. సత్తిరాజు పేరులేదు.

'ఏంచెయ్యమంటావు రంగనాథం! దురదృష్ట దేవతకు నేను ముద్దుబిడ్డనైపోయినాను. చిన్నప్పుడెప్పుడో మల్లేశ్వరుడి కొండపైన కాలుజారి పడితిని. మోకాటికింద ఎముక విరిగింది. పుత్తూరికి తీసుకపోయి మూఢాళ్ళు కట్టు కట్టించుకొచ్చినారు. నేను కాలు కొంచెం ఎగరేస్తూ నడవడం అందుకే! డాక్టరుగాడేమైనా గుడ్డోడా! ఎట్టనో పసిగట్టేసినాడు. కాలూ, చెయ్యీ సరిగ్గా లేనివాడు మిలిటరీకేం పనికొస్తాడు చెప్పు.'

ట్రెయినింగుకోసం నన్ను పూనా వెళ్ళమన్నారు. ఆరోజు నన్ను సాగనంపడంకోసం స్టేషనుకు వచ్చి ప్లాట్‌ఫారంపైన నిల్చున్న సత్తిరాజు యింకా నా కళ్ళల్లో మెదులుతున్నాడు. అతడి మాటలు నాచెవిలో గింగురుమంటూనే వున్నాయి. 'క్షేమంగా వెళ్ళిరావయ్యా రంగనాథం! నేనన్ని వివరాలూ విచారించి తెలుసుకున్నాలే! మిలిటరీ క్యాంపులో ఉదయం అయిదు గంటలయ్యేటప్పటికి 'ఏ వన్' కాఫీ ఇచ్చేస్తారట! మళ్ళీ ఎనిమిదింటికే టిఫిను. ఇడ్లీలకైతే సాంబారు. పూరీలకైతే ఉర్లగడ్డల మసాలా. నువ్వెన్నయినా తినొచ్చు. అడిగేవాళ్ళుండరు. మధ్యాన్నం పన్నెండున్నరకు టంచనుగా భోజనం ఎట్లాగూ మిలిటరీలో చేరినావుగనక మిలిటరీ భోజనమే ఎన్నుకో! బిర్యానీ, చికెన్, ఆమ్లెట్...'

ఇంకా ఏమిటో చెబుతూనే వున్నాడు సత్తిరాజు, నేనెక్కినరైలుబండి కదిలింది.

ఈనెల అత్యుత్తమ అబద్ధం పోటీ

మొదటి అత్యుత్తమ అబద్ధం

"రాష్ట్రంలో విద్యుత్ కోతవల్ల పరిశ్రమలేవీ మూతబడలేదు" —
ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖామంత్రి రాజిరెడ్డి.

-ఆకాశవాణి ప్రాంతీయవార్తలు 15-2-87

శ్రీమతి. ఎస్. పద్మమోహన్ — *గూటి*

"నాయకుడు" చూస్తున్నంతసేపూ ఏడుస్తూనే ఉన్నాను -విజయశాంతి
26 నవంబర్-2 డిసెంబర్ 1987 సితారలో ప్రకటన

యర్రా బాల్జీ — *అనకాపల్లి*

రెండవ అత్యుత్తమ అబద్ధం

"ఆసక్తి లేకనే ఆట వదిలేశా !"

-సునీల్‌గవాస్కర్ (ఈనాడు నవంబర్ 28)

వి. కె. విశ్వనాథ్ — *హనుమకొండ*

మూడవ అత్యుత్తమ అబద్ధం

"అనుభవజ్ఞులైన కళాకారుల కోసం మా నిరంతరకృషి, శ్రమ ఎల్లప్పుడూ ఉంటుంది"
(టి. వి. జాబులు-జవాబులు)

ఆర్. రామకృష్ణారావు — *గోగాపురం*

ఇతర ఉత్తమఅబద్ధాలు

"పెళ్ళిచూపుల్లో అమ్మాయి అబ్బాయిని అడుగుతున్న మొదటి ప్రశ్న పల్లకి జీవితచందా కట్టారా" అని !

10-12-87 పల్లకి వారపత్రికలో ఒక ప్రకటన

వి. రమేష్‌బాబు — *మల్కాజ్‌గిరి*

"రైతుకుటుంబంలో జన్మించిన తాను వ్యవసాయ మంత్రిగా వుండాలన్న ధ్యేయంతో హోంశాఖను వదిలివేశానని" శ్రీ వసంత నాగేశ్వరరావు అన్నారు.
ఆంధ్రజ్యోతి 30-11-1987

తెనాలియోగా — *మంగళగిరి*

"శ్రీనివాసులురెడ్డి అంటే నాకు ఎంతో గౌరవం"
ముఖ్యమంత్రి ఎన్. టి. రామారావు ఈనాడు 18-11-87

గుబ్బల గోపాలకృష్ణ — *కాకినాడ*

భారతజట్టు కెప్టెన్‌గా నా జీవితం సంతృప్తికరంగానే సాగింది. ఎటువంటి ఫిర్యాదులూ లేవు -భారత క్రికెట్ జట్టు మాజీకెప్టెన్ కపిల్‌దేవ్
ఈనాడు 5-12-1987

టి. బాలకృష్ణ — *మంగళగిరి*

'తాము క్రమశిక్షణారాహిత్యాన్ని ఏనాడు క్షమించము, పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించినవారికి తమ పార్టీలో తావులేదు'
ముఖ్యమంత్రి ఎన్. టి. రామారావు వార్త ఆంధ్రజ్యోతి డిసెంబరు 13

ఎం. ఎస్. లక్ష్మి — *నందివెలుగు*

"శ్రీ ఎన్. టి. రామారావు కూలిపోవాలని ఈ రోజు పసిపిల్లలు కూడా కోరుతున్నారు"
-శ్రీ యన్. శ్రీనివాసులరెడ్డి వార్త 'ఉదయం' డైలీ డిశంబర్ 11-12-1987

కె. వెంకట్ రావు — *సత్తుపల్లి*

"ఆకలితో వచ్చే ప్రేక్షకులకి విందుభోజనం పెట్టటమే నా ధ్యేయం"
-సినీ దర్శకుడు కె. మురళీమోహన్‌రావు వార్త సితార 10-16-డిశంబర్ 87

యన్. రవి — *సత్తుపల్లి*

"టి. టి. డి. నిధులు బ్యాంకుల్లో భద్రం"
ఈనాడు 14-12-97 దేవదాయశాఖమంత్రి

గిరికుమార్ — *నెల్లూరు*

అవినీతి పాలిట ముఖ్యమంత్రి ఎన్. టి. ఆర్, చండశాసనుడు, సింహస్వప్నమని వసంత నాగేశ్వరరావు తదితరులు (అన్నను) అభివర్ణించారు.
ఆంధ్రప్రభ దినపత్రికలో 27-11-87

బి. రాధ — *చీరాల*

"హైదరాబాద్ దూరదర్శన్‌లో తాను జయసుధకిచ్చిన ఇంటర్వ్యూలో తాను రాజకీయాల్లో చేరబోతున్నట్లు చెప్పిన వార్తల్లో నిజంలేదని" శ్రీ అక్కినేని అన్నారు

వి. రమేష్‌బాబు, హైదరాబాద్, వి. సత్యనారాయణ, హైదరాబాద్

శివరాత్రి మహాత్మ్యం

పురాణం సుబ్రహ్మణ్యశర్మ

అనగనగా ఓ లేడీడాక్టరు. మేం డి.బి.కె. రైల్వేలో పనిచేసే రోజుల్లో అరవిందముఖి అని ఓ లేడీడాక్టరుండేది.

లేడీడాక్టర్ రాకముందు లేడీడాక్టర్ని మా వూరు వేస్తున్నారంటే మా కేంపు కేంపంతా సరదా పడిపోయింది. ఆ లేడీడాక్టరు అవివాహిత అని తెలిశాక మా రైల్వే స్టాఫ్ అంతా మగాళ్ళుకూడా ఆవిడ దగ్గర పురుడు పోసుకోడానికి పరమ సంబర పడిపోయారు. ఆఫీసర్లుకూడా 'అరవిందముఖి' రాకకోసం మలయాళపు శృంగార సినిమాకై కుర్రకారు ఎగబడినట్లు తెగ ఉత్సాహ పడిపోయారు.

ఆవిడకు రోగుల్ని చూడ్డానికి, కేంపులలో వున్న సిబ్బందిని పరామర్శించడానికి ఇంజనీర్ల జీపుల్ని వాడుకోవచ్చు. అంచాత ఆ డాక్టరమ్మగారిని పక్కన కూచోబెట్టుకుని బండిని తోలడానికి ప్రతి జీపు డ్రయివరూ రంభనెత్తుకుని రన్నింగ్ రేసులోకి దిగినట్లు ఫీలయ్యేవాడు. తెరమీది సాని దిగివచ్చి దిగివచ్చి కితకితలు పెట్టినట్లు జీపు డ్రయివర్లు మెలిదిరిగి పోయేవారు. ఆడగాలి మహిమ అలాంటిది.


పులులకి, సింహాలకి పడనట్లే డాక్టర్లకి, ఇంజనీర్లకికూడా పడదు. అరవింద మంచి లేడీడాక్టరు కావడంవలన (అసిస్టెంట్ సర్జన్లకు అసిస్టెంటు మెడికలాఫీసర్‌హోదా అప్పటికి రాలేదు. అంటే గెజిటెడాఫీసరు కాలేదు. కనుక వాళ్ళ టి.ఎ. బిల్లులు, ఇంజనీర్లు కవుంటర్ సైన్ చెయ్యాలి) కొంత సర్దుకుపోయినా ఆడగాలి వేరు, కొండగాలి వేరు. దేనికది వేరేకదా!

ఇంతలో ఓ వింత - కాబోయే పేషెంట్ల ఆశలన్నీ ఆవిడ కుప్పకూల్చేసింది. చాలా మంది ఆవిడ తన కంకణాలచేత్తో చెయి చూస్తుందనీ, జ్వరంవస్తే పొట్టమీద చేయివేసి పరామర్శిస్తుందనీ, మెడమీద తలమీద రాస్తుందనీ, అలాగే ఆ కోమలమైన హస్తంతో ఇంజక్షనిస్తుందనీ ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.

కాని, ఆవిడ జగత్కాంత్రి అని విలాసార్థం నలకూబరుడు లేకుండా ఆ లోయల్లో విహారానికి వచ్చిన రంభ అనీ, టి.ఏ. బిల్లుల కోసం, ఆదివారాలు రెండవ శనివారాలు హాలిడేస్‌లో వాల్తేరు చెక్కేసి 'కజిన్స్'తో కాలక్షేపం చేయడానికే వచ్చిన కాంతకాని, రోగార్తుల ఆశ నిరాశలతో ఆమెకేమీ నిమిత్తం లేదని అప్పుడు ఆ వూళ్ళో చాలామందికి తెలీదు.

డాక్టర్ అరవిందముఖి తెల్లబాతులా డ్రెస్సప్పయి శివునిమెళ్ళో పడగ విప్పిన నాగసర్పంలా స్తెత్‌ని మెళ్లో వేసుకుని దాన్నే తిప్పుతూ, నలుపుతూ పేషెంట్లు చెప్పినది వినీ విననట్లు తన వాలుకనులతో అటూయిటూ చూసి నచ్చినవాడు ఫల్గుణుడైనా వాడి ప్రాణాలు తోడేసేది. చెయిచూడ్డం, ఇంజక్షనివ్వడం, మందులు తాగించడం వగైరాలు కంపవుండరు గోపాలరావుచేత చేయించేది. చిన్నచిన్న గాయాలు తగిలినా అన్నిటికీ గోపాలరావే. ఆఖరికి నోట్లో గుచ్చిన ధర్మామీటరును కూడా కంపవుండరేచూసి చెప్పాలి. ఆవిడ చూపులు ధర్మామీటరు మీదకూడా వాలేవి కావు.

ఇక పెద్దవాళ్ళ విషయానికివస్తే, ఆవిడ చాలా ఓర్పుగా 'మీరు డి.యం.వో. గారిని చూస్తే మంచిది. సి.యం.వో. గారిని చూస్తే మంచిది -' అని కేసులన్నీ పైకి రిఫర్‌చేసి తప్పించుకునేది. అయితే ఆఫీసర్స్ క్లబ్బులో మాత్రం దబ్బెట్టి పేకాడేసి కుర్రఇంజనీర్ల నుంచి లాగవలసినంతసొమ్ము లాగేసేది. ఆవిడకోసం టవున్నుంచి 'కజిన్స్' వస్తూ వుండేవారు. వారికోసం రమ్మూ, జిన్నూ, బ్రాండీ, విస్కీ సీసాల్ను స్టోర్ చేసేది. మాంసాహారం వండ నేర్పుగల 'ఆయాని' కేసులో చేర్చుకుంది. అలా ఆవిడకు ప్రతి రాత్రి వసంతరాత్రి కాకపోయినా అన్ని రాత్రులూ చీకటి రాత్రులు కావు. ఇలా, కతిపయ దినంబులు గడచినంత - నాకూ ఆవిడకూ భేటీ పడింది.



గవర్నమెంటులో పని చేసే వారికి తెలుస్తుంది. అక్కడ రూల్సు ముఖ్యంకాని మరేమీ కాదు. ఇంజనీర్లకి డాక్టర్లకీ తాము టెక్నికల్

మనుషులమని తమకు రూల్సు వర్తించవని గర్వం. అప్పుడప్పుడు ఇంజనీర్ల జీపులు దొరకనప్పుడు-లేడీడాక్టర్ యిష్టమున్నా లేకపోయినా బస్సెక్కవలసి వచ్చేది. ఢిల్లీకి, న్యూయార్క్‌కి మధ్య లంకలా ఆ వూరుకీ విశాఖపట్నానికి మధ్య శృంగవరపుకోట అలాటిది. పెద్ద షాపింగ్‌లకి పాత్తేరు కెళ్ళినా-చిన్న చిన్న షాపింగ్‌లకు శృంగవరపుకోటే శరణ్యం. హోటళ్ళున్నాయి. ఒకటో ఆరో సినిమాహాళ్ళున్నాయి. మా లారీ డ్రయివర్లూ, జీప్ డ్రయివర్లూ కులాసా చెయ్యడానికి ఇక్కడ చిల్లర సదుపాయాలు కూడా వున్నాయి. డ్రయివర్లు ఎక్కడ నిద్రతీశారో చెప్పడానికి క్లీనర్లుండేవారు. డ్రయివర్లు వదిలేసిన కాతాల్ను క్లీనర్లు లాగిస్తూ కేసులు చెడిపోకుండా చూసుకునేవారు.

* * *

అరవిందముఖి యింటికెవరేనా వెళితే విసుక్కునేది, తిట్టేది. ఆసుపత్రిలో వుందో లేదో తెలిసేదికాదు. ఇల్లా వెళ్ళేసరికి అల్లా మాయమయేది. ఆవిడ పొట్టి కాదు, కాస్త పొడగరి. తెలుపే. ముఖం వెడల్పే - కళ్ళు కాస్త చిన్నవి. మనిషి హోదావల్ల వచ్చిన దర్జాతో మెరిసేది. ఆ కాలనీలో కుటుంబాలతో వున్నవాళ్ళు కొద్దిమందే. ఒక విశేషం ఏమిటంటే - కేంపుల్నించి వచ్చాక 'అమ్మగారు కూరవుంటే పెట్టమన్నారు, పచ్చడి వుంటే పెట్టమన్నారు' అని కళాసీని గిన్నె యిచ్చి పంపేది. ఆడవాళ్ళు తాము యింట్లో యేది చేసుకున్నా, డాక్టరమ్మకి పంపించేవారు. కాని, ఆ మొహమాటం ఏమీ లేకుండా ఇంటికి వచ్చినప్పుడు ఖచ్చితంగా 'ఐదూ, పది' విజిటింగ్ ఫీజు వసూలు చేసేది. ఇలా వుంటూండగా -ఆవిడగారు కాంపుకి లైనుమీద వెళ్ళేసినపుడు కంపవుందరు గోపాలరావు మా ఆవిడ కబురుచేస్తే 'డెట్టాల్' యివ్వడానికి బదులు 'లైజాల్' యిచ్చాడు. ఏడాదికూడా నిండని మా చంటిపిల్లాడికి అది డెట్టాల్ అనుకుని - కాళ్ళమీద పడుకోబెట్టుకుని నోట్లో పోసేసింది. దాంతో పిల్లాడు నోరంతా కాలి, బోరంతా కాలి గుక్కపట్టి యేడ్చేస్తున్నాడు. తరవాత కనుక్కుంటే తెలిసింది. లైజాల్ పాయిజన్ లాటిదని. పిల్లాడు గిలగిల కొట్టుకుంటున్నాడు. చూడ్డానికి వచ్చిన వాళ్ళంతా యీ పిల్లాడు యిలా అరిచరిచి చచ్చిపోతాడు. అని అన్నారు. ఉప్పునీళ్ళు నోట్లో పోశాము. నాకూ మా ఆవిడకూ కాలూ చేయీ ఆడలేదు. ఆవిడ ఏడ్చేస్తోంది. పిల్లాడి అవస్థచూసి నేను వెర్రిమొహం వేసుకుని నిలబడ్డాను. కంపవుందరుచేత మందులిప్పిస్తే ఎలా కొంపమునిగిందో చూశారా అని అంతా చివాట్లు వేస్తున్నారు. ఓ రాత్రివేళ డాక్టరమ్మ వచ్చిందని తెలిసి కబురుచేస్తే 'లెట్ హిమ్ డై. నన్ను డిస్టర్బ్ చెయ్యొద్దు' అని అందిట. ఆ మనిషి ఎటువంటి శాడిస్టో అనుకున్నాం, విచారించాం. పిల్లాడి యేడుపు ఆగిందికాదు. 'ఇలా ఏడిచి ఏడిచి మన కళ్ళముందు ప్రాణాలు విడుస్తాడు వీడు' అని భయపడుతున్నాం. ఇంతలో మా ఆవిడ తలారా స్నానంచేసి వెంకటేశ్వరునికి ముడుపుకట్టి నీ కొండకు వస్తానని మొక్కుకుంది. ఇంట్లో చాపమీద చెరోవైపూ పడుకుని మధ్యన ఏడుస్తున్న పిల్లవాడ్ని పెట్టుకుని దీనాతిదీనంగా అయిపోయి ఒరిగాం. వాడు ఏడుస్తూనే వున్నాడు మేం నిద్రపోయాం. అంత దుఃఖంలో ఎలా నిద్రపట్టిందో మాకైతే తెలీదుకాని మేం మళ్ళీ లేచేసరికి పిల్లాడు మా యిద్దరిమధ్యా కూచుని నవ్వుతూ కేకలేస్తూ ఆడుకుంటున్నాడు. మాకు చెప్పలేనంత ఆనందం కలిగింది. పిల్లాడ్ని ఎత్తుకుని యింటింటికీ వెళ్ళి నిద్ర లేపి మావాణ్ణి చూపించి వెర్రాళ్ళలా సంతోషపడిపోయాం. పిల్లాడు వాడికేమీ జరగనట్టే వున్నాడు. బోర

నోరు అంతా కాలిపోయి మచ్చలు కట్టినా, అది నిస్సందేహంగా ఏడుకొండలవాడి మహిమేనని మాకు స్పష్టంగా నెత్తిమీద కొట్టి చెప్పినట్లు తెలిసిపోయింది. ఆఫీసులో టీపార్టీ యిచ్చాను. కంపవుందరు గోపాలరావుని ఏమీ అనొద్దని పెద్ద ఆఫీసర్‌కి చెప్పి వచ్చాను. కాని 'లెట్ హిమ్ డై' అన్న ఆ లేడీడాక్టర్ 'అరవిందముఖి' మీద నా కోపం పోలేదు. ఇంతచిన్న వయసులో మానవత్వపు విలువలు

మృగ్యమయిన యీ ఆడది ఎదిగితే ఎంతపెద్ద విషవృక్షమవుతుందోకదా-ఎంతమందిని కాటేసే విషవృక్షమవుతుందోకదా? ఎంత మందిని కాటేసే కాలసర్పంలా మారుతుందో కదా? అని విచారించాను. మా కాలనీ కాలనీ అంతా ఆ 'అరవిందముఖిని' డ్రాకులాని చూసినట్టు చూసేవారు. కాని ఆమెను ఎవరూ ఏమీ చేయలేకపోయారు.

* * *


అసలుజీతం బ్యాంకులో వేసుకుని టి.ఏ. బిల్సు వగైరాలమీద చాలామంది బతికేస్తూ వుంటారు. అరవిందముఖి బిల్సు, పేబిల్సు, ప్యాసులు అన్నీ నేను చూస్తూ వుండేవాడిని. ఆవిడ టి.ఏ. బిల్సు అన్నీ తప్పుల తడకలు. జీపుల లాగ్‌బుక్స్‌తో కంపేరుచేస్తే చాలా తప్పులు వుండేవి. అలాటి బిల్సు పాస్‌చేస్తే ఆడిట్‌వాళ్ళు పట్టుకుని పిలక జాడించేస్తారు.

బస్సులు చెడిపోయి వారాల తరబడి నడవకపోయినా - ఆ బస్సులలో తను వెళ్ళినట్లు పాత బస్సు టిక్కెట్లమీద తేదీలు దిద్ది బిల్లులు పెట్టేది.

గుమాస్తా తెలివితేటలన్నీ వుపయోగించి ఒక పెద్ద నోట్ తయారుచేసి పెద్ద ఆఫీసర్‌కి పంపాను. ఆవిడ బిల్సు అన్నీ రిటన్ చేశాను.

ఉరుము ఉరిమి మంగలంమీద పడ్డట్లు ఆఫీసరు పిల్చి నామీద విసుక్కున్నాడు. ఆ బిల్సు అన్నీ ఎలా రాయాలో నీకు తెల్సు కాబట్టి నువ్వే ఎలారాయాలో చెప్పి అలా





రాయకపోయావా ? లేడీడాక్టర్‌కి మీ ఎస్టాబ్లిష్‌మెంటు రూల్సన్నీ ఎలా తెలుస్తాయి. అని నన్ను దబాయించాడు. నా దస్తూరితో నేను రాయకూడదు, రాయనన్నాను.

ఇది జరిగాక కొన్నాళ్ళకి నాకు హెడ్డాఫీస్‌కి వాల్తేరు ట్రాన్స్‌ఫరయింది. తంతే బూర్లె గంపలో పడ్డట్టు కోరుకున్న విశాఖపట్నం వచ్చాను. ట్రైనులో వుండేవారికి ఎంత బతిమాలినా విశాఖపట్నం యిచ్చేవారుకాదు. అల్లాటిది నాకు పిలిచి వాల్తేరివ్వడం నా అదృష్టం అనుకున్నాను.

నాకు పెద్ద సెండాఫ్ పార్టీ యిచ్చారు. నా గురించి ఆఫీసర్లుకూడా పొగిడారు. నేను వెళ్ళిపోతే అక్కడ పెద్ద వెలితి ఏర్పడుతుందన్నారు. నా సహోద్యోగులు నా గురించి మాట్లాడుతూంటే- నాకు ఓచెంప అనుమానం కలిగింది. అది నా సంతాపసభా, నావీడ్కోలు సభా అని అనుమానం వచ్చింది. నేను కుర్చీలో కూర్చుండగానే నా గురించి భూతకల కైరిమతో వా సుగుణాల్ని వర్ణిస్తూంటే నాకు నవ్వొచ్చింది.

నా హయాంలో మంచి లైబ్రరీ, ఒక స్పోర్ట్స్ క్లబ్ పెట్టించాను. కోపరేటివ్ స్టోర్స్ పెట్టించాను. నాటకాలు వేయించాను. ఉత్సవాలు జరిపించాను. ఇందుగలడందులేడని ప్రహ్లాదుడు చెప్పినట్లు అన్నిట్లో వున్నాను. నా ఉద్యోగంకంటె నేను చాలా ఎత్తున వున్నాను. అయితే నా పలుకుబడి, నాకుగల సంబంధాలు అట్లాంటివి. అయినా నాకు ప్రథమకోపం జాస్తి. కోపము వలన ఘనత కొంచెమైపోవును అన్నారు పెద్దలు. అలా నా ఘనత కొంచెమైపోవడానికి నేనే కారకుణ్ని. ఎవర్నయినా తిడితే ఆ కోపంకాస్తా జారిపోయాక నిస్సంకోచంగా 'అపాలజీ' చెప్పేవాడ్ని.

మా ఆఫీస్‌లో గోవర్ధన్ అని ఓ అటెండరు (అస్పామీ) వుండేవాడు, అతనితో దోస్తీ. అతను నాకు బాడీగార్డు. మంచికుక్ ఉత్తరాది మిఠాయిలు అతనిచేత చేయిస్తూ వుండేవాళ్ళం పండగలకి. రవ్వకేసరి బాగా చేసేవాడు. అతను నాకు ఫ్యాన్స్ క్వార్టర్స్‌లో తనఇంట్లో పార్టీయిచ్చాడు. ఆవేళ పూరీలు ఆబేజీ బఠాణీలకూర, పాలక్‌భాజీ, తోటకూరతో బజ్జీలు ఏవో చాలా చేశాడు. నాతోపాటు కొంతమంది స్నేహితులుకూడా గోవర్ధన్ యింటికి విందుకు వచ్చారు.

అయితే ఆరోజు మహాశివరాత్రి.

గంజాయి, బాదంపప్పు, ఇలాచీ యింకా ఏవో మసాలాలు తెచ్చి ఒక పచ్చని ముద్ద నూరాడు మా గోవర్ధన్. అంతకుముందు నేనెన్నడూ ఎటువంటి మాదక ద్రవ్యాలూ, మత్తు సామానూ తీసుకుని ఎరగను. పైగా అవి తీసుకునేవారికి నీతిపాఠాలు జోరుగా చెబుతూ వుండేవాడిని. దగ్గు, ఆయాసం వస్తోందని సిగరెట్లుకూడా మానేసాను. అంచేత మా గోవర్ధన్ 'భంగు' దానిని పాలలో కలిపిఇస్తూ వుంటే 'యిది ఎలా వుంటుంది' అని అడిగాను. అతనన్నాడుగదా 'సగ్గుబియ్యం పరవాణ్ణంలా వుంటుంది గురూజీ' అన్నాడు. లస్సీ గ్లాసుడు తాగి ఆకుపచ్చ పరవాణ్ణం నెమ్మదిగా తాగాను. 'అవును అతను అబద్ధం చెప్పలేదు. అచ్చం పరవాణ్ణంలాగే వుంది మధురాతిమధురంగా.' ఒకటి, రెండు, మూడు - మూడు లస్సీగ్లాసులు తాగాను. రవ్వకేసరి, పూరీలు కూర, బజ్జీలు, యింకా ఏవో మిఠాయిలు 'జై బోలో భజరంగబలీకి. జై పశుపతినాథ్! నమఃపార్వతీపతయేన్నమః' అని మహాశివుని కీర్తిస్తూ తిన్నా.

అయితే భంగు తాచుపాములా సర్రున ఎక్కిందట.

'చుక్కలు తిరిగే హిమాద్రిపై
ఆకసము చేసే గౌరీశా -
విన్నావయ్యా నా మనవొక్కటి
విన్నవించెద గౌరీశా -'

అని చింతాదీక్షితులగారి శివరాత్రి కవిత అలపించాను, వాళ్ళంతా భజన ప్రారంభించారు. నాకు నిద్ర వస్తున్నదంటే - గోవర్ధన్ నన్ను యింటివద్ద దిగబెట్టాడు. వెళ్ళి పడుకున్నాను. ఆ పడుకోవడం మూడురోజులకు నిద్రలేచాను. నా స్నేహితులంతా నాకెల్లా వుందని చూడ్డానికి వచ్చి కిటికీలదగ్గర మూగినపుడల్లా మా ఆవిడ 'ఆయన్నిలా చేస్తారా' అని కాళ్ళను జాడించేదిట. నా అవస్థ ఎలా వుందంటే ఆ మూడ్రోజులూ నేను మంచాన్ని అంటిపెట్టుకుని లేవలేకపోతున్నానుగాని నాకన్నివిషయాలూ, మాటలూ తెలుస్తున్నాయి. వినిపిస్తున్నాయి. నా మెదడు సహస్ర ఖండాలుగా విడిపోయి దేనికది ఇండిపెండెంటుగా ఆలోచిస్తున్నది.

మా ఆవిడ ఉప్మాచేసి ప్లేటులోపెట్టి నన్ను తినమని చెప్పింది. అప్పుడు నేనన్నాను, స్టూలుమీదవున్న వుప్మా నా దగ్గరకు రావాలి రావట్లేదేమని.

'స్నేహితులు, స్నేహితులంటారు. ఆ స్నేహితులే మిమ్మల్నిట్లా చేశారు' అని మా ఆవిడ కళ్ళనీళ్ళు పెట్టుకుంది. నేనిలా అయిపోయాననే బాధకుతోడు యిది అందరికీ తెలిసిపోయిందే అని ఆవిడ ఎక్కువ బాధపడింది. డాక్టర్ అరవిందముఖికూడా నన్ను చూడ్డానికి పనిగట్టుకు వచ్చిందని నాకు తెలుస్తోంది.

'ఒళ్ళు పొగరు. తిక్క బాగా కుదిరిందని కొంతమందిఅనందించారట.'

అయితే నాతో భంగు స్వీకరించిన మిగతా వాళ్ళంతాకూడా కొన్ని 'శివలీలలు' చూపెట్టారట.

ఒకతను రైల్వేక్లబ్బుకివెళ్ళి తెల్లార్లూ క్యారమ్స్ ఆడుతూ కూచున్నాట్ట.

ఇంకొకతను గుమ్మంలోంచి యింట్లోకి రాకుండా కిటికీలోంచి లోపలకు రావటానికి ఆదేపనిగా ట్రయి చేశాడట.

మరొకతను కోటేసుకుని వాళ్ళింటి



గుమ్మంలో నిలబడి తనొక టికెట్ కలెక్టర్నను కొని 'టికెట్ టికెట్ ప్లీజ్' అంటూ నిలబడిపోయాట్ట.

శివరాత్రి మహత్యం యిలా జరిగాక నేను గప్‌చిప్‌గా తెల్లారగట్లలేచి లారీఎక్కి వైజాగ్ వెళ్ళిపోయాను. అక్కడ పెద్దాఫీసులో నాకు కొన్ని విషయాలు తెలిసాయి.

డాక్టర్ అరవిందముఖి షెడ్యూల్‌కాస్ట్ సర్టిఫికెట్‌తో మెడికల్ కాలేజీలో సీటు సంపాయించిందికానీ ఆవిడది పెద్దకులమేననీ, డేట్ ఎక్స్‌పయిర్ అయిన పాస్‌తో మళ్ళీమళ్ళీ ప్రయాణం చేస్తూ చెకింగ్ స్క్వాడ్ గారికి దొరికిపోయిందనీ, ఆ కేసులన్నీ మళ్ళీ నా దగ్గరకే వచ్చాయి, భూమి గుండ్రం అన్నట్లు

ఆ కేసులన్నీ నేను చదివాను.

అపుడు నాకు తెలిసిందేమిటంటే - లేడీ డాక్టర్ని పనిగట్టుకు అల్లరి పెడుతున్నానని నన్ను వాల్తేరు ట్రాన్స్‌ఫర్ చేయించింది 'అరవిందముఖే' నని.

అప్పుడు మా ఆవిడ అంది 'ఆడవాళ్ళతో తగూ పెట్టుకోకండి. ఓడినా గెలిచినా మీకే అవమానం' అని.

మీరేమంటారు ?

తోటకూర ఆశాలత



జరిగిన కథ:

కాంగ్రేసేతర ప్రభుత్వం అధికారంలోవున్న రాష్ట్రంలో ఓ పట్టణమది. ఆ పట్టణంలో శాంతి భద్రతల్ని పునరుద్ధరించడానికి ఎస్.పి. రంజిత్‌ని స్పెషల్ మెజిస్ట్రీరియల్ పవర్స్‌తో నియమిస్తారు. ఓ ఆగంతుకుడు పట్టపగలు పదిమందీ చూస్తుండగా ఓ కాలేజీ విద్యార్థినిని కిడ్నాప్ చేసి రేప్ చేసి మర్డరు చేస్తాడు. హంతకుడ్ని ఉరికంబమెక్కిస్తానని ప్రతిజ్ఞ చేస్తాడు రంజిత్. ఆర్‌టిసి బస్సుని ఆపి అందరూ చూస్తుండగా ఓ ముసలమ్మని ఆ కారునుంచి దింపి వెట్టుకి ఉరిదీసి రంజిత్ ప్రతిపవాలు చేస్తారు. పోలీసుల వైఫల్యానికి నిరసనగా యు.ఎస్. ఆర్గనైజర్ వెంకట్ బంద్‌కి పిలుపు ఇస్తాడు. పట్టణంలో నిషేధాజ్ఞలు ధిక్కరిస్తాడు వెంకట్. వెంకట్ ప్రత్యర్థి అయిన కుమార్ ప్రశాంతంగా సాగే ఊరేగింపులో అరాచకం సృష్టిస్తాడు. ఫలితంగా దారుణ మారణ కాండ జరుగుతుంది. ఆ అరాచకాన్ని ఫోటోలతో సహా పత్రికకి ఇస్తుంది 'మహానాడు' రిపోర్టర్ మిస్ కపిల. వెంకట్‌పై ద్వేషాన్ని పెంచుకుంటారు రంజిత్. రిటైర్డ్ డి.ఎస్.పి. రామచంద్రుడి కూతుర్ని అతడి ఇంట్లోనే రేప్ చేసి మర్డర్ చేస్తారు. 'మహానాడు' దినపత్రిక సర్క్యులేషన విపరీతంగా పెరుగుతుంది. 'మహానాడు' మేనేజింగ్ డైరెక్టర్ మధు మొదటి పేజీలో మేనేజింగ్ డైరెక్టోరియల్ రాస్తాడు. హోంమంత్రి హుటాహుటిన వచ్చి మధుని కలుస్తాడు. ఆ తర్వాత....

సెన్సేషన్

తన టేబుల్ ప్రక్కనున్న మైక్రో రిసీవర్ నుంచి వినవస్తున్న మెసేజ్ వింటూనే ఎస్.పి. రంజిత్ అప్రమత్తమయ్యాడు. 'టూటౌన్' లో మర్డర్ జరిగింది. అదీ ఒక కాలేజీ స్టూడెంట్! కాలేజీ విద్యార్థిని రేప్, మర్డర్‌తో విద్యార్థి లోకంలోనూ, తల్లిదండ్రులలోనూ అసంతృప్తి బాగా పెరిగిపోయింది. ఆ కారణం చూపే వెంకట్ విద్యార్థుల్ని రెచ్చగొట్టాడు. నిరసన ప్రదర్శనలకు, ఆందోళనకు పిలుపు ఇచ్చాడు. ఘోర అగ్ని ప్రమాదానికి కారణ మయ్యాడు. డెత్ స్పాట్‌కి వెళ్లకుంటే సంఘ విద్రోహ శక్తులు, ప్రత్యేకించి వెంకట్ ఈ అవకాశాన్ని వినియోగించుకునే ప్రమాదముం ది. ఆదిలోనే అణచివేయాలి అనుకున్నాడు.

కాని మనసు కపిల ఫోనుకోసంఆరాటపడు తోంది. ఎక్కడో రాజమండ్రి దగ్గర బయట పడిన కలప కుంభకోణం అది. ఆ గొడవతో తనకు ఎలాంటి సంబంధంలేదు. అయినా సిక్స్త్‌సెన్స్ అతడ్ని కలవరపరుస్తోంది. కాలం కరిగిపోతున్నా కపిలనుంచి ఫోను రాకపోవడం తో మర్డర్ జరిగిన స్పాట్‌కి బయల్దేరాడు.

రంజిత్ ఏ విధంగా ఆ రాజమండ్రి కలప కుంభకోణం వార్త చూసి రియాక్టు అయ్యాడో కపిల కూడా అదేవిధంగా రియాక్టు అయింది. ఆమె అనుమానానికి కారణం రాజమండ్రి స్టోరీ విజయవాడ డేట్‌లైన్‌తో రావడం! అదీ విజయవాడలోని స్టాఫ్ రిపోర్టర్‌కి తెలియకుండా. అంటే ఈ కలప కుంభకోణంతో విజయవాడ లోని ప్రముఖులకి సంబంధం ఉండి ఉండాలి. స్టాఫ్ రిపోర్టరుకి కూడా తెలియకుండా డాక్ ఎడిషన్‌లో న్యూస్ ఇవ్వకుండా సిటీ ఎడిషన్ లోనే అందునా బ్యానర్ హెడ్డింగుతో ఈ స్టోరీ ఇచ్చారంటే దీని వెనుక ప్రముఖుల హస్తం ఉండి ఉండాలి. అంటే బ్లాక్‌మెయిలింగ్ జరుగుతోంది. ఈ స్టోరీ వెనుక మరొక పెద్ద స్టోరీ జరుగుతోంది. ఎలాగూ నేను ఈ స్టోరీ మిస్ అయ్యాను. కనీసం ఆ స్టోరీ అయినా ఫ్లాష్ చేయాలి— అనుకున్నది. రెండుమూడు రోజుల్లో ఈ స్టోరీ తప్పకుండా సెన్సేషన్ అవు తుంది. ఆ ధాటికి తట్టుకోవాలంటే ఏం చేయాలి?— అని ఆలోచనలో నిమగ్నమయిం ది. సరిగ్గా అదే సమయంలో— 'మహానాడు' మేనేజింగ్ డైరెక్టర్ మధు 'సుప్రభాతం' దిన పత్రిక చూస్తూ, 'పిచ్చివెధవలు— రాజమండ్రి లో కలప అక్రమ చేస్తున్న ఒక లారీని పట్టు కుంటే సిటీ ఎడిషన్‌లో అందునా ఫ్రంట్ పేజీలో, పై పెచ్చు బ్యానర్ హెడ్డింగుతో ఎవరయినా పబ్లిష్ చేస్తారా? న్యూస్ వేల్యూ తెలియదు. ఏ వార్తని హైలైట్ చేయాలో అంతకన్నా తెలియదు. అందుకే మన పత్రిక సర్క్యులేషన్ విపరీతంగా పెరుగుతుంటే వారి సర్క్యులేషన్ తగ్గిపోతోంది'' అను కున్నాడు ఆనందంగా.

* * *

రాజమండ్రి కలప కుంభకోణం విషయమై రాజమండ్రిలోని తమ రిపోర్టర్‌ని ఎస్.టి.డి.లో కాంటాక్ట్ చేయడానికి ప్రయత్నించి విఫల మయిన కపిల, 'టౌన్లో ఓ స్టూడెంట్ మర్డర్ జరిగింది. అయ్యగారు అక్కడికి వెళ్లారు' అన్న విషయం ఎస్.పి.బంగ్లా నుంచి తెలుసు కొని అక్కడికి బయల్దేరింది.

ఎస్సై తదితర పోలీసు సిబ్బందితో హత్యా స్థలంలోఉన్నఎస్.పి.రంజిత్ కపిలనుచూస్తూనే ప్రక్కకు వచ్చాడు. ''రాజమండ్రి కాంటాక్టు చేశాను. మీ రిపోర్టరు బయటకు వెళ్లాడట! ఓ

గంటలో నాకు ఫోనొస్తుంది. వెంటనేమిమ్మల్ని కాంటాక్టు చేస్తాను. పోతే, ఈ మర్డర్ ఎలా జరిగి ఉంటుంది?''

''కుర్రవాడు కాలేజీ స్టూడెంట్స్ యూనియన్ యాక్టివిటీస్‌లో యాక్టివ్ రోల్ తీసుకుంటాడు. వెంకట్ ప్రత్యర్థి గ్రూపులోవాడు. కాకపోతే డబ్బున్నవాడికుండే దురలవాట్లన్నీ ఉన్నాయి. రాత్రి ఇతని గదిలో ఓ అమ్మాయి ఉంది. అయితే ఎవరో రివాల్వర్‌తో కాల్చి చంపారు. యూనియన్ పాలిటిక్సు వల్ల ఈ హత్య జరిగిందా లేక అమ్మాయి వ్యవహారమా లేక ఆస్తికోసం ఇతడ్ని ఎవరైనా హత్య చేశారా? లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అన్నది ఎంక్వయిరీ చేయాలి'' అన్నాడు. కపిల మనసులో రిటైర్డ్ డి.ఎస్.పి రామచంద్రుడు మెదిలాడు. స్టూడెంట్స్ యూనియన్ బంద్‌కి పిలుపు ఇచ్చిన రోజునేరామచంద్రుడికూతుర్ని అతడి ఇంట్లోనే రేప్ చేసి మర్డర్ చేశారు. ఆ రేప్‌కి ఈ స్టూడెంట్‌కి ఏమైనా సంబంధం ఉందా? ఆ ఆచూకీ తెలుసుకున్న రిటైర్డ్ డి.ఏస్.పి అతణ్ణి కాల్చి చంపాడా?— అన్న అనుమానం కలిగింది.

అంతలోనే వెంకట్ మాటలు ఆమె చెవుల్లో మార్మోగాయి. ''కపిలగారూ! నేను పేదవాణ్ణి. అన్నపు మెతుకురుచి పైసా విలువ తెలిపిన వాడ్ని. ఒకపేదవాడి గుడిసె కూలితే ఆ గుడిసెని నిలబెట్టడానికి అతడెన్ని అగచాట్లు పడతాడో తెలిపిన వాణ్ణి. పోలీసులు, రాజకీయ నాయకులు నన్ను 'గుండా' అంటున్నారు. కాని నేను బడుగు వర్గాలకు ప్రతినిధిని. ఈ అరాచకానికి ఎవరో ఒకర్ని కారణంగా చూపించి కాల్చి పారేసి తమ చేతులు దులుపు కుంటారు. నేను కొన్ని రోజులు లేదా గంటలు, కాదు కొన్ని నిమిషాలు బ్రతకవచ్చు. ఏ క్షణాన్నయినా వారు నన్ను అంతం చేయవచ్చు. ఈ శరీరం బుల్లెట్లతో నిండిపోతుందని నాకు తెలుసు. అయితే నేను ఆఖరి శ్వాస విడిచేలోపునే నా క్యారెక్టర్ని, రాజకీయ భవితవ్యాన్ని బూడిదపాలు చేస్తున్న వీరి అంతం చూస్తాను. నిద్రపోతున్నపులినినిద్ర లేపారు. ఈ రోజునుంచే వేట ప్రారంభిస్తాను. అవసరం అనుకుంటే నా ఈ మాటల్నే పత్రికా ముఖంగా పెద్ద పెద్ద అక్షరాలతో వేయండి. లేదా రేపు ఏ పోలీసు ఆఫీసరో, మంత్రో హత్య చేయబడితే అది ఈ వెంకట్ పనిగా ఆ రోజునయినా రాయండి''

ఆనాడు ఆవేశంగా ఏదేదో అన్న వెంకట్ తన ప్రత్యర్థి వర్గంలోని వాడిని చంపి పోలీసులకి సవాలు విసిరాడా? అన్న అనుమానం కలిగింది కపిలకి.

ఒకవేళ ఈ హతుడే తన కూతురు మానభంగానికి, మరణానికి కారకుడని అనుమానించి డి.ఎస్.పి రామచంద్రుడు ఈ హత్య చేశాడా?

ఏదీ నిర్ణయించుకోలేకపోయింది. తనఅనుమానాలను రంజిత్‌కి తెలియజేద్దామా? అనుకున్నది. కాని అదే జరిగితే పోలీసుల దృష్టి ఈ ఇద్దరిపైనే నిలుస్తుంది. అసలు నిందితుడు తప్పించుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది. ఆరోజున రింగు రోడ్డు వద్దకు వస్తున్న ఈ ఊరేగింపునిపర్యవేక్షిస్తున్న రంజిత్‌నితనకు అందిన తప్పుడు సమాచారంతో అక్కడ్నించి మరో చోటికి కదిలేలా చేసింది. ఫలితంగా ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. కోట్లాది రూపాయల ఆస్తి నష్టం వాటిల్లింది. అటు వంటి పొరపాటునే మరొక పర్యాయం చేయదలుచుకోలేదామె. రెండు ఫోటోలు తీసుకొని బయల్దేరింది.

*　　*　　*

మర్డర్ అయింది కాలేజీ స్టూడెంట్—


అందునా తన ప్రత్యర్థి వర్గంలోని వారు—

విధిగా ఆ హత్యానేరాన్ని ఎస్.పి.రంజిత్ తనపై మోపుతాడని, కస్టడీలోకి తీసుకుంటాడని అనుకున్నాడు వెంకట్. రానున్న ప్రమాదాన్ని పసిగట్టి ముందు జాగ్రత్తగా లాయరు సలహా తీసుకోవాలనుకున్నాడు. తన శ్రేయోభిలాషి అయిన ఒక లాయరు కోసం కబురంపాడు. పోలీసులకి తన ఆచూకీ తెలియకుండా అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు.

ఈ మర్డర్ విషయమై వెంకట్‌ని ప్రోచ్ చేద్దామని వచ్చిన కపిల వెంకట్ కనిపించకపోవడంతో తన అనుమానం నిరాధారంకాదని నిర్ధారించుకున్నది. అక్కడి నుంచి తిన్నగా రిటైర్డ్ డి.ఎస్.పి రామచంద్రుడు బంగ్లాకి వెళ్లింది. తన రివాల్వర్‌కి ఆయిలింగ్ చేస్తున్న రామచంద్రుడు, కపిలను చూసి, ''కూర్చో—'' అన్నట్టుగా సోఫా చూపించారు. వంటవాడిని పిలిచి కాఫీ తీసుకురమ్మన్నాడు. తిరిగి తన పనిలో నిమగ్నమయ్యాడు. ఆ ఇల్లు ఇప్పుడు ఒక శిథిల మందిరంలా ఉంది. యుద్ధానంతరం గత కాలపు వైభవంగా మిగిలిపోయిన కోటలా ఉంది. ఆ ఇంట్లో అన్నీ ఉన్నాయి. కాకపోతే ఏదీ ఉండవలసిన స్థానంలో, ఉండవలసిన రీతిలో లేదు.

నాయర్ కాఫీ తీసుకొచ్చి ఇచ్చాడు. మవునంగా కాఫీ సిప్ చేయసాగింది. అంతకన్నా మౌనంగా, ఏకాగ్రతతో తన రివాల్వర్‌కి ఆయిలింగ్ చేయడంలో నిమగ్నమయివున్నాడు రామచంద్రుడు.





కాఫీ తాగడం పూర్తయిందనిపించింది కపిల.

రామచంద్రుడు మాత్రం యోగిలా అలాగే తన పనిలోనే దృష్టినంతా కేంద్రీకరించి ఉన్నాడు.

సోఫాలో కూర్చునున్న కపిల అప్రయత్నంగా తన దృష్టిని ఆ ఇంట్లో గోడకు తగిలించి ఉన్న గడియారంవైపు సారించింది.

''కుకూబర్డ్'' వాల్ క్లాక్ అది!

ఆగిపోయిన ఆ వాచీ ఆ ఇంట్లోని వారి ఆలోచనల్ని, చైతన్యాన్ని సూచిస్తోంది.

తాను కాఫీ తాగడానికి ఆ ఇంటికి వచ్చినట్లుంది కపిలకి.

గతంలో ఎంతో మందిని ఎన్నో రకాలుగా మభ్యపెట్టి, ప్రశ్నించి, సంభాషణని పొడిగించి తనకు కావలసిన సమాచారాన్ని సేకరించిన కపిల ఈ పర్యాయం రామచంద్రుడ్ని పలకరించడానికి సాహసించలేకపోయింది. కళ్ళు మూసుకుని బాహ్య ప్రపంచాన్ని మర్చిపోయి తనదయిన ప్రపంచంపై దృష్టిని నిలిపిన మౌనిలా ఉన్నాడాయన.

''వెళ్లొస్తాను...'' అంటూ సోఫాలోనుంచి లేచింది. తృటికాలంపాటు దృష్టిని ప్రక్కకు మరల్చి, 'మంచిది...' అన్నట్టుగా తలూపాడు.

'ఈ గాంభీర్యం వెనుక ఎంతటి విషాదం, క్రోధం, ప్రతీకారం ఉన్నాయో!' అనుకున్నది కపిల.

ఆ వెళ్లడం వెళ్లడం తిన్నగా ఆఫీసుకి వెళ్లింది. విజిటర్స్ లాంజ్ దాటి వెళ్తున్న కపిలని రిసెప్షనిస్టు పిలిచింది.

''కపిలా! ఎమ్.డి.గారు నీ కోసం ఇప్పటికి రెండుసార్లు అడిగారు.. ఎమ్.డి.గార్ని చూస్తావా?'' అనడిగింది.

''ష్యూర్...''

వెంటనే ఇంటర్‌కమ్‌లో ఇన్‌ఫార్మ్ చేసింది.

''రమ్మంటున్నారు...'' కపిలవైపు చూసి అన్నది.

''థాంక్యు...'' అంటూ ఎమ్.డి.ఛాంబర్‌లోకి వెళ్లింది. సోఫాలో తీరిగ్గా కూర్చుని ఉన్నాడు మధు. అతడికి ఎదురుగా టీపాయ్ మీద ఏవేవో ఫైల్స్ ఉన్నాయి.

''కాంగ్రాట్స్ కపిలా... నిన్న మీ పార్టీకి నేనూ రావాలనుకున్నాను. మరొక ఇంపార్టెంట్ మీటింగులో హెల్డప్ అయ్యాను.'' అంటూ ఎదురుగానున్న సోఫా చూపించాడు.

''థాంక్యూ...'' అంటూ సోఫాలో కూర్చుంది.

''వుడ్‌యులైక్ టు టేక్ కాఫీ, టీ...''

''కాఫీ...''

సర్వసాధారణంగా ఒక ఆఫీసులోగాని బిజినెస్ వ్యవహారంలోగాని తనపై అధికారితో వీలయినంత చొరవగా, ఎక్కువగా మాట్లాడటానికి ప్రయత్నిస్తాడు క్రింది అధికారి. తన క్రింది స్థాయిలోని వ్యక్తితో వీలయినంత క్లుప్తంగా మాట్లాడి పంపించడానికి ప్రయత్నిస్తాడు పై అధికారి. అదే బిజినెస్ వ్యవహారమయితే, అప్లిగేషన్ తీసుకోవలసిన వ్యక్తి రెండవ వ్యక్తి కాలాన్ని ఎక్కువగా వినియోగించుకోవాలని ప్రయత్నిస్తాడు. ఇక్కడ జరిగిందదే.

మేనేజింగ్ డైరెక్టర్ తనకు తానుగా కాఫీ ఆఫర్ చేస్తే, అంతకు కొద్ది నిమిషాల క్రితమే రిటైర్డ్ డి.ఎస్.పి రామచంద్రుడి ఇంట్లో కాఫీ తీసుకున్నా తిరిగి కాఫీ తీసుకున్నది.

''ఉదయం మీ ఇంటికి ఫోను చేశాను. ఒక తఫా ఎంగేజ్ వచ్చింది. మరో తఫా ప్రయత్నిస్తే ఎంగేజ్ వచ్చింది. ఫోను ట్రబులేమోనని కంప్లెయింట్ ఇచ్చాను. రాజమండ్రి మాట్లాడుతున్నావని చెప్పారు...''

''సుప్రభాతం'' దినపత్రికలో కలప కుంభకోణం స్టోరీ వచ్చింది గదా, డిటెయిల్స్ తెలుసుకుందామని మన రిపోర్టరుకి ఫోను చేశాను...''

''ఆ... అదేమంత ఇంటరెస్టింగ్ స్టోరీ కాదు. అసలు మీకు తెలిసినంతగా వాళ్లకి న్యూస్ హైలైట్ చేయడం తెలియదు. రాజమండ్రిలో ఎవరో ఒక లారీలో కలప దొంగతనంగా తీసికెళ్లడమేమిటి— అది విజయవాడ పేపర్లో ప్రముఖంగా రావడమేమిటి?'' అని అంటున్న మేనేజింగు డైరెక్టర్ అమాయకత్వానికి, అజ్ఞానానికి నవ్వాలో ఏడ్వాలో తెలియక బ్లాంక్ ఫేస్ పెట్టింది.


అంతలో అటెండరు కాఫీ తెచ్చి ఇచ్చాడు.

''సార్, ఈ స్టోరీని మనం తక్కువగా అంచనావేయగూడదు. లారీలో కలప అక్రమ రవాణా కావడమన్నది అతి సాధారణమయిన విషయం. అయితే ఈ వార్తకి అసాధారణ ప్రాధాన్యత ఇచ్చిన తీరు చూస్తుంటే ఈకుంభకోణంలో అసాధారణ వ్యక్తులు చిక్కుకొని ఉంటారు...''

''ఆ మీ జర్నలిస్టులంతా ఇంతే— చిన్న విషయాన్ని భూతద్దాలనుంచి పెద్దగా చూస్తుంటారు...'' నవ్వుతూ అన్నాడు. తిరిగి అడిగాడు, ''టౌన్లో ఎవరో స్టూడెంట్ లీడరు మర్డర్ అయ్యాడట... ఆ మర్డరుచేసిందెవరో ఏమైనా తెలిసిందా? ఖైదిభై వెంకట్ పరారీలో ఉన్నాడని కూడా తెలిసింది. ఈ న్యూస్‌ని ఏ విధంగా హైలైట్ చేయబోతున్నారు..'' అనడిగాడు.

''ఇది మన ఎక్స్‌క్లూజివ్ స్టోరీకాదు, అన్ని పేపర్లూ ఫోటోలతో సహా ప్రచురిస్తాయి. పోలీసులు న్యూస్ బుల్లెటిన్ రిలీజ్ చేస్తారు...''





''అందుకే అడుగుతున్నాను... ఐటమ్ ఎలా ఇవ్వబోతున్నావు? అని''

కొశ్చనుమార్కు ముఖం పెట్టింది కపిల.

''టౌన్లో ఓ స్టూడెంట్ మర్డర్ జరిగింది. అతను స్టూడెంట్ యూనియన్ పాలిటిక్సులో యాక్టివ్ మెంబరు. పైపెచ్చు వెంకట్‌కి అపోజిషను గ్రూపు. అతని హత్య తర్వాత వెంకట్ అండర్‌గ్రౌండ్‌కి వెళ్లాడు. అంటే అతని హత్యకు వెంకట్ అదృశ్యానికి ఏదైనా సంబంధం ఉందా? మిగిలిన పేపర్లన్నీ మర్డర్‌ని ప్రముఖంగా ఫోకస్ చేస్తాయి. ఈ మర్డర్‌ని సెకండరీ చేసి, యూనియన్ పాలిటిక్సులో హతుడికి వెంకట్‌కి ఉన్న క్లాష్‌ని ఫోకస్ చేస్తే సెల్లింగ్ పాయింటవుతుంది...''

''మనం కేసుని మిస్ లీడ్ చేసినట్టవుతుంది...''

''అది పోలీసుల తలనొప్పి...''

''కావచ్చు. కాని రేపు అసలు హంతకుడు పట్టుబడితే మన క్రెడిబిలిటీదెబ్బతింటుంది.''

''కపిలా...'' మధు స్వరంలో అసహనం స్పష్టంగా తొంగి ఛూసింది. ''మన రీడర్సు ఈ వేళ జరిగినదానిని నాలుగు రోజులలో మర్చిపోతారు. పై పెచ్చు అసలు హంతకుడు దొరుకుతాడన్న నమ్మకమేమిటి? ఒకవేళ దొరికినా ఆ బిల్డప్ స్టోరీ ఇస్తాం...'' అన్నాడు.

అతడి ధోరణి ఆమెకు అర్థంకాలేదు. అయినా అతడు తన యజమాని. అందుకే ఆమె అతడి అభిప్రాయాన్ని ఖండించే ప్రయత్నం చేయలేదు. ఎడిటర్‌ని సంప్రదించాలి— అనుకున్నది, ఆ విధంగా చేయడం ఇష్టంలేక! ''ఓ.కె.సర్, నేను వెళ్తాను...'' అంటూ సోఫాలోనుంచి లేచింది.

అంతలో ఎమ్.డి. టేబుల్ మీదున్న ఫోను మోగింది.

''హలో....'' అంటూ రిసీవర్ అందుకున్న మధు ''కపిలా... ఈ ఫోను నీకే'' అంటూ పిలవడంతో బయటకు వెళ్తున్న కపిల వెనుదిరిగింది.

అది రాజమండ్రి ట్రంక్‌కాల్.

అవతల మాట్లాడుతున్నది 'మహోవాడు' రాజమండ్రి రిపోర్టర్.


తాను ఉదయం దేనికోసం ఫోను చేసిందీ చెప్పింది.

''అదా... నేను ఉదయం అక్కడికే వెళ్లాను. మీ జిల్లా ఎస్.పి. పేరువ కలపరవాణా అవుతోంది. పైన అంతా మామూలు కలపే. అడుగున నల్లచెక్క, గంధపు చెక్క ఉంది. పోలీసులు లారీని సీజ్ చేశారు. పైపెచ్చు లారీ వెంట ఒక సబ్ ఇనస్పెక్టరు, హెడ్ కానిస్టేబుల్ కూడా ఉన్నారు. వారిరువురూ రంజిత్ మనుషులేనట! ఎస్పైదగ్గర్నుంచి స్టేట్‌మెంట్ కూడా రికార్డు చేశారు. ఆ రిపోర్టు, ఫోటోలు కృష్ణా ఎక్స్‌ప్రెస్‌కి పంపిస్తున్నాను'' అంటూ అసలు విషయం చెప్పాడతడు.

ఈ వార్త వింటున్న కపిల నుదుటిపై చిరు చెమటలు చోటు చేసుకోవడం గమనించిన మధు భృకుటి ముడిపడింది.

సిన్సియర్ ఆఫీసర్ అని పేరు తెచ్చుకున్న రంజిత్ చరిత్ర రేపటితో భూస్థాపితం కాబోతోంది. కలప అక్రమ రవాణా పేరుతో అతడి కెరీర్ శాశ్వతంగా సమాధి చేయబడుతోంది. రంజిత్ పేరు చెబితే ప్రతి ఒక్కరికీ ఈ రోజు వరకూ సింహ స్వప్నం. అటువంటి రంజిత్‌ని రేపటి నుంచి రిక్షావాలానుంచి బడా బ్లాక్ మార్కెటీర్ వరకు మొహంమీదే ఎగతాళి చేస్తారు. అన్నిటినీ మించి వెంకట్...

(సశేషం)



వికసించిన విద్యుత్తేజం

డా॥ ఆలూరి విజయలక్ష్మి



"రజీ! పుస్తకాలేమైనా వున్నాయా?" దీక్షగా మెడిసిన్ బుక్‌ని చదువుకుంటున్న రజిత తపోభంగమయినట్లుగా తలెత్తింది.

క్వార్టర్స్‌లో యింతమందున్నారు. ఒక్కళ్ళంటే ఒక్కళ్ళకూడా మంచి టేస్టే లేదు ఛీ! ఛీ! చిర్రు బుర్రులాడుతున్న మానసవంక చిత్రంగా చూచింది రజిత. పెథిడిన్ అడిక్ట్‌కి పెథిడిన్ దొరకకపోతే ఎంత విలవిలలాడిపోతాడో 'చరస్' అడిక్ట్‌కి 'చరస్' దొరకకపోతే ఎంత దుర్భరమైన బాధననుభవిస్తాడో, పుస్తకాలు దొరకకపోతే అంతరెస్ట్‌లెస్‌గా అయిపోతుంది మానస.

"మానసా! పి.జి. ఎంట్రెన్స్ అని మనకేదో ఎగ్జామ్ లాంటిది ఉన్నట్లుంది, నువ్వేమైనా విన్నావా?" అమాయకంగా అడిగింది రజిత.

"లక్షణంగావుంది. వాయిదాలమీద వాయిదాలు పడుతూ 'మే' రెండో తేదీకి దేకింది. ఊఁ! అయితేఏంటి?" నుదురు చిట్లించింది మానస.

"అఁహ! మేమంతా రోజుకు పదిహేడు గంటల చొప్పున చదువుతూకూడా ఎమ్.డి. ఎమ్.ఎస్. కాకపోతేమానె, కనీసం డిప్లమోలోనన్నా ప్రవేశం దొరికితే చాలు అని, కనపడని దేవుళ్ళందరికీ మొక్కుకుంటూంటే, నువ్వింత కులాసాగా అర్ధరాత్రి పన్నెండు గంటలకు నావెల్స్ వేటలో వద్దావుకదా, అసలు నీ ఉద్దేశమేంటి? ..." కొంటెగా నవ్వుతూ మాట్లాడుతున్న రజిత. అవాక్కయిపోయి కళ్ళు వెడల్పుచేసి చూస్తూంది. భళ్ళున తలుపుతోసి పెద్దపెద్ద అంగలేసుకుంటూ లోపలికి వస్తున్నాడొకతను.

"ఆగు ఆగు, ఎక్కడికి? ఇక్కడికెందుకు వచ్చావ్?" భయంతో వణికిపోతూ గావుకేకలు పెట్టింది రజిత నిర్భయంగా అర్ధరాత్రి ఆడపిల్లల క్వార్టర్స్‌లోకి ప్రవేశించింది చాలక గది తలుపులు తోసుకుని రాజాలాగా లోపలికి వస్తున్న ఆగంతకుడివంక, భీతహరిణేక్షణిలా వణవణ వణుకుతున్న రజితవంక ఆశ్చర్యంగా చూస్తూంది మానస.

"ఏయ్ మిస్టర్! ఎవర్నువ్వు? ఏమిటీ జబర్దస్తీ కొంచెం తెప్పరిల్లి కోపంగా అడిగింది మానస.

"ఐవాంట్ మనీమేడమ్" తొణుకు బెణుకు లేకుండా చెప్పాడతను.

"వాట్! నువ్వు స్పృహలోవుండే మాట్లాడుతున్నావా? ... ఔట్! ఐసే గెటవుట్!" ఉరుముతూ గుమ్మం వైపు చూపించింది మానస. ఆమె అరుపులకు రవ్వంతకూడా చలించకుండా గదంతా కలయ చూస్తున్నాడతను. మంచం మీదున్న వానిటీబాగ్ కనపడగానే అటు కదిలాడు,

"రాజేష్! ముందునువ్వు బయటికెళ్ళు బయటికెళ్తె డబ్బిస్తా!" ఆశ పెడుతున్నట్లుగా అతనివంక చూచింది రజిత .ఆమె దీనవదనాన్ని రవ్వంత కూడా గమనించకుండా ఏకదీక్షగా తన లక్ష్యం వైపువెళ్తున్నాడతను. అతను తమను దాటగానే మానస చెయ్యిపట్టుకుని గుంజిలాక్కెళ్తూ పిచ్చి పట్టిన దానిలా 'నైటీతోనే వరండాలో పరుగెత్తసాగింది రజిత. ఆమె పట్టును విడిపించుకుని వెనక్కి చూచేసరికి తన పని చక్కబెట్టుకుని దర్జాగా వెళ్ళిపోతున్నాడతను. రజిత కేకలకు

పుస్తకాలతో కుస్తీపడుతున్న అమ్మాయిలంతా తలుపులు తీసుకుని వరండాలోకి వచ్చి ఏమిటేమిటని ప్రశ్నలు కురిపించసాగారు,

"రాజేష్ ! డబ్బు!" రొప్పుతూ ఆయాసపడుతూ పలవరించసాగింది రజిత.

"రాజేషా ?! ఇక్కడికూడా వచ్చాడా? బాబోయ్! కళ్ళు వెడల్పు చేస్తూ భయంగా అంది విద్య.

"లైబ్రరీలోనే వీడితో పడలేకుండా వుంటే ఇక్కడికూడా వచ్చి పడిందా పీడపీడ ?!" అంది మనోజ్ఞ.

"మిమ్మల్నందరినీ గజగజలాడిస్తున్న ఈ క్రొత్త విలన్ ఎవరే?" చిరాగ్గా అడిగింది మానస.

"గౌరవనీయులైన మన సీనియర్ గారు" పూర్వాశ్రమంలో బొత్తిగా ఏమీ తోచకపోతే కాలేజీకి వేంచేసేవారట! ఎనాటమీ, ఫిజియాలజీల దగ్గర గజనీ, ఘోరీ మహమ్మద్‌లను. దాటిబీట్ చేస్తూంటే ఎగ్జామినర్స్ అంతా కలసికట్టుగా పకడ్బందీగా కుట్ర పన్ని క్లినికల్ సైడ్‌కి తోసేసి చేతులు దులిపేసుకుని హాయిగా నిట్టూర్చాడు. ఐతే ఒకసారి పోగుపోయిన అనుభవంతో ఎగ్జామినర్స్ కుట్రల్ని విజయవంతగా భగ్నంచేస్తూ, నిరాటంకంగా పరీక్షలు ఫెయిలవుతూ, చిదానందంగా విద్యార్థి జీవితాన్ని గడుపుతున్నాడు. మధ్యలో రెండు, మూడేళ్ళు శ్రీవారు స్వగ్రామంలో విశ్రాంతి తీసుకోవడం వల్ల మనబాచ్ వాళ్ళకు యీ దివ్య పురుషుని పావన చరితం గురించి తెలియదు, విద్యచెప్తున్నది కుతూహలంగా వింటూంది మానస.

"ఆగవే బాబూ ! అంతభావావేశం, ఉద్వేగం గట్రా ప్రెస్ చేస్తున్నావు. కొంపదీసి ఓ ఛోటా రచయితవైయిపోయి నీ ట్రీట్‌మెంట్‌తో కాకుండా రచనల్తో ప్రజల్ని చంపుతావేమోనని నాకు దడగావుందే" గుండెమీద చెయ్యేసుకుని భయాన్ని అభినయించింది శార్వరి.

"ఛప్ ! నువ్వాపవే శార్వరీ ! యింతకీ యితన్ని చూచి మీరంతా ఎందుకింత కకావికలైపోతున్నారో ముందు చెప్పండి ?" అంది మానస.

"నీకా కష్టాల్లేవనుకో మరి, మేమంతా లైబ్రరీని దగ్గరుండి తెరిపించి మళ్ళీ మూసేసేదాకా కుర్చీలకు అంటుకుపోయి పుస్తకాల్ని నూరుకునితాగుతున్న బాపతు కదా ! లైబ్రరీకి వచ్చి ఆడ, మగ తేడా లేకుండా మమ్మల్నందరినీ అష్టకష్టాలు పెడుతున్నారీవిలన్‌గారు. మేము బాత్ రూమ్‌కో కాంటీన్‌కో వెళ్ళినప్పుడు గప్‌చిప్‌గావచ్చి మా పుస్తకాల్ని దాచేస్తాడు. డబ్బులివ్వమని డబాయిస్తాడు" ముఖాన్ని విచారంగా పెట్టి ముక్కును ఎగబీల్చింది విద్య.

"డబాయిస్తే డబ్బులిచ్చేస్తారా చవట దద్దమ్మల్లారా ? ఎవరికీ వాడిని అడ్డగించే దమ్ముల్లేవా ?" మానస చిటపటలు చూచి నవ్వింది విద్య.

"పిల్లి మెడలో ఎవరు గంట కడ్తారు? ఇతన్తో పెట్టుకుని టైమ్ వేస్ట్ చేసుకునే తెలివితక్కువవాడెవరు ?..." ఈ ప్రశ్నకు జవాబు చెప్పలేక పోయావో నీ తల వెయ్యి వ్రక్కలవుతుంది జాగ్రత్త!" తర్జనితో బెదిరించింది శార్వరి. "చాల్లే! కనీసం ప్రిన్సిపాల్ కి రిపోర్టన్నా యివ్వరా ?" కసిరింది మానస. ఆమె అమాయకత్వాన్నిచూచి జాలిగా నవ్వారంతా.

"అయ్యో ! అదీ అయిందే. మా కష్టాలన్నీ విని ఆయనో విలువైన మాటను సెలవిచ్చారు. అతను ప్రేమ బాధితుడట, ప్రేమ విఫలమవడంతో మెంటల్‌గా దెబ్బతిని అలా ప్రవర్తిస్తున్నాట్ట అలాంటి వ్యక్తిమీద కోపంకాక జాలి చూపించాలట !" అంది రజిత.

"చాలా గొప్పగా వుంది సలహా ! యింతకీ అతను మెంటల్‌కేసా ! వేషాలేస్తున్నాడా ?" సందేహం వెలిబుచ్చింది మానస. "రేపు నువ్వోసారలా షికారుగా లైబ్రరీకిరా. నువ్వే డయాగ్నైజ్ చేద్దువుగాని."


మరునాడు కాంటీన్‌లో అతని ప్రవర్తన చూచి అతను మెంటల్‌కేస్ కాదని అందరినీ అదిరించి, బెదిరించి బ్రతకడానికి అలవాటు పడ్డాడని నిర్థారించుకుంది మానస. అతనిని ఎలా ఎదుర్కోవాలా అని ఆలోచిస్తూ లైబ్రరీలో కూర్చుని మెడికల్ జర్నల్ పేజీల్ని తిప్పుతూంది. తన భుజంమీదుగా చెయ్యిచాచి టేబిల్ మీదున్న పర్స్‌ని తీస్తున్న రాజేష్‌ను చూడగానే మానస శరీరం జుగుప్సతో జలదరించింది.

"యూ బాస్టర్డ్ !" కోపంతో వణుకుతూ అతని చేతిని తోసేసి పర్స్ తీసుకుంది మానస. ఆమె చేతిలోని పర్స్ కోసం అతను పెనుగులాడుతూ వుండడంతో చాచి ఒక్క లెంపకాయ కొట్టింది. లైబ్రరీలో కూర్చున్నవాళ్ళంతా బిలబిల వచ్చి వాళ్ళను చుట్టుముట్టారు. యిద్దరు పి.జి.లు అతన్ని పట్టుకుని అవతలకు లాగారు. అందరివంకా చీదరగా చూచింది మానస.

"వీడిలా దాదాగిరి చెలాయించి బ్రతుకుతూంటే మెంటల్ పేషెంట్ అని జాలిపడుతూ వదిలేస్తున్నారా ? యిది జాలి కాదు, నిర్లక్ష్యం, చేతకానితనం. నాలుగు తిడితే వాడి అసలురంగు బయట పడేది కాదూ ?!" రుద్రకాళిలా విరుచుకు పడింది మానస. "అదికాదు మానసా ? పరీక్షల ముందు వాడితో గొడవ పెట్టుకుని ఆ చికాకులన్నీ ఎవరు భరిస్తారు చెప్పు ?" నెమ్మదిగా చెప్పబోయాడు మానస వార్డ్‌మేట్ మాధవరావు.

"అలా మాట్లాడడానికి నీకు సిగ్గేయడంలేదూ ? మన చిన్న పరిధిలోని ఈ అరాచకాన్నే ఎదిరించి సరిదిద్దలేని మీరు ఈ సమాజంలో బ్రతకడానికే అనర్హులు. డాక్టర్‌గా జబ్బులతో ఎలా పోరాడాలో తెలుసుకోవడమేకాదు, మనిషిగా అన్యాయాల్నెలా ఎదుర్కోవాలోకూడా తెలుసుకోవాలి. కమాన్ ! నాతో ఎవరొస్తారోరండి వీడిని ప్రిన్సిపాల్ దగ్గరకు లాక్కురండి" వికసించిన తేజంలా బయటి కడుగు పెడుతున్న మానసవెంట లైబ్రరీలోనివాళ్ళంతా కదిలారు. •••

యామిని పదవ్యూహం-14



చిరునామా: ______________________

ఆధారాలు

నిలువు:—


1) మొసలి పట్టుకున్న ఏనుగు చివరి స్థితి 2) విష్ణువు 3) బంధించు 4) కుచ్చిళ్ళు 5) అప్పుతచ్చులు 6) నుదుట దిద్దేపేరు 8) తక్కెడలో ఊగేటప్పుడు ఒకటిపైకి ఒకటి క్రిందికీ 9) కాకి

అడ్డం:—

1) రంధ్రము 2) ఇక్కడపాలు తాగినా అది నమ్మరు 4) భద్రాచల సీతమ్మ నగ 6) కుడినుంచి ఎడమకు సరిపోయినంత 9) దుర్యోధన, దుశ్శాసన, కర్ణ, శకునిలు 11) గ్రక్కున విడువ వలసిన వాటిలో మూడవది 12) ఈవిడ వెళ్ళి మద్దెలతో మొరపెట్టుకుందట

పదవ్యూహం 13 విజేతలు

1. వై. యస్. నాగమణి విశాఖపట్నం 2. కొత్త లక్ష్మీతులసి కంచర్ల పాలెం 3. పుల్లాపంతుల వెంకటసుబ్బారావు నరసాపురము 4. ఎస్.జె.ఎల్. నరశింహారావు విజయవాడ 5. సత్తి వెంకటరెడ్డి కపిలం 6. కె.యస్. ఆర్. శర్మ విజయవాడ.



నిబంధనలు:

1. ప్రతినెల పూరించిన పదవ్యూహం మా కార్యాలయానికి 20వ తేదీలోగా చేరాలి.
2. సంచికలో గడినే వాడాలి. విడి కాగితములపై గళ్ళుగీసి నింపరాదు.
3. గళ్ళనుడిపై చిరునామా తప్పక వ్రాయాలి.
4. మడికట్టు పంపే కవరుపై 'పదవ్యూహసంఖ్య' ని తప్పక వ్రాయాలి.
5. బహుమతి మొత్తం రూ. 100/- విజేతలు ఒకరికంటే ఎక్కువైతే బహుమతి మొత్తాన్ని పంచి పంపుతాము.

కదిలేది-కదిలించేది

వాకాటి పాండురంగారావు

సిరిపురం జంక్షన్ దగ్గర మురికినీళ్ళ గుంట, పాడుపడి, నాలుగయిదు ఇటుకలు రాలిపోగా పాచి పట్టిన గోడ, దాని కన్నాల్లోంచి మొలుచుకొచ్చిన జెముడు మొక్కలు, వస్తూ పోతూన్న వాహనాలు రేపిన దుమ్ము, రాతి పలకలు తొలగినపుట్‌పాత్ - ఆ మొత్తం ఏర్పాటూ చాల గొప్ప సినీఆర్ట్ డైరెక్టర్ వేసిన అద్భుతమైన సినిమా సెట్టింగులా వుంది, కాని అది అసలు సెట్టే! ఆ 'సెట్టు'కు విత్తనం 1947లో నాటారు.

సిరిపురం జంక్షన్ దగ్గర, ఆ సెట్టింగుకు 'సెంటర్'లా వున్నాడా చిన్నవాడు. వయసుకు చిన్నవాడే అయినా చూపులకు పెద్దవాడు, సిరి సిరి మువ్వల సవ్వడి విననివ్వని చెవులవాడు, సరిగా ఎవరినీ చూడనిచ్చగించని కనులవాడు, లోభిచేతి పర్సువలె ఎప్పుడూ విప్పని నోరువాడు, శతాబ్దాలు దాటి వచ్చిన వేమన యోగికి నకలు రూపమువాడు!

ఇసుకమీద పీతల కాలి ముద్రల్లాంటి రోజులు - అతడి జీవితపు పేజీలు.

అలాంటిచోట ఒకనాడు హఠాత్తుగా హడావిడి మొదలయింది, ఎన్నో కలలను, మాటల పళ్ళెంనిండా నజరానాగా పేర్చుకుని, ముత్తైదువలా వచ్చాయి ఎన్నికలు. 'మడులిత్తుము, మాణ్యాలిత్తుము, మన్నికగా ఆయివు వర్షాలపాటు వాడదగిన ఆశల జల్లెడల నిత్తుము' అంటూ వచ్చారో జెండాల పేరంటాళ్ళు. మగయనక ఆడయనక, చిన్ననక, పెద్దనక అందరికీ బొట్లే, అందరికీ పిలుపులే! అంతా కలుపుగోరు తనాలే!


అయినా మనవాడు, సిరిపురం చిన్నవాడు - రిఫరెన్స్ నిమిత్తం 'డి. నారాయణ' అంటే ఏమీ అనుకోనివాడు. వాడి దైనందిన జీవితం, హైదరాబాదు నగరంలో నీటికొరత బాధవలె - అలాగే వుంది.

కందకు లేనిచో దురద కత్తిపీటకుం డాలికదా - అంచేత డి. నారాయణకు అక్కరలేకపోయినా ఆ ఎన్నికల కలం రోడ్లమీదకు పాకి, గోడల కెగబ్రాకి, డ్రెయినేజి కాల్వలు నిండి అతడిమీదకు పొంగింది.

అప్పుడతడు తలఎత్తి చూచాడు.

కాలివేళ్ళమీద నిల్చున్న శ్రీరామాచారి కన్పించాడు. చేతిలో పళ్ళెం, పళ్ళెంలో తీర్థం, ప్రక్కనే తులసిదళాలు. ఆ నీటిని అతడికీ తనకూ మధ్య చల్లుతూ పలకరించాడు "ఒరేఅబ్బి, ఇక్కడనుండి నీ బిచాణా ఎత్తి వేయాలిరా నాయినా! ఇక్కడ సీతారామాలయానికి వచ్చేవారం శంకుస్థాపన జరగబోతున్నది. గుడి గోడలో దేవుడు వెలిశాక వచ్చి ఆలయం ముందు కూర్చున్నావనుకో, ఇక నీకు సమారాధనే! చక్కెర పొంగలి, దద్ధోజనం, ప్రసాదాలు, అదికాక కొబ్బరి ముక్కలు, చిల్లర డబ్బులు. అట్లా చూస్తావేంరా, వెర్రివెధవా, శ్రీరామశరణు - శ్రీరామశరణు అనుకో - వచ్చేజన్మలోనయినా మగ పుట్టక పుడతావని అని మళ్ళీ ఒకసారి చల్లి ధోవతి కుచ్చిళ్ళను పైకిపట్టుకుని కాంపౌండ్‌లోనిబంగళాలోకి వెళ్ళిపోయాడా రామాచార్యులు.

అటు ఆయన వెళ్ళాడోలేదో ఇటు ఝుర్రమంటూ వచ్చి ఆగిందొక స్కూటర్. చలన కళ్ళజోడు, భుజానికి కెమేరా, చేతిలో నోట్‌పుస్తకం బాల్



పెన్నూ వున్న అతడి నామధేయం పానకాలరావు. వాలకమే చెబుతూంది అతడు "మన ప్రత్యేక విలేఖరి అని. అంచేత అతగాడు మనందరి తరపున, మనందరిలో ఒకడయిన డి. నారాయణను వివరాలడిగి మనందరికీ అందించాలి అని ప్రారంభించాడు.

"చూడండిసార్, మీ పేరేమిటి?"

డి. నారాయణ బుర్ర గోక్కున్నాడు

"పోన్లెండి ... మిరొక స్వతంత్ర భారత దేశపౌరులు. అదిచాలుమాకు. ఈ ప్రాజెక్టులూ, ప్రణాళికలూ, ప్రాంగణాలూ - వీటి వలన సిద్ధించిన ప్రగతి గురించి మీ అభిప్రాయం చెప్పగలరా?" అని అడిగాడు పానకాలరావు,

డి.నార్థాయణ తన చిరిగిన మురికి పంచె పీలికలలో రెండింటిని ముడి వేయ సాగాడు.

"ప్రగతి సంతృప్తికరంగానే వుంది. కాని ఇంకా చిక్కుముడులున్నాయని వ్యాఖ్యానించారన్నమాట! భలేవారండీ మీరు! నోరు విప్పకుండానే వివరంగా చెప్పేస్తున్నారు .... మరింత -

కేంద్రం రాష్ట్రాల సంబంధం గురించి ఏదన్నా చెబుతారా?"

డి.నారాయణ గడ్డం గోక్కుని ఆకాశం వైపు చూశాడు. దాన్ని అర్థం చేసుకున్నాడు పానకాలరావు.

ఇంకా ఉన్నతంగా వుండాలి, ఇంకా మెరుగు పడాలి అన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు అవునా! గుడ్‌థాంక్సండీ! అని ఒక ఫోటో తీసేసుకుని స్కూటర్ దాక వెళ్ళి హఠాత్తుగా వెనక్కొచ్చి-

"అన్నట్టు ఏమండోయ్ ... ఈ మధ్యనే ఈ దారిద్రపు రేఖ నుండి కొన్ని కోట్ల మందిని పైకి లాగారుకదా? మరిప్పుడు మీ రెక్కడున్నారు?" అని అడిగాడు మన విలేఖరి.

డి. నారాయణ ప్రక్కనే పారుతున్న మురికి కాలవ వైపు చూడగా "ఓహో! ఆ కాలవ దారిద్ర రేఖయితే మీరు దానికి ఎగువనే వున్నారన్నమాట. చాలా సంతోషం వస్తానండీ. రేపొద్దున్న జాతీయ పత్రికలన్నిట్లో మీఅభిప్రాయాలన్నీ ఫోటోతో సహా వస్తాయి, మార్నింగ్ ఎడిషన్ కొని చదవండి - అని పానకాలరావు ఇంకో ఇంటర్వ్యూకు వెళ్ళిపోయాడు.

అరగంటయ్యాక "ఒరేయ్ ఎవడ్రా అక్కడా?" అన్న గర్జన విని కళ్ళు తెరిచాడు పడుకునేవున్న డి. నారాయణ.

తెల్ల వలువలు. తెల్ల పలువరుస, తెల్లటి నవ్వుతో ఎదుట వున్నారో అభ్యర్థులవారు. వారు చేతులు జోడించి నిలబడి వున్నారు.

వారు వేసిన కేకే అది. "ఎవడ్రా అక్కడ? మన బ్రదర్‌కో కుర్చీ వేయించండి" అని పురమాయించారు. అలాటిదేమీ రాకుండానే టేప్ రికార్డర్‌లాటి గొంతు స్విచ్చి నొక్కారు.


"అయ్యా దండా [illegible] కులాసేనా? మీరు [illegible] రాళ్ళు లేవుకదా? [illegible]ల్లో నీళ్ళు లేవు కదా? ఈ దా[illegible] సర్వేల్లిరావు అంటారు. విశాఖపట[illegible] తుఫానులు అవీ రాకుండా యారాడ కొండ నిల్పింది నేనేనండి. బీచినిండా ఇసుక పోయించిన అదృష్టంకూడా నాదేనండి. అట్నుంచి ఆ చల్లగాలి రావడానికి నేనుపడ్డ తిప్పలకు లెక్క లేదనుకోండి. ఏది చేసినా మీకోసం మీ పాటవం కోసమేనండి. ఈ సేవా తత్పరతలోనే రాలి, పిడికెడు బూడిదయి పోవాలని ఎనిమిదోసారిగా ఎన్నికల్లో నిలబడుతున్నానండి. తప్పకుండా మీది, మీ ఆవిడది మీ పిల్లలవి ఓట్లు నాకు వేయించాలి. నేనీసారి గెలిస్తే మన అందాల నగరాన్ని పారిస్‌లాగా, మిమ్మల్ని డీగోల్ అంతవాడిగా తీర్చి దిద్దుతానని హామీ ఇస్తున్నాను. నా గుర్తు మీకు గుర్తేగా! మరి సెలవిప్పండి సోదరా—" అని కారెక్కి వెళ్ళిపోయారు యు. సర్వేల్లిరావు గారు.


కారొదిలిన పొగకు గొంతు చిటపటలాడగా ప్రక్కనున్న డబ్బాలోంచి నీళ్ళు తాగాడు నారాయణ. కడుపు తడుముకున్నాడు. మూట భుజాన వేసుకుని నడక మొదలుపెట్టాడు. అప్సరా డౌన్‌లో నడుస్తున్నాడు. నాలుగుకాళ్ళ కుక్కలు మొరగసాగాయి. మొరిగి మొరిగి వూరుకున్నాయి.

నెమ్మదిగా అడుగులు వేస్తున్న నారాయణ వెనకాలే వొచ్చాడొకాయన. పైజామా లాల్చి, గిరజాల జుట్టు, లాల్చి జేబులో చేయ్యా, తడబడుతున్న అడుగులు ఒక చేతిలో కాగితాల బొత్తి.


"సోదరా ఆగు!" అని అతడు డి. నారాయణ భుజం పట్టుకోబోయాడుగాని ఆభుజం పక్కకు తొలగింది.

"ఇది విను సోదరా ... ఇది నీకే అంకితం. నా కథయే వో వ్యథ ..." అంటూ ఒక్కొ పంక్తినీ ఠెండేసిసార్లు









నమిలి నమిలి పలకసాగాడు.

'అధో జగత్సహోదరా! శంఖమెత్తి
ఊదరా!

నా ఉదరమ్మది రుధిరమ్మని —
నా నయనమ్మది అగ్ని గోళమ్మని —
నా పిడికిలి రేపటి వాకిలియని —
వేకువ కేకా భావికి బాకా —
నేనే నేనేయని.
వెయ్యేక పొలికేకా' - అని అతడు కాస్త ఊపిరి తీసుకోవడానికి ఆగగానే డి. నారాయణ నడక వేగం హెచ్చించాడు.

అదిగో అల్లంత దూరాన పెళ్ళి ఇల్లు!

"ధన్యోస్మి! నా కవితకింత సత్ఫలితమా! ఒక్క చరణం వినేసరికే నా సోదరుడిలా గతిశాలుడై ముందడుగు వేస్తున్నాడంటే నాకింతకన్నా ఏమి కావాలి?" అని ఉప్పొంగి పోయిన కవి వి.పి. లవంగమూర్తి. కవిత కట్టలో రెండోపుట తిప్పి, తల పైకెత్తేసరికి డి. నారాయణ అల్లంతదూరం వెళ్ళిపోయాడు. కవి పరుగెత్తాలని ప్రయత్నించాడుగాని అతడి కాళ్ళకాస్పృహ అందలేదు. నిలబడ్డమే కష్టంగా వున్నాయి వాటికి. జేబులోంచి సీసా తీసి చూశాడు. ద్రవం అసలులేదు. ఎందుకొచ్చిన ఉపద్రవం అని దానిని గిరవాటేసి నారాయణవైపు నడవసాగాడు.

వడి వడిగా పడుతున్నాయి పెళ్ళివారు తిని పారేసిన విస్తరాకులు.

ఎగిరెగిరి పడుతున్నాయి రకరకాల తినుబండారాల అవశేషాలు.

రెండు చేతులనిండా విస్తళ్ళనాక్రమించుకుని, కావలించుకుని, పోటీగా వచ్చిన కుక్కల్ని తరిమి కొట్టి ఇవతలికి పడ్డాడు దరిద్ర నారాయణ.

కదిలిస్తున్నాయి ఆ విస్తళ్ళు
కదిలాడు డి. నారాయణ.





తడిసి మోపెడు

భ.రా.గో

నా పంథొమ్మిదోయేట చేరాను, పొలాలూ, స్థలాలూ కొలిచే సర్వే ఉద్యోగంలో. అప్పట్లోనూ, ఆ తరవాత చాలాకాలంవరకూనూ మన రాష్ట్రంలో చాలినన్ని రోడ్లు ఉండకా, రోడ్డున్నా బస్సు సౌకర్యాలు లేకా, నా ఉద్యోగధర్మం చాలాకాలంపాటు నడిచే నిర్వహించాను.

నడిచీ, నడిచీ, కొలిచీ, కొలిచీ రాష్ట్రంలోని ఇరవైమూడు జిల్లాల్లో పదకొండు జిల్లాలు తిరిగాను. సాగినన్నాళ్ళూ సాగిన నా నడకకి సుమారు ఎనిమిదేళ్ళకిందట మోపెడ్లు ముమ్మరంగా మార్కెట్లోకి దిగినప్పుడు బ్రేకుపడ్డ నడక అక్కడ ఆగిపోయిందనుకోకండి. నా నడకకిపడ్డ బ్రేకు వేగాన్నీ, ధ్వనినీ పెంచడానికీ నా స్థానిక ప్రయాణాల పరిమాణాన్ని గుణీకృతం చెయ్యడానికీ పడ్డాదిగానీ ఆపెయ్యమనికాదు. ఎందుకంటే ఆ ఎనిమిదేళ్ళనాడు నేనొక మోపెడ్ కొన్నాను.

దరిద్రుడు తల కడిగితే వడగళ్ళవాన అన్నారు. అలాగ్గా నేను మోపెడ్‌కొన్న మర్నాడు డ్యూటీకొస్తుండగా ఏ హెచ్చరికా లేకండా వాన పట్టుకుంది. ఇంతా అంతాకాదు. అరగంట వ్యవధిలో అరవై మిల్లీమీటర్లు కురిసి ఠకీమని ఆగిపోయింది. కాపురం మల్కాపురంలోనూ, డ్యూటీ టౌన్లోనూ కావడంవల్ల ఈ అరగంట ప్రయాణంలోనూ నేనూ నా మోపెడూ చిత్తుగా తడిసి ఓ కిలోమీటర్ దూరం బండితోసుకోవలిసొచ్చింది. నేననుకున్నట్టే నన్ను పలకరించిన వాళ్ళందరూ మోపెడ్ కొన్నారా, ఎంతైంది అని అడగడం, అందరికీ ఒకటే సమాధానం చెప్పడం సంభవించింది. అదే - తడిపి మోపెడు.

అందరూ ఆ సమాధానాన్ని అలా మింగేసి వూరుకున్నారు. మా డాక్టర్ ఫ్రెండుమాత్రం "పోన్లే! ఇన్నాళ్ళకి నువ్వు కూడా ఓ బండివాడివయ్యేవన్నమాట" అన్నాడు. అతను అంతకు ఐదాంళ్ళ కిందటే ఇంటివాడూ, బండివాడూ అయ్యేడు. అంచేత మరి నేనేం మాటాడలేదు.

అప్పుడెప్పుడో ఒకాయన మేకపిల్లని కొనుక్కెడుతూవుంటే ఇది మేకపిల్లకాదు కుక్కపిల్ల అని పద్ధతిగా చెప్పి కుట్రచేసి ముగ్గురు పెద్దమనుషులు ఆ మేకపిల్లని అపహరించేరుట. అలాగ అపహరించే వుద్దేశంతో కాకపోయినా నా మోపెడ్‌నీ, దాన్ని కొన్నందుకు నన్ను అపహాస్యం



చేస్తూ జనం డ్రైలాగుతెయ్యడం అదో ప్రహసనాల మాలిక. ఆ వివరాలు కొద్దిగా మనవి చేస్తాను.

పాపారావుగారని, విశాఖపట్నం రచయితలకి ఓ అన్‌లిస్టెడ్ క్రిటిక్కు. రాజకీయశాస్త్రంనుంచి రతిశాస్త్రం వరకు అన్నీ చదివి విమర్శించడమే అతని కాలక్షేపం. ఓ అరగంట అతని మాటల్ని ఫాలో అయినవాడు ఐదారు జీవిత సత్యాలను కొత్తగా గ్రహించక తప్పదు. అయనొకసారి నేను మోపెడ్‌మీద వెళ్తుండగా తటస్థపడ్డాడు. ఆస్పత్రి డౌన్‌లో సర్రుమని వొచ్చేస్తూవుంటే ఎంతదూరంనించీ చూసేడోగాని చెయ్యి అడ్డంపెట్టి ఆపేడు. "ఏటివాయ్, మంచి జోరుమీదుందే ఎవహారం!" అన్నాడు. "ఔను! మోటారుందికదా ఇంకా జోరుగా వెళ్ళకపోవాలా?" అన్నాను. "నన్ను పోస్టాఫీసు దెగ్గిర దింపేస్తావేటి?" అన్నాడు. "ఓ" అన్నాను. వెనకాతల కూచోమని సూచన చేసి, అతను నావేపూ, నా బండివేపూ పరీక్షగా చూసి "లాబంలేదుగురూ! ఇది మన్ని కాయదు. దీనికి గుండె సిన్నది, సీటు సిన్నది. ఇలాటిది కొన్నావేటిగురూ! అగినన్నాళ్లాగినావుగండా కుంచెం పెద్దది కొన్లేకపోయేవా?" అనేశాడు.

మరోమాటు మా బావమరిది కూతురు వర్లక్ష్మి ఇంటర్ యేగో చదువుతూవుండేది. అప్పట్లో — దొండపర్తి బస్‌స్టాపు దగ్గిర "మామయ్యోయ్" అని పెద్ద కేకేసి ఆపింది. "ఏంటి మామయ్యా! తొత్తిగా అటూ యిటూ చూడకుండా వెళ్ళిపోతున్నావు? ఎవరేనా లిఫ్ట్ ఇమ్మని అడుగుతారని భయమేనా అదంతా?" అంది. "అలాక్కాదే మేనకోడలా. ఈ వూళ్లో మోటర్లవాళ్ళు రోడ్డుమీదా, ట్రాఫిక్ సిగ్నల్స్‌మీదా తప్ప మరెక్కడా దృష్టి పెట్టుకోకూడదు. యాభై గజాలకో స్పీడుబ్రేకరు, పదేసి గజాలకో గొయ్యి నీ మనుషులవేపు చూస్తూ పోతే గోతిలోపడ్డం ఖాయం. అందుకని!" అన్నాను. "ఐతే నీ మూషిక వాహనంమీద నన్నెక్కనియ్యవా?" అంది. "ఎక్కడ దించమంటావు?" అన్నాను. "జగదంబా సెంటర్లో దింపి మామయ్యా అక్కణ్ణించి కాలేజీకి బస్సులో వెళ్ళిపోతాను" అంది.

ఒకటికి రెండు ప్రాణాలు కదా అనీ, అందులోనూ ఆడపిల్ల కదా అనీ జాగ్రత్తగా వెళ్తున్నాను. ఆ పిల్లకి ఆ స్పీడు నచ్చకపోతే గేరుమార్చు, స్పీడుపెంచు అని పాటవరసలో కాకపోయినా మాటవరసకైనా అ మాట చెప్పొచ్చుగా. డాబాగార్డెన్ స్టాప్‌కీ, జగదంబా జంక్షన్‌కీ మధ్య తనెక్కవలసిన బస్సు మమ్మల్ని దాటుకుని వెళ్ళిపోయిందట. నేను స్లోగా వెళ్ళే బండి కొన్నానని విసుక్కుంటూ విశ్వనాధం విగ్రహం దగ్గిర బండి ఆపించి దిగెళ్ళిపోయింది.

ఆవేశనించి నాకు కసి పెరిగిందనుకుంటాను. రోజూ మల్కాపురంనించి ఆఫీసుకి వచ్చేటప్పుడు రంప్యామని నలభై కిలోమీటర్ల స్పీడులో వచ్చేస్తూ నా బండికేం అని ధీమాపడ్డం మొదలెట్టేను. ఓరోజు అలా వస్తూ, డ్రైడాక్‌కి కొంచెం దక్షిణంగా ఒకచోట మూడున్నర హార్స్‌పవర్ బండొకదాన్ని దాటేశాను కూడాను. ఆ బండిమీద తెల్లటి యూనిఫారం వేసుకున్న ఆఫీసర్ ఒకాయన వస్తున్నాడు. ఆ బండిక్కూడా తెల్లరంగే వేశారు. వెనకాల ఒక అడకూతురు మహా తెల్లటిపిల్ల కూచునుంది. ఉంటే నాకేం? నేను నా బండితో ఆ బండిని దాటేశా నన్నది తేటతెల్లమైపోయింది.

అయితే అతనలా ఊరుకోలేదు. ఓ నిమిషం గడిచేలోగా డుబ్ డుబ్ లాడుకుంటూ నా కుడిపక్కగా వొచ్చేసి "మిస్టర్! ఓ క్షణం ఆగుతావా, నీతో మాట్లాడాలి!" అన్నాడు ఇంగ్లీషులో. నాకు కొద్దిగా భయం వేసింది. అతని బండిమీద "నేవల్ పోలీసు" అని రాసివుంది. ఎక్కువ స్పీడులో వస్తున్నానని నామీద ఏదైనా కేసుపెట్టమని సివిల్ పోలీసుకు సలహాగానీ ఇచ్చేస్తాడేమో బ్రహ్మనాయనా అనుకున్నాను. కాని అంతలోనే ధైర్యం తెచ్చుకున్నాను. నాబండి ఏక్సిలరేటరు సరుకేగాని గేరు బండి కాదు. ఎంత పీక్కున్నా నలభై కిలోమీటర్ల స్పీడుకన్నా వెళ్ళదు. అదోపెద్ద స్పీడు కాదు. అంచేత "ఓ షూర్" అని నా బండిని పక్కగా తీసి ఆపాను. ఎందుకేనా మంచిదని కిందికిదిగి, నిలబడి స్టాండ్ కూడా వేసేను. అతను నా బండిని దాటుకెళ్ళి అక్కడ తన బండి ఆపి ముందు ఆ అమ్మాయిని దిగమని, తరవాత తను దిగి, స్టాండేసి నా దగ్గిరికొచ్చేడు.


"ఎన్నాళ్ళయింది ఈ బండికొని?"

"రెండునెల్లవుతోంది"

బండి హేండిలూ బ్రేకులూ అవీ పట్టుకుని చూశాడు. ఓసారి స్టార్ట్‌చేసేడు. కళ్ళెగరేసి "బానే పోతున్నట్టుందే!" అన్నాడు.

"ఫరవాలేదు" అన్నాను జాగర్త





భయం నాస్తి ధోరణిలో.

"అదే నేనూ అనుకుంటున్నాను" అని ఆ అమ్మాయిని రమ్మని సంజ్ఞచేసేడు ఆవిడ రాగానే "చూశావా, నే చెప్పలే!" అన్నాడు. నావేపు తిరిగి, "మా ఆవిడకి ఇలాటిదొకటి కొందామని ఉద్దేశం. మీ సలహా ఏమిటి?" అన్నాడు.

దాంతో నాకు భయం పోయిందిగాని ఏదో వికారం పుట్టింది. "ఓ తప్పకుండాను! ఇక నేను వెళ్ళొచ్చా?" అని బండి స్టార్ట్ చేశాను.

* * *

జీవితాన్ని గురించి సూక్ష్మంలో మోక్షంగా వ్యాఖ్యానం చెయ్యమని ఓ తత్వవేత్తని అడిగితే ఆయన చెప్పేడుట. జీవితం అనేది, మాటవరసకి, నువ్వూ నీ మిత్రుడూ కాఫీహోటలుకి వెళ్ళి చెరొక రవ్వదోశా ఆర్డరివ్వడం లాంటిదని చెప్పొచ్చు. సర్వర్‌కి, మీకిద్దరికీ విభేదాలు కల్పించాలన్న తలంపు లేదు. దోసె వేసేవాడు మిమ్మల్నసలు చూడలేదు. కాని చివరికి ఏమైంది? నీ మిత్రుడికెదురుగా వుంచిన ప్లేట్లో దోశ కొంచెం పెద్దది, మరొక్కచాయ ఎర్రగా కాలింది, అనిపిస్తుంది. అంతే —

తనకి లేదని ఏడిస్తే వోకన్ను పోతుందనీ. ఇంకోడికి ఉందని ఏడిస్తే రెండో కన్ను పోతుందనీ మరోతత్వవేత్త శెలవిచ్చారట. అయినా ప్రపంచంఅంతా రెలెటివిటీ మీదనే నడుస్తోందని నా అనుమానం. నా ఉద్యోగంకన్నా (నా అర్హతలేఉన్న) సూర్యారావుకొచ్చిన ఉద్యోగం మంచిదేమో. మాకిచ్చిన క్వార్టర్స్‌కన్నా (నా వేజ్ గ్రూప్‌లోనే ఉన్న) కృష్ణారావుకిచ్చిన క్వార్టర్స్ ఆరోగ్యమేమో. ఇంకా కొంచెం లోతుకి వెడితే మా ఆవిడకన్నా ఆ మనోహర్రావుగాడి పెళ్ళాం అందమైందేమో. మా పిల్లలకన్నా గోవిందరావుగారి పిల్లలు స్మార్ట్‌గా ఉంటారేమో!


నాకు తెలుసు. మీలో చాలామంది ఇలా ఆలోచించరు. ఎవరికెలా రాసిపెట్టుంటే అలాగ అని సంతృప్తిపడి జీవితాన్నిగొప్ప కంటెంట్‌మెంట్‌తో అనుభవిస్తున్నారని నాకు తెలుసు. కాని నాదౌర్భాగ్యమేమిటో. సంతృప్తి అన్నది లేకుండా పోయింది! రోడ్డుమీద నా మోపెడు తోలుకుంటూ వెళ్తూనా, మిగిలిన మోటారు వాహనాలు దేన్ని చూసినా నాకుచిరాకే, అసూయే. నాది సగం హార్స్‌పవర్ బండికదా. ఆఫీసులో నా రూమ్‌లో నాతోకలిసి పనిచేసే మిగతా నలుగురికీ ఒకటిన్నర హార్స్ పవర్ బండ్లున్నాయి. పక్క రూమ్‌లో నాకన్నా చిన్న పుద్యోగస్తులు ముగ్గురికి ఒకటింముప్పాతిక, రెండున్నర, మూడున్నర హార్స్‌పవర్లు గల బండ్లున్నాయి. వాళ్ళందర్నీ చూసి అసూయతో, చిరాకుతో కుళ్ళిపోయి చస్తూవుంటాన్నేను. మా ఆఫీసులో మిగిలినవాళ్ళలో చాలా మంది వున్నవి మోపెడ్లే, అయినా అవన్నీ ఇంకేవో కంపెనీలవి. తడిసి మోపెడ్లుకావు తడవని మోపెడ్లేమోనని నా బండికన్నా ఏదైనా నయమేమోననీ అనిపిస్తుంది అస్తమానమన్ను.

ఈ ఏడెనిమిదేళ్ళలోనూ నా మోపెడ్‌ని చిన్నచూపు చూసిన సంఘటనలైతేనేమి, దాన్ని కొన్నందుకూ - అనేక మందిలాగా ఏడాదో రెండేళ్లో గడవగానే అమ్మిపారేసి మరో పెద్దబండి కొనకుండా దాన్నే

మెయింటేన్ చేస్తూ ఏకపత్నీవ్రతుడిగా కొనసాగుతున్నందుకూ - నన్నో అప్రయోజకుడిగా చూసిన సంఘటనలైతేనేమి, చాలా జరిగేయి, మాట వరసకి కొన్ని ఉదహరిస్తాను, రెల్లివీధి దగ్గిర ఓసారి కాలేజీడౌన్ మీదుగా కలెక్టరాఫీసుకి వెళ్తుండగా తోవలో ఏమైందమకున్నారు? ఓ ఇద్దరు, రోడ్డుమధ్యని నిర్భయంగా నిలబడి ఏదోమాటామాటా అనుకుంటున్నారు. నేను హారన్ మోగించాను. వాళ్ళు కదల్లేదు, వాళ్ళగొడవే వాళ్ళది! వీళ్ళపని ఇలాకాదని బండి ఆపేను, అంటే, ఇంజన్ ఆపకుండా బ్రేకుమాత్రం వేసేనన్నమాట. మళ్ళీ హారన్ మోగించేను. అబ్బే, వాళ్ళు అంగుళంకూడా జరగలేదు. ట్రాఫిక్‌రూల్సన్నీ తప్పని సరిగా అమలు పరుస్తానని ఆర్.టి.ఓ. ఆఫీసులో రాతమూలకంగా హామీ ఇచ్చి రోడ్డుటాక్సు కూడా కట్టిన నాకు; ఏహామీలూ ఇవ్వకుండా రోడ్డుటాక్సు కూడా కట్టకండా వున్న వాళ్ళు దారివ్వకుండా నిలబడ్డమా అని నాకు ఉక్కురోషమెచ్చింది. జేబులో చెయ్యిపెట్టి రెండు పది పైసల నాణాలుతీసి ఇద్దరికీ చెరోటీ ఇచ్చాను. వాళ్ళు కొంచెం ఆశ్చర్యపడినా అసంకల్పితంగా పుచ్చేసుకున్నారు. నేను బండిలాగించేసి జోరుగా వెళిపోతూ "గుడ్డోడికి చెవిటోడికీదర్మం" అని కేకేశాను.

మరోమాటేమైందనుకున్నారు? డైమండ్ పార్క్‌కి దగ్గిరగా (రోడ్డు మధ్యనే, మళ్ళా!) ఓ నలుగురు నిలబడి ఎన్నికల్లో యెవరు గెలుస్తారు, ఎందుకు? అనే విషయంమీద కాబోలు, తీవ్రమైన





చర్చలో ఉన్నారు. వాళ్ళకూ్కడా తప్ప కోమని సూచిస్తూ హారన్ కొట్టాను. వాళ్ళేం తప్పుకోలేదుగానీ అందులో ఒకా యన "ఎందుకు ?" అన్నట్టు చూశాడు. చుట్టూ చూశాను ఎంతెంతలేసి పెద్దపెద్ద వాహనాలవాళ్ళూ మనకెందుకులే అన్న ట్టుగా వాళ్ళే తప్పుకుని పోతున్నారు. "ఇక్కడ పార్కు ఎక్కడండి ?" అన్నాను. నన్నో వెర్రివెధవకింద చూసి "ఇదేగా" అని పక్కనేఉన్న పార్కువేపు చూపించాడు అతను. నేను బండి బ్రేకులు వదిలి ఏక్సిలరేటరు బిగించి "మరి మీ మీటింగు రోడ్డు మీద పెట్టేరేమిటి ?" అంటూ లాగించేశాను.

ఉంకోమాటు - ఇసకతోట దగ్గిర ! ఇసకతోటంటే తెలుసుగా, మంచి రద్దీ అయిన ప్రదేశం. జనం బోలెడు ఇళ్ళు కట్టుకున్నారు. అయినా ఎవ్వరూ ఇళ్ళల్లో వుండరు. అంతా రోడ్లమీదనే ఉంటారు. ఏడాది పొడుగుతా కనీసం పదిమంది పిక్నిక్ సీజన్‌లో ఇరవై మంది లారీలకింద పడి చచ్చిపోతూ ఉంటారు.

ఏక్సిడెంట్ జరిగిన గంటలో అంతా మర్చిపోయి మళ్ళా రోడ్డు మీదకి చేరుకుంటారు. అలాటిచోట నేను మోపెడ్ మీద వెళ్తుంటే ఒక అజాను బాహుడు తీరిగ్గా రోడ్డు ఇద్నింఛటు దాటు తున్నాడు. నా బండి నేను నడుపుతున్న ప్రకారం వెళితే అతన్ని గుద్దేయడం ఖాయం. అయినాసరే, పెళ్ళైపోయినపిల్ల మేనత్త కొడుకునిచూసి బెదరనట్టు ధీమాగా వెళ్ళేడతను. నేను రోడ్డుకి పక్కగా నా బండి ఆపి (ఇంజిన్ ఆప లేదు, బ్రేకేసేనంతే) అతన్ని పిల్చాను, "అప్పారావూ, ఇట్రాఓసారి" అని -

అతను వచ్చేడు. "నాపేరు అప్పారావు కాదు"

"సింహాచలమా ?" అన్నాను.

"కాదే !"

"పోనీ పైడితల్లి" అన్నాను.

"అదీకాదు, ఇంతకీ ఏటి ?" అన్నాడతను.

నేను కళ్ళెగరేసి "మంచి పెర్సనాల్టీ గున్నావోయ్" అన్నాను.


అతను కాలర్ పైకెత్తుకుని మీసం సవ రించుకుని "అయ్ !" అన్నాడు ఖుషీగా.

"కానీ ! ఇదుగో ఈ రోడ్డుమీద నువ్విప్పుడు నడిచినట్టు నడిస్తే ఏ లారీయో గుద్దేసి కాలో శెయ్యో ఇరిగిపోద్ది. నువ్వు ఆస్పటలుకి ఆడు జేలుకి ఎళ్ళిపోతారు తెల్సా ?" అని బోధించి యథాప్రకారం బండి లాగించేశాను.

ఇలాగ ట్రాఫిక్ రూల్సు గురించీ రోడ్డు మధ్యని పాదచారులు నిలబడుట లేక నడుచుటయందలి ప్రమాదములు అనే విష యం గురించీ ఇంకా ఈవూళ్లో ఏడులక్షల తొంభైతొమ్మిదివేల తొమ్మిదివందల మందికి పైగా చెప్పాలి. ఎందుకంటే ఈ ఊరి జనాభా ఎనిమిది లక్షలుట. అయినా నేను నిరుత్సాహ పడదల్చుకోలేదు.

* * *

మొన్నోరోజు ఆఫీసునుంచి కొంచెం త్వరగా ఇంటికొచ్చేసేను. మళ్లా బయటికి వెళ్ళవలసిన పనున్నాదికదా అని మోపెడ్ ఇంట్లోకి తెచ్చికుండా రోడ్డు వారని ఉంచీసేను. కిటికీ పక్కని కూచుని కాఫీ తాగుతూ ఓ కన్ను అటుం




చేను. ఇంతలో ఎవరో ఓ మనిషి నా మోపెడ్‌ని అదే పనిగా గమనిస్తూ అందు కోసం దాని చుట్టూ ప్రదక్షిణలు చేస్తు న్నట్టు తెలిసిపోయింది. ఏదైనా కుక్క అలా తిరిగిందంటే దానిఅర్థంవేరు. కనక వెంటనే లేచివెళ్ళి తరిమేసేషని, అయితే మనిషేకదా అని నిర్లక్ష్యం చేసినందుకు అతనేంచేశాడనుకున్నారూ ?

అబ్బే ! అతను నామోపెడ్ దొంగ తనం చెయ్యలేదు. దానికెంత గుండె కావాలి ! అసలు ఎవరైనా ఆ మోపెడ్‌ని ఉన్నదున్నట్టుగా స్టార్ట్ చెయ్యగలిగితే సన్మానం చేసో చప్పట్లు కొట్టో దాన్ని అతని పేర రిజిస్టర్ చేయించేసే యెచ్చని నా సహోద్యోగులు కొందరు అంటారు.

అయితే అతనేంచేసేడు ? మా పక్క వాటా వాళ్ళ తలుపుకొట్టి ఈమోపెడ్ ఎవరిదండీ అని అడిగేడు. వాళ్ళు నా పేరు చెప్పి, మా వాటా చూపించేరు (అంతా కిటికీలోంచి కనబడుతూనేఉంది.) అతను మా తలుపుతోసుకుని లోపలి కొచ్చేసి నమస్కారం చెప్పికుర్చీ ఈడ్చుకుని కూచున్నాడు. నేను ఫలానా కంపెనీ మోపెడ్ల సేల్స్‌ప్రొమోటర్నని చెప్పేడు. నాకు అర్థమైపోయింది. నామోపెడ్ ఆ కంపెనీదేగా. ఫ్రీసర్వీసింగు, చెడిపోయిన పార్టులకి బదులు కొత్తవి చవగ్గా సరఫరాచెయ్యడం అలాంటి కార్యక్రమాలేవో ఉన్నాయిగావును, అనుకున్నాను.

అతను చెప్పింది వింటే నాకేకాదు, మీకూ్కడా కోపం వస్తుంది.

నా మోపెడ్ ఎనిమిదేళ్ళనాటి మోడల్లోదిట. దరిమిలాను ఆ కంపెనీవారు ఇంకా కొంత కృషిచేసి ఈమోపెడ్ నాణ్యతను పెంచుకుంటూపోయి కొత్తరకాలు విడుదల చేస్తున్న కారణంగా నా 1979 మోడల్ మోపెడ్ ఇంకా రోడ్డుమీద తిరగడం కంపెనీకి అంతమంచిది కాదుట. అందుకని దీన్ని ఏదోధర చేసి కంపెనీకే




ఇచ్చెయ్యాలన్నాడు.

నేను కొంచం బాధపడ్డా చివరికి పోనీ సరేలే అన్నాను. ఎంతధర చెప్పొచ్చు - అని కాయితం కలం తీసి లెక్కేశాను. మొదట కొన్నది మూడువేల ఎనిమిది వందలకి. ఏడాదిలో రెండు టైర్లూ ట్యూబులూ పోయాయి. అప్పట్లో మూడు వందలు. రెండో యేడు నడుస్తుండగా ఓమారూ, నాలుగేళ్ళ తరవాత ఓమారూ నాలుగేళ్ళ తరవాత ఓమారూ ఇంజిన్ రీబోర్ చేయించేను. ఆరువందలు. ఆరో యేడు నడుస్తూ వుండగా కొత్త ఇంజిన్ వేయించేను. ఆరువందలు. మధ్యలో మరో రెండుసార్లు టైర్లు, ట్యూబులు మార్చాను. ఆరు వందలు. మొన్న డిశంబర్‌లో కార్బురేటరు కొత్తది వేశాను. మూడువందలు. ఇంకా సైలెన్సర్ డీకార్బనైజ్ చెయ్యడం, బ్రేకు షూలు మార్చడం బెల్టులు మార్చడంలాంటి చిల్లరమల్లర రిపేర్లు ఐదువందలు పెట్టాను. అంతా కలిసి ఆరువేల నాలుగువందలైంది. మరీ ఈ ఎనిమిదేళ్ళూ పెట్రోలు పోయించేను కదా. దానికో నాలుగువేలేనా అయ్యుండదూ? అంచేత పదివేలిచ్చి పట్టుకుపోతే అదే పదివేలన్నాను. మీరు నవ్వుతున్నారు కదూ. అతనూ నవ్వేడు. అదంతా ఎందుకుగానీ, ఇచ్చేధర చెప్పేమన్నాడు.

"ఇచ్చేధర కాకపోతే మరేమిటి! ఇప్పుడు మీరిది పట్టుకుపోతే నేను కొత్త బండి కొనుక్కోవాలి కదా. ఈమాటు మోపెడ్ కాకండా కనీసం రెండుగేర్లైనా ఉండేదిగా చూసి కొనుక్కుంటాను" అన్నాను.

"అలాఅయినా ఎనిమిదివేలకి మించి లేదు. కాని ఇప్పుడేదో కొత్త రూల్ వచ్చిందికదా. పన్నెండేళ్ళకి ఒకేసారి రోడ్డు టాక్స్ కట్టాలని. దానిమాటేమిటి మరి?" అన్నాను.

అతను కోపంగా మొహం పెట్టి "అసలు మా కంపెనీ మోపెడ్‌ని మీరు సరిగా మెయిన్‌టేన్ చెయ్యకుండా డొక్కులాగా తయారుచేసి, ఏకీలుకాకీలు విరక్కొట్టి రోడ్డుమీద ధమ ధమ ధమ ధమ అని చప్పుడుచేసి అందరిదృష్టి ఆకర్షిస్తూ మా కంపెనీకి అప్రదిష్ట తెస్తున్నారు. అందుకని మీ మీద పరువునష్టం దావా వేస్తాం" అని లేచి వెళ్ళిపోయాడు. ●●●



ప్రైవేటు ప్రాక్టీసు

డాక్టర్. టి. చంద్రశేఖరరావు

హఠాత్తుగా ఎవరో మంత్రిగారు చనిపోయారని ఆరోజు ఆస్పత్రిగ్కూడా సెలవిచ్చారు.

బద్ధకించడానికి అంతకంటే అవకాశం రాదని, గెడ్డం గీసుకోకుండా, స్నానం కూడా చెయ్యకుండా ఇంట్లోనే వుండిపోయారు డాక్టర్ చిన్నారావుగారు. దేశం అంతా ఆరోగ్యంగా వుంటేనో, మంత్రులు చచ్చిపోతేనోతప్ప డాక్టర్లు అలా హాయిగా బద్ధకించే అవకాశం రాదు. అవకాశం రాగానే సరిపోదు. బద్ధకించే అదృష్టం కూడా వుండాలి.

ఇంతలో కాలింగ్‌బెల్ మోగింది. డాక్టర్‌గారు వెళ్ళి తలుపు తీసేసరికి ఎదురుగా పాతికేళ్ళ స్త్రీ ఆదుర్దాగా నిలబడి వుంది. అందంగా, నాజూగ్గా, నాగరికంగా చదువు, సంస్కారం వున్న పెద్ద కుటుంబంనుండి వచ్చిన స్త్రీలాగ వుంది.

"గుడ్‌మార్నింగ్ అంకుల్" అంది. ఆవిడ 'అంకుల్' అనేసరికి తనని ముసలాడికింద జమ కట్టేసిందని ఆయనకి మొదట బాధవేసింది. లేకపోతే తదేకంగా ఆవిడ్ని చూస్తూ నిలబడి పోయినందుకు ఆయన శీలాన్ని శంకించి ఎందుకైనా మంచిదని ముందు జాగ్రత్తగా 'అంకుల్' అనేసిందేమోనని తననితానే సముదాయించుకున్నారు డాక్టర్ చిన్నారావుగారు.

"ఎవరు కావాలి ?" అనడిగారు.

"మీరే కావాలి. మీకోసమే వచ్చాను. లోపలికి రావచ్చా" అని అంత ఆదుర్దాలోనూ తియ్యగా అడిగింది.

"ప్లీజ్ కమిన్" అన్నాడు. ఆమె లోపలికి వచ్చింది.

"కూర్చోండి" అన్నారు. కూర్చుంది.

"అంకుల్ అని చనువు తీసుకుని పిల్చినందుకు క్షమించండి డాక్టర్. నా పేరు సుజాత. పెళ్ళయ్యింది. ఇద్దరు పిల్లలుకూడా. ఆస్తి బాగానే వుంది. మా ఆయనకి పెద్ద వుద్యోగంకూడా వుంది. మాకు ఏ లోటూలేదు" అని వివరించి కొంచెం ఆగి "అయినా మీ దగ్గరికి ఎందుకొచ్చానా అని ఆలోచిస్తున్నారా ?" అంది.

"అన్నీవున్నా ఆరోగ్యం బాగులేదని వచ్చారా ?" అనడిగారు డాక్టర్‌గారు.

"నా ఆరోగ్యం బాగానేవుంది. మానసికంగా ఆయన అదోరకంగా తయారయ్యారు. మీరు కళ్ళడాక్టరే నని నాకు తెలుసు. అయినా మీకు ఓపిక ఎక్కువని విని నమ్మి, మిమ్మల్నే వెదుక్కుంటూ వచ్చాను" అందామె.

"ఆకలీ, నిద్రా సరిగ్గా వున్నాయా ఆయనకి ?" అనడిగారు డాక్టర్ చిన్నారావుగారు.

"సుష్టుగా భోంచేస్తున్నారు. హాయిగా నిద్రపోతున్నారు. మతి స్థిమితం తప్పిందని అనుమానం లేదు. అలాగైతే ఏ



పిచ్చి డాక్టర్ దగ్గరకో తీసుకెళ్ళేదాన్ని. ఆయనకి మనసులో ఏదో అనుమానం పట్టుకుని వేధిస్తోందని నా అనుమానం" అని చెమర్చిన కళ్ళు తుడుచుకుంది.

"భార్యా రూపవతి శత్రుహి అన్నారు. ఆయనకి మీమీద అనుమానమా ?" అనడిగారు.

"మేం ప్రేమించుకుని పెళ్ళి చేసుకున్నాం. నామీద ఆయనకి ఎటువంటి అనుమానం లేదు" అంది.

"మరి వుద్యోగంలో ఏదైనా అసంతృప్తి, చికాకులు వున్నాయా ?" అనడిగారు.

"ఎన్నిసార్లు అడిగినా ఆ సంగతి చెప్పడంలేదు. మూడు నెలలనుండి ఆఫీసుకి సెలవు పెట్టేసారు. జీతం రాకపోయినా ఫర్వాలేదు. ఆయన కులాసాగా వుంటే అంతేచాలు. మీరే నా సంసారం నిలబెట్టాలి. ఆయన్ను మామూలు మనిషిని చెయ్యాలి" అని అమాంతంగా వచ్చి డాక్టర్‌గారి కాళ్ళు పట్టుకుంది. సినిమాలో లాగ ఆవిడ్ని భుజాలు పట్టుకుని పైకి లేవదీసి కన్నీళ్ళు తుడిచి తలమీద బుజ్జగించి అభయం ఇవ్వడానికి ఆయనకి ధైర్యం చాలలేదు. లోపలున్న వాళ్ళావిడ వచ్చి చూసిందంటే ఏమనుకుంటుందో ? నా సంసారం నిలబెట్టండంటూ ఈవిడ మీ కాళ్ళమీద ఎందుకు పడిందని వాళ్ళావిడ ఆయన్ని నిలదీస్తే ఏంచెప్పాలో తెలియక ఖంగారు పడ్డారు. గుండెల్లో భయం బయల్దేరి కాళ్ళు వణికాయి డాక్టర్‌గారికి. ఆయన కాళ్ళు వణక్కుండా ఆవిడ ఇంకా గట్టిగా పట్టుకుంది.

"నాకు చేతనైన సాయం నేనుచేస్తాను. దయచేసి మీరు లేవండి" అని ధైర్యం చేసి అనగల్గారు. ఆవిడ దయదల్చి కాళ్ళు వదిలేసి నెమ్మదిగా ఆవిడ అంతట ఆవిడే లేచింది.

లేవకపోతే ఆయనే తిరిగి ఆవిడకాళ్ళమీద పడి 'నా సంసారం నిలబెట్టమని' అడగాల్సి వచ్చేది. అటువంటి ప్రమాదం తప్పిందని సంతోషించారు.

ఆవిడ అలా దుఃఖిస్తూంటే ఆయన సంతోషించడం బావుండదని "నేను ప్రైవేటు ప్రాక్టీసు చెయ్యకూడదు. అయినా తెగించి నీ మీద జాలికొద్దీ మీ ఆయనకి వైద్యం చేస్తాను. ఇంతకీ మీ ఆయన ఏడీ ? ఎక్కడున్నాడు ?" అనడిగారు.

"నాతో పాటే తీసుకువద్దామనుకున్నాను. కానీ ఆయన బయటకురారు. తానొక బంగారం షాపులో గుమస్తాగా పనిచేస్తున్నట్టు వూహించుకుని అస్తమానం నగలో, బంగారం, ముత్యాలో, పగడాలో, పచ్చలో, వజ్రాలో, డబ్బు, బిల్లు కట్టేసే టైము, తలుపులు తాళాలు అంటూ ఏమిటేమిటో మాట్లాడుతారు. చూడ్డానికి కూడా గుమాస్తాలా తయారయ్యారు. మధ్య మధ్యలో గుమాస్తాలా వినయంగా చిర్నవ్వు నవ్వుతారు. జాక్సన్ అండ్ జాక్సన్ కంపెనీలో ఏరియా మేనేజర్‌గా వుండే ఆయన్ని ఇలా చూస్తే నా కడుపు తరుక్కుపోతోంది."

"ఆయన రాలేకపోతే నేనైనా మీ ఇంటికి వచ్చి ఆయన్ని చూడాలి" అన్నారు డాక్టర్ చిన్నారావుగారు.


"మీకెందుకా శ్రమ? నేనే ఏదో చెప్పి ఆయన్ని నమ్మించి తీసుకువస్తాను. ముందు మీరేం మాట్లాడకండి. ఆయన్ని కూర్చోనిచ్చి ఏంచేస్తారో గమనించండి. చివరికి ఆయనే మాట్లాడ్డం మొదలు పెడతారు. ప్రస్తుతానికి ఇది వుంచండి. ఆయనకి పూర్తిగా నయమయ్యాక మీ ఋణం వుంచుకోను" అని ఆమె ఐదొందలు తీసి బల్లమీద వుంచారు.

"ముందు ఆయన్ని తీసుకురండి. నేనేమైనా చెయ్యగలిగితే చూస్తాను. ఆ తర్వాత ఇద్దురుగాని" అని డబ్బు తీసుకోలేదు డాక్టర్‌గారు.

ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. డబ్బు తీసుకోకుండా వైద్యం చేస్తే జబ్బు తగ్గదని ఆమె అనుమానం కాబోలు. మళ్ళీ కాళ్ళమీద పడుతుందేమోనని భయపడ్డారు చిన్నారావుగారు.

"చూడమ్మా! నువ్వు రాగానే అంకుల్ అని ఆప్యాయంగా పిలిచావు. నీ దగ్గర డబ్బు తీసుకోను. అదీకాక ఈమధ్య డాక్టర్ల ప్రైవేటు ప్రాక్టీసు బాన్ చేశారు కూడా! డబ్బు తీసుకుంటే వుద్యోగం పోతుంది. అంకుల్ అని పిల్చాక నీదగ్గర డబ్బు తీసుకుంటే కళ్ళుకూడా పోతాయి. అసలే కళ్ళడాక్టర్ని. నువ్వు అస్తమానం కళ్ళనీళ్ళు పెట్టుకోకు. ధైర్యంగా వుండాలి. మీ ఆయన్ని మామూలు మనిషిని చేసి నీ సంసారం నిలబెడతాను. నువ్వెళ్ళి మీ ఆయన్ని తీసుకురా" అన్నారు డాక్టర్‌గారు వాత్సల్యంతో.

"థ్యాంక్యూ అంకుల్! చిన్న రిక్వెస్ట్ మా ఆయన ఆటోరిక్షాలు, టేక్సీలు ఎక్కరు. ఏదో అనుమానం. మూడ్నెల్లబట్టి ఆఫీసుకారు డ్రైవరు లేడు. మాకారు డ్రైవ్ చెయ్యడానికి నాకు భయం. ఆయనే





డ్రైవ్ చెయ్యడం మంచిదికాదు. అందు కని..." అని మొహమాట పడింది సరోజ.

"అందుకని నా కారు పట్టుకెళ్ళు. మా డ్రైవర్ వుంటాడు. బంగారం షాపుకే వెళ్దాం అని మీ ఆయనకి చెప్పు. తిన్నగా ఇక్కడికి తీసుకురా. మిగిలినది నేను చూసుకుంటా" అని డాక్టర్‌గారు డ్రైవర్ని పిలిచి కారులో సరోజని పంపించారు.

కారులో సరోజ తిన్నగా బంగారం షాపుకి వెళ్ళింది. డాక్టర్‌గారు, ఆయన కారు, ఆయనడ్రైవర్ బంగారం షాపు వాళ్ళకి బాగాతెలుసు.

"నేను డాక్టర్‌గారి మేనకోడల్ని. మా చెల్లి పెళ్ళికి నగలు కావాలి. ఈ మూడు రకాలు నెక్లెస్‌లు, దుద్దులు, గాజులు. మీ నమ్మకమైన గుమాస్తాతో పంపించండి. నచ్చినవి తీసుకుని బిల్లు గుమస్తాతో పంపిస్తాను" అంది సరోజ.

మూడు సెట్లు నగలు నమ్మకమైన గుమాస్తాతో డాక్టర్‌గారి కారులో సరోజతో పంపించారు బంగారం కొట్టువాళ్ళు.

కారు తిన్నగా డాక్టర్‌గారింటికి వచ్చింది.

"మీరు డాక్టర్‌గారి దగ్గర కూర్చోండి నేను అత్తయ్యకినగలు చూపించి, నచ్చిన వాటికి డబ్బులిచ్చి మీ బిల్లు సెటిల్ చేస్తాను రండి" అని సరోజ గుమాస్తాని తీసుకొచ్చి డాక్టర్‌గారి దగ్గర కూర్చొ పెట్టి, "నేను ఆంటీ దగ్గర వుంటాను. నేను చెప్పిన బంగారం కొట్టు గుమాస్తా ఆయనే అంకుల్! చూసుకోండి" అని లోపలికి వెళ్ళింది సరోజ. నగలతో లోపలికి వెళ్ళిన సరోజ నగలతో సహా మరో గుమ్మంలోంచి వీధిలోకి వెళ్ళిపోయింది చల్లగా. ఎదురుగా కూర్చున్న గుమాస్తా కేసి పరీక్షగా చూసారు డాక్టర్‌గారు. గుమస్తా వినయంగా చిర్నవ్వు నవ్వాడు. ఆవిడ చెప్పింది జ్ఞాపకం వచ్చిడాక్టర్ గారు చిర్నవ్వు నవ్వుకున్నారు.

"మీరు .... ?" అనడిగారు డాక్టర్ గారు.

"నేను బంగారం కొట్టు గుమాస్తాని" అన్నాడు వినయంగా గుమాస్తాగారు.

డాక్టర్‌గార్కి నవ్వొచ్చింది. జాక్‌సన్ అండ్ జాక్‌సన్ కంపెనీ ఏరియా మేనేజర్‌కి ఏంగతి పట్టింది అని జాలిపడ్డారు.

"అమ్మాయి చెప్పింది మీ సంగతి. సరోజ లోపల్నించి వచ్చేదాకా కాస్సేపు కూర్చోండి" అని డాక్టర్‌గారు పేపరు అడ్డుపెట్టుకుని అతడ్ని పరిశీలించ సాగారు.


అతను ఏదో లెఖ్ఖలు నోటితో చేసుకుని కాగితంపై వేసుకున్నాడు. జేబులో తాళాలు బయటికి తీసి చూసుకుని మళ్ళీ జేబులో వేసుకుని మళ్ళి నోటితో లెఖ్ఖలు వేసుకున్నాడు. డాక్టర్‌గారికేసి మళ్ళీ వినయంగా చిర్నవ్వు నవ్వాడు. వాచీకేసి చూసుకుని ఆలస్యం అయిపోతున్నట్టు ముఖం పెట్టాడు.

"టైం అయిపోయిందా ?" అనడిగారు డాక్టర్‌గారు.

"అదే కొట్టు తాళాలు నా దగ్గర వున్నాయి. తలుపులు వెయ్యాలంటే..." అని వినయంగా నసిగాడు.

"ఏంకొట్టు" అనడిగాడు చిన్నారావుగారు.

"భలేవారేసార్ ! తెలియనట్టు అడుగుతారు. బంగారం కొట్టు" అన్నాడు గుమాస్తా.



"నాకు తెలుసు! బంగారం కొట్టు, తాళాలు, తలుపులు, పగడాలు, ముత్యాలు, పచ్చలు, వజ్రాలు అన్నీ అమ్మాయి చెప్పింది. తొందరపడకు. కొంచెంసేపు ఓపిక పడితే ఇంటికి పంపించేస్తాను" అన్నారు డాక్టరుగారు ఆప్యాయంగా నవ్వుతూ.

"ఇంటికేమిటి సార్ ? షాపుకి వెళ్ళాలి. అదే ఆ నగల బిల్లు ఆ డబ్బు ఇచ్చేస్తే" అని వినయంగా నసిగి చిర్నవ్వు నవ్వాడు.

"నగలు, బిల్లు అంటూ బెంగ పెట్టుకోకు. నగలేమిటి ? బిల్లేమిటి ? అలాంటి ఆలోచనలు పెట్టుకోకు" అన్నారు డాక్టర్ గారు.

"పెద్దవారు ! నాతో పరాచికాలాడకండి. ఆ నగలు, డబ్బు ఇచ్చి నన్ను పంపించండి. కొట్టు కట్టేసే టైమైంది" అని ప్రాధేయపడ్డాడు గుమాస్తా.

"అనవసరంగా అల్లరి చెయ్యకు. నగలు, డబ్బు నీ వూహ! అసలు బంగారం కొట్టెక్కడుంది ? నగలేమిటి ? బిల్లేమిటి? డబ్బేమిటి ? నీవసలు ఏం మాట్లాడుతున్నావో తెలుసా ?" అని డాక్టర్‌గారు కోప్పడ్డారు.

"బాబూ ! నా సంసారం నిలబెట్టండి. నేను గుమాస్తాగాడ్ని. ఆ నగలు, డబ్బు తీసుకెళ్ళకపోతే మా షావుకారు జైలుకి పంపించేస్తాడు. నన్ను రక్షించండి బాబూ !" అని డాక్టర్‌గారి కాళ్ళమీద పడ్డాడు.

"సరోజా ! సరోజా !" అని పిల్చారు డాక్టరుగారూ. ఎన్నిసార్లు పిల్చినా సరోజ రాలేదు. డాక్టర్‌గారిభార్య మాత్రం వచ్చి "సరోజ ఎవరండీ మనింట్లో ? నాపేరు గాయత్రి. పెళ్ళాంపేరే మర్చిపోయారా?" అంది.

"సరోజ లోపలికి రాలేదా ? అనడిగారు డాక్టర్‌గారు ఏం జరిగిందో తెలియక అయోమయంగా.

"సరోజ ఎవరండి మధ్యలో" అని రాగాలు పెట్టసాగింది గాయత్రిగారు.

"బాబూ! నానగలు డబ్బు" అంటూ కాళ్ళమీద పడ్డాడు గుమాస్తా.

సరోజ ఏమయ్యిందో డాక్టర్‌గార్కి తెలియలేదు. మరి డాక్టర్‌గారి ప్రైవేట్ ప్రాక్టీస్ ఏమయ్యిందో నాకు తెలియలేదు.

నవత-యువత

"మగడి అవసరాలు చూడడం, పని చెయ్యడం బానిసత్వమా? క్రొత్తగా వింటున్నాను!"

"మగడి అవసరాలు చూడడం, పని చెయ్యడం" వాళికికీ ఓహద్దుంటుంది, వదినా! ఆయన *స్నానం చేస్తూంటే బాత్ రూం గుమ్మంలో తువాలు పట్టుకుని నిల్చోవడం, ఆయన రాజావారిలా కట్ డ్రాయర్ వదిలి వెడితే నువ్వు* ఉతికేయడం. ఏం ఆ ఒక్కగుడ్డా ఆయన ఉతికేసుకోకూడదా? ఆయన అంత చిన్న పనికూడా తను చేసుకోకుండా మీచేత చేయించడం-భార్యను ఏ మాత్రం గౌరవించేదీ తెలిసిపోతుంది! భార్య ధర్మం పేరుతో ఎంత నీచమైపోయింది స్త్రీ బ్రతుకు అనిపిస్తూంది నాకు!"

పోలంపల్లి శాంతాదేవి

జరిగినకథ:-

శాలినికి ఓ పల్లెటూర్లో టీచర్ గా ఉద్యోగం వస్తుంది. ఆమె స్నేహితురాలు సుధకు కూడా అదే ఊళ్ళో విలేజ్ వర్కర్‌గా ఉద్యోగం వస్తుంది. శాలిని తన స్కూల్లో పనిచేసే శర్మను ప్రేమిస్తుంది. అతని గురించి తప్పుగా చెప్పినా తర్వాత సరియైన సమాచారాన్నందిస్తుంది సుధ.

అంగన్‌వాడీలో పనిచేసే సుజాతపరిచయమవుతుంది. ఆమెను ఊళ్ళోని ఇద్దరు కిరాతకులు మాన భంగం చేస్తారు. వారిపై కేసుపెట్టి, సుజాత ఎదురు తిరగడంతో ఓడిపోతుంది సుధ. సుధ వాళ్ళ ఆఫీసుకు ఓ కొత్త బి.డి.వో. వస్తాడు. అతనో దురదృష్టవంతుడు. భార్య అంగవైకల్యం ఉన్నా, ఆమెకు సేవలు చేస్తూ ఉంటుంటాడు. శర్మ, శాలినిల పెళ్ళికి పెద్దవాళ్ళు ముందర కొంత బెట్టు చేసినా చివరికి వప్పుకొంటారు.

—ఇక చదవండి

"పెళ్ళయిన కొత్త కాబట్టి అన్నయ్య నిన్ను మురిపెంగా చూస్తున్నాడు. పాతబడ్డాక నువ్వూ మాలాంటి ఆడదానివి కాకపోతే అప్పుడు చూడనా?"

"ఒక మగవాడికి భార్యగా ఉండాలంటే, అంత నీచంగా బ్రతకాల్సివస్తే, ఆ భార్యస్థానం నాకొద్దు అంటాను, కాని, భార్యపేరుతో బానిసగామాత్రం బతకను. మీరు చూసేది ఆదే!" శాలిని చాలా సీరియస్‌గా చెప్పింది. "అవునూ! ఇందాక వదినగారితో అన్నట్లు నా బట్టలు నీచేత ఉతికిస్తాననే సీబట్టలుతకమని చెప్పలేదా?" అనడిగింది భర్తను.

"నా బట్టలు నువ్వు ఉతుకొచ్చు. నీ బట్టలు నేను ఉతుకొచ్చు. కానీ, నీ బట్టలు నేనుతికితే చూసేవాళ్ళకు బాగుండదు! వాళ్ళ దృష్టిలో నేనో విచిత్రంగా మారడం నాకిష్టంలేదు!"

"నువ్వు కట్నం వద్దన్నప్పుడూ, పూలదండల పెళ్ళి చేసుకొన్నప్పుడూ విచిత్రంగానే చెప్పుకొన్నారుకదా జనం.

"ఆ విచిత్రంలో ప్రశంస ఉంది. ఈ విచిత్రంలో హేళన ఉంటుంది! ప్రజల హేళన భరించ వలసిన అవసరం రానంత వరకూ మార్పును ఆహ్వానిస్తాను."

"ఒకనాడు బాల్యవివాహాలు వ్యతిరేకించినప్పుడూ, విధవా పునర్వివాహాలు ప్రోత్సహించినప్పుడూ హేళనలే ఎదుర్కొన్నారు ఆనాటి సంఘ సంస్కర్తలు!"

"పెళ్ళాం చీరలుతకడం సంఘ సంస్కరణ కాదుగా?"

"స్త్రీ పురుష సమానత్వాన్ని ఆహ్వానించడం ఒక విధంగా సంఘసంస్కరణే కృష్ణా!"

"మగవాడు భార్య చీరలుతకడం, వంటచేసి వడ్డించడం, పక్క వేయడం – ఇవిచేస్తే స్త్రీ పురుష సమానత్వం వచ్చేసినట్టా శాలినీ ?" శర్మ ముఖంలో నవ్వు మాయమై సీరియస్‌నెస్ చోటుచేసుకుంది.

"స్త్రీ వ్యక్తిత్వం జోలికి పోకుండా ఉండడం, ఆమె అభిప్రాయాలను గౌరవించడం, ఆమె ఆదర్శాలను మన్నించడం – స్త్రీ పురుష సమానత్వాన్ని గౌరవించడమని నా ఉద్దేశ్యం ! అంతేగాని, నీకు వంట చేసిపెడితే, నువ్వూ నాకు వంటచేసిపెట్టాలి, నీ బట్టలు నేనుతికితే నా బట్టలు నువ్వెందుకు ఉతకవని, నేను పిల్లల్ని కంటాను; నువ్వెందుకు కనవని అంటే స్త్రీ పురుష సమానత్వం అది కాదని నేనంటాను ! ఇలా అడుగడుగునా ఫైట్ చేస్తూ ఉన్నామంటే మనం ఆలూ మగలంగా ఉండము. చండీ మొండీ అంటారే ; అలా అవుతాం !"

"నేను పిల్లల్ని కంటే నువ్వెందుకు కనవని మరీ అంత తెలివి తక్కువగా ఫైట్ చేయనులే ! కాని, నాకు న్యాయమనిపించినదానికోసం తప్పకుండా ఫైట్ చేస్తాను !"

"ఆలూ మగలమధ్య ఉండాల్సింది ఫైట్స్ కాదు ! అవగాహన, అనురాగం."

"దాంపత్య జీవితంలో అడుగు పెట్టానుకదా ? ఇక నేర్చుకుంటాను పాఠాలు ! నా చీరలు ఉతికిస్తానని భయపడొద్దుగాని, ఇలాఇవ్వు, ఉతుకుతాను ! నువ్వు గలబరించు ;" శాలిని కొంగు నడుముకుచుట్టి, కుచ్చిళ్ళు పైకి దోపి బట్టలదగ్గరికి వెళ్ళింది.

"ఆలు మగలు ఆడుతు పాడుతు పనిచేస్తుంటే మధ్యలో నేనేమిటి పానకంలో పుడకలా !" అనుకొని వెళ్ళిపోయింది బృందావని.

"ఇన్ని బట్టలు ఒక్కడివే ఉతుక్కునేబదులు నన్ను పిలువకూడదూ సాయం చేయమని !"

"పెళ్ళికాకముందు ఉతుక్కునేవాడినికదా ?"

"అప్పుడూ, ఇప్పుడూ ఒక్కటేనా ;" అల్లరిగా చూస్తూ చేతుల్లో ఉన్న నురగ తీసి శర్మ ముఖంమ్మీద విదిలించింది.

"ఏయ్ ! ఇదేంపని ;"

"తెలియదా ? పెళ్ళాం సరసమాడుతోందని !"

"నన్నూ ఆడమంటావా ?"

"ఆడమనేగా !"

శర్మ హుషారుగా ఈలవేశాడు. బట్టలుతకడానికి పెట్టుకొన్న నీళ్ళబకెట్ అమాంతం లేపి శాలినిమీద గుమ్మరించేశాడు.

"ఇటువంటి సరసమూ నేనాడమంది ? ఈ అవతారంతో ఇంట్లోకి ఎలా వెళ్ళాలి ?" శాలిని ఏడుపుముఖం పెట్టేసింది.

"వెళ్ళకు !"

"బాత్‌రూంలోనే సమాధి అయిపోనా ; తడిచీరతో ఇంట్లోకి ఎలా వెళ్ళను?"

"వెడితేఏం ;"

"అయ్యవారి నిర్వాకం అందరికీ తెలియాలి కాబోలు ! కాస్త చీర తెచ్చిపెడుదూ !"

"బృందని తెమ్మని చెబుతాను !"

"నువ్వు తెస్తేఏం ;"

"మనం ఒంటరి కాపురం చేసినప్పుడు నువ్వు ఏంచెబితే అది చేస్తాను ! ఇప్పుడుమాత్రం నా పరువు కాపాడు. పెళ్ళాం చీరలు మోశానని చెవులు కొరుక్కుంటారు."

"ఎవరు ;"

"ఇది చూసినవాళ్ళు, విన్నవాళ్ళు !"


"ప్రపంచాన్ని చూసి నువ్వు బాగా భయపడే మనిషిలా ఉన్నావు. మనం చేసే పని తప్పని మన మనసు ఒప్పుకోనంతవరకు మనం ఎవర్నిచూసి భయపడాల్సింది లేదంటాను."

"అయితే నువ్వే ఇంట్లోకివెళ్ళి చీర మార్చుకోరాదూ ? మగడు సరసమాడితే తప్పులేదుకదా ?"

"వెడతాను ! నాకేంసిగ్గులేదులే ;" బింకంగా అంది శాలిని. తడిచీరతోటే బట్టలుతికి శర్మకు ఆరవేయడానికి ఇచ్చేసి, మరో రెండు చెంబులు మీద గుమ్మరించేసుకొని, చీరనుండి కారుతున్న నీళ్ళను పిండేసి ఇంట్లోకి వెళ్ళింది శాలిని.

అత్తగారు చూసి అంది – "చీరమీదే స్నానం చేశావా ? అదేంపని ; పిలిస్తే పొడిచీర నేనో, బృందో తెచ్చిపెట్టేవాళ్ళం కదా ;"

"నిన్నా మొన్నా చెయ్యని స్నానం ఈరోజు చేస్తుందా ; అదికాదులేఅమ్మా !



అన్నయ్య నీళ్ళు పోసేసినట్టున్నాడు" అంది బృంద.

"అన్నయ్య నీళ్ళెందుకు పోస్తాడు ?"

"అలు మగల బాత్‌రూం సరసాలే అమ్మా !"

"చిన్నకొంప ! మామగారు, ఆడపడుచు మొగుడు వాళ్ళు చూస్తే ఏమనుకొంటారు ? ఛీ! ఛీ! ఎంత కొత్తదంపతులైనా నలుగురున్న కొంప అని గుర్తుపెట్టుకుంటే బాగుంటుంది !" అత్తగారు చిరాకుగా అంది.

మొదటిసారిగా అత్తవారింట్లో శాలిని మనసు చివుక్కుమన్నట్టుగా అయింది.

* * * *

బజారునుండి పువ్వులు తెచ్చాడు బృంద భర్త కిషన్‌రావు. బృంద తీరికగా కూర్చొని పొందిగ్గా దండకట్టి సగంమాల త్రుంచి జడలో తురిమి అద్దంలో చూచుకొంటూంటే వెనుకనుండి వచ్చి భార్య భుజాలమీద చెయ్యేసి పూలలో ముక్కుదూర్చి గట్టిగా పీల్చి "మల్లెపూలు వాసన చూడాలంటే ఆడవాళ్ళ జడల్లో ఉండగానే చూడాలి!" అన్నాడు.

వంటగదిలోంచి పద్మావతి, పెరట్లోంచి శాలినీ ఒక్కసారే వసారాలోకి అడుగువేసి, అలు మగల సరాగాలు చూడకూడదన్నట్టుగా వేసిన అడుగు వెనక్కి తీసుకొని వెళ్ళిపోయారు.

ఇలాంటి దృశ్యాలు అప్పుడప్పుడూ కనబడుతూనే ఉంటాయి అందరికళ్ళలో. పగలే తలుపులు మూసి గదిలో చేరుతారు.

నలుగురున్న చిన్న ఇళ్ళలో ఎలా మసలుకోవాలో కోడలికి నీతులు చెప్పే అత్త నలుగురున్న ఇళ్ళలో ఎలా మసలుకోవాలో కూతురికి చెప్పదు.

కూతురికి ఓ నీతి ! కోడలికోనీతి !

అసలు ఈ ప్రపంచంలో మనిషి మనిషికోనీతి !

శాలిని విరక్తిగా నవ్వుకొంది.

* * * *

"అమ్మగారు పిలుస్తున్నారు" అంటూ వచ్చింది సుగుణ పనిపిల్ల.

సుధ వెళ్ళేసరికి సుగుణ ఏడుస్తూంది.

"ఎందుకేడుస్తున్నారు ? ఏం జరిగింది ?" ఆతృతగా అడిగింది సుధ.

ఆఫీసు వ్యాన్ అక్కడే ఉన్నాడు. "అయ్యగారు మహబూబ్ నగర్ మీటింగ్‌కి వెళ్ళివస్తూంటే కొత్తకోట దగ్గర లారీతో గుద్దుకుంది ! డ్రైవరుకి దెబ్బలు తగిలాయి. అయ్యగారికి కొద్దిగా దెబ్బలు తగిలాయి. డ్రైవరు, అయ్యగారు ఆస్పత్రిలో ఉన్నారు.

"కొంచెం దెబ్బలంటున్నాడుగాని, అసలాయన సజీవంగా ఉన్నారోలేదో ! నేను ఏమైనా అవుతానని అలా చెబుతున్నాడో ఏమో సుధా ! నాకు భయంగా ఉంది ! నీ ద్వారా తప్ప నాకు నిజం తెలిసే అవకాశంలేదు. నేను వెళ్ళలేను ! అవిటి బ్రతుకైందినాది. నువ్వు త్వరగా వెళ్ళిచూసి నాకు ఉన్నదున్నట్టుగా చెప్పాలి. నువ్వు ఏం

చెప్పినా నేను నమ్ముతాను !" దుఃఖస్వరంతో ప్రాధేయ పూర్వకంగా అంది సుగుణ.

"మీరు ఏదేదో ఊహించుకొని మనసు పాడు చేసుకోకండి. వెళ్ళి చూసి వస్తాను !"

సుధ వ్యాన్‌తో వెళ్ళి చంద్రకాంత్‌ని చూసింది. సుగుణ బెంబేలు పడ్డట్టుగా ఆతనికి ప్రమాదకరమైన దెబ్బలేం తగల్లేదు. ముఖానికి ఒకటి రెండు గాయాలయ్యాయి. ప్లాస్టర్ వేయబడింది గాయాలమీద. చేతికి మాత్రం పెద్దదెబ్బే తగిలింది. బాండేజీ వేశారు.

డ్రైవరుకు దెబ్బలు బాగానే తగిలాయి కాని, ప్రమాదం ఏంలేదని చెప్పాడు డాక్టరు."

సుధ తిరిగి వచ్చి చెప్పింది "మీరు అనవసరంగా కంగారు పడ్డారు. నిజంగా కూడా పెద్ద దెబ్బలేం తగల్లేదు. రెండుగంటల రెస్ట్ తరువాత డిశ్చార్జి చేస్తానన్నాడు డాక్టరు."

"అంతేనా ? ఎంతభయపడ్డానో ఏక్సిడెంట్ అంటే నాకొక పీడకల. నన్ను జీవచ్ఛృతురాలిని చేసింది ఏక్సిడెంటేకదా ?" గుడ్లనిండా నీళ్ళతో అంది సుగుణ.

* * * *

చంద్రకాంత్ మోచేతికి బాండేజీ ఉండడంవల్ల ఆఫీసుకి సెలవు పెట్టకతప్పింది కాదు. డాక్టరుకూడ ఓ వారం రోజులపాటు రెస్ట్ తీసుకొమ్మని చెప్పాడు.

ఏక్సిడెంట్ సంగతి తెలుపడంవల్ల తలిదండ్రులు వచ్చారు. తండ్రి ఒక రోజు మాత్రం ఉండి వెళ్ళిపోతే, తల్లి ఇక్కడే ఉండిపోయింది. ఇంట్లో వంటా వార్పుకు మరో దిక్కు లేకపోవడం వల్ల.



కట్నం కానుకలు లేకుండా ఉత్త చేతులతో తమింట అడుగు పెట్టినకోడలంటే ఆమెకు మొదటినుండి ఇష్టంలేదు ; ఏక్సిడెంట్ అయ్యి కొడుకు మెడకు ఓ గుదిబండలా తయారైందని అవిడ అక్కసు ! ఆ అక్కసుని సమయం వచ్చినప్పుడల్లా వెళ్ళ గ్రక్కుతూనేఉంటుంది. సుగుణనుశూలాలవంటి మాటలతో గాయపరుస్తూనే ఉంటుంది.

దానికే భయపడతాడు చంద్రకాంత్. సుగుణని బాధపెడతారనే తల్లినిగాని అక్కలని గాని ఎవరినీ పిలువడు. సుగుణకు జడవేయడం దగ్గరినుండి వంటచేయటం వరకు ఆడపనీ, మగపనీ అన్నీ ఆతడే చూచుకోవడం నేర్చుకొన్నాడు. ఇప్పుడు చేతికి బాండేజీపడి తన పనులకే ఒకరి చేతిలో చిక్కినట్టుగా అయ్యాడు. సుగుణతేం చేస్తాడు ! అక్కడికీ ఒక్కచేత్తో చేయగల పనులు చేయడానికే ప్రయత్నిస్తున్నాడు. సుగుణే వారిస్తూంది– "ఈ నాలుగు రోజులు మీరు రెస్ట్ తీసుకోండి !" అని.

ఒకరోజు సుధ వచ్చేసరికి మంచంమీద కూర్చుని, తలదువ్వుకొని జడవేసు కొంటూంది సుగుణ.

"చిక్కులన్నీ అలాగే పెట్టేసి జడ అల్లుతున్నారేమిటి ?" అడిగింది సుధ.

"నేను బాగా ఉన్నరోజుల్లోనే చిక్కులు తీసే ఓపిక ఉండేదికాదు. అలాగే అల్లేసుకొనేదాన్ని. అమ్మ కోప్పడి, జడవిప్పి మళ్ళీ వేసేది. అప్పుడింకా ఎక్కువ తలకట్టుండేది."

"ఇప్పటికికూడా మీ అందం మీ జడలోనే ఉందనిపిస్తుంది. దువ్వెనిటివ్వండి నేను చిక్కులు తీస్తాను." సుగుణ చేతిలోంచి దువ్వెన తీసుకొంది సుధ.

"ఏ అందం వుండి ఎవడికేం ఒరగబెట్టింది ? వాడి నిండు నూరేళ్ళజీవితం నాశనమైపోయింది. చచ్చిన ఛావు కాదు, బ్రతికిన బ్రతుకుకాదు !" అంది సుగుణ అత్త సుబ్బలక్ష్మి.

"స్త్రీకి స్త్రీయే శత్రువంటారు ! ఎందుకో తెలుసా ?" అప్పటికే కళ్ళనీళ్ళు తిరుగగా పేలవమైన స్వరంతో అంది సుగుణ.

"బాధ పడకండి ; అలాంటి మాటలు అసలు మీరు పట్టించుకోకూడదు."

"ఎలా పట్టించుకోకుండా ఉండను ? చెవులు శుభ్రంగా వింటున్నాయి, మనసు శుభ్రంగా ఆలోచిస్తూంది. ఎలా పట్టనట్టుగా ఉండగలను ?" నిస్సహాయంగా చూసింది.

సుధ కల్పించుకొని "కందకులేనీ దురద కత్తిపీటకెందుకు మామ్మగారూ ? మీరూ స్త్రీయేకదా? సుగుణ స్థానంలో మీరో మీ కూతురో ఉంటే మీరిలాగే అనగలరా?" అడిగింది.

"నేనేఉంటే ఇంత విషంమింగి చచ్చేదాన్ని. అంతేకాని చచ్చిన పాములా వాడి మెడకు పడి ఏడ్చేదాన్నికాదు" ఆవిడ కటువుగా, అంత నిర్దాక్షిణ్యంగా అంటుంటే సుధకు మనస్సు చివుక్కుమన్నట్టుగా అయింది. నోట మాట రానట్టుగా నిశ్చేష్టురాలై పోయింది.

"బతుకు బండలైన ఒక కొడుకు తల్లిగా మాట్లాడుతున్నాను. పిల్లల జీవితాలు పిల్లాపాపలతో, సుఖసంతోషాలతో కళకళలాడుతుండాలని ఏ తల్లైనా కోరుకొంటుంది. ముప్పైఏళ్ళకే నా కొడుకు నాతిగల బ్రహ్మచారి అయ్యాడు. నాకిది గుండెకోతకాదా?"

"ఇది మీ కోడలు కావాలని చేసిన అన్యాయం కాదుకదా ? ఏక్సిడెంట్ అయి ఇలా జరిగిన దానికి ఆమేంచేయగలదో చెప్పండి ?"

"చేయాలనుకొంటే చేస్తుందమ్మా !"


"ఏంచేయగలదు ? తను ఆత్మహత్య చేసుకోవడమా ?"

"నా కడుపున ఇద్దరాడపిల్లలున్నారు. అంతమాట నేనెలా అంటాను ? తనుండి కూడా పెద్దమనసుతో వాడికి మళ్ళీ పెళ్ళి చేయొచ్చు. వాడికి పిల్లాపాప పుడితే వాళ్ళని చూసి తన పిల్లలుగా ఆనందించవచ్చు. నిజంగా భర్త సుఖం కోరుకొనే ఇల్లాలైతే ఆ పని ఎప్పుడో చేయాల్సింది. తను సంసారానికి పనికిరానని తెలుసు కొన్న మరుక్షణం ఈ నిర్ణయం తీసుకోవాల్సింది."

"చేతులారా సవతిని తెచ్చిపెట్టుకొంటేతప్ప ఆమె ఉత్తమ ఇల్లాలు కాదంటారా మామ్మగారూ ? జీవితాంతం ఆమె సంసారానికి పనికిరాదని చెప్పలేదుగా డాక్టర్లు ? కొంతకాలం తాము చెప్పినట్టుగా జాగ్రత్తగా ఉండి మందులు వాడితే తరువాత దాంపత్య జీవితం గడపొచ్చునని చెప్పారుగా డాక్టర్లు. ఆమె జీవిస్తున్నదే ఆ కొంత కాలం తరువాత గడపబోయే జీవితంమీద ఆశతోటే ! అదే నాశనం చేసుకొంటే ఆమె జీవించేందుకు ఆధారమేమిటి ?"

"ఆఁ డాక్టర్లకేం ? ఎప్పుడూ ఆశగానే చెబుతారు ; మరుక్షణంలో చచ్చేవాళ్ళకైనా "ఫర్వాలేదు ! మీరు కోలుకుంటారు" అని చెప్పి ఆశతో ఊపిరి పోయడానికే ప్రయత్నిస్తారు. అది వాళ్ళ ధర్మం కాబట్టి ! కాని నా కోడలు మామూలుగా తిరుగు తుందంటే నేను నమ్మను. ఏడాదినుండి నడుం విరిగి పడిఉన్న ఆమెలో ఏమార్పూ నాకు కనిపించలేదు."

చంద్రకాంత్ ఎప్పుడు వచ్చి నిలబడ్డాడో గుమ్మంలో – "అమ్మా !" అని పిలిచాడు కఠినంగా "సామాను సర్దుకో ! బస్సు ఎక్కించి వస్తాను."



"ఇప్పుడు నేనేం తప్పు మాట్లాడానని నన్ను ఇంట్లోంచి గెంటినంత పని చేస్తావురా ?"

"నవ్వుతూ, తుళ్ళుతూ గడపాల్సిన సమయంలో ఏక్సిడెంట్ అయ్యి, అవి టిదై పోయి జీవన్మృతురాలిలా రోజులు నెడుతూందే! అమెనింకా చచ్చినపామును చంపుతున్నట్లుగా మాట్లాడుతున్నావే! నా సుఖం సంగతి నాకు తెలియదా ? ఆమె పిల్లను తెచ్చినాకు పెళ్ళి చేయాలా ? ఏం సలహా ఇస్తున్నావమ్మా ? అమె స్థానంలో నీ కూతురే ఉంటే ఇంత నిర్దాక్షిణ్యంగా మాట్లాడేదానివా ?"

"నేను మాట్లాడుతున్నది బ్రతుకు అన్యాయమైన ఒక కొడుకు తల్లిగా ! నేనేం తప్పు మాట్లాడలేదురా !" సుబ్బలక్ష్మి ఉక్రోషంగా అంది.

"ఈ ప్రపంచంలో చాలామంది తల్లులు తన పిల్లలకి తల్లిగా మాత్రమే గిరి గీసుకొని ఆలోచించడం వల్ల. అత్తింటికిరాతకానికి చాలా మంది స్త్రీలు అహుతై పోతున్నారమ్మా ! నీ కొడుకు గురించి ఆలోచించినదాన్నివి మరో అమ్మ కన్న బిడ్డను గురించి ఎందుకాలోచించలేవు ?"

"అంత సువిశాలమైన మనసు నాకు దేవుడు ఇవ్వలేదు ! ఏం చేయను ?"

మరునాడుదయం తల్లిని బస్సెక్కించి వచ్చిన చంద్రకాంత్ రిలీఫ్‌గా ఊపిరి పీల్చుకొన్నాడుగాని, తల్లి సుగుణ మనసులో అగ్నికణం విసిరిందని, అది రాజు కొంటూందని గుర్తించ లేకపోయాడు.

* * * *

ఉదయమేవచ్చి చంద్రకాంత్ చేతికున్న గాయాన్ని డెట్టాల్‌తో తుడిచి బాండేజీ కట్టి వెళ్ళే కాంపౌండరు ఆ రోజు రాలేదు.

కాంపౌండరు కోసం చూసి చూసి ఇక రాడని నిశ్చయించుకొన్నాక చంద్రకాంతే గాయాన్ని తుడిచి, బాండేజీ కట్టుకోడానికి ప్రయత్నించసాగాడు. డెట్టాల్‌తో శుభ్ర పరుచుకో గలిగాడుకాని, బాండేజీ కట్టుకోవడం ఒక్కచేత్తో సాధ్యంకాక అవస్థ పడసాగాడు.

రోజూ ఒకటి రెండు సార్లు పరామర్శించి వెళ్ళే సుధ "ఏంచేస్తున్నా" రంటూ వచ్చింది.

చంద్రకాంత్ అవస్థ చూసి, "నేను కట్టనా ?" అంది.

"కట్టండి కాని, అయిదు రూపాయల ఫీజు తీసుకొనేట్టు అయితేనే కట్టాలి !" చిరునవ్వుతో అన్నాడు చంద్రకాంత్.

"ఫీజా! ? ఫీజెందుకు ?"

"రోజూ వచ్చి కట్టు కట్టడానికి కాంపౌండర్‌కి అయిదు రూపాయలిస్తున్నాగా?"

"వృత్తిని డబ్బుగా మార్చుకొనేవాడు అతడు ! నాకిది వృత్తి కాదుగా ఫీజు తీసుకోడానికి ? కేవలం ఒక సేవాభావన ! అంత పెద్ద పేరుకూడా అవసరంలేదు ! కేవలం, మనిషికి మనిషి సాయం !" అంటూనే, చంద్రకాంత్ అనుమతికోసం చూడ

కుండా. బాండేజీ కట్టడానికి ఉపక్రమించింది.

కాంపౌండరు చకచకా అయిదు నిమిషాల్లో కట్టేసే బాండేజి, సుధకు అలవాటు లేకపోవడంవల్ల పావుగంట పట్టింది.

ఈలోగా చంద్రకాంత్ పొయిమీద పెట్టిన పప్పు మాడిపోవడం మొదలు పెట్టింది.

"ఏదో మాడువాసన వస్తూంది. పొయ్యిమీద ఏంపెట్టారు ?"

"పప్పు పెట్టాను ! చంద్రకాంత్ లేచి పరుగెత్తాడు. గరిటతో కెలికిచూస్తే పప్పు బాగా అడుగంటి పోయినట్టుగా అనిపించింది. పైపైన పప్పుతీసి మరోగిన్నె లోకివేసి తిరిగి పొయిమీద పెట్టాడు. గుమ్మం దగ్గర నిలబడి తొంగిచూస్తున్న సుధతో "కాస్త ఈ ఉల్లిపాయలూ, టమాటా తరిగిపెట్టండి. ఒక్కచేత్తో తరగడం కుదరడంలేదు !" అన్నాడు.


సుధ లోపలికివచ్చి కూరలబుట్టదగ్గర కూర్చుంది. తరిగి వేయడానికి గిన్నె, చాకు ఇచ్చాడు.

సుగుణగారికి వంట బాగా చేతనయ్యేదా ?"

"అబ్బే ! ఆవిడకు పెళ్ళయ్యేప్పటికి టీ చెయ్యడంకూడా సరిగా వచ్చేదికాదు. పెళ్ళయ్యాకే అన్నం, పప్పు వండడానికి నేర్చుకుంది, ఆవిడకు మొదటినుండి కొంచెం నాజూకు ఎక్కువే ! పనేమీ చేతకాదని, వట్టి సుకుమారిని కట్టుకొన్నానన్ని నా ఫ్రెండ్స్ వేళాకోళం చేసేవాళ్ళు ! ఒకసారి నాకు పౌరుషంవచ్చి బెట్టుకాశాను ఒక పెళ్ళిలో."

"ఏంబెట్టుకాశారు ?" ఉత్సాహంగా అడిగింది సుధ.

"ఏభై మందికి తనొక్కతి వడ్డన చేస్తుందని, గెలిస్తే వందరూపాయలు వాళ్ళి



వ్వాలని, ఓడితే వందరూపాయలు నేనిస్తానని పందెం."

"గెలిచారా పందెం ?"

"వినండి ! నన్ను పందెం గెలిపించాలన్న ఉత్సాహంతో సుగుణ చకచకా వడ్డన చేసేసింది. అందరూ చివర పెరుగువరకూ వచ్చేశారు. గెలుపు నాదేనని సంబర పడిపోతున్నాను. సుగుణకూడా తన అలసటను వెనక్కునెట్టి ఉత్సాహంగా వడ్డిస్తూంది. కాని ఊహించని ఘోరం జరిగిపోయింది."

"ఏం ఘోరం ?"

"అందరూ కంగారుగా లేచి నిలబడ్డారు. విస్తళ్ళక్రిందా అక్కడా వెదకడం మొదలుపెట్టారు. "ఎక్కడమ్మా జెర్రి ? కనిపించదే ?" ఎక్కడ చూశావు ?" అనడిగాడు ఒకతడు.

"జెర్రా ? జెర్రిని నేను చూడలేదే ?" బెదిరిపోయి అంది సుగుణ. వాళ్ళందరూ విస్తళ్ళమీదినుండి లేవడంచూసి.

"ఇందాకా అన్నావుకదా జెర్రి జెర్రి అని !"

"జెర్రి అనలేదండీ. జెరి అన్నం పెట్టుకోండి" అన్నాను.

"అన్నం పెట్టుకోండి అని వినిపించలేదు. జెరి ... జెర్రి అనిమాత్రం అనడం వినిపించింది." అన్నాడు అతడు.

"ఓడిపోయాడు మీ ఆయన !" అందరూ తేల్చేశారు.

"సుగుణ పుట్టి పెరిగింది అంతా ఆంధ్రాలోనే ! పెళ్ళయ్యాక నాతో హైదరాబాద్ వచ్చి మూడునెలలే అయింది. హైదరాబాద్ తెలుగు ఆమె అప్పుడప్పుడే నేర్చుకొంటూంది. జర అన్నం పెట్టుకోండి అనబోయి 'జెరి' అని, నా పందెం పోగొట్టేసింది.

సుధ ఒకటే నవ్వడం మొదలు పెట్టింది.

అసలు విషయంకంటే అతను చెబుతున్న తీరు నవ్వుపుట్టించేట్టుగా మాట్లాడుతున్నాడు.

గోడ ఆసరాతో అతి ప్రయాసతో నడిచివచ్చి సుగుణ గుమ్మం వారగా నిలబడింది.

"ఆయన ముఖంలో అంత ఉత్సాహం, సంతోషం చూసి ఎన్నిరోజులైంది ?"

"గడ్డం మాసి ఎంత అసహ్యంగా అయిందో ! రోజూ షేవింగ్ చేసుకోకపోతే నాకసలు బాగుండదు !"

"కాని గడ్డం మీ ముఖానికి ఓ నిండుదనం ఇస్తూంది ! అసలు గొప్పవాళ్ళ గొప్పదనం వాళ్ళ గడ్డాల్లోనే ఉంటుంది. రవీంద్రనాథ్ టాగోర్, అరవింద ..."

"నిజమా ? నేనలా గడ్డం, జులపాలు పెంచేస్తే నాముఖం చాలా తమాషాగా ఉంటుందికదూ ?" చంద్రకాంత్ నవ్వసాగాడు.

సుగుణ నిశ్శబ్దంగా వెనుదిరిగి వెళ్ళిపోయింది.

* * * *

ఆరోజు సుధ చాలాసార్లు తనలోతను నవ్వుకోడం, ఒకసారి పైకే తెరలు తెరలుగా నవ్వేయడం చూసి ఆశ్చర్యపోయింది శాలిని.

"ఏమిటే ? పిచ్చిదానిలా ఆ నవ్వు ?"

"మా బి.డి.వో.గారికి జులపాలు, గడ్డం తగిలించి ఎలాఉన్నారో చూస్తున్నాను"

"గడ్డం, జులపాలేమిటి ?"

"ఉదయం తమ సంభాషణ గురించి చెప్పి, మళ్ళీ నవ్వసాగింది.

"సుధా ! నువ్వేమీ అనుకోనంటే నేనోమాట చెప్పనా ?" కొంచెం సీరియస్‌గా అంది శాలిని.

"ఏమిటి ?"


"నువ్వు బి.డి.వో. ఇంటికి వెళ్ళడం తగ్గించు !"

"ఎందుకు ?"

"చుట్టుపక్కలవాళ్ళు దీన్ని గురించి అప్పుడే చెడ్డగా అనుకుంటున్నారు ! భార్యతో పొందులేనివాడుకదా ఈ అమ్మాయిని ఊరికే వదులుతున్నాడా అని !"

"మైగాడ్ ! ఇంత అసహ్యంగా ఆలోచిస్తున్నారా మన ఇరుగు పొరుగులు ! ఆవిడ సుస్త్రీమనిషికదా ? ఆఫీసరు భార్యకదాని పలకరించడానికి వెడుతుంటాను. ఆవిడకు స్నేహితులు లేరుకదా ! నన్నుచూస్తే ఆవిడప్రాణం లేచివచ్చినట్టుగా చూస్తుంది. ఆయనకి చేతికి బాండేజీ ఉందికదా ! చేసుకోలేక ఏం ఇబ్బంది పడుతున్నారో అని వెడుతున్నాను. మన పొరుగున ఒకరు కష్టంలోఉంటే మనం పట్టనట్టుగా ఎలాఉంటాం? అదీ ఒకే ఆఫీసులో పని చేస్తున్నవాళ్ళం. పైగా ఆయన మా బాస్ !"

"నీ ఉద్దేశ్యం మంచిదేనమ్మా కాని, ప్రపంచం అలా అనుకోనప్పుడు దాని



కోసం మనం మన నడతను మార్చుకోవద్దూ ?"

"మనకోసం ఒకరకంగా, ప్రపంచం కోసం ఒకరకంగా ఎలా నడుస్తాం, శాలినీ ? నాకలా నటించడం చాతకాదు ! నా మనోభావాలకు అనుగుణంగా నడుచుకోవడమే నా కిష్టం. ప్రపంచం కోసం మరోవిధంగా ఉండలేను ! తప్పు ప్రపంచం ఆలోచనలో ఉంది. నా నడతలోకాదు, దిద్దుకోవాల్సింది ప్రపంచంకాని, నేనుకాదు."

"ప్రపంచం నీ గురించి చెడ్డగా అనుకొంటే నువ్వు బాధపడవా ?

"నా మనసులో, ప్రవర్తనలో చెడ్డతనం లేనంతవరకు నేను బాధపడను!" ఖచ్చితంగా, నిబ్బరంగా చెప్పేసింది సుధ.

"తన మనోభావాలకు అనుగుణంగా ప్రవర్తించడానికి చాలా ఆత్మ స్థయిర్యం కావాలి! ధైర్యం కావాలి. అవి సుధలో పుష్కలంగా ఉన్నాయి !" అనుకొంది శాలిని.

* * * *

నరహరి కూతురి ట్రాన్సఫర్ కోసం ఎన్ని రోజులనుండో చేస్తున్న ప్రయత్నం ఫలించి శాలినికి సిటీకి ట్రాన్సఫర్ అయ్యింది. శాలిని కాన్సిల్ చేసుకొందామనుకుందిగాని శర్మ పి. హెచ్ డి. కోసం శెలవు పెట్టి తనూ వచ్చేస్తానని చెప్పాడు.

మొదటమొదట మడిపేరుతోకోడల్ని వంటదగ్గరికి రానివ్వని రామలక్ష్మి మెల్లమెల్లగా రాత్రిపూట వంట దగ్గరికి పంపుతూంది !చేసినన్నాళ్ళు చేశాను ! ఇంకా ఎంత కాలం చేయను ? కోడలొచ్చాక కూడా రెస్ట్ దొరకకపోతే ఎలా ?" అని. ఆశపడుచు కొలు డబ్బుకోసం ఊరెళ్ళడంతో శాలిని చేతివంట తినడానికి పెద్దగా అభ్యంతరం లేకపోయింది ఎవరికీ.

ఆదివారంరోజు పూర్తిగా సెలవు అత్తగారికి.

శ్రావణమాసం ఇంకో వారంరోజులుండగా రామలక్ష్మి అంది. "మంగళ గౌరీ నోములు, వరలక్ష్మి వ్రతం ఇద్దరు కలిసి చేసుకోవచ్చని బృందనీ రమ్మని రాయించాను !"

"నోములా ? నాకలాంటి నమ్మకాలులేవు, అత్తయ్యా ! అసలు, ఇన్ని రోజులైంది ! నేను దేవుడికి పూజచేయగా చూశారా ?" అంది శాలిని.

"దీపారాధన ఏదో నేనే మడికట్టుకు చేస్తూంటాకదా.? నువ్వు వేరుగా పూజ చేస్తావో చేయవో నాకెలా తెలుసు ? అయితే నాస్తికురాలివన్నమాట !" ఏదో చేదు నిజం తెలిసినట్టుగా ఆమె ముఖం పెట్టింది.

"ఏపూజలు భజనలు చేస్తే దేవుడున్నాడని మీరు విస్వశించినట్టో, ఆ పూజలు భజనలు నేను చెయ్యను కాబట్టి నాస్తికురాలినే !"

"పూజలు భజనలు చెయ్యకపోతే పీడా పో యె! ఇప్పుడు ఇరవైనాలుగు గంటలు చెక్క భజన ఎవరు చేస్తారని ? కనీసం దేవుడున్నాడనైనా ఒప్పుకోవా?"

"ఒప్పుకోను ! నాకు నమ్మకంలేదు కాబట్టి !"

"అదే ఎందుకని అడుగుతున్నాను."

"నాకు ఎందుకు నమ్మకంలేదో నేను తరువాత చెబుతాను. మీకెందుకు నమ్మకం ఉందో ముందు చెప్పండి."

"ఉన్నాడు కాబట్టి !"

"మీరు చూశారా ?"

"అదేంప్రశ్న ? అంత సులభంగా కనిపించేవాడైతే దేవుడెలా అవుతాడు ?"

"మీరు చూడలేదుకదా ? ఎలా నమ్ముతున్నారు ?"

"లేకపోతే ఇంత ప్రపంచం, ఈ జీవసృష్టి ..."

"దీనివెనుక ఏముందో మీరు సైన్స్ చదువుకోలేదుకదా అత్తయ్యా ? అందుకని, మీరు దేవుడని పేరు పెట్టుకొన్నారు. కాని, మాకు సైన్స్ తెలుసుకదా ? ఈ ప్రపంచం ఎలా పుట్టింది ? ఈ భూమ్మీద జీవరాసి ఎలా ఏర్పడింది ? మాకు సైన్స్, చరిత్ర చెబుతాయి. కాబట్టి ఈ సృష్టి రహస్యంమీద ఊహాగానాలు చేసి, దీనికంతా మూలం ఒకటుండాలికదా అనుకొని, ఆ ఒకడికి దేవుడని పేరుపెట్టి, అతడికి అపారమైన మహిమలు ఆపాదించి, మూఢభక్తితో మురిసిపోయే స్థితిలోలేడు అధునికమానవుడు. ఈ దేవుడు పుట్టినరోజుల్లో తెలియని చాలా విషయాలు అధునిక మానవుడు తెలుసుకొన్నాడు. కేవలం, మీ దేవుడుమాత్రమే పుట్టిస్తాడనుకొన్న పిల్లల్ని ఇవాళ సైంటిస్టులు టెస్ట్ట్యూబుల్లో పుట్టిస్తున్నారు !"

"పుట్టుకని కనిపెట్టారేమోగాని చావుని కనిపెట్టలేదుగా ?"

"ఇది కనిపెట్టగలిగినవాళ్ళు, అది కనిపెట్టలేరా ? ఆరోజు చేరువలోనే ఉందని మా విశ్వాసం !"

* * * *

నోములకు రమ్మని పుట్టింటివాళ్ళు రాయడంవల్ల, అక్కడ నోచుకోడానికి పెద్దదిక్కు లేకపోవడంవల్ల మంగళగౌరీ నోములు నోచుకోడానికి వచ్చింది బృందావని. వదినగారు నోచుకోనన్నదని తెలిసి ఆమె ఆశ్చర్యానికి అంతూ పంతూ లేకుండాపోయింది.

"అసలు, నూతన వధువులు మంగళగౌరీ నోములు ఎందుకు నోస్తారో తెలుసా ?"

"అంత బాగా తెలియదు. చెప్పండి !" అంది శాలిని.

"తన పతికి ఆయురారోగ్యం ప్రసాదించి తన పసుపు కుంకుమలు చల్లగా చూడమని. నువ్వు మా అన్నయ్యని ప్రేమించడంలేదా ? అతడు అయురారోగ్యాలతో జీవించాలని, నీ పసుపు కుంకుమ చెరగకుండా ఉండాలని నువ్వు కోరుకోవడంలేదా ?"

"ఎందుకు కోరుకోను ? కోరుకుంటాను !"

"మరి గౌరీనోము ఎందుకు నోచుకోవు ?"

"మంగళగౌరీనోము నోచినవాళ్ళంతా గ్యారంటీగా ముత్తయిదువులుగా చావడంలేదుగనుక. పాతికేళ్ళకే భర్తచచ్చి గుండుకొట్టించుకొన్న మీ మీనక్క, ఇంకా

చాలామంది వితంతువులతో విధిగా, తప్పనిసరిగా వాళ్ళమ్మలూ, అత్తలూ ఈమంగ
గౌరీ నోములు నోయించి ఉంటారు. వాళ్ళ పసుపు కుంకుమలు రాలిపోతుండే ఏ
చేసింది మీ మంగళగౌరి."

జవాబు చెప్పలేనట్టుగా చూసింది బృంద.

"విదేశాలలోని వనితలెవ్వరూ ఈ మంగళగౌరి నోములు నోయరు. వాళ్ళంత ముండమోయడం లేదా. విదేశాలవరకూ ఎందుకూ ? మన దేశంలోనే చాలా రాష్ట్రాలలో ఈ మంగళ గౌరీనొములేదు. వాళ్ళు మగళ్ళని తెల్లారేసరికి కోల్పోవడంలేదా."

ఈ విషయం ఆడవాళ్ళమధ్యే ఆగలేదు. ఇంటి యజమాని దాకా వెళ్ళింది శర్మ తండ్రి అన్నాడు. "విదేశీవనితలు నోములు, వ్రతాలు చేయకపోతే వాళ మగళ్ళు చావడం లేదుకదా అంటే, నోములు వ్రతాలు ఆ జాతి సంస్కృతికాదు ప్రతి దేశానికీ ఒక జాతి, జాతికొక సంస్కృతీ ఉంది. ఈ నోములు, వ్రతాలు పూజలు, జపాలు మనజాతి సంస్కృతిలో ఓ భాగం. సంస్కృతి రక్షించుకోవడం అనేది ప్రతి భారతీయుడి కర్తవ్యంకదా !"

"మన గ్రామప్రాంతాల్లో, గిరిజన ప్రాంతాల్లో మైసమ్మలూ, పోలేరమ్మలూ అనే గ్రామదేవతలను కొలిచి జంతువులను బలి ఇవ్వడం, ఒక్కోచోట నరబలి ఇవ్వ డంకూడా జరుగుతూంది. ఇది మన సంస్కృతిలో భాగమేకదా ? సంస్కృతి కాపాడ బడాలంటే ఆ జంతుబలిని, నరబలిని ఆలాగే కొనసాగనివ్వాలికదా ? నాగరిక సమా జం ఎందుకు గర్హిస్తుంది ఆ చర్యని ?"

"నేను గర్హించను !"

"అంటే సమర్థిస్తారా, మామగారూ ?" శాలిని ఆశ్చర్యానికి అంతులేదు.

"అవును ! ఎవరి ఆలోచనలు వాళ్ళవి. ఎవరి నమ్మకాలు వాళ్ళవి. వాళ్ళ జోలికి వెళ్ళకూడదంటాను !"

వాళ్ళు చేసే జీవహింస ? నిల్చున్నపాటున గొర్రెలనీ, కోళ్ళనీ నరికి వేస్తారే సభ్యమానవుడు ఎపడూ హర్షించని చర్యకదా ?"

"మాంస భక్షకులకోసం కటికవాడు రోజుకు ఎన్ని గొర్రెలను, ఎన్ని కోళ్ళను వాడి దుకాణం ముందు నరకడం లేదు ? జీవహింస అని, కిరాతక చర్యఅని వాడి చర్యను ఖండించడం లేదేం!" సూటిగా అడిగాడు.

"కటికవాడు చేసేపనీ, క్షుద్ర దేవతలకుఇచ్చే జంతుబలీ ఒక్కటే ఎలా అవు తాయండీ ?"


(ఇంకావుంది)

Edited & Published by V. Leelavathy Raghaviah, at 1-8-519/11. Chikkadpally, Hyd-20. & Printed by P. Ramakrishna at Raghava Pustaa, 1-8-4/1/1, Chikkadpally, Hyderabad-20

JYOTI Feb-88 Regd NO=H/SD73



Black.


మారెళ్ళ వింధ్యారాణి
PRADEEP.
మనసుతో ఆడితే..!

అది 'కో ఎడ్యుకేషన్' కాలేజీ కావటంతో .... కాలేజీ వదలగానే అమ్మాయిలు, అబ్బాయిలు, గుంపులు, గుంపులుగా కబుర్లు చెప్పుకుంటూ, ఒకరి మీద ఒకరు 'కామెంట్స్' విసురుకుంటూ, సరదాగా బయటికొస్తున్నారు.

అందరూ గోల గోలగా వచ్చి బస్టాప్‌లో నుంచున్నారు. అప్పటివరకూ కాలేజీలో చాలా సరదాగా గడిపినా ... కాలేజి వదిలాక మాత్రం, ఎప్పుడెప్పుడు ఇంటికి చేరుదామా అని వుంటుంది. అబ్బాయిల కంటే అమ్మాయిలకే అలాంటి ఆత్రుత ఎక్కువగా వుంటుంది. కాని ... త్వరగా ఇళ్ళకు చేరాలంటే ... సిటీ బస్‌లు వచ్చి చావవు. వచ్చినా పత్తిని బోరెంలో కూరినట్లు కూరుతారు. అది తలుచుకుంటేనే ఎక్కడలేని నీరసం వస్తుంది.

అప్పటివరకూ కాలేజీలో చేసిన 'ఎంజాయ్' అంతా బస్టాప్‌కి రాగానే, చప్పన ఆవిరై పోతుంది! అలాంటప్పుడు చక్కగా కార్లల్లో, ఆటోరిక్షాల్లో వెళ్ళేవాళ్ళమీద 'జలసీ'కూడా వేస్తుంది. ఆ క్షణాన మన ఈ ప్రభుత్వంమీద, మన ఈ సమాజం మీదా, మన ఆర్థిక వ్యవస్థమీదకూడా గొంతుదాకా కోపం వస్తుంది. సోషలిజం, కమ్యూనిజం ... మరో యిజం ... ఆ యిజం, ఈ యిజం ... ఏమిటేమిటో తలపుకొస్తాయి. అందరికీ ఒకేవిధమైన సంపదను, అదృష్టాన్ని ఇవ్వని ... ఆ పైవాడిమీద కూడా కోపం వస్తుంది. వ్యక్తీకరించలేని ఉక్రోషం తన్నుకొచ్చి ... ధనవంతుల్ని, ధనవంతులుగా మార్చిన ఆ భగవంతుడ్నికూడా 'షూట్' చేయాలనిపిస్తుంది.

ప్రస్తుతం అలాంటి ఉక్రోషంతోనే సతమతమవుతూ బస్టాప్‌లో నిల్చునివుంది కర్పూరిక. అప్పటివరకూ తనకు తోడుగా నిల్చున్న ఫ్రెండ్స్ కల్యాణి, సుమలతలు కూడా తమ ఇళ్ళవైపు వెళ్ళే సిటీబస్‌లు రావటంతో వెళ్ళిపోవల్సి వచ్చింది. వాళ్ళ బాచ్‌లో కర్పూరిక ఒక్కతే మిగిలిపోయింది. కర్పూరికకు కావాల్సిన సిటీబస్ ఎంతకీ రావటంలేదు! నిల్చుని, నిల్చుని కాళ్ళు లాగుతున్నాయి. ఒకవైపు ఆకలికూడా బాగా దంచివేస్తుంటే నీరసంతో విసుగు వచ్చేస్తున్నది. అప్పుడెవరైనా పలకరించినా సవ్యంగా జవాబు చెప్పేస్థితిలో లేదు కర్పూరిక. మాటి మాటికీ వాచీ చూసుకుంటూ, అసీజీగా నిల్చొంది.

బస్టాప్‌లో ఫ్రెండ్స్ ఎవరూ లేకుండా కర్పూరిక ఒక్కతె ఎల్చొని వుండటంతో - ఇద్దరు జులాయి వెధవలు ఏవో బూతు జోకులు వేసుకుంటూ, ఓరకంట కర్పూరికను చూసి వెకిలి నవ్వులు నవ్వుకుంటున్నారు. కర్పూరికకు ముళ్ళమీద నుంచున్నట్లుగా వుంది. ఎంత త్వరగా ఇంటికి చేరదామా అనివుంది. కాని ... సిటీ బస్సు రావటంలేదు. పోనీ, ఏదైనా ఆటోగాని, రిక్షాగాని ఎక్కుదామన్నా డబ్బుల్లేవు. ప్రస్తుతం తనదగ్గర లేకపోయినా, పోనీ ఇంటికి చేరిన తర్వాతనైనా ఇద్దామంటే ... ఇంటిదగ్గర తల్లివద్దకూడా ఉన్నాయో లేవోనన్న అనుమానం? ఎందుచేతనంటే....? అవి నెలాఖరు రోజులు. ఒక్క తండ్రి సంపాదనతోనే ఆ ఇల్లంతా గడవాలి. మధ్య తరగతి జీవితాలలో డబ్బు ప్రధాన సమస్యగా వుంటుంది. అన్నిటికీ మించి 'ప్రిస్టేజి' ఒకటి తగలబడి చస్తుందికదా! ధనికులతో సరిసమానంగా తూగలేరు! క్రిందివర్గంతో కలవలేరు.

పిక్చర్‌కెళితే క్లాసు టిక్కెట్ తీసుకోవాలని మనస్సు ఆరాటపడ్తుంది. కాని... ఆర్థిక ఇబ్బందులు గుర్తొచ్చి మనస్సు నలుగుతుంది. తక్కువ ఖరీదు టిక్కెట్ తీసుకొని పిక్చర్ చూడొచ్చు. అయితే .... తెల్సిన వాళ్ళెవరైనా చూస్తారేమో, ఎదురుగా కాకపోయినా, చాటుగానైనా 'గేలి' చేస్తారేమోనన్న భయంతో ఆ టిక్కెట్ తీసుకోటానికి మనస్సు ఒప్పుకోదు. అసలొక పిక్చరొక్కటేకాదు! ప్రతి విషయంలోనూ ఈ పాడు 'ప్రిస్టేజి' ఒకటి మనల్ని చంపుకు తింటుంది. త్రిశంకు స్వర్గంలాంటి జీవితాలను గడపవల్సి వస్తుంది. ఒక్కోసారి జీవితం అంటేనే విరక్తి పుడుతుంది. కాని .... అదొక్కక్షణం మాత్రమే! మరలా వెంటనే భవిష్యత్తు గురించి ఏవేవో ఊహలు, కలలు రీలులా తిరుగుతుంటాయి. ప్రతి మనిషికి ఈ రకమైన వైరాగ్యం, బలహీనత సహజమే! బ్రతుకుగూర్చిన ఈ 'ఆశ' లేకపోతే మనిషసలు బ్రతకలేడుకూడా. ఈ సృష్టి ఇంతందంగా ఉండేదికూడా కాదప్పుడు.

ఆశా, నిరాశలమధ్య ఊగిసలాటేకదా "జీవితమంటే". ఇది అందరికీతెల్సు! కాకపోతే అప్పుడప్పుడు కాస్త మర్చిపోయినట్లు, తెలియనట్లు నటిస్తామంతే. అది రిలీఫ్ కోసమే. ఒక్కోసారి ఆత్మవంచనలోకూడా అందముంటుందేమో అనిపిస్తుంది.

ఇవన్నీ కర్పూరిక మనస్సులోకూడా మెదులుతున్నాయి. పర్సులోని చిల్లరను

తడిమి చూసుకొని గాఢంగా నిట్టూర్చింది.

"హలో .... కర్పూరికగారూ! మీ బస్ వచ్చినట్లులేదే....? మీ ఫ్రెండ్స్‌కూడా వెళ్ళినట్లున్నారుగా ...? ఇక్కడ ఒక్కరే నుంచోవటం అంత మంచిదికాదు. ప్లీజ్! రండి డ్రాప్‌చేస్తాను" స్కూటర్‌ని అక్కడాపి మర్యాదగా అడిగాడు లలిత్.

అసహ్యంతో కర్పూరిక తన ముఖాన్ని ప్రక్కకు తిప్పుకుంది. "మిమ్మల్నే నండీ" ... నవ్వుతూ అన్నాడు లలిత్.

"అవసరంలేదు" విసురుగా అంది.

"సరే! మీఇష్టం .... ! "గమ్మత్తుగా భుజాలెగరేసి అక్కడినుండి కాస్త అవతలకెళ్ళి టీస్టాల్ దగ్గర నుంచుని కర్పూరికను అప్పుడప్పుడు గమనిస్తున్నాడు.

ఇంతలో కర్పూరికకు కావాల్సిన సిటీబస్సు వస్తూ కన్పించింది. కర్పూరిక చాలా సంతోషపడింది. కాని ... ఆ ఆనందం ఎంతోసేపు నిలవలేదు. నిండు గర్భిణీలా సాగిపోయిందాబస్సు ఎక్కడా ఆగకుండా. కర్పూరికకు కోపం, ఉక్రోషం అన్నీ పోటీపడి కన్నీళ్ళుకూడా బుగ్గల మీదకు జారాయి. ఆ దృశ్యం లలిత్ కళ్ళపడింది. అతని మనస్సు జాలిపడింది. ముఖ్యంగా తన నిస్సహాయత అతనికి తెల్సిపోయిందే అన్నబాధ కర్పూరికను ఎక్కువగా బాధించింది.

చాటుగా కళ్ళు తుడుచుకుని, అప్పుడే అటు పోతున్న రిక్షాని పిలిచి, అడ్రసు చెప్పి విసురుగా ఎక్కి కూచుంది. టీ స్టాల్‌నుండి దారిలోకి వచ్చి — "జాగ్రత్తరా రాములూ! అమ్మగార్కి అసలే కోపమెక్కువ" చిలిపిగా అన్నాడు లలిత్.

కర్పూరిక అతనివైపు కాల్చివేసే చూపులతో చూసింది.

"శాంతం మేడమ్! శాంతం!" లలిత్ గొంతు తమాషాగా ధ్వనించింది.

"ఛీ -! సిగ్గులేకపోతేసరి ... !" ఛీత్కారంచేస్తు -"త్వరగా పదబ్బాయ్!" రిక్షావాడిని తొందర చేసింది.

అతను బిత్తరపోతూ, స్పీడుగా తొక్కాడు. "ఆ రాస్కెల్ నీకు తెల్సా ?" కోపంగా అడిగింది. "ఏ రాస్కెలమ్మా?" అయోమయంగా చూస్తు అడిగాడు రిక్షావాల.

"స్కూటర్‌మీద రాలా ఒకడు? వాడి గురించే నేనడుగుతున్నది..." విసుగ్గా అంది కర్పూరిక.

"ఎవరమ్మా .... లల్లిబాబా...?" ఆశ్చర్యంగా అన్నాడు. "లల్లిబాబెవరు?"

"అదేతల్లీ! ఇందాక మిమ్మల్ని జాగ్రత్తగా తీసుకెళ్ళమని చెప్పిన ఆ బాబు గురించే కదా మీరంటున్నది?" శాంతంగా, ఓపిగ్గా అడిగాడు రిక్షావాలా.

"బాబా ...గీబా ...? వాడొక రౌడీ వెధవ...." అసహ్యంగా అంది. "ఛా! తప్పమ్మా! ఆ బాబు దేముడు తల్లీ ....! నా బోటి దౌర్భాగ్యులెందరికో బతుకుతెరువు చూపించిన పుణ్యాత్ముడమ్మా .... ! ఇయ్యాళ నేను, నా భార్య, బిడ్డలు కాసిని గంజి నీళ్ళయినా త్రాగుతున్నామంటే ఆ బాబు చలవే!" ఎంతో కృతజ్ఞతగా పలికాడు.

"ఏం చేశాడేంటీ?" దీర్ఘం తీసింది కర్పూరిక.

"ఈ రిక్షా కొనుక్కోటానికి డబ్బిచ్చింది ఆ బాబేనమ్మా ...! అంత ఉన్నోళ్ళయినా కాస్త కూడా గర్వంలేదు. మా ఆడదైతే రోజూ దణ్ణం పెట్టుకుంటుంది బాబుకు." అతని గొంతులో కృతజ్ఞత నిండుగా తొణికిసలాడింది. "చాల్లే ఆపు ...! నిన్నలా చెప్పమన్నాడా?" వ్యంగ్యం చేసింది కర్పూరిక.

"అ...మ్మా... !" కోపంగా చూశాడు రిక్షావాలా.

"మీ లాంటి వాళ్ళందర్ని 'మంచి' జేసుకొని ... ఏదో ఒక సత్కార్యం చేస్తాడేమోలే?" ఈసడింపుగా అంది కర్పూరిక.

"ఆ బాబుగురించి మీరు చాలా పొరబాటుగా మాట్లాడుతున్నారమ్మా" బాధగా అన్నాడు.

"నువ్వొక స్టుపిడ్‌వి!" మనస్సులో గొణుక్కొని "సర్లే నీ పొగడ్తలు! నన్ను త్వరగా ఇల్లుచేర్చు" కసురుకుంది. కర్పూరికను ఒక వెర్రిబాగుల్దాన్ని చూసినట్లు చూసి, స్పీడుగా తొక్కాడతను.

"ఇక్కడే ... ఇక్కడే ఆపు" రిక్షా దిగుతూ అంది. "ఎంత?" పర్సు చూసుకుంటూ అడిగింది.

"వద్దమ్మా !" అంటూ గిర్రున వెనుదిరిగాడు. "ఏయ్ ... ఇదేమిటి ?"

"బాబుగారు మిమ్మల్ని జాగ్రత్తగా తీసుకెళ్ళమన్నారమ్మా! అంటే .... మీరు ఆ బాబుగారికి బాగా తెల్సినవారేకదా ? మీ దగ్గర డబ్బులు తీసుకునేదా ?" ఇబ్బందిగా అన్నాడు రిక్షావాలా.

"ఇదిగో! ఇలాంటి వేషాలు నాదగ్గర కాదు, ముందు ఎంత ఇవ్వమంటావో చెప్పు" కోపంగా అంది కర్పూరిక.

"బాబోయ్!" మనస్సులో భయపడి, "మీ యిష్టమొచ్చినంత ఇవ్వండి తల్లీ!" మెల్లగా అన్నాడు. ఎంతోకూడా సరిగ్గా లెఖ్ఖ చూసుకోకుండానే, ఆ పర్సులోని చిల్లరంతా అతని చేతిలో గుమ్మరించి చర చర ఇంట్లోకి నడిచింది.

* * * *

"కర్పూరికా! నిన్న ఎప్పుడు వెళ్ళావే ఇంటికి? త్వరగా బస్సొచ్చిందా?" కర్పూరిక స్నేహితురాలు కళ్యాణి కాలేజీలో అడిగింది. "బస్సు రావలేదు. రిక్షాలో వెళ్ళాను" కోపంగా చెప్పింది.

"ఆ లలిత్ ఏమైనా గొడవ చేశాడా కర్పూరీ? నీ ప్రక్కన మేముకూడా తోడు లేమాయె" అనుమానంగా అడిగింది సుమలత.

"ఛా! అతనికెప్పుడూ అదేపనా ఏమిటి? పాపం! అనవసరంగా అతని గురించి మీరిద్దరూ అపోహ పడుతున్నారే! నిజం చెప్పండి? అతనెప్పుడైనా మనపట్ల అసభ్యంగా ప్రవర్తించాడా?" కల్యాణి మందలింపుగా పల్కింది.

"నువ్వొక వెర్రి పీనుగవి" సుమలత కసురుకుంది.

"సుమలత .. అనేది అబద్ధంకాదు కళ్యాణి! మీరిద్దరూ వెళ్ళాక నన్ను తన స్కూటర్ మీద ఎక్కించుకొని డ్రాప్ చేయాలని, మాట్లాడాలని, ఎంతగా 'ట్రై' చేశాడను కున్నావ్. కాని అతని ఆటలు నా దగ్గర సాగవు కదా! చివరికి ఆ రిక్షా ఎక్కితే నీలాగే వాడూ అతని గురించి పొగడ్తలు మొదలెట్టాడు. ఇక చూస్కో నా 'తిక్క' తారామండలాన్ని దాటిందనుకో!"

"ఏమోనే! అతని గురించి మీరిద్దరు తప్ప. మరెవ్వరూ చెడుగా చెప్పుకోరు! ఆ రిక్షావాలా చెప్పింది కరెక్టే కావొచ్చు! అలా చాలా మంది చెప్పగా నేనూ విన్నాను! మొట్ట మొదటే నీ కెందుకో అతని మీద బాడ్ ఇంప్రెషన్ కల్గింది. దాన్నిక నువ్వు మార్చుకోలేక పోతున్నావు! నిజానికతను మన పట్ల చెడుగా ప్రవర్తించిందేమీ లేదు. నిన్ను చూడగానే అతని మొహం ఎందుకో విప్పారుతుంది! నిన్ను స్నేహ పూర్వకంగా పలకరించాలనే చూస్తాడతను. కాని, నువ్వు అతన్ని అపార్థం చేసుకొని చీదరించుకుంటున్నావని నా అనుమానం ...!" కర్పూరిక వైపు పరిశీలనగా చూస్తూ, గంభీరంగా అంది కళ్యాణి.

"అయిందా తమరి భగవద్గీత?" హేళన చేసింది సుమలత. "సు....మా!" కోపంగా అరిచింది కళ్యాణి. "ఎందుకలా అరిచావ్? నీ దృష్టిలో అతడు మంచివాడైతే కావొచ్చు మా దృష్టిలో చెడ్డవాడే! అమ్మాయిల్ని ఆకర్షించుకోవటానికి ఏవో దాన, ధర్మాలు చేస్తాడు లాగుంది. నీ కంత మంచి అభిప్రాయముంటే పూజించు! కాదన్నదెవరు ...?"

"అవసరమైతే పూజిస్తానేమోలే! నీకూ, నాకూ వాదన అనవసరం!" సీరియస్‌గా అంది కళ్యాణి. సుమలత కోపంగా చూసింది.

"అతనెవరి కోసమో మనలో మనం వాదులాడు కోవటం బాగోలేదే కళ్యాణీ" నచ్చ జెపుతున్నట్లుగా అంది కర్పూరిక.

"వాదన కాదే...! వాస్తవమే మాట్లాడుతున్నా, నిన్నస్తమానం అతను పలకరించాలని చూస్తున్నాడనే కదా నీ అసహ్యమంతా? అదేమీ నేరం కాదే! నీకు అతన్ని చూసిన మొదటి క్షణానే ఎలా అసహ్యం వేసిందో, అలాగే ఆతనికి నిన్ను చూసిన మొదటి క్షణానే ఏదో మంచి భావం కల్గి వుంటుంది. ఒక్కోసారి ఒక్కో మనిషిని చూడగానే ఒక్కో రకమైన 'అనుభూతి' కలుగుతుంటుంది. 'అలా ఎందుకు జరుగుతుంది? ఏమిటీ .... అంటే?' సరియైన కారణం చెప్పలేం! ఏ కారణం లేకుండానే ఒక్కొక్కరిని ప్రేమించటం ... ఒక్కొక్కరిని ద్వేషించటం జరుగుతుంది. అది వారి వారి అదృష్టంగా భావించుకో వాల్సిందే! అయితే ఒక విషయం మీరు అడగవచ్చు?! ఒక వ్యక్తి మంచి, చెడ్డల్ని అంచనా వేసేటప్పుడు అతని వ్యక్తిత్వం. నడవడిక. రూపలావణ్యాలు, పరిగణనలోకి తీసుకో బడవా ... ఆవేశంగా మాట్లాడిందే కళ్యాణి.

"స్టేజీఎక్కి చెప్పు. మంచి ప్రజంటేషన్ కొట్టేయవచ్చు!" సుమలత

స్వరంలో కాస్త హేళన ధ్వనించింది. కళ్యాణి సుమలతవైపు కోపంగా చూసింది.

"ఇక ఆ టాపిక్ వొదిలేయండే" విసుగ్గా అంది కర్పూరిక.

ఇంతలో బెల్‌కూడా మ్రోగటంతో క్లాసుల్లోకి దారితీశారు ముగ్గురూ.

* * * *

"అబ్బ! ఆ నడకలో అచ్చం నదీమ తల్లి హొయలేరా!" ఆ కామెంట్ చేసింది లలిత్ మిత్రబృందంలోనివాడే. కర్పూరిక ఒక్కక్షణం ఆగి, సీరియస్‌గా చూసింది.

"ఏయ్... ఒళ్ళు దగ్గర పెట్టుకోండి" లలిత్ స్నేహితుడ్ని మందలించాడు. అతని మందలింపుని మరోలా అర్థం చేసుకున్న కర్పూరిక అసహ్యంగా చూసింది. లలిత్ హృదయం చివుక్కుమంది.

అతను తన మిత్రబృందాన్ని మరింతగా రెచ్చగొడ్తున్నాడని భావించింది కర్పూరిక. అతను మందలిస్తున్నాడని కళ్యాణి చెప్పినా కర్పూరిక, సుమలతలు ఒప్పుకోలేదు! అది లలిత్ దురదృష్టమనే చెప్పాలి. లలిత్‌వైపు అనునయంగా చూసి స్నేహితురాళ్ళ ననుసరించింది కళ్యాణి. సుమలత ఎందుకో వెనక్కి తిరిగి చూస్తూ నడిచింది. తలను కనీసం వెనక్కికూడా తిప్పకుండా నడిచింది ఒక్క కర్పూరికే. ఆమె ఒక్కసారి వెనక్కి తిరిగిచూస్తే బాగుండుననుకున్నాడు లలిత్. కాని అతని కోరిక తీరలేదు.

"ఈ అమ్మాయికి నేనంటే ఎందుకింత కోపం?

* * * *

"కర్పూరీ! మన కాలేజీ మ్యాగ్జయిన్ క్రొత్తది వచ్చింది చూశావా? లలిత్ మహాశయులుకూడా ఒక విరహ గీతాన్ని వ్రాశాడు. ఏమో అనుకున్నాగాని ... ఘటికుడే!" సుమలత ఆత్రుతగా అంది.

"నేను చూడలేదు. ఏదో ఒకటి అఘోరించాడులే!" నిర్లక్ష్యంగా పలికింది కర్పూరిక. ఇంతలో అక్కడికి కళ్యాణి మ్యాగ్జయిన్ చేతిలో పుచ్చుకొని తిరగేస్తూ వచ్చింది.

"ఏదీ చూద్దాం ....ఇటివ్వు!" కర్పూరిక కళ్యాణినుద్దేశించి అన్నది. నవ్వుతూ ఆమె చేతికందించింది.

"ఇదిగో ... చూడవే!" సుమలత తొందర చేసింది. "ఏమిటి?" ఆశ్చర్యంగా చూసింది కళ్యాణి.

"ఏంలేదు! మన క్లాస్‌మేట్ నళిని వ్రాసిన కథ పడిందికదా! అది చదవమని చెప్తున్నానులే" విసుగు నటించింది సుమలత.

కళ్యాణి భావగర్భితంగా నవ్వి వూరుకుంది. కర్పూరిక క్యూరియాసిటీగా పేజీలు తిరగేస్తున్నది.

"మనకుకూడా లాస్ట్ అవర్లో ఇస్తారటలే! ఈ బుక్ ఇచ్చేసేయి. ఇది మన లేడీస్ రిప్రజెంటేటివ్‌ది. చూసిస్తానని అడిగితే ఇచ్చింది. మరలా తనేమైనా అను

కుంటుంది" కళ్యాణి కర్పూరిక దగ్గరినుండి పుస్తకాన్ని అందుకుంటూ అంది.

"మన లేడీస్' రిప్‌దేకదా; కొంపలేమీ అంటుకుపోవులే!" హేళనగా అంది సుమలత. "కొంపలంటుకు పోకపోయినా అది సభ్యత కాదు." సీరియస్‌గా చెప్పి పుస్తకం తీసుకొని వెళ్ళిపోయింది ఆ అమ్మాయికివ్వటానికి.

కళ్యాణి మాటలు తప్పనిపించలేదుగానీ మ్యాగ్జయిన్ పూర్తిగా చూడలేక పోయానే అన్న నిరాశ కల్గింది కర్పూరికకు.

లాస్ట్ అవర్లో కర్పూరికా వాళ్ళకుకూడా మ్యాగ్జయిన్స్ పంచారు. ఎప్పుడెప్పుడు ఇంటికిచేరి మ్యాగ్జయిన్ చదువుదామా అని వుంది కర్పూరికకు! పైకి ఆ కోరికను బహిర్గత పరచకపోయినా, ఆమె అంతర్గత కోరికను గ్రహించి, మనస్సులో గుంభనంగా నవ్వుకుంది కళ్యాణి.

"ఉట్టి పెంకిపిల్ల! వాస్తవాన్ని ఒప్పుకోటానికి ఏదో అహం అడ్డొస్తున్నదంతే" మనస్సులో అనుకుంది కళ్యాణి.

కర్పూరిక ఆశించినట్లే ఆరోజు సిటీబస్సు చాలా త్వరగా వచ్చింది. ఇంటికి చేరి, కాళ్ళుకూడా సరిగ్గా కడుక్కోకుండానే మ్యాగ్జయిన్ తీసుకొని పందిరిమంచం ఎక్కింది. ఆత్రంగా లలిత్ వ్రాసిన 'గీతిక' చదవసాగింది.

లలిత్ వ్రాసిన ఆ విరహగీతిక చదివి, కర్పూరిక మనస్సు కొద్దిసేపు మెత్తబడింది, మనస్సు లోలోపల ఏవో సరిగమలు! "అతని ఆరని ఆవేదనకు కారణం ఎవరు ....? అసలు ఆ ఆరని ఆవేదన నిజమేనా? లేక అదీ ఒక స్టంటా?" ఆలోచిస్తోంది కర్పూరిక.

మరలా కళ్యాణి మాటలు చెవుల్లో ప్రతిధ్వనించాయి. "అది అన్నట్లు నిజంగానే తను క్రూరంగా బిహేవ్ చేస్తున్నదా? అతనంటే తన కెందుకసలు ద్వేషం? ఆ ద్వేషానికి సరియైన కారణం తను చూపించగలదా .... ?"

ఇంతలో "ఆరోజు షాపులో కన్పించినతను మీ క్లాస్‌మేటా?" కుతూహలంగా అడిగింది పెద్ద చెల్లి కావ్య.

"ఊఁ..." విసుగ్గా పలికింది కర్పూరిక. "అక్కా! అతను బాగా ధనవంతుడా? మరలా అడిగింది. "నీ కెందుకా వెధవ ప్రశ్నలన్నీ?" కోపంగా అంది కర్పూరిక.

"నీ కన్నీ వెధవ ప్రశ్నలుగానే కన్పిస్తాయి! నువ్వొక్క దానివే తెలివిగల దానివి?" విసురుగా మాట్లాడి, అక్కడి నుండి లేచి వెళ్ళిపోయింది కావ్య.

కర్పూరిక ఆశ్చర్యపోయింది .... "దీని అసాధ్యం కూలా ఎంత నోరు పెరిగింది!" మనసులో అనుకుంది.

"అక్కా! నీ కోసం కళ్యాణక్క వచ్చింది" బాత్రూము తలుపుల మీద చిన్నంగా చప్పుడు చేస్తు చెప్పింది రెండో చెల్లి శిల్ప.

"త్వరగా వస్తా! కూర్చోమని చెప్పు! ఇదిగో, అమ్మను 'టీ' పెట్టమను"

బాత్రూములోనుండి కేకేసి చెప్పింది.

"అట్లాగేలే! తొందరగా రా!" చెప్పి, కళ్యాణి దగ్గర వచ్చి కూర్చుంది కర్పూరిక.

జుట్టు ముడి విప్పుకుంటూ వచ్చి కూర్చుంది కర్పూరిక. "ఫ్రెష్‌గా తెల్ల రోజాలా వున్నావే...! ఆ వచ్చేవాడెవడో గాని, వెరీలక్కీ!" కొంటెగా అంది కళ్యాణి.

"నీకీ మధ్య నోరు పెరిగింది!" ప్రేమగా కసురుకుంది" లలిత్ ఆర్టికల్ చదివావా? చాలా బాగుంది కదూ!" కర్పూరిక మొఖంలోని భావాలను పరిశీలిస్తు అడిగింది

"ఇప్పుడది అడగటానికే వచ్చావా?" వ్యంగ్యంగా అంది కర్పూరిక.

"అందుకే వచ్చానని నేననలేదే? ఏం ...ఒకవేళ అందుకే వస్తే నాతోమాట్లాడవా?" నవ్వుతూ అంది కళ్యాణి.

"మాట్లాడను! నేనతన్ని అసహ్యించుకుంటానని నీకు తెల్సుగా!" రెక్లెస్‌గా మాట్లాడింది.

"ఐలైక్‌హిమ్ వెరీమచ్!" పెంకిగా అంది కళ్యాణి. "నేనిందాక వాడిన పదాన్ని మళ్లా రిపీట్ చేసే ఓపిక నాకు లేదిప్పుడు ...." కసిగా ఉచ్ఛరించింది కర్పూరిక.

"అదే ఎందుకూ అని అడుగుతున్నాను?" రెట్టించింది కళ్యాణి.

"అబ్బ! ఇంటి కొచ్చికూడా ఆ దరిద్రుడి గొడవెందుకే? హాయిగా 'టీ' త్రాగి కబుర్లు చెప్పుకోక?"

"క....ర్పూ...రికా!" ఆడపులిలా గర్జించింది కళ్యాణి. ఆ గర్జనకు కర్పూరికతోపాటు, ఇంట్లోనివారుకూడా అదిరిపడ్డారు.

"సారీ! చాలా ఆవేశంగా అరిచాన్కదూ! వెళ్తున్నా" అని లేచింది కళ్యాణి ఆవేశాన్ని అదుపులో పెట్టుకుంటూ.

"ఎక్కడికే?" ఖంగారుగా అడిగింది కర్పూరిక.

"ఇంటికి" ముభావంగా పల్కింది.

"మరెందుకొచ్చినట్లు?" నిష్ఠూరం ధ్వనించింది కర్పూరిక కంఠంలో.

"వచ్చినందుకు బాగానే బుద్ధిచెప్పావుగా!" బాధగా అంది కళ్యాణి.

"నువ్వు పిచ్చిమేళానివో, మంచి మేళానివో నాకర్థంగావటంలేదు! అతన్నేదో అంటే నీవు బాధపడతావు దేనికే?" విస్తుపోతూ చూసింది.

"ఏ కారణం లేకుండా ఎవర్ని విమర్శించినా, ఎవర్ని హేళన చేసినా నేను బాధపడతాను కర్పూరికా! ఎవరినైనా ద్వేషించేముందు ఒక కారణం కన్పించాలి. అంతేగాని ఎట్టి కారణం లేకుండా, ఒక మంచి మనిషిని ద్వేషించటం పరమ మూర్ఖత్వమవుతుంది! మనలో లేకపోయినా, ఎదుటి వ్యక్తిలోని టాలెంట్‌నైనా గుర్తిస్తే అది సంస్కారమనిపించుకుంటుంది. నేను అతని రచన గురించి అడిగానుకదా! అది నచ్చిందో, లేదో ఫ్రాంక్‌గా చెప్పు. అంతవరకే. మధ్యలో అతన్ని దూషించటం

దేనికి? చాలా విషయాల్లో సంస్కారంగా ప్రవర్తించే నువ్వు ఈ ఒక్క విషయంలో ఎందుకో మూర్ఖంగా బిహేవ్ చేస్తున్నావు? నిజాన్ని నిర్భయంగా అంగీకరించనప్పుడు కనీసం మౌనంగా ఉండటమైనా నేర్చుకోవాలి" గంభీరంగా చెప్పి, కర్పూరిక 'టీ' త్రాగి వెళ్ళమని చెప్తున్నా విన్పించుకోకుండా చర చర ఇంటికి నడిచింది.

అలా వెళుతున్న కళ్యాణిని గుడ్లప్పగించి చూడసాగింది కర్పూరిక. కావ్య కూడా వాళ్ళ సంభాషణ వినటంమూలాన, ఆ పిల్లకుకూడా అక్కమీద గొంతుదాకా కోపం వచ్చింది.

* * * *

ఒక వారంరోజులపాటు కళ్యాణి కర్పూరికతో అసలు మాట్లాడలేదు. చివరికి కర్పూరికే కళ్యాణిని పలకరించింది. కళ్యాణికూడా నవ్వుతూ మాట్లాడింది.

"నేను లాస్ట్ అవర్ ఉండను. కాస్త నోట్సు జాగ్రత్తగా వ్రాయండి. రేపు వ్రాసుకుంటాను" ఇంటికి వెళ్ళబోతూ అంది కళ్యాణి.

"ఎందుకని ఉండవే?" అనుమానంగా అడిగింది సుమలత.

"లలిత్‌ని చూడటానికి వెళుతున్నాను" సాధారణంగా చెప్పింది. అది వినటంతోనే కర్పూరిక ముఖం మాడిపోయింది. సుమలత 'అదోలా' చూసింది కళ్యాణిని.

"పాపం! అతనికి యాక్సిడెంట్ అయ్యి గాయాలయ్యాయట. అందరూ వెళ్ళి చూసివస్తున్నారు" బాధగా చెప్పింది కళ్యాణి.

"నిన్నెవరూ సంజాయిషీ అడగలేదులే!" వ్యంగ్యం ధ్వనించింది సుమలత స్వరంలో. సుమలత వైపు కాస్త కంపరంగా చూసింది కళ్యాణి. కర్పూరిక మనస్సులో ఏముందో ఏమోగాని మౌనంగా వూరుకుంది. కర్పూరిక మనోభావాల్ని సూక్ష్మంగా పరిశీలించాలని అనుకుంది మనస్సులో. కానీ అంతు చిక్కని ప్రశ్నలా అన్పించింది కళ్యాణికి.

స్నానం చేసి, 'టీ' త్రాగి స్నేహితురాలింటికి వెళ్తున్నానని తల్లితో చెప్పి, లలిత్‌ని చూడటానికి బయల్దేరింది కళ్యాణి. కళ్యాణిని చూడగానే ఆనందంతో విచ్చుకున్నాయి లలిత్ కన్నులు. అతని కళ్ళల్లోని మెరుపు చూసి .... కళ్యాణి స్త్రీ హృదయం ఒక్క క్షణం 'లయ' తప్పింది. మరలా వెంటనే మామూలుగా అయిపోయింది.

"మీరొక్కరే వచ్చారా?" అతని ప్రశ్నకు కళ్యాణి మనస్సులో కాస్త నొచ్చుకుంది. "నేనొక్కదాన్ని రాకూడదా?" నిష్ఠూరంధ్వనించిందామె గొంతులో.

"ఛా...! నా ఉద్దేశ్యం అది కాదు!" ఖంగారు పడ్డాడు లలిత్.

"కంగారు పడకండి!" నవ్వుతూ అంది కళ్యాణి. "మోటర్ సైకిల్ యాక్సిడెంటా?" అతని గాయాలవైపుచూస్తూ అడిగింది.

"అవునండీ!"

"ఒక వెహికిల్ మీద ముగ్గురు, నల్గురు చొప్పున కూర్చొని షయిర్లు కొడుతుంటే, యాక్సిడెంట్‌కాక ఏమవుతుంది చెప్పండి?" ప్రేమతో కూడిన మందలిం

చిది. తిన్న బుచ్చుకున్నట్లనిపించాడు కళ్యాణికి.

"నేను అతి చొరవ తీసుకుంటున్నానేమో కదూ ?" బిడియంగా అంది.

"కాదు ! అభిమానంతో హెచ్చరిస్తున్నారు ! నా శ్రేయస్సు గురించి ప్రేమగా మందలించిన మొదటి వ్యక్తి మీరు. అందుకు మీకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను!" లలిత్ స్వరం ఉద్వేగంగా వుంది.

"నేనే కాదు ! ఎవరైనా ఇలాగే హెచ్చరిస్తారు !" నవ్వుతూ చూసింది కళ్యాణి. "నాదొక సలహా. మీరేమీ అనుకోరుగా" సంకోచంగా అంది.

"అనుకోవడమా ..." ఆశ్చర్యపోయాడు లలిత్.

"ఏంలేదు! మీరు మంచివారే కావొచ్చు! కానీ....మీ చుట్టూవున్న 'సర్కిల్' ని చూసి చాలామంది అపోహపడే ప్రమాదముంది, దాని వలన వాళ్ళకు లాభం చేకూరుతున్నా, మీరేమో నష్టపోతున్నారు. ఆర్థికంగా నష్టమే అయితే ఫర్వాలేదు! కాని మున్ముందు మీ 'క్యారెక్టర్' మీద కూడా 'మచ్చ' పడే ప్రమాదం ఎదురవ్వొచ్చు. ఇంతకంటే ఇంకెలా చెప్పాలో నాకు అర్థంగావటంలేదు ? దయచేసి మీరు అపార్థం చేసుకోరుకదూ !"

"యూ ఆర్ రైట్ ! ఐ ఎన్‌టైర్లీ అగ్రీ విత్ యూ!" సంతోషంతో పలికాడు లలిత్, ఆమె కళ్ళల్లో వెన్నెల పుష్పాలు విరగబూశాయి.

"ఇకవస్తానండీ!" మర్యాదగా శెలవు తీసుకొని ఇంటికి చేరిందికళ్యాణి. ఇంటికి చేరినాకూడా ఏవో సౌగంధాలు ఆమెని వదిలిపెట్టలేదు.

* * * *

పెద్ద చెల్లికి, చిన్న చెల్లికి ఎగ్జామ్స్ జరుగుతుండటంతో పేరంటానికి కర్పూరిక ఒక్కతే వెళ్ళవల్సి వచ్చింది. అక్కడ బాగా లేటయింది. సుమలతకూడా ఆ పేరంటానికి వచ్చింది.

"పోనీ ఆ సందు చివరదాకా తోడురానా కర్పూరీ ?" ఒక్కతే పొద్దుబోయి వెళ్తున్నదని అడిగింది సుమలత.

"వద్దులేవే ! నువ్వెళ్ళు ! నీకూ్కడా బాగా ప్రొద్దుబోయిందికదా ! ఆ సందు చివరకెళితే రిక్షాలుంటాయిగా ! భయం లేదులే ! నువ్వెళ్ళు. మీ ఇంటి ప్రక్కవాళ్ళు మరల వెళ్ళిపోతారు" అని ఒక్కతే బయల్దేరింది.

స్పీడుగా అడుగులు వేయసాగింది. ఇంతలో ఎక్కడినుండి వచ్చారో నల్గురు వ్యక్తులు చుట్టుముట్టి, నోరు మూశారు. భయంతో కెవ్వుమంది.

'వదలమని' అనటానికికూడా వీల్లేకపోయింది. బలమంతా ఉపయోగించి పెనుగులాడ సాగింది. ఒకప్రక్క దుఃఖం తన్నుకొస్తోంది. మరోప్రక్క భయం వణికిస్తున్నది.

"త్వరగా దీన్ని అవతలకి తీసుకెళ్ళాలిరా" ఆ నల్గురిలో ఒకడు అసభ్యంగా మాట్లాడుతున్నాడు. నల్గురూ బాగా త్రాగి వుండటంతో ... ఆ వాసనకు కర్పూరికకు

కడుపులో తెములుతున్నట్లుగా వుంది.

ఇంతలో అటు ఒక మోటారు సైకిలు వస్తూ కన్పించింది. ఆనందంతో ఏదో అరవబోయింది. కానీ నోరు తెరవనిస్తేగా వాళ్ళు ?

"అరేయ్ ! త్వరగా పదండిరా" వాళ్ళు ఖంగారుగా కర్పూరికను లాక్కొని పరిగెత్త సాగారు.

"హెల్ప్ .... ! హెల్ప్ .... !" అరిచింది కర్పూరిక.

ఆ కేకలకు ఆ మోటారుసైకిలు ఆగిపోయింది. దాని మీదనున్న ఇద్దరు వ్యక్తులు క్రిందకు దూకి వాళ్ళనుండి కర్పూరికను విడిపించారు. భయం నుండి తేరుకోగానే వాళ్ళను పరీక్షగా చూసిన కర్పూరిక ముఖం మ్లానమైపోయింది.

మోటారుసైకిలు ఆగటంతోనే కర్పూరికను వదిలి, వాళ్ళు కాళ్ళకు బుద్ధి చెప్పటంతో, కర్పూరికలో ఏదో అనుమానం బయల్దేరింది.

"ఇలా ప్రొద్దుబోయి ఒంటరిగా తిరగటం అంత మంచిది కాదు!" గంభీరంగా హెచ్చరించాడు లలిత్. కర్పూరిక మాట్లాడలేదు.

"ఒరేయ్ మురళీ ! నువ్వు నడిచిరా ! నేను వారిని ఇంటి దగ్గర డ్రాప్ చేసి వస్తాను !" చిన్నగా అన్నాడు.

"అవసరంలేదు ! వాళ్ళు మీరు పంపిన రౌడీలేకదా ! వేరే రౌడీలెవ్వరూ నా వెంట పడరు. ఆ విషయం నాకు బాగా తెల్సు ! ప్లాను చాలా చక్కగా వేశారే ?" కర్పూరిక మాటల్లో హేళన, నిరసన, ధ్వనించాయి.

"కర్పూరికా .... !" అది పిలుపులా లేదు. గర్జనలావుంది. అవమానంతో అతని ముఖం జేవురించింది. అప్పటికప్పుడే కళ్ళు మండుతున్న అగ్నిగోళాల్లాగా తయారయ్యాయి. అయినా పొగరుగా తలెగరేసింది కర్పూరిక.

కోపాన్నిక కంట్రోల్ చేసుకోలేకపోయాడు లలిత్. "యూ...స్టుపిడ్....!" అంటూ ఆమె రెక్కపట్టి గుంజ బోయాడు.

"లల్లీ ...! ఆవేశపడకు. ఆమె మూర్ఖంగా ప్రవర్తిస్తున్నదని మనమూ ప్రవర్తిస్తే ప్రయోజనమేముంది ? పద ! మన దారిన మనం పోదాం !" లలిత్‌ని నడిపించి, మోటార్‌సైకిలు స్టార్ట్ చేశాడు మురళి.

"హుం !" కోపంతో బుసలుకొడుతూ వచ్చి వెనకాల కూర్చున్నాడు లలిత్.

"గుడ్‌నైట్" కసిగా చెప్పి మోటారుసైకిల్ని పరిగెత్తించాడు మురళి. వెనక్కి తిరిగికూడా చూడలేదు లలిత్. అతని హృదయం అవమానంతో భగ్గుమంటున్నది.

"ఇంత మొండి ఘటాన్ని నేనెక్కడా చూడలేదురా" మురళి డ్రైవ్‌చేస్తూనే అన్నాడు. "ఆ డెవిల్ గురించి ఇక మాట్లాడకు" కోపంగా కసిరాడు లలిత్.

"బాగుందిరా నీ వరస ..." నవ్వుతూ లలిత్‌ని అతని ఇంటిదగ్గర డ్రాప్ చేసి, వెహికిల్‌నికూడా వదిలి నడుచుకుంటూ తన ఇంటికి వెళ్ళిపోయాడు మురళి.

భయం, భయంగానే రిక్షాలో ఇంటికి చేరింది కర్పూరిక.

"ఆదేంటే? జుట్టు అలా రేగిపోయిందేంటి?" కర్పూరిక తల్లి ఖంగారుగా అడిగింది.

"రేగిపోలేదే ..." విసుగ్గా చెప్పి బాత్రూములో దూరింది. తల్లి మౌనంగా వూరుకుంది. బాత్రూములోనుండి బయటకు రాగానే తల్లి భోజనానికి పిలిచింది.

"త్వరగా తినెళ్ళి చదువుకో" సౌమ్యంగా హెచ్చరించింది తల్లి. భోంచేసి ముగ్గురూ పుస్తకాలు పట్టుకొని కూర్చున్నారు. కానీ ... చిన్నపిల్ల శిల్ప ఒక్కతే చదువుమీద మనస్సును లగ్నం చేయగల్గింది. మిగతా ఇదరి ఆలోచన్లు వేరేచోట్ల వున్నాయి. అయితే ఆ ఇద్దం ఆలోచన్లకు 'కేంద్రబిందువు' ఒకటేనని వాళ్ళకు తెలియదు.

* * * *

"ఒసే, కర్పూరీ! ఈరోజేనట ఎలక్షన్స్‌లో పోటీచేసే అభ్యర్థులు నామినేషన్స్ దాఖలు చేసేది" గేటులోకే ఎదురొస్తూ హుషారుగా చెప్పింది సుమలత.

"అలాగా!" అని వూరుకుంది కర్పూరిక.

"ఏమిటీ అంత నీరసంగా పలుకుతున్నావ్? ఎంత హుషారుగా వుండాలి?" నవ్వుతూ అంది.

"మనకెందుకొచ్చిన గొడవే? మనమేమన్నా పోటీ చేస్తున్నామా?" విసుగ్గా అంది.

"మనం పోటీ చేయకపోతే ఉత్సాహంగా వుండకూడదా? ఎంత సందడి! ఎంత అల్లరి! ఓహ్!" సంబర పడుతూ అంది. నవ్వుతూ చూసింది సుమలతను.

"మరో ముఖ్య విషయమే కర్పూరీ! లలిత్ ప్రెసిడెంట్‌గా పోటీ చేస్తున్నాడట. ఆ మురళేమో సెక్రటరీగానట. ఇకచూస్కో నా సామిరంగా..." హుషారుగా 'ఈల' వేసింది సుమలత.

"ఛా ....! నోర్మూసుకో! ఆ ఈల వెయ్యొద్దని నీకెన్నిసార్లు చెప్పాను? ఒకటీ ఆడ లక్షణం లేదు!" చనువుగా కసురుకుంది కర్పూరిక.

"ఆడలక్షణం లేకపోయినా .... ఆడతనం పుష్కలంగా వుందికదా!" చిలిపిగా తన ఎత్తయిన గుండెల్ని చూపిస్తూ అంది సుమలత. "ఛీ ...ఛీ.... !బొత్తిగా సిగ్గు లేకుండా చస్తున్నావ్!" తిడుతూ, క్లాసు రూములోకి నెట్టుకొచ్చింది.

క్లాసులో కూడా ఎవరి నోటి వెంట విన్నా, ఎలక్షన్స్ సంగతే! అందులోనూ లలిత్ 'ప్రెసిడెంట్' గా పోటీ చేయటం వలన, ఆ ఎలక్షన్స్‌కి అంత ప్రాధాన్యత వచ్చినట్లు గ్రహించింది కర్పూరిక.

సరిగ్గా అప్పుడే ఆమె ఊహించని విధంగా అక్కడకు లలిత్, అతని ఫ్రెండ్స్ వచ్చారు. వాళ్ళ రావటం చూసి ముఖం చిట్లించుకుంది కర్పూరిక. అతనికి తగిలిన గాయాలింకా పూర్తిగా మానలేదు. ఆ గాయాల్ని చూడగానే రాత్రి తనకు ఎదురైన

దుర్ఘటనను తలుచుకోగానే కర్పూరిక మనసు ఒక్క క్షణం మెత్తబడింది. కాని మరు క్షణమే ఆమె మనస్సులో ఏదో ప్రవేశించింది.

చప్పున అక్కడినుండి వెళ్ళబోయింది. "ప్లీజ్! కర్పూరికా! వెళ్ళిపోకండి! ఒక్క నిమిషం ఓపిక పట్టండి! నేను ప్రెసిడెంటుగా పోటీ చేస్తున్న సంగతి మీకు తెలిసే వుంటుంది అవునా కళ్యాణిగారూ?" మర్యాదగా అడిగాడు లలిత్.

"తెలుసండీ! మేమే మిమ్మల్ని అభినందించటానికి రావాలనుకుంటున్నాం! మీరే వచ్చారు" అతన్ని అభిమానంగా చూస్తూ చెప్పింది కళ్యాణి. 'మేమే' అని చెప్పినందుకు కర్పూరికకు కోపం వచ్చి, కళ్యాణి వైపు గుర్రుగా చూసింది.

"మీ అందరి ప్రోత్సాహంతోనే నేను రంగంలోకి దిగవల్సి వచ్చింది. కనుక మీరంతా నా విజయానికి కృషి చేయమని సవినయంగా కోరుకుంటున్నాను. చేస్తారుకదూ!" కర్పూరికవైపు చూస్తూ గమ్మత్తుగా నవ్వాడు. ఆ నవ్వు చూసి మనస్సులో తిట్టుకుంది కర్పూరిక.

"అలాగేనండీ! తప్పక మీ విజయానికి కృషిచేస్తాం. మీరు ధైర్యంగా వుండండి" నవ్వుతూ చెప్పింది కళ్యాణి.

"మీరు గెలిస్తే ఏంచేస్తారు?" సుమలత అడిగింది.

"మీరేమిచేయమంటే అదే" నవ్వుతూ చెప్పి అక్కడినుండి వెళ్ళిపోయాడు లలిత్ మిత్రబృందం అతన్ని అనుసరించారు.

"ఇక పదండి" కసురుకుంది కర్పూరిక. "నేను శశిధర్‌నే సపోర్ట్ చేస్తాను" కర్పూరికవైపు ఓరగా చూస్తూ అంది సుమలత. కళ్యాణి చివ్వున తలత్రిప్పి సుమలత వైపు కోపంగా చూసింది. కర్పూరిక మౌనంగా వూరుకుంది.

"నీ అమూల్యమైన ఓటు పోయినంత మాత్రాన అతనేమీ ఓడిపోడులే" వ్యంగ్యం చేసింది కళ్యాణి. గమ్మత్తుగా నవ్వుతూ "నువ్వో కర్పూరీ?" కల్యాణి అడిగింది. సుమలత కళ్యాణివైపు విసురుగా చూసింది.

"ఆ వెధవ పాలిటిక్స్ గురించి నన్నడక్కు!" చిరాగ్గా చెప్పింది. మనస్సులో నవ్వుకుంది కళ్యాణి. సుమలత మొహం మాడిపోయింది.

"ఆఁ బుద్ధిగా ఉండవే!" నవ్వుతూ అంది కళ్యాణి. ఎవరి ఆలోచన్లతో వారు ఇళ్ళకు చేరారు.

"అక్కా! మీ కాలేజీలో ఎలక్షన్స్ జరుగుతున్నాయా? ఆరోజు నిన్ను పలకరించారే ..., ఆ లలిత్‌గారుకూడా పోటీ చేస్తున్నారటగా! నేనుకనుక మీ కాలేజీ స్టూడెంట్‌నైతే ఎంచక్కా ఆ లలిత్‌గారినే సపోర్ట్ చేసేదాన్ని" ఉత్సాహంగా మాట్లాడింది కావ్య.

* * *

ఎలక్షన్స్ గొడవ అయ్యాక, కాస్త చదువులో పడ్డారందరూ. ఒకరోజు-సుమలత ఖంగారుగా కర్పూరిక దగ్గరకు పరిగెత్తుకొచ్చి -"కర్పూరీ -! లలిత్‌ని ఎవరో కొట్టారట! దెబ్బలు తగిలాయట - మన కాలేజి వాళ్ళంతా చూడటానికి వెళ్తున్నారు"

చెప్పింది.

"పిచ్చి వేషాలు వేస్తుంటే తన్నకేమి చేస్తారు?" కసిగా అంది. "నువ్వే చెప్పింది కూడా కరెక్టే!" చిన్నగా అని ఇంటికి వెళ్ళిపోయింది.

ఆ మరునాడు కాలేజీలో ఇంకా అసెంబ్లీ ప్రారంభము కాలేదు. అందు వలన గుంపులు, గుంపులుగా నుంచొని కబుర్లు చెప్పుకుంటున్నారు. అందరూ ఎక్కువగా లలిత్ గురించిన కబుర్లే చర్చించు కుంటున్నారు. సుమలత, కళ్యాణి ఇంకా కాలేజీకి రాలేదు. కర్పూరిక ఒక్కతే ముందు వచ్చింది, కళ్యాణి కూడా ఒక పది నిమిషాల కొచ్చింది.

కళ్యాణి రాగానే ఒకమ్మాయి ఆత్రంగా పరిగెత్తుకొచ్చి "కళ్యాణీ! లలిత్‌ని నువ్వు చూసొచ్చావా? పాపం! ఎవరో బాగా కొట్టారటగా?" సానుభూతిగా అంది.

"అవును" బాధగా అంది. "ఎవరో అమ్మాయి విషయంలో... అలా ఘర్షణ పడ్డారని విన్నాను" అప్పుడే అక్కడకు వచ్చిన సుమలత అంది. సుమలత వైపు కోపంగాచూస్తూ... "పచ్చ కామెర్ల రోగికి లోకమంతా పచ్చగానే వుంటుంది. అతనెప్పుడో మానవత్వంతో రౌడీల బారినుండి ఒక అమ్మాయిని రక్షించాడు. ఆ కక్ష పెట్టుకొని వాళ్ళు ఒంటరిగా వెళుతున్న లలిత్‌ని కొట్టారు. ఆ అమ్మాయి వలన అతనింత నష్టపోతే కనీసం ఆ అమ్మాయి కృతజ్ఞతలు తెలియచేయకపోగా... అనం దిస్తున్నదట" కసిగా అంది. కర్పూరిక ఉలిక్కి పడింది.

"అదేం అన్యాయం?" కళ్యాణిని అడిగిన ఆ అమ్మాయి అంది.

"అదే న్యాయంమరి! అహంకారంతో కళ్ళు మూసుకుపోతుంటే న్యాయం గురించి ఎలా తెలుస్తుంది? ఆరోజు దైవంలా అతనాదుకోకుండా వుంటే, తిక్క బాగా కుదిరేది. ఆ రౌడీల చేతుల్లో ఎంగిలి విస్తరాకులా అయ్యేది బ్రతుకు. అహంకారం అంతా బాగా అణిగేది. ఆ పిచ్చిలలిత్ రక్షించి, పైపెచ్చు మాటలు పడ్డాడు. ఇప్పుడు దెబ్బలూ తిన్నాడు" కసిగా అంది కళ్యాణి.

"ఏమన్నదట?" మరలా సందేహంగా అడిగింది ఆ అమ్మాయి.

"ఏమంటుంది? అతనే ముందు రౌడీలను పంపించి ఆ తర్వాత వచ్చి రక్షించినట్లు నాటకమాడాడని దూషించిందట. ఈ వెధవ సినిమాలుచూసి, అతనుకూడా సినిమాలోలాగా తన ప్రేమను పొందటానికి వేసిన ప్లానని భావించింది. అతనికేంఖర్మ? సినిమా ట్రిక్స్ ఉపయోగించటానికి. ఇక ఆమెకంటే అందగత్తెలే లేరావేం ఈ ప్రపంచంలో?" హేళనగా అంది.

కళ్యాణి మాటలకు కర్పూరిక ముఖం రక్తం లేనట్లు పాలిపోయింది. గుండెల్లో ఏదో అలజడి ప్రారంభమైంది. వాళ్ళ ఎదురుగా నిలబడే శక్తి లేనట్లు, మౌనంగా క్రింద కూలబడి, పుస్తకం తిరగేస్తున్నట్లు నటించింది.

"ఏమిటి? కర్పూరిక ఏమీ మాట్లాడటంలేదు?" ఆ అమ్మాయి అంది "ఇలాంటి కబుర్లంటే దానికి తలనొప్పిలే! అందులోనూ నేను మాట్లాడుతుంటే మహా

చిరాకు" కళ్యాణి మాటల్లో హేళన ధ్వనించింది.

"స్టాపిట్!" అరిచింది కర్పూరిక. "నీకు, నీ చదువుకు అంతరాయం కల్గుతుందనుకుంటే క్లాసు రూములోకెళ్ళి చదువుకో! ఇది కాంపౌండ్" నిర్లక్ష్యంగా అంది కళ్యాణి. కళ్యాణివైపు కోపంగా చూసి, స్పీడుగా నడుచుకుంటూ వెళ్ళింది క్లాసు రూములోకి.

"ఆ అమ్మాయి కర్పూరికా ఏమిటి?" కుతూహలంగా అడిగింది సుమలత. సుమలతవైపు గమ్మత్తుగా చూస్తూ... "కాదు! మన కర్పూరిక అంత మూర్ఖురాలనా ఏమిటి నీ ఉద్దేశం? ఎవరో డి.ఎస్.పి. కూతురట ఆ అమ్మాయి" చెప్పింది కళ్యాణి. "డి.యస్.పి. కూతురా?" నమ్మలేనట్లు చూసింది సుమలత.

"అవును!" ఒత్తి పలికి అసెంబ్లీకి దారితీసింది. దిమ్మెర పోయినట్లు అయింది సుమలత. "మరో గమ్మత్తు ఏమిటంటే?... లలిత్‌కి ఆ అమ్మాయంటే తగని యిష్టమట. ఎలాగైనా ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాడని కూడా విన్నాను." అలాంటి షాక్ న్యూస్ చెప్పి, నిశ్చింతగా నుంచున్నది కళ్యాణి. సుమలత దిమ్మెరపోయి, పిచ్చిచూపులు చూడసాగింది.

* * * *

ఆరోజు కాలేజీ 'ఇనాగరేషన్' ఫంక్షన్. అందరూ ఎంతో సంబరంగా తిరుగుతున్నారు. అక్కతో ఆ ఫంక్షన్‌కి తనుకూడా రావాలని చాలా రోజులనుండి సంబరపడుతున్నది కావ్య. కానీ... పాపం! సరిగ్గా ఆ టైముకు నూటనాలుగు డిగ్రీల జ్వరంతో బాధపడుతూ మంచంలోనే ఉండిపోవల్సి వచ్చింది. అందువలన కర్పూరిక ఒక్కతే వచ్చింది.

చీఫ్‌గెస్ట్, మరికొందరు ఆహ్వానితులు సరియైన టైముకే రావడంతో, ఫంక్షన్ చాలా ఉత్సాహంగా ప్రారంభమైంది. మొదట చీఫ్‌గెస్ట్ ఉపన్యాసం, ఆ తర్వాత స్టూడెంట్స్ యూనియన్ లీడర్సు పరిచయం... ఆ తర్వాత ప్రిన్సిపాల్‌గారు కాలేజీ అభివృద్ధి గురించి నాలుగు ముక్కలు మాట్లాడటం, ఇదంతా జరిగిపోగానే అందరూ స్టేజీదిగి వచ్చారు.

వెంటనే సాంస్కృతిక కార్యక్రమాలు మొదలయ్యాయి. అందరూ ఉత్సాహంగా తిలకిస్తున్నారు. కళ్యాణి భరతనాట్యం వేయబోతున్న ఒకమ్మాయికి మేకప్‌లో సహాయపడటానికి గ్రీన్ రూములోకి వెళ్ళింది. ఇకపోతే సుమలత ఆరోజు ఫంక్షన్‌కి రాలేదు. ఎందుకని రాలేదో కర్పూరికకూ అర్థం కాలేదు, కళ్యాణికీ అర్థం కాలేదు.

క్లాస్‌మేట్స్ ప్రక్కన కూర్చొని చూస్తోంది కర్పూరిక. ప్రక్కన ఫ్రెండ్స్ ఇద్దరూ లేకపోవటం ఏదో వెలితిగా వుంది. సరదాగా కబుర్లు చెప్పుకుంటూ చూస్తున్నారందరూ. కానీ... కర్పూరిక మౌనంగా చూస్తోంది. అప్పుడప్పుడూ కాస్త గొడవ పడినా ప్రక్కన కళ్యాణి వుండి సరదాగా మాట్లాడుతుంటేనే ఎంతో బాగుంటుంది కర్పూరికకు. ఆరోజు ఇద్దరూ లేకపోవటంతో చాలా 'డల్‌గా' వుంది

బాగా చివరి లైన్లదగ్గర కూర్చుంది కర్పూరిక. ఆ వెనుక అబ్బాయిలు నిలబడి చూస్తున్నారు. వాళ్ళకు కూర్చునే ప్లేసులేక నిలబడి చూస్తున్నారు. ప్రోగ్రామ్స్ చూస్తూ, సరదాగా జోక్స్ వేసుకుంటూ ఆనందిస్తున్నారు వాళ్ళు. అక్కడినుంచి లేచి వెళ్ళి ముందు కూర్చోవాలని చూసింది. కానీ ... ఎక్కడా ప్లేస్ కన్పించక వూరుకుంది. ఎందుకో ప్రక్కకు తల తిప్పి చూసిన కర్పూరికకు లలిత్ ఫ్రెండ్స్ కాస్త దూరంలో నుంచొని కన్పించారు. వాళ్ళు తననే గమనిస్తున్నట్లు ఫీలయింది. "మరి ఆ మహానుభావుడెక్కడ ఊరేగుతున్నాడో?" మనస్సులో కోపంగా అనుకుంది.

"ఎక్కడ ఊరేగితే తనకెందుకు? అసలైనా అస్తమానం అతని ఊసెందుకు తనకు ?" తనను తనే విసుక్కుంటూ ప్రోగ్రామ్ చూడటంలో నిమగ్నమైంది కర్పూరిక.

ఇంతలో సడన్‌గా కరెంట్ ఫెయిలయింది. చుట్టూ గాఢాంధకారం. "అమ్మో! కరెంటు పోయిందే..." అని అందరూ అనుకునేలోపే .... ఏదో 'కలకలం' బయల్దేరింది. ఉన్నట్లుండి ఆ వాతావరణమంతా ఒక్కసారిగా మారింది. అరుపులు, ఆర్తనాదాలు, కేకలు ... ఆ ప్రాంతమంతా ప్రతిధ్వనించాయి. వచ్చిన అతిధులుకూడా ఆ భీభత్స వాతావరణానికి భయకంపితులయ్యారు. ఎవరో కావాలనే కరెంట్ ఫెయిల్ చేశారని అర్థమైంది.

కర్పూరికకూడా ఖంగారుగా ఆ చీకట్లో పరిగెత్తుతూంది. ఒక బెంచీ అడ్డొచ్చి తూలి పడింది మరలా. ఇంతలో ఎవరో కర్పూరిక మొహంమీద పెన్‌టార్చి వేసి, ఆమె పైకి లేవటానికి సాయపడ్డారు.

"కమాన్! త్వరగా అవతలికి రండి! ఇక్కడుండటం ప్రమాదంగా అన్పిస్తోంది" ఆ వ్యక్తి ఖంగారుగా కర్పూరిక చేయి పట్టుకొని అవతలకి పరిగెత్తాడు. అంత భయంలోనూ, అంత ఖంగారులోనూ, ఆ స్వరం విని నిటారుగా అయింది.

"ప్లీజ్ కర్పూరికా! సందేహించకండి. ఇది యోచన చేసే సమయం కాదు. మృగాల్లా ప్రవర్తిస్తున్నారు. ఈ చీకట్లో ఎవరినీ కంట్రోల్ చేయలేం. ఇది ఎవరో కావాలనే చేసిన దుర్మార్గం. ప్లీజ్ ! నా చేయి పట్టుకొని త్వరగా పరిగెత్తండి !" ప్రేమగా, ప్రాధేయపూర్వకంగా, వేడికోలుగా హెచ్చరించాడు లలిత్.

"భగవాన్ ! ఇటువంటి సమయంలోకూడా ఇతను తనను వదలలేదే ?" మనస్సులో అనుకుంటూ "నన్ను వదలండి ! నా చేయి ముట్టుకోకండి ! మీరంటే నాకసహ్యం .... ! ఇదంతా మీరే .... మీరే కావాలని చేశారు. మీకు ఓటు వేయలేదన్న కక్షతో ఈ అకృత్యానికి పాల్పడ్డారు. ఐ హేట్ ... యూ ... ఐ హేట్ ...." యూ ఒక ప్రక్క రోదిస్తూనే నిందించింది.

"ఉష్ ... ! నోర్మూసుకొని నావెంట రండి. ఇదంతా ఆ శశిగాడి దుర్మార్గం. ఎవరు ఎవరిని ఏమిచేస్తున్నారో తెలియని విధంగా పశువుల్లా ప్రవర్తిస్తున్నారు. ఎలా కంట్రోల్ చేయాలోకూడా అర్థంగావటంలేదు. మీరు గుర్తుకు రాగానే భయంతో ఇలా

పరిగెత్తుకొచ్చాను. ప్లీజ్ ! నన్ను విశ్వసించి అలా దూరంగా వెళ్దాం పదండి. క్విక్!"

"వదులు దుర్మార్గుడా ! వదులు. నీదంతా నాటకం ... నన్నొదులు" కర్పూరిక పిచ్చిపట్టిన దానిలా ఏకవచన సంబోధనలోకి మారింది. ఆ విషయం గ్రహించాడు లలిత్. అందుకు కోపం రాలేదుకానీ .... ఆమె మూర్ఖత్వానికి విపరీతంగా కోపం వచ్చింది.

"వై డు యు ఛాటర్ ? హోల్డ్ యువర్ టంగ్" ఈడ్చి చెంపమీద కొట్టి ఒక్కలాగు లాగాడు. ఆ ఘర్షణతోనే అప్పటికే కాలేజీ గార్డెన్ వెనక భాగానికి చేరారు. అక్కడికికూడా కాంపౌండ్‌లో జరుగుతున్న గొడవ వినపడుతూనేవుంది.

"యూ ఈడియట్ ! నన్ను కొడ్తావా ?" అతని చేతిని రక్కి పరిగెత్తబోయింది. చప్పున అతను కాలు అడ్డం పెట్టటంతో క్రింద పడిపోయింది. ఆ విసురుకు అతనుకూడా తూలి ఆమెమీద పడిపోయాడు. అనుకోకుండా ఇద్దరి పెదాలు కలిశాయి. ఆమె శరీర స్పర్శ అతనిని ఉన్మత్తుణ్ణి చేసింది. అతని నిగ్రహమంతా 'ధూళి'లో కల్సిపోయింది. కర్పూరిక ఎంత పెనుగులాడినా లాభం లేకపోయింది. ఆమె మొండితనమే ఆమె జీవితాన్ని సర్వనాశనం చేసింది.

అతని ఆవేశం చల్లారి, కళ్ళు తెరిచేసరికి .... కాలేజీ అంతా వెలుగు కనబడుతోంది ! జరిగింది తలుచుకునేసరికి లలిత్ భయంతో వణికి పోయాడు. శవంలా పడి వుంది కర్పూరిక. ఆమె కళ్ళు తెరిచే చూస్తోంది, అయితే .... ఆ చూపుల్లో 'జీవకళ' లేదు. ఆమె కళ్ళల్లోకి చూడలేకపోయాడు. తలొంచుకొని - "ఐ యామ్ వెరీ సారీ కర్పూరికా ! యిట్ యీస్ డన్ యిన్ అడ్వర్‌టెంట్‌లీ ...." బాధగా చెప్పాడు లలిత్.

కర్పూరిక ఒక్క చూపు చూసింది. ఆ చూపుకు లలిత్ దెబ్బతిన్న పిట్టలా విలవిల్లాడి పోయాడు.

"ప్లీజ్ కర్పూరికా ... ! లేవండి ! వీలయినంత త్వరలో ఇక్కడి నుండి బయట పడటం మంచిది." అంటూ చేయందించి లేపాడు. నీరసంతో అడుగు వేయలేకపోయింది. ఆ స్థితిలో నున్న కర్పూరికను చూస్తూంటే .... లలిత్‌కి తన మీద ఏనాడూ కల్గనంత జుగుప్స, అసహ్యం కలిగాయి. తనే ఆమె బట్టల్ని, జుట్టుని సవరించాడు.

"నువ్వు ఎటువంటి శిక్ష విధించినా ... ఆనందంగా భరిస్తాను. ప్లీజ్ ...ఆలా చూడకు ! ఇలా జరుగుతుందని కలలో గూడా అనుకోలేదు. నిజం కర్పూరికా !" వేడికోలుగా చూశాడు లలిత్.

అసలా మాటలు విననట్లే తూలుతూ నడవ సాగింది కర్పూరిక. "ప్లీజ్ .... కర్పూరికా ! అటు వెళ్ళొద్దు. దయచేసి ఈ ఒక్కసారి నా మాటవిను" ! కర్పూరిక చేయిపట్టి ఆపాడు. చప్పున నడుము పట్టుకొని ఎత్తి భుజాన వేసుకొని, స్పీడుగా నడిచాడు ఎటువంటి గొడవ చేయలేదు కర్పూరిక.

కాలేజీ వెనక భాగానవున్న పొలాలగుండా మెయిన్‌రోడ్ మీదకుచేరి, అప్పుడు క్రిందకు దించాడు కర్పూరికను.

ఒక ఆటోని పిలిచి, అందులో కర్పూరికను కూర్చోమని చెప్పి, ఆమె కూర్చున్న తర్వాత డ్రైవర్‌కి 'సైగ' చేశాడు.

"దిగు కర్పూరీ!" కర్పూరిక ఇంటిముందు ఆటో ఆగగానే, ప్రేమగా హెచ్చరించాడు లలిత్.

కామ్‌గా ఆటో దిగింది కర్పూరికకూడా. అప్పటికే కర్పూరిక తల్లి, తండ్రులు చెల్లెళ్ళు ఖంగారుగా ఎదురు చూస్తున్నారు.

"తనకు కొంచెం వేడి వేడిగా 'టీ' ఇవ్వండి. నేను రేపు ఉదయాన్నే వచ్చి మీతో మాట్లాడతాను" గంభీరంగా చెప్పి, ఒక్కక్షణం కర్పూరికను ఆర్తిగా చూసి మరలా ఆ ఆటోలోనే వెళ్ళిపోయాడు. ఒకరి నొకరు పిచ్చిచూపులు చూసుకుంటూ నుంచున్నారు. ముందుగా తేరుకున్నది కర్పూరిక నాన్నగారైన శంకరంగారు.

"పదమ్మా!" కూతురి భుజంచుటూ చేయివేసి లోపలకు నడిపించుకెళ్ళి తమ బెడ్రూములో కూర్చోబెట్టి ఇవతలకు వచ్చి 'టీ' తయారు చేయమని భార్యను హెచ్చరించారు ఆమె వెంటనే ఆ ప్రయత్నంలో పడిపోయింది.

మంచంమ్మీద వాలిపోయి శూన్యంలోకి చూడసాగింది కర్పూరిక. అప్పుడు ఉప్పొంగాయి ఆమె నయనాలు మహా జలపాతాల్లాగా. కావ్య, శిల్పలు కుతూహలంగా ఆ గదిముందు తచ్చాడటం చూసి, వారిని సున్నితంగా మందలించి ఇవతలకు తీసుకొచ్చింది తల్లి.

భార్య చేతిలోని 'టీ' కప్పు అందుకుంటూ - "ఇదిగో దాన్ని ఎటువంటి మాటలతో విసిగించకండి! రాజారావుగారు ఫోన్ చేసిన విషయం పొరబాటునకూడా దానికి తెలియనివ్వకండి. ఏం జరగనట్లే ప్రవర్తించండి!" సీరియస్‌గా హెచ్చరించి 'టీ' కప్పుతో కూతురి గదిలోకెళ్ళారు శంకరం.

తండ్రిని చూసి చప్పున కళ్ళు తుడుచుకుని సరిగ్గా కూర్చుంది. "'టీ' త్రాగి రెస్ట్ తీసుకోమ్మా! బాగా వర్రీ అయివుంటావు" లాలనగా కూతురి తల నిమిరి 'టీ' కప్పు చేతికందించి ఇవతలకొచ్చేశారు.

తెల, తెల వారుతుండగాతలుపుల మీదఎవరో చప్పుడు చేస్తున్నట్లనిపించి, అనుమానంగా లేచి వెళ్ళి తలుపులుతీశారు కర్పూరిక నాన్నగారు శంకరంగారు. ఎదురుగా ఎన్నో లంఖణాలు చేసిన వాడిలా నిలబడివున్నాడు లలిత్. అంతకు ముందు అతన్నెప్పుడూ చూడకపోయినా, రాత్రి కర్పూరికను వదిలి వెళ్ళినప్పుడు చూడటం వలన, వెంటనే గుర్తుపట్ట గలిగారు. ఆ సమయంలో అతనలా రావటం ఏదో అనుమానాన్ని 'భయాన్ని' కల్గించిందాయనలో.

"రండి" ...! ప్రక్కకు తప్పుకుంటూ, ఆహ్వానించారాయన. "నేను మీకంటే బాగా చిన్నవాడ్ని. మన్నించండి!" నమ్రతగా పలికి, ఆయన వెంట లోపలకి నడిచాడు.

ఆ అలికిడికి కర్పూరిక తల్లికూడా లేచింది. కర్పూరిక నిద్రపోనే లేదు. అనీజీగావుండి, లేచి హాల్లోకి వచ్చింది. సరిగ్గా అప్పుడే లోపలకి వస్తున్న లలిత్‌ని చూడగానే ఆమెలో ఆవేశం బుసలు కొట్టింది! కక్ష, కార్పణ్యాలతో, నిలువెల్లా కంపించి పోయింది.

"యూ ... ఈడియట్ ...! నువ్వా ... ?నువ్వు...ను ... వ్వు....ఇక్కడికెందుకొచ్చావ్? ఇంకా ఏం సర్వనాశనం చేయాలని దాపురించావ్? పో ...! వెళ్ళిపో!" పిచ్చి పట్టిన దానిలా అరిచింది. ఆ గోలకు కావ్య, శిల్పలు కూడా నిద్ర మొహాలతో అయోమయంగా చూడసాగారు.

లలిత్ స్థిరంగానే నిలబడి వున్నాడు. అతనేమాత్రం చలించినట్లు కన్పించ లేదు.

"ఫస్ట్ యు గెటవుట్! గెటవుట్" అరుస్తూ, అతన్ని సమీపించి రెండు చేతులతో అతని మెడను గట్టిగా బిగించి, పిసకసాగింది. ఏమాత్రం అడ్డు చెప్పకుండా పళ్ళబిగువున బాధను ఓర్చుకుంటూ ... మౌన మునిలా నిలబడ్డాడు లలిత్.

కర్పూరిక తల్లిదండ్రులు, కావ్య ఖంగారుగా కర్పూరికను సమీపించి "ఇదేం పని తల్లీ?" అంటూ ఆపారు. ముగ్గుర్నీకూడా నెట్టిపారేసి, మరలా లలిత్ గొంతు పట్టుకుంది. ఈసారికూడా ఏమాత్రం తొణక్కుండా నిల్చున్నాడు లలిత్. "శిక్ష విధించమన్నట్లు" తల వంచి నిల్చున్న అతన్ని చూస్తుంటే కర్పూరిక తల్లిదండ్రులకు చాలా ఆశ్చర్యం వేసింది.

అక్క ప్రవర్తన చాలా వెగటుగా అన్పించింది కావ్యకు. అతనివైపు దిగులుగా చూసింది.

"కర్పూరీ! ముందతన్ని వదులు." రెక్కపట్టి బలంగా ఒక్కలాగు లాగారు కర్పూరిక నాన్నగారు. "నన్నాపకండి నాన్నా! ఈ పశువును చంపి నేను చావాలి" రౌద్రంగా వుంది కర్పూరిక అవతారం.

"నోర్ముయ్!" కర్పూరిక చెంపమీద కొట్టారు శంకరం.

"నా ... న్నా!" కర్పూరిక కళ్ళలో ఆశ్చర్యం, బాధ! ఆ దెబ్బ తనకే తగిలినంతగా విలవిల్లాడిపోయాడు లలిత్.

"ప్లీజ్! ఆమెనేమీ అనకండి. తప్పంతా నాదే, ఆమె బాధ తీరిపోయేదాకా నన్ను చిత్రవధ చేయనివ్వండి" వేదనగా పలికాడు లలిత్.

"మీరంత మెత్తగా ఉండబట్టే ఆమె అట్లా ఆడుతోంది" కోపంగా అంది కావ్య. కావ్యవైపు అందరూ విస్తుపోయి చూశారు.

"ఏమిటే? నువ్వు కూసేది!" చెల్లెలిమీదకు చేయెత్తింది కర్పూరిక. "మర్యాదగా దించు" గర్జించింది కావ్య. "కావ్యా!" ఆశ్చర్యంతో గొణిగాడు లలిత్.

"నువ్వు లోపలికిరా బాబూ!" లలిత్‌ని చప్పున అంతవరకూ కర్పూరిక

పడుకొనివున్న గదిలోకి లాగి తలుపులు బిగించారు కర్పూరిక నాన్నగారు. దిమ్మెర పోయినట్లు చూసింది కర్పూరిక.

రాత్రి కావా

లని నేనలా ప్రవర్తించలేదు. లోగడకూడా ఆమెనెప్పుడూ విపరీతంగా ప్రేమిస్తూ వచ్చానేతప్ప, ద్వేషించలేదు. నేనామెపట్ల అనుచితంగా ప్రవర్తించాననటానికి ఒక్క కారణం చూపమనండి. అందుకామె ఏ శిక్ష విధించినా ఆనందంగా భరిస్తాను. అంతే కాని ... నన్ను ... నా ప్రేమనుమాత్రం కించ పరచవద్దని చెప్పండి. నేను రెండు చేతులూ ఎత్తి ప్రార్థించేదదే..."

లలిత్ గొంతులోని బాధను, ఉద్వేగాన్ని చూసి చలించిపోయారు కర్పూరిక నాన్నగారు. అతను ఎవరి కుర్రాడో తెలిశాక, మరీ విచలితులయ్యారు. అంత ధన వంతుల కుర్రాడై వుండికూడా, తను అనుకోకుండా చేసిన తప్పుకు అలా క్షమాపణలు కోరుతున్నాడంటే ఆయనకెంతో ఆశ్చర్యంగానూ, ఆనందంగానూ వుంది. "ఈ రోజుల్లో లలిత్‌లాంటి కుర్రాళ్ళు అసలుంటారా ?" అనే అనుమానం వచ్చిందాయనకు.

బిడ్డ అదృష్టవంతురాలనే చెప్పాలి. రాత్రి ఆ సమయంలో నువ్వు కాకుండా వేరే ఇంకెవరైనా అయితే మా ఖర్మ ఎలా ఉండేదో ? ఊహించటానికే భయంగా వుంది. అది నీపట్ల ఎందుకంత మూర్ఖంగా బిహేవ్ చేస్తున్నదో నాకూ అర్థంగావటంలేదు ? దాని మనస్తత్వం ఏమిటో ఒక్కోసారి తల్లిదండ్రులమైన మాకే తెలియదు. నేను లాల నగా నచ్చజెప్పి చూస్తాను. ఎందుకంటే ? ఇది .... దాని భవిష్యత్తుకు సంబంధించి నది కదా ?" గంభీర స్వరంతో అన్నారు.

"మీ సహృదయతకు ఎంతో కృతజ్ఞుడ్ని. ఒక ఆడపిల్ల తండ్రిగా మీ నోటి నుండి ఎన్ని దూషణలు వినవల్సి వస్తుందోనని భయపడుతూ వచ్చాను. అంతేకాదు, మీరేశిక్ష విధించినా భరించటానికికూడా సిద్ధపడే వచ్చాను. కానీ .... మీ మంచితనం నన్ను కదిలించి వేస్తోంది" బొంగురు స్వరంతో చెప్పాడు లలిత్.

లలిత్ మాటలకు ఆయనలోని పితృవాత్సల్యం ఉప్పొంగింది. "బాబూ !" గద్గద స్వరంతో లలిత్‌ని ఆలింగనం చేసుకున్నారు. ఇద్దరికళ్ళూ చెమ్మగిల్లాయి.

"ఇక వస్తానండి ! నా అదృష్టాన్ని మీ చేతుల్లో పెడుతున్నాను" దిగులుగా చెప్పి బయల్దేరాడు లలిత్. తలుపులు తీసిన చప్పుడు వినపడగానే త్రుళ్ళిపడ్డారు తల్లీ కూతుళ్ళిద్దరూ. అతనివైపు చూడటమే మహాపాపమన్నట్లు తల ప్రక్కకు తిప్పుకుంది కర్పూరిక. లలిత్ హృదయం గిలగిల్లాడింది.

పూర్తిగా తెల్లవారగానే కర్పూరిక నాన్నగారు స్నానంచేసి, కాఫీత్రాగి, బయ ల్దేరారు. ఆయన కాళ్ళు కళ్యాణి ఇంటివైపు దారితీశాయి.

"అసలీపని ఎవరు చేసి వుంటారమ్మా ?" కళ్యాణివైపు చూస్తూ అడిగారు కర్పూరిక నాన్నగారు.

"ఇంకెవరు ? ఆ శశిగాడు, వాడి ముఠాయే చేసి వుంటుంది. ఎలక్షన్స్‌లో వాడు గెలవలేదన్న కోపంతో ఈ ఘాతుకానికి తలపడ్డాడు. పైపెచ్చు లలిత్‌మీద నేరం మోపుతున్నాడట. కరెంట్ రాగానే పోలీస్ స్టేషన్‌కి 'రిపోర్ట్' చేశారు ప్రిన్సి పాల్. పోలీసులు వెంటనే ఎంక్వయిరీకి వచ్చారు. అప్పటికే కొన్ని జీవితాలు బుగ్గి పాలయ్యాయి" వేదనగా చెప్పింది కళ్యాణి.

"ఎవరినీ అరెస్ట్ చేయలేదా ?" కర్పూరిక నాన్నగారు సందేహంగా అడిగారు.

"బలమైన ఎవిడెన్స్ లేకుండా వాళ్ళేంచేయగలరు ? కానీ ... దురదృష్టవశాత్తు అప్పుడక్కడ లలిత్‌గారు లేరు. అనుమానం వారిమీదకు పోయింది. ఆ తర్వాత కొద్దిసేపటికే వారొచ్చారు. ఎక్కడికెళ్ళిందీమాత్రం వారు చెప్పలేదు. నేనప్పుడే అనుకున్నా ... బహుశా కర్పూరికను ఇంటిదగ్గర డ్రాప్ చేయటానికే వెళ్ళివుంటారని" కళ్యాణి గొంతులో రవ్వంత 'ఈర్ష్య' ధ్వనించింది.

"ఎలా వూహించావ్ ?" కళ్యాణి ముఖకవళికల్ని బాగా పరిశీలిస్తూ అడిగారు.

"అతనెక్కడున్నా .... ఎలాంటి పరిస్థితిలోవున్నా అతని మనస్సులో కర్పూ రికే వుంటుందని నాకు బాగా తెల్సు. అందులోనూ అటువంటి ఆపద సమయంలో కర్పూరిక గుర్తురాకపోవడమేమిటి ? ప్చ్ ... కానీ .... ఏంలాభం ? అతనంతగా ప్రేమ చూపిస్తున్నా కర్పూరిక మూర్ఖత్వాన్ని ప్రదర్శించటం నిజంగా చాలా విచా రించదగిన విషయం...."

"నిజంగానాఅమ్మా !" శంకరంగారు సంబరంగా అడిగారు.

"నిజమంకుల్ ! మన కర్పూరిక చాలా మూర్ఖంగా బిహేవ్ చేస్తోంది. అతని కోసం ఎంతమంది ఆడపిల్లలు వల వన్నారో, ఎంతమంది మనస్సులోనే గుప్తంగా ఆరాధిస్తున్నారో, కర్పూరిక గ్రహించివుంటే అలా బిహేవ్ చేయదు. గ్రహించికూడా అలా మొండిగా బిహేవ్ చేస్తున్నదని నా అనుమానం. ఎందుకంత అకారణంగా అతన్ని ఈసడించుకుంటున్నదో బుర్ర బద్దలు చేసుకున్నా నాకర్థంగావటంలేదు" బాధగా పలికింది కళ్యాణి.

* * *

శంకరంగారు ఇంట్లోకెళ్ళబోతుంటే ప్రక్కింటి రెడ్డిగారు -"ఏమిటండీ... ? రాత్రి మీ అమ్మాయి చదువుతున్న కాలేజీలో ఏదో 'ఘోరం' జరిగిందట. అందరూ చెప్పుకుంటున్నారు" క్యూరియాసిటీగా అడిగాడు. కొంతమందికి ఇటువంటి విషయా లలో చాలా ఉత్సాహం ! ప్రక్కవాళ్ళు సమస్యల వలయంలో ఇరుక్కుపోయి నరక యాతన అనుభవిస్తుంటే ..., అది చూసి వినోదించటం అదొక 'హాబీ'గా పెట్టు కుంటారు. ఆవతలివాళ్ళ కళ్ళ రక్తాన్ని స్రవిస్తుంటే వీళ్ళ అంతరంగాలు పరవశించి పోతుంటాయి. ఆ కోవకు చెందిన వ్యక్తే రెడ్డిగారు కూడా.

"అవునండీ !" అని ముభావంగా లోపలకు తప్పుకోబోయారు శంకరం.

"మన అమ్మాయి క్షేమంగా చేరిందికదా !" ప్రేమ, ఆదుర్దా ... నటించాడు.

ఆఁ. అమ్మాయి చాలా ముందేవచ్చింది! చెప్పి లోపలకు వచ్చారు. అలా అబద్ధమాడటం ఒక ఆడపిల్ల తండ్రిగా ఆయన బాధ్యత. అంతకంటే ఏ తండ్రి అయినా ఏం చెప్పగలడు?

ఎదురొచ్చిన భార్యతో -"అమ్మాయి మొహం కడుక్కొని కాఫీ త్రాగిందా?" గంభీరంగా అడిగారు. 'కాఫీయా? దాని బొంద?' కావ్య అంటుంటే తేలిగ్గా కొట్టేశాము గానీ... దానంత మొండి ఘటం ఈ పపంచములో మరొకటుండదని అన్పిస్తున్నదండీ!

కళ్యాణి చెప్పినదంతా నిజమేననిపించింది. "తమాషా ఏమిటోగాని?" ఆయనకసలు లలిత్‌మీద కోపం రావటంలేదు. ఎందుకని రావటంలేదో కూడా ఆయనకి అర్థంగావటంలేదు. బహుశా, చేసిన తప్పును తనంతట తనేవచ్చి స్వయంగా ఒప్పుకోవటం వలన కావొచ్చు!

అందువలనే భార్య చెప్పిన మాటలు విని ఆయన మండిపడ్డారు.

"ఏదది?" కోపంగా అడిగారు.

"బాత్రూములో స్నానం చేస్తోంది" బెంబేలు పడుతూ చెప్పింది కర్పూరిక తల్లి శాంతాదేవి. పచార్లుచేస్తూ తిరిగారు శంకరంగారు.

కూతురు స్నానంచేసి రాగానే గదిలోకి పిలిచి తలుపులు బిగించారు. మూస్తున్న ఆ తలుపులవైపు శాంతాదేవి, కావ్య, శిల్పలు భయం, భయంగా చూడసాగారు.

"అమ్మ చెబుతున్నది నిజమేనా?" కర్కశంగా అడిగారు. ఆయన కూతురితో అలా మాట్లాడటం అదే మొదటిసారి. తల వూపింది కర్పూరిక.

"నీకెంతధైర్యం? మతి వుండే మాట్లాడుతున్నావా?" కోపంగా అన్నారు.

"మతి ఇంకా పోలేదుకనుకనే ఒక దుర్మార్గుణ్ణి చట్టానికి అప్పగించాలనుకుంటున్నాను నాన్నగారూ!" ఏమాత్రం తొణక్కుండా చెప్పింది కర్పూరిక.

"నోర్ముయ్! అతన్ని చట్టానికి అప్పగించిన తర్వాత నీ గతి ఏమవుతుందో ఆలోచించావా?" మాట్లాడలేదు కర్పూరిక.

"మాట్లాడవేం?" శంకరంగారు రెట్టించారు కూతుర్ని. తండ్రివైపు గమ్మత్తుగా చూస్తూ "ఏమీకాదు!" నవ్వుతూ అంది.

"ఏమీ ఎందుకు కాదు! నీ బ్రతుకు కుక్కలు చింపిన విస్తరవుతుంది. నీలాంటి దౌర్భాగ్యులాలికి జన్మనిచ్చినందుకు మేము ఆ అవమానం భరించలేక, ఏ నదిలోనో దూకి చావాల్సి వస్తుంది. ఇక ఆ ఇద్దరాడపిల్లలు జీవితాంతము నీకు పడే ఏడవాల్సి వస్తుంది. నువ్వు మాత్రం బండరాయిలా అందరి ఆనందాన్ని హరించి, నిత్యెపంలా బ్రతుకుతావ్" కసిగా అన్నారు.

కర్పూరిక తండ్రివైపు విభ్రాంతిగా చూస్తూ -"మీరు... మీరు... మీరేనా నాన్నగారూ ఇలా మాట్లాడుతున్నది?" అడిగింది. ఆమెకు మాటలు కూడా తడబడ్డాయి.

"ఎందుకంత ఆశ్చర్యం....? నేనే మాట్లాడుతున్నాను. నీ అతి తెలివికి, మూర్ఖత్వానికి, ఎవరైనా ఇలాగే మాట్లాడుతారు."

ఆయనంత కఠినంగా మాట్లాడగలరని ఏనాడూ వూహించని కర్పూరిక నిశ్చేష్టురాలైంది. ఆమె కళ్ళు జల, జల. వర్షించాయి.

* * * *

లలిత్ కర్పూరిక దగ్గరకు అశగా బయల్దేరే సమయాన మామ్మ కళ్యాణి విషయం ప్రస్తావించేసరికి నిశ్చేష్టుడయ్యాడు.

"క్షమించుమామ్మా! కళ్యాణి అంటే నాకలాంటి అభిప్రాయం లేనేలేదు. ఏనాడూ ఆ అమ్మాయినలాంటి దృష్టితో చూడలేదు. కళ్యాణి నాకొక అపురూపమైన మిత్రురాలు. ఆ అమ్మాయి యిష్టపడితే ఆ నోటితో 'అన్నయ్యా' అని పిలిపించుకోవాలని ఉంది" చిన్నగా చెప్పాడు.

మామ్మ చాలా నిరుత్సాహ పడిపోయింది. "అలా దిగులు పడకు మామ్మా! నీకు కళ్యాణికన్నా అందమైన అమ్మాయిని మనుమరాలిగాతెస్తానుండు!" ఉత్సాహంగా అన్నాడు.

"నిజంగానా?" అన్నట్లు చూసిందామె. "నమ్ము నమ్ము మామ్మా!" నవ్వుతూ అని వెంటనే కర్పూరిక దగ్గరికి బయల్దేరాడు.

లలిత్‌ని చూడగానే సాదరంగా ఆహ్వానించారు శంకరంగారు, శాంతాదేవి. అతని కళ్ళు కర్పూరికకోసం వెదకటం గమనించి "కూర్చోబాబూ! అమ్మాయి బాత్రూములో వుంది" ప్రేమగా చెప్పింది కర్పూరిక అమ్మగారు.

శంకరంగారికెదురుగా కూర్చున్నాడు. కావ్య హాలు అవతల నుంచొని లలిత్‌ని చాటుగా చూస్తోంది! శంకరంగారు భార్యకు సైగ చేయగానే కాఫీ కప్పుతో తిరిగొచ్చిందామె. త్రాగాలని లేకున్నా వాళ్ళ సంతృప్తికోసం త్రాగాడు లలిత్.

అతనొచ్చిన విషయం తెలియక బాత్రూమునుండి మామూలుగా హాల్లోకొచ్చింది కర్పూరిక. స్వచ్ఛమైన శ్వేత గులాబీలా వున్న ఆమెను చూడగానే లలిత్ గుండె వేగంగా, చిత్రంగా స్పందించింది. లోగడ ఆమె ముఖం చిట్లించుకోగానే మనస్సు గాయపడి, అవతలి కెళ్ళిపోయేవాడు. కానీ... ఆ సంఘటన జరిగి, ఇద్దరిమధ్యా ఒక విచిత్రమైన అనుబంధం ఏర్పడిన తర్వాత ఆమె అసహ్యించుకున్నా, తిట్టినా బాధనిపించటంలేదు. ఆమె పరాయిగా అన్పించటంలేదు. తన స్వంత మనిషి తనను చనువుగా మందలిస్తున్నట్లు ఫీలవుతున్నాడు లలిత్. ఆనాటిరాత్రి ఆమె 'స్పర్శ' అతని అణువణువునా నిండి పులకరింపజేస్తోంది. ఆమె శరీర మృదుత్వం, గులాబి రంగును అతిశయింపజేసే ఆ చేతులు, తేనెలూరించిన ఆమె అధరాలు, అతడ్ని ప్రతిక్షణం వివశుణ్ణి చేస్తున్నాయి. స్పందించే అతని ఎద తీరాలలో ఎగిసే భావకెరటాలెన్నెన్నో....?

అతనినక్కడ సడన్‌గా చూడగానే సర్పద్రష్టలాగా ఆగిపోయింది కర్పూరిక. ఎందుకో తెలియదు గానీ, లలిత్ లేచి నిలబడ్డాడు. అతనెప్పుడైతే లేచి నిలబడ్డాడో. అప్పుడే చివ్వున వెనుదిరిగింది కర్పూరిక.

"ప్లీజ్ ! కర్పూరికా ! ఇటొచ్చి కూర్చోండి ; మీతో కాస్త మాట్లాడాలి..."

ప్రాధేయ పూర్వకంగా కోరాడు లలిత్. "మీరు వెళ్ళిపోవటం మంచిది !" ఛీత్కారం చేసింది. లలిత్ మొఖం బాధతో కమిలిపోయింది.

"ప్లీజ్ ... కర్పూరికా !" మరోసారి జాలిగా అడిగాడు లలిత్.

"సిగ్గు, లజ్జ, ఉన్న మనిషికి ఒకసారే చెప్పేది" పొగరుగా అంది.

కూతుర్ని ఎప్పుడు సమీపించారో ... ఏమో ? చెంప ఛెళ్ళుమనిపించారు శంకరంగారు.

చెంప పట్టుకొని పిచ్చిదానిలా చూడసాగింది కర్పూరిక. "మీరు చాలా త్వర పడ్డారు" బాధగా అన్నాడు లలిత్. అతన్ని కాల్చివేసే చూపులతో చూసింది కర్పూరిక.

"ఇదంతా నావలనే, నన్ను క్షమించు కర్పూరికా !" పశ్చాత్తాపంగా చెప్పాడు లలిత్. "మనందరం ఇలా మాట్లాడితే, దానికి కాస్త తెచ్చాం !" కోపంగా అన్నారు శంకరం. తండ్రి వైపు రోషంగా చూసింది కర్పూరిక.

"బుద్ధిగా కూర్చొని, అతను మాట్లాడేది విను ... నీకూ, మాకూ క్షేమంగా ఉంటుంది" గంభీరంగా హెచ్చరించింది తల్లి. "ఊఁ ... కూర్చో !" శంకరం గారు కూడా గదిమారు. ఇక కూర్చోక తప్పలేదు కర్పూరికకు,

కర్పూరికకు ఆ క్షణాన ఆడజన్మంటేనే రోత అన్పించింది. ఎంత పెద్ద చదువులు చదివినా, ఎంతగా విజ్ఞానాన్ని సంపాదించినా .... ఆడది అబలగానే మిగిలిపోతున్నది. తల్లిదండ్రులు, సమాజంకూడా ఆమెను ఒక ఇనుపచట్రంలో బిగించి ఆనందిస్తున్నారుతప్ప, ఆమెకూ ఒక మనస్సుంటుందని, ఆ మనస్సుకూ కొన్ని నిర్దుష్టమైన ఆశలు, ఆశయాలు ఉంటాయని ఎందుకనుకోరు ? తోలుబొమ్మ నాడించినట్లు ఆడిస్తారెందువల్ల ? ఇలా పరిపరివిధాల ఆలోచిసోంది కర్పూరిక.

కర్పూరికనలా శాసించినట్లు కూర్చోబెట్టటం లలిత్‌కి బాధనిపించింది.

ఒక్కక్షణం అతని వైపు ప్రసన్నంగా చూసింది కర్పూరిక.

ఆ ఒక్కక్షణం చాలు, లలిత్‌లో ధైర్యం పుంజుకోవటానికి. ఆక్షణం అలా చూడకపోతే లలిత్ అంత ధైర్యం చేసేవాడు కాదేమో ?

"మిమ్మల్ని వివాహం చేసుకోవాలనుకుంటున్నాను కర్పూరికా ! మీ మీదున్న నా అపూర్వమైన ప్రేమను నిరూపించటానికని అనండి, లేక, చేసిన తప్పును సరిదిద్దుకోవటం అనండి .... మీరేదైనా భావించండి ! నా మనస్సులోని మాటను చెప్పాను. తొందరేంలేదు. బాగా ఆలోచించుకునే చెప్పండి. మీరు పైకి నన్నెంత ద్వేషిస్తున్నా మీ మనస్సు రహస్య అరల్లో నాకొక్కరికే చోటుంది. ఆ విషయాన్ని మీరు ఒప్పు

కోకపోయినా అది పచ్చి నిజం. ఎవరు గ్రహించలేకపోయినా, నేను గ్రహించాను. నేను చదువుతున్న సైకాలజీ నాకు కొన్ని జీవిత సత్యాలను నేర్పటమేకాక నా హృదయ రాజీ ఆంతర్యాన్నికూడా తెలియజెప్పింది. ఎవరి సహనానికైనా కొన్ని హద్దులంటూ ఉంటాయి. ఆ విషయాన్ని గుర్తుంచుకుని నా హృదయ కుసుమాన్ని దయచేసి కరుకు రాతికేసి విసిరిగొట్టకండి. అది తుత్తునియలైపోయిన తర్వాత, నాతోపాటు మీరుకూడా విచారించవల్సి వస్తుంది." చాలా గంభీరంగా చెప్పి అక్కడినుండి స్పీడుగా బయట పడ్డాడు.

కూర్చున్న కుర్చీలోనే శిలలా బిగుసుకుపోయింది కర్పూరిక చాలా సేపు. గడిచిన తర్వాత కానీ, ఆమె మామూలు మనిషి కాలేకపోయింది.

* * *

ఒకరోజు కర్పూరిక ఒక భయంకర నిజాన్ని తెల్సుకొని చిగురుటాకులా వణికిపోయింది. అసలానిజాన్ని ఎలా జీర్ణించుకోవాలో ఆమెకర్థం కాలేదు.

"తను లలిత్ బిడ్డకు తల్లి కాబోతున్నదా ? ఓ ... మైగాడ్ ! ఎంత దారుణమైన స్థితికి నన్ను రప్పించావు తండ్రీ ... ? ఏ వ్యక్తినైతే ద్వేషిస్తానో, అవ్యక్తిద్వారానే నా యవ్వనపు శాలిరేకుల్ని చిదిమివేయించావు. అది చాలదన్నట్లు ఆ దుర్మార్గుడి ప్రతిరూపాన్నికూడా మోయమని శాసిస్తున్నావా ? నీవెంత క్రూరుడివి ? ఇన్నాళ్ళూ నిన్ను చాలా గుడ్డిగా పూజించాను. నేను నీకంటే క్రూరురాల్ని ! ఆ విషయం గుర్తుంచుకో ! ఈ పాపాన్ని నేను చస్తే భరించలేను ! ఆ దుర్మార్గుడి నీడకూడా నామీద పడటానికి వీల్లేదు !" కసిగా పళ్ళు కొరికి, ఒక్క ఉదుటున లేచింది. ఆమెకాళ్ళు ఒక నర్సింగ్‌హోమ్‌వైపు స్థిరంగా పడ్డాయి.

టెస్ట్‌చేసిన లేడీడాక్టరు నాలుగు చీవాట్లు పెట్టింది. "నో .... డాక్టర్ ... ! ఎంత ప్రమాదమైనాసరే ... ఫర్వాలేదు కానీ ఈ విషాన్ని నా రక్తంలో మాత్రం కలిపేదిలేదు. ఏదో విధంగా నన్ను విముక్తిరాల్ని చేయండి ! మీకు చేతులెత్తి ప్రార్థిస్తాను".... నిలబడే శక్తిలేక, క్రింద కూలబడి రోదిస్తూ అడిగింది కర్పూరిక.

కర్పూరిక భుజంమీద లాలనగా చేయివేసి పైకిలేపి- "నువ్వు చాలా రాంగ్‌గా ఆలోచిస్తున్నావు. నీ అభిప్రాయాన్ని మార్చుకొని వెళ్ళిపో"...! గంభీరంగా హెచ్చరించిందా డాక్టరు. నిద్రలో లేచి నడుస్తున్నదానిలా తూలుతూ నడవసాగింది.

కర్పూరిక హాస్పిటల్ నుండి బయటకు రావటం... అప్పుడే అటు స్కూటర్ మీద వెళుతున్న లలిత్ కళ్ళబడింది. తుళ్ళిపడి స్కూటర్‌ని ఆపి, ధగి లోపలికెళ్ళాడు.

ఎంతో ఆత్రంగా కర్పూరిక గురించిన వివరాలు చెప్పి, డాక్టర్‌నడిగాడు. ఆమె మొదట సందేహించినా.... తర్వాత అసలు విషయం చెప్పింది. అతనూహించింది.వేరు ...! వింటున్నది వేరు ..., తీరా అడిగాక ఆమె చెప్పిన విషయం విని.... చలించిపోయాడు. అసలు ఒక అయిదు నిమిషాలపాటు నోటమాట రాలేదతనికి. ఆ

అయిదు నిమిషాల తర్వాత.... ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అయ్యాడు. ఆ తర్వాత మరలా ఉగ్రనర్సింహమూర్తిలా మారాడు.

"రాస్కెల్...! ఎంతకు తెగించింది? ఎవ్వరికీ చెప్పా, పెట్టకుండా ఒక్కతే హాస్పిటల్ కొచ్చి 'అబార్షన్' చేయించుకోవాలని ప్లానా....? ఎంత ధైర్యం....? అసలు ఆడదేనా....?
తన బిడ్డ తనకు దక్కాలంటే ఏంచేయాలి...? ఆ రాక్షసి ఆట ఎలా కట్టించాలి"? ఎన్నడూ కూడా కర్పూరిక అంటే అంత కోపం, అసహ్యం, కల్గలేదు లలిత్‌కి. ఆవేశంతో అతని పిడికిళ్ళు బిగుసుకున్నాయి.

వెంటనే స్కూటర్ స్టార్ట్‌చేసి శంకరంగారు పనిచేసే ఆఫీసుకొచ్చాడు. జేవురించిన లలిత్ ముఖాన్ని చూసి, ఆయన బాగా కలవరపడిపోయారు! మరో ప్రశ్నకు తావివ్వకుండా, వెంటనే ఆయన్ని స్కూటరెక్కించుకొని పబ్లిక్ పార్కుకు తీసుకెళ్ళి కూతురు చేసిన ఘనకార్యం చెప్పాడు. అతని గొంతులో ఎప్పుడూ చూడని కరుకుదనాన్ని చూసి విస్మయం చెందారు శంకరంగారు. అంతేగాదు....! కూతురిమీద వెర్రికోపం వచ్చింది.

లలిత్ చెప్పగానే.... ఆయన కూడా వెంటనే ఆవేశంగా లేచారు. ఏం మాట్లాడకుండా ఆయన్ని మరలా స్కూటరెక్కించుకొని, వాళ్ళింటిముందు ఆపి—
"మీరు మీ అమ్మాయికి మంచిగానే చెప్పుకుంటారో, చెంపలు వాయించే చెప్పుకుంటారో, అది మీ ఇష్టం! కానీ.... మీ అమ్మాయిని ఒక్క విషయం మాత్రం బాగా గుర్తుంచుకోమని చెప్పండి...! నేను తెలిసే చేశానో, తెలియకే చేశానో.... ఏదైనా నా వలన ఒక తప్పు జరిగిపోయింది! అందుకు శిక్ష అనుభవించటానికి రడీగానే వున్నాను. ఆమె పొట్టలో, పెరుగుతున్న నా ప్రతిరూపానికి ఎటువంటి 'హాని' జరిగినా నేను భరించలేనని నా మాటగా చెప్పండి! ఏ మాత్రం 'హాని' తలపెట్టినా నాలో మనిషినికాక మృగాన్ని చూడవల్సి వస్తుందని చెప్పండి....! నా సహనానికి అంతం చూడాలన్న ఆమె ప్రయత్నాన్ని మానుకోమని చెప్పండి"....! సీరియస్‌గా హెచ్చరించి, వెళ్ళిపోయాడు. శంకరంగారు కూడా అతని గొంతులోని కఠినత్వానికి భయపడిపోయారు! తడబడుతున్న అడుగులతో ఇంట్లోకిచేరి, కూలబడి, మంచినీళ్ళు తెమ్మనమని చెప్పటానికి కూడా నోటమాటరాక, భార్యకు 'సైగ' చేశారు. ఆమె ఖంగారుపడుతూనే మంచినీళ్ళ గ్లాసు తెచ్చి, భర్త చేతి కందించింది.

* * * *

కర్పూరిక తల్లి భోంచేసి, నిద్రకుపక్రమించ బోతుండగా—
"ఆ పెద్దదాన్నిటు పిల్చుకురా..."! గంభీరంగా చెప్పారు శంకరం.
"ఇప్పుడా..."? మరలా ఏం ఉపద్రవం వచ్చి పడిందోనని? గాభరా పడుతూ వెళ్ళి కూతుర్ని పిలుచుకొచ్చిందామె.

"కూర్చో...."! ఆయన గొంతులో ఎటువంటి ఆప్యాయతాలేదు. మౌనంగా కూర్చుంది కర్పూరిక.

"నీకు చాలా తెలివితేటలున్నాయని మాకు తెల్సు. కానీ.... కడుపు తీయించుకోవటం కూడా బాగా తెల్సని... మాకు తెలియదు....!" ఎట్టి ఉపోద్ఘాతం లేకుండానే శంకరంగారు సూటిగా అన్నారు. ప్రక్కన బాంబు పడ్డట్లు అదిరిపడింది శాంతాదేవి. కర్పూరిక కూడా విస్తుపోయింది.

"ఏమిటే ఆ దెయ్యపు చూపులు...? నాన్నగారు అంటున్నది నిజమేనా...?" కూతుర్ని గద్దించి అడిగింది. కర్పూరిక మాట్లాడకుండా చూస్తోంది.

"నిజమే!" తల్లికి నిర్లక్ష్యంగా జవాబిచ్చింది.

"ఎంత నిర్లక్ష్యంగా చెబుతున్నదో చూడు" శంకరంగారు కోపంగా అన్నారు.

"మీరు .... మీరే ... నన్నిలా తయారు చేశారు! కన్నబిడ్డను పరాయిదానిలాగా చూస్తున్నారు. కన్నబిడ్డ శీలాన్ని మంట గలిపిన రాక్షసుడ్ని నెత్తినెక్కించుకొని, పూజిస్తూ, నన్ను ద్వేషిస్తున్నారు. భేష్! ఇలాంటి తల్లిదండ్రులే అందరూ అయితే ఆడపిల్లల బ్రతుకులు ఇంకెంత అధ్వాన్నంగా వుండేవో ...?" రోషావేశాలతో పలికింది కర్పూరిక.

"నోర్మూయ్! ఇంకా పేలుతున్నావా?" సీరియస్‌గా హెచ్చరించి భార్యను వెంటబెట్టుకొని, అక్కడినుండి చర చర వెళ్ళిపోయారు శంకరంగారు.

* * * *

"ఏమాలోచించుకున్నావ్?" ఆఫీసుకెళ్ళబోతూ అడిగారు శంకరం. తండ్రివైపు నిర్భయంగా చూస్తూ "మీకు కావాల్సింది మీ పరువు మంటగల్సి పోకుండా ఉండటమేకదా? నా మనస్సు, సుఖం, మీకు అక్కరలేనప్పుడు ... ఆ పశువునే కట్టుకోవటం ఎందుకు? మీ పరువు పోకుండా ఎవరో ఒక మగాడ్ని కట్టుకుంటాను. తీసుకురండి. అయితే ఒక విషయం! నా విషయం తెల్సి, నన్ను స్వీకరించటానికి సిద్ధపడాలి! అంతేకాని నా బొందిలో ప్రాణముండగా ఆ లలిత్‌నిమాత్రం కట్టుకునేది లేదు! నేను మీకంటే మొండిదాన్నని గుర్తుంచుకోండి!" చెప్పి చర చర వెళ్ళిపోయింది. శంకరంగారు కూతురి మాటలకు నిశ్చేష్టులయ్యారు.

ఆ తర్వాత వెంటనే ఆయన లలిత్ దగ్గరికి బయల్దేరారు. ఆయన చెప్పిన మాటలు విని ఉగ్రుడయ్యాడు. అతనిలోని శాంతం, వివేకం, తమాషాగా ఎగిరిపోయి వాటిస్థానంలో క్రౌర్యం, ప్రతీకారం చోటుచేసుకున్నాయి.

"నా ప్రయత్నం నేను చేసుకుంటాను, మీ ప్రయత్నం మీరు చేసుకోండి. ఆ రాక్షసి కడుపులో పెరుగుతున్న నా బిడ్డ క్షేమంగా ఉన్నంతవరకే, ఎవరినైనా నేను క్షమించేది" గంభీరంగా అన్నాడు లలిత్. కాళ్ళీడ్చుకుంటూ ఇంటికి చేరారు శంకరంగారు.

ఆయన మనస్సు కూతురి హెచ్చరిక, లలిత్ హెచ్చరికల గురించే ఆలోచించ సాగింది. అలా ఆలోచించగా, ఆలోచించగా ఆయన మనస్సులో ఒక మంచి ఆలోచన మెదిలింది. ఉత్సాహంగా పైకి లేచి కలాన్ని, కాగితాన్ని చేతిలోకి తీసుకున్నారు.

చివరి పరీక్ష రాసి ఇంటికొచ్చి 'టీ' త్రాగుతోంది కర్పూరిక. శంకరంగారు ఏం మాట్లాడకుండా ఒక లెటర్ని కర్పూరిక చేతిలో పెట్టి, అవతలికెళ్ళిపోయారు ఆశ్చర్యంగా దాన్ని విప్పి చదవసాగింది.

"గౌరవనీయులైన శంకరం మాష్టారికి !"

'కుమార్' నమస్కరించి వ్రాయునది! మీ లెటరు చేరింది. విషయాలు తెలిశాయి. ఇప్పటికైనా నేను గుర్తొచ్చినందుకు ఎంతో కృతజ్ఞుడ్ని. మీరుణం అసలు తీర్చుకోలేనేమోనని ఎప్పుడూ బాధపడుతుండేవాడ్ని. కానీ .... ఇప్పుడా అవకాశం వచ్చినందుకు చాలా సంతోషిస్తున్నాను. మీరు నన్ను వేడుకోవటం ఏమిటి మాష్టారూ ? ఆజ్ఞాపించాలిగానీ.

"ఆనాడు మీరు నా చదువుకు సాయం చేయకపోతే నేను ఏస్థితిలో ఉండేవాడినో ...? ఆనాడు నా భావి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయటమేకాక, మరలా ఈనాడు మీ బిడ్డను నాకు భార్యగా ప్రసాదిస్తూ నన్నెంతో అదృష్టవంతుడ్ని చేస్తున్నారు. కర్పూరిక గురించి మీరేమీ భయపడకండి. ఆమెను నేను మనస్ఫూర్తిగా స్వీకరిస్తాను. ఆమె గతం నాకనవసరం. నన్నొక భర్తగా గౌరవించి, ప్రేమిస్తే నాకంతేచాలు. యవ్వనంలో తెలియక ఒక తప్పటడుగు వేసినంత మాత్రాన జీవితాన్ని సంపూర్ణంగా ఆస్వాదించటానికే అనర్హులంటే నేనొప్పుకోను. ఎట్టి శంకలూ లేకుండా మా వివాహ మహోత్సవానికి కర్పూరికను రడీగా ఉండమనండి ! నేనిలా నిర్ణయించుకోవటం తొందరపాటూ కాదు, మీపట్ల నేను చూపిస్తున్న కృతజ్ఞతాకాదు. నా కోసం, నా సుఖంకోసం, నా స్వార్థంకోసమే కర్పూరికను స్వీకరిస్తున్నాను. ఆనాడే ఆ చిన్నారి కర్పూరిక నా మనస్సులో చోటు చేసుకుంది. అయితే అర్హత ఉన్నదో, లేదోనని, ఇన్నాళ్ళూ సందేహించాను. కానీ, ఈనాడు మీరే ఆ అవకాశం ఇస్తున్నారు కనుక సంతోషంగా నా ఆమోదాన్ని తెలియచేస్తున్నాను."

"నా ఫొటో ఒకటి ఇందులోపెట్టి పంపిస్తున్నాను! తనకు నచ్చితే నాకు తెలియచేయండి చాలు....! ముహూర్తం టైముకి మీ ముందుంటాను! నేను జాబ్ చేస్తున్నది ప్రైవేట్ ఫర్మ్‌లో కనుక, ఎక్కువ శెలవులు వేస్ట్ చేయటానికి వీలవదుకదా! ఒకవేళ కర్పూరిక నన్ను కల్సి ముఖాముఖీ మాట్లాడాలని రూలు పెడితే రావటానికి ప్రయత్నిస్తాను ! ఇంకేం వ్రాయను"...?

"అమ్మగారికి నా నమస్కారములు ! చిరంజీవులు కావ్య శిల్పలకు నా శుభాకాంక్షలు"....

మీ

'కుమార్'

ఆ ఉత్తరం చదివి చాలా ఆశ్చర్యపోయింది కర్పూరిక. "ఎవరీ కుమార్ ? నాన్నగారెప్పుడూ చెప్పలేదే ? ఒక ఉత్తరం రాయగానే ఇలా ఒప్పుకున్నాడంటే, అతన్నెలా అర్థం చేసుకోవాలి ? అదంతా నాన్నగారి మీదున్న భక్తా...? లేక, తన సంస్కార హృదయాన్ని చాటి చెప్పుకోవడమా ? లలిత్ క్రుళ్ళి వీధ్వటమే కదా తనక్కావల్సింది. నా మొహం ! అతనితో మాట్లాడేదేముంటుంది ? ప్రస్తుతం తన డ్యూటీ తల్లి, దండ్రుల పరువు కాపాడటమేకదా ! ఆ పరువు నిలవటానికి కుమార్ నైతేనేమి...? మరొకరైతేనేమి ? తను వివాహం చేసుకొని తన పంతం నెగ్గించుకుంటుంది... ఇలా వెర్రి మొర్రిగా ఆలోచిస్తోంది కర్పూరిక.

"లెటరు సాంతం చదివావా"? ప్రశాంతంగానే అడిగారు శంకరంగారు. తల వూపింది "మరేమంటావ్?"

"మీరెప్పుడు లగ్నం పెట్టిస్తే, అప్పుడె తలొంచుతాను" హేళనగా చెప్పింది.

"అతన్ని రప్పించమంటావా ?"

"అవసరంలేదు" గట్టిగానే ఉచ్చరించింది. ఆయన కూతురి మొఖంవైపు పరీక్షగా చూస్తు, జాలిగా నిట్టూర్చారు. ఆ అమ్మాయికి అంత మూర్ఖత్వం ఎలా అలవడిందా అని, ఆయన తల బ్రద్దలు కొట్టుకోసాగారు ?

* * * *

ఎట్టి ఆర్భాటం లేకుండా కర్పూరిక వివాహం తిరుపతిలో ముగించుకు రావాలని నిశ్చయించుకున్నారు శంకరంగారు. కర్పూరిక మాత్రం నిర్లిప్తంగా వుండిపోయింది ! కర్పూరిక వెంట తల్లి, దండ్రులు, చెల్లెళ్ళు, ఒకరిద్దరు ముఖ్య బంధువులు, కళ్యాణి తప్ప, మరెవ్వరూలేరు.

"అమ్మా ... కళ్యాణీ !" వాళ్ళు కూర్చున్న చోటుకొచ్చి ఖంగారుగా పిలిచారు శంకరంగారు. "ఏం లేదంకుల్ ! కర్పూరి వూరికే పడుకుంది" సర్ది చెప్పింది.

"అమ్మాయిని త్వరగా తయారు చేయండమ్మా ! మరలా అప్పుడు హడావుడిగా వుంటుంది" సున్నితంగా హెచ్చరించి బయటికెళ్ళిపోయారాయన.

శరీరం అప్పగించి కూర్చున్నది కర్పూరిక. తన అభిరుచుల కనుగుణంగా కర్పూరికను పెళ్ళికూతురి ముస్తాబు చేసింది కళ్యాణి. పెళ్ళికూతురి ముస్తాబులో మెరిసిపోతున్న కూతుర్నిచూసి చాటుగా కళ్ళు తుడుచుకుంది శాంతాదేవి.

"అబ్బ ! ఎంత ముద్దొస్తున్నావే ? ఆ కుమార్ చూడకుండా చేసుకుంటున్నా కూడా వెరీ లక్కీఫెలో" చిలిపిగా బుగ్గ గిల్లుతూ అంది కళ్యాణి. కర్పూరిక చిరుకోపంగా చూసింది.

"ఇక బయల్దేరాలమ్మా కళ్యాణీ ! మీ ఆంటీనికూడా తొందరచేయి. కావ్యా! కావల్సినవన్నీ జాగ్రత్తగా కారులో పెట్టు !" శంకరంగారు హడావుడి చేశారు.

ఆయన చెప్పినట్టే ... వెంటనే బయల్దేరి అందరూ కళ్యాణ మండపానికి చేరారు. వివాహ వేదికమీదకు తల వంచుకొని నడిచి, తల్లి కూర్చోబెట్టినచోట ఒద్దికగా

కూర్చుంది కర్పూరిక. పెళ్ళి అలంకరణలో మెరిసిపోతున్న పెళ్ళికొడుకుని, అతని అందాన్ని చూసి కావ్య, శిల్పలు ఏదో పెద్దగా అనబోయి, తండ్రి తమవైపు తీక్షణంగా చూడటంతో చప్పున నోళ్ళు మూసుకున్నారు. కళ్యాణి అతనివైపుచూసి స్నేహపూర్వకంగా నవ్వింది. పెళ్ళి కొడుక్కీ, పెళ్ళికూతురికి మధ్య ఒక తెరవుంది. అందువలన ఒకరి నొకరు చూసుకునే అవకాశం రాలేదు. బ్రాహ్మణుడు తనపని తాను కానిస్తున్నాడు.

బ్రాహ్మణుడు హెచ్చరించటంతో అప్పటివరకూ తెర పట్టుకున్న యువతి తెరను తీసింది. ఒకరెదురుగా ఒకర్ని కూర్చోబెట్టి, పురోహితుడు ఏదో తతంగం జరుపుతున్నా .... కర్పూరిక మనస్సు అక్కడ లేదు. రాతిబొమ్మలా వుంది.

మంగళసూత్రధారణ జరగబోతోంది. వరుడు మాంగల్యాన్ని పట్టుకొని లేచి నిలబడ్డాడు. వాయిద్యాల హోరు పెరిగింది. తలెత్తబోయింది. అప్పటికే ఆమె మెడలో రెండుముళ్ళు పడిపోయాయి.

పూర్తిగా తలెత్తి చూసిన కర్పూరిక భయంతో అవమానంతో, క్రోధంతో, కంపించిపోయింది. "ను .... వ్వా .... ? మోసం ! దగా !" పెద్దగా అరుస్తూ, విసురుగా లేచింది. అప్పటికే ఆమె మెడలో మూడోముడికూడా పడిపోయింది.

* * * *

"నన్ను ....నన్ను ...ఎంత మోసం చేశావ్ ? నువ్వు మనిషివికావు, కుక్కవు మీరు నాకు తల్లిదండ్రులుకారు. పాపాత్ములు !" ఆవేశంతో అరవసాగింది కర్పూరిక. కర్పూరికవైపు చూడలేనట్లు మొహం చాటుచేసుకున్నారు శంకరం, శాంతాదేవి. కళ్యాణికూడా బాధగా చూస్తోంది. కావ్య, శిల్పలుకూడా అయోమయంలో పడిపోయారు. కానీ ... లలిత్‌మాత్రం విజయగర్వంతో చూస్తున్నాడు.

"నా మెడలో మూడుముళ్ళు వేసినంతమాత్రాన నువ్వు నా భర్తవు కాలేవు నువ్వొకమృగానివి. మోసంచేసి నన్ను కట్టుకున్నంత మాత్రాన...విజయగర్వంతో విర్రవీగకు. ఆఫ్టరాల్ .... నువ్వు బిగించిన ఈ నూలుపోగు నన్ను బంధిస్తుందని కలలోకూడా అనుకోకు. ఇదెంత ? దీని విలువెంత ? దీన్నిప్పుడే నీ కళ్ళముందే తెంచి పారేయకపోతే చూడు !" రెచ్చిపోతూ చప్పున దాన్ని పట్టుకొని తెంచబోయింది కర్పూరిక.

"ఆగు ...." బలంగా కర్పూరికను లాగి చేతులు విరిచి పట్టుకున్నాడు లలిత్

"వదులు ! అరుస్తోంది కర్పూరిక.

"నీలాంటి రాక్షసిని కట్టుకొని నేను సుఖపడగలనని కలలోగూడా అనుకోలేదు! అనుకోనుకూడా. కానీ ... నీలోని పొగరుని, అహంకారాన్ని అణచివేయాలనుకున్నాను, అణచివేశాను, దట్సాల్ ....! లేకపోతే నీకు అహంకారమా ? నీ గర్భంలో పెరుగుతున్న నా బిడ్డను జాగ్రత్తగా కాపాడి, నాకందించక పోయావో .... నీ స్థితి మరింత అధ్వాన్నమవుతుందని గుర్తుంచుకో ! అండర్‌స్టాండ్ ?" కర్పూరిక గడ్డాన్ని

గట్టిగా పైకెత్తి, ఆమె కళ్ళల్లో కళ్ళుపెట్టి చూస్తూ అన్నాడు. అప్పుడుకనుక కర్పూరిక ఏమాత్రం బెదిరిపోయినట్లు కనిపించినా తను చేసిన మోసానికి లలిత్ క్రుళ్ళిపోయేవాడు. కానీ .... అలాకాక కర్పూరిక శివంగిలా మీదకు రావటంతో, లలిత్ ఇంకా ఇంకా రెచ్చిపోయాడు. అందరూ గుడ్లప్పగించి చూస్తున్నారుతప్ప ఏ ఒక్కరూ నోరెత్తటంలేదు. వాళ్ళిద్దరూ భార్యాభర్తలు కదా ! వాళ్ళ విషయంలో మనం తలదూర్చటమెందుకన్నట్లుగా మౌనం వహించారు. కళ్యాణికూడా మౌనంగానే వుండిపోయింది.

"నా బొందిలో ప్రాణముండగా నన్ను తీసుకెళ్ళలేవు !" ఆడ పులిలా గర్జించింది కర్పూరిక.

"నీ బొందిలో ప్రాణముండటం ఇకనుండీ నీ ఇష్టంకాదు. నా యిష్టం. నువ్వు ప్రాణం ఎలా తీసుకుంటావో నేనూ చూస్తాను. చెప్పానుగా ... నా బిడ్డను నాకు సక్రమంగా అప్పగించేంతవరకూ నీ ఆటలేవీ సాగవు. బి ... కేర్ !" బెదిరించాడు లలిత్.

"నువ్వు మనిషివికాదు. పశువ్వి ! రాక్షసుడివి !" పిచ్చిదానిలా అరవసాగింది కూతుర్ని అలా చూస్తుంటే, శంకరం దంపతులకు బాధగావున్నా.మౌనం వహించారు. అందువలనే. లలిత్ చేస్తున్న మోసంలో సహకరించారు.

"అవును ... నేనిప్పుడు రాక్షసుడ్నే ! మృగాన్నే ! పశువునే ! కాదనను. కానీ నన్నీస్థితికి దిగజార్చింది ఎవరు ? నువ్వుకదూ ? నా ప్రేమకు, నా సహనానికి అంతం చూడాలని ప్రయత్నించి, నువ్వే నన్నిలా మృగాన్ని చేశావు. నువ్వు చేసిన దానికి నువ్వే బాధ్యత వహించక తప్పదు. మగవాడి ఓర్పును పరీక్షిస్తే, ఆడదాని బ్రతుకేమవుతుందో .... నీకు తెలియాలి. ఆ అనుభవాన్ని నువ్వు ఎదుర్కోక తప్పదు. నీలాంటి బండరాయిని ప్రేమించిన నేరానికి నేనుకూడా నీతో సమానంగా ఏడుస్తూ కూర్చోక తప్పదు." ఎంత దాచాలని ప్రయత్నించినా ... లలిత్ స్వరంలో చివరకు దుఃఖము తొంగిచూసింది. అతను ఎంతో ప్రయత్నంమీద దుఃఖాన్ని అదిమిపడుతున్నాడని గ్రహించిన కళ్యాణి హృదయం బరువెక్కింది.

* * * *

ఏడుస్తూ పడుకొనివున్న కర్పూరికను సమీపించి, ఓదార్పుగా భుజంమీద చెయ్యేసింది కళ్యాణి. ఆ చేతిని విసిరి కొట్టింది కర్పూరిక.

"పో ....! ఇక్కడినుండి వెళ్ళిపో ! నన్ను విసిగించకు. అందరూకల్సి నన్ను వంచించారు ...!" కోపంతో అరిచింది.

"ఎవ్వరూ నిన్ను వంచించలేదు. వంచించరుకూడా. నిన్ను నువ్వే వంచించుకుంటున్నావు. లేకపోతే ప్రాణాధికంగా ప్రేమించే ఒక ప్రేమమూర్తిని చేజేతులా దూరం చేసుకుంటారా ? ఒక వ్యక్తంటే ప్రేమ లేకపోవచ్చు. ప్రేమించలేకపోవచ్చు. కానీ ... ఒక బలమైన కారణం లేకుండా ఎవ్వరూ ఎవ్వరినీ ద్వేషించరుకదా ...?

"నీ ఉపన్యాసం కట్టిపెట్టి, నా ముందునుండి వెళ్ళిపో! ప్రేమికుడ్ని త్యాగం చేశానని గొప్పగా ఫీలవుతున్నావేమో? నేను ... నీలాంటి త్యాగమూర్తిని కాదల్చుకోలేదు. ఒక రాక్షసుడ్ని మనిషిగా చూడలేను, ప్రేమించలేను" గట్టిగా అరిచింది కర్పూరిక.

"నువ్వు లలిత్‌నే రాక్షసుడిగా భావించి, మనిషిగా చూడలేనంటే ... నువ్వసలు ఏ మగాడ్ని మనిషిగా చూడలేవు, ప్రేమించలేవు. నీకసలు ప్రేమంటే అర్థమే తెలియదనుకోవాలి. నీలో ఏమాత్రం 'స్త్రీత్వం' లేదని నా భావన. ఉంటే.. ఇలా ప్రవర్తించేదానివి కాదు." కోపంగా అంది కళ్యాణి.

"షటప్...!" గర్జించింది కర్పూరిక. "నా నోరు మూయించగలవుగానీ... ఈ లోకం నోరు మూయించగలవా?" వ్యంగ్యం చేసింది కళ్యాణి. కర్పూరికెందుకో ఒక్కక్షణం మౌనం వహించింది.

కళ్యాణి మాటలకు మరొకరికైతే తల తిరిగిపోవల్సిందే! కానీ .... కర్పూరిక మామూలుగానే వుంది. కాస్త తల తిరిగినా, తిరగనట్లు నటించింది. కర్పూరికను చూసి, కళ్యాణి జీవితంలో ఏనాడూ ఆశ్చర్యపోనంతగా ఆశ్చర్య పడింది.

"దీనికేమన్నా దెయ్యం పట్టలేదుకదా?" మనస్సులో అనుకుంది.

కళ్యాణి ఎదురుగా ఉన్నంతవరకూ మొండిగా రెట్టించి, విసిగించి, లెక్కలేనట్టు ప్రవర్తించినా, ఆమె అసహ్యంగా చూసి అవతలికెళ్ళిపోగానే ఒంటరితనంతో క్రుంగిపోతూ, దిండులో తలదూర్చి బావురుమంది కర్పూరిక "అదొక రకమైన దిక్కుతోచని, నిస్సహాయస్థితి! కాని ఆ నిస్సహాయస్థితిని చేజేతులా కల్పించుకుంది ఆమేగా? స్వయంగా అనర్థాన్ని కొని తెచ్చుకొని విచారిస్తే ప్రయోజనమేముంది? ఆ దైవం మాత్రం ఎలా విచారించగలడు?"

"మీరు ఎటువంటి దిగులు పెట్టుకోకండి మామయ్యా," కర్పూరికను నా ప్రాణంగా చూసుకుంటాన్ను,   కర్పూరిక గుర్తించేరోజు త్వరలోనే వస్తుందని మీ అందరితోపాటు, నేనూ అదృష్టవంతుడ్ని అవుతానన్న ఆశ నాకుంది" లలిత్ చివరి వాక్యం ఉచ్ఛరించేటప్పుడు అతని గొంతు చాలా బరువుగా, విషాదంగా, ధ్వనించింది.

"బా... బూ...!" శంకరంగారు శాంతాదేవి బెంగారుగా చూశారు. "నా గురించి మీరు బాధపడటం మాని, మీ బిడ్డ మారాలని ఆ దైవాన్ని ప్రార్థించండి...."

"మనం సాహసం చేశామేమో బాబూ? అది అసలు మారేటట్లులేదు; అనవసరంగా నువ్వు కూడా నీ బంగారు భవిష్యత్తును పాడు చేసుకున్నావు. దాని ఖర్మ, మా ఖర్మ ఎట్లాగో తెల్లవారేది" బాధగా పల్కారు శంకరం.

"ఛా! అలా అనకండి మామయ్యా! కర్పూరికలో తప్పక మార్పు వస్తుంది. ఆ మార్పును తీసుకురాగలనన్న నమ్మకం కూడా, నా కుబాగా ఉంది; ఒక ఆడదాని హృదయాన్ని గెల్చుకోవటం కష్టమే! కాదనను. కానీ.... నా సామర్థ్యం తెలి

ఆతనివైపు ఆశ్చర్యంగా చూశారు శంకరం దంపతులు.

"కర్పూరిక తన జీవితంలో ఒకే ఒక్క 'మగాడ్ని' ప్రేమించింది మామయ్యా....!"

లలిత్ అలా అనగానే ఒక్కసారిగా త్రుళ్ళిపడ్డారు శంకరంగారు, శాంతాదేవి కూడా.

"ఆమె మనస్సులో అప్పుడు ఇప్పుడు ఎప్పుడూ కూడా, ఒకే ఒక్క 'మగాడు' కాపురముంటాడు. కాని ఈ నిజాన్ని ఆమె ధైర్యంగా పైకి ఒప్పుకోదు; అహంకారం, అతిశయం, ఆమెను మొండిదాన్ని, మూర్ఖురాల్ని చేశాయి" గంభీరంగా చెప్పాడు లలిత్.

అప్పటివరకూ కర్పూరిక ప్రేమించిన మనిషి ఎవరా? అని విస్తుపోయిన శంకరం దంపతులు లలిత్ గొంతులోని కసిని వ్యంగ్యంతో కూడిన ఆ నవ్వును చూడగానే ఆ వ్యక్తి ఎవరో గ్రహించి కాస్త, స్థిమితపడ్డారు.

"ఎప్పుడో ఒకసారి ఏదో ఒక 'షాక్' ట్రీట్‌మెంట్ ఆమెకు తగిలితే తప్ప, ఆమెలోని అతిశయం, ఆ అహంకారం, దిగజారవు; అప్పటివరకూ తను కూడా ఒక మగవాడ్ని ప్రేమించిందని కానీ, ఆ మగవాడ్ని నేనేనని కానీ ఆమె బహిరంగంగా ఒప్పుకోదు! అప్పటివరకూ 'ఓర్పు'గా ఎదురు చూడవల్సిందే మామయ్యా! తప్పదు" గంభీరంగా అన్నాడు లలిత్. నోటమాటరానట్లు చూస్తున్నారాయన.

అప్పుడు లలిత్‌ని చూస్తుంటే, శంకరంగారికి "మహాగ్నిగోళంలా నిప్పులు రగిలించిన సూర్యుడు ప్రతాపం చల్లబడి పడమటి కొండ దిగిపోతూ పొందే వేదనకు ఇతను పొందుతున్న వేదనకు, చాలా దగ్గరి 'సారూప్యం' కన్పించి, ఆయన హృదయం బరువెక్కింది.

శాంతాదేవిగారికైతే లలిత్ మాటలు కొన్ని అర్థం కూడా కాలేదు. అతనివైపు దిగాలుపడి చూస్తోంది.

* * * *

తిరపతినుండి వస్తు సరాసరి తన ఇంటికే తీసుకెళ్ళాడు లలిత్ కర్పూరికను. కర్పూరిక బాగానే పేచీ పెట్టింది. కానీ ఆమె ఆటలు సాగనివ్వలేదు లలిత్. అతనికి సపోర్టుగా తల్లి, ద్రండులుకూడా ఉండటంతో అతన్ని అనుసరించక తప్పలేదు.

"ఎందుకొచ్చిన గొడవ? డెలివరీ అయ్యేవరకూ ఎలాగో కళ్ళు మూసుకొని అతనింట్లో పడివుండి, ఆ మాయదారిబిడ్డను అతనికే అప్పగించి, ఇక ఆ తర్వాత తేలిగ్గా బయటపడొచ్చు! అతనడుగుతున్నది కూడా అదేకదా...!" మనస్సులో ఇలా నిర్లక్ష్యంగా అనుకునే, అతనితో అతనింటికి చేరింది కర్పూరిక. అలా పెడత్రోవన ఆలోచిస్తు, తనకు తానుగా ఎంత పోగొట్టుకొంటున్నదో ఆమెకర్థం గావటం లేదు.

ఇల్లు ఇంక కొద్ది క్షణాలలో రాబోతున్నదనగానే కర్పూరికను మరోసారి గంభీరంగా హెచ్చరించాడు లలిత్.

"నువ్వు నా యింట్లో ఎట్టి అఘాయిత్యానికి పూనుకున్నా నిన్ను క్షమించేది లేదు! ఆ విషయం బాగా గుర్తుపెట్టుకో...! అంతేకాదు, మరో విషయం కూడా. 'ఇతను నన్నేం చేస్తాడులే'? అని సాహసించావో, ఆ మరుక్షణాన నాలో సజమైన రాక్షసుడ్ని చూడవల్సి వస్తుంది నువ్వు. నువ్వు చావటానికి ప్రయత్నించటం అటుంచి, నిన్ను నేనే నా చేతులారా చంపి, నీ శవాన్ని కూడా అడ్రసు లేకుండా చేసి, నువ్వు ఎవరితోనో వెళ్ళిపోయావని ప్రచారం చేస్తాను.

కారు లలిత్ ఇంటివైపు సాగిపోతుంటే, మౌనంగానే కళ్ళు తుడుచుకున్నారు శంకరం దంపతులు, కానీ ఆ తర్వాత కళ్యాణిని చుట్టుకుపోయి, బిగ్గరగా రోదించారు వాళ్ళలా బాధపడుతుంటే కళ్యాణికి కూడా దుఃఖము ఆగలేదు. ఎలాగో దుఃఖాన్ని కంట్రోలు చేసుకొని, వాళ్ళను ఊరడించి, ఇంటిదగ్గర దింపి, తను ఇంటికి చేరింది.

• • •

తనకు కేటాయించిన గదినుండి, మెల్లిగా, పిల్లిలా అడుగులో, అడుగు వేసుకుంటూ బయటకొచ్చి అటు, ఇటు కాస్త భయం, భయంగాచూసి, ఇక ఆ తర్వాత నెత్తిమీదకు కొంగు లాక్కొని, చక, చక అడుగులువేస్తు గేటు దగ్గరకు చేరి, 'అమ్మయ్య' అనుకొని ఉత్సాహంగా గేటు తీసింది. బయటకు ఒకడుగు వేసి... భయంతో బిగుసుకుపోయింది.

అక్కడ చేతిలో కాలుతున్న సిగరెట్టుతో రౌద్రాకారంతో నిలబడి వున్నాడు లలిత్. ఆ సిగరెట్టు లాగానే అతని హృదయం కూడా కాలిపోతోంది! అతని కళ్ళల్లో ఎర్ర జీరలు భయంకరంగా కనబడుతున్నాయి.

అతను ఏమీ మాట్లాడక పోవటంతో, కర్పూరిక మరీ భయపడింది. విసురుగా గడ్డం పైకెత్తి, ఆమె మొహంలో మొహంపెట్టి, ఒక రెండు నిముషాలుచూసి, మరలా వదిలేశాడు. అతనినలా చూస్తుంటే స్పృహ తప్పుతున్నట్లుగా వుంది కర్పూరికకు. అది గమనించినట్లుగా, అమాంతము కర్పూరికను రెండు చేతులమీదుగా ఎత్తుకొని, స్పీడుగా నడిచి, ఆమె గదిలోని మంచము మీద కూలేశాడు. నోరు మెదపాలంటేనే ధైర్యం చాలటంలేదు కర్పూరికకు. అతనేమీ మాట్లాడకపోవటం ఆశ్చర్యాన్ని, భయాన్ని, కలిగిస్తున్నది కర్పూరికకు.

"నిన్ను ముందే హెచ్చరించాను. ఇలాంటి పిచ్చివేషాలు వేయొద్దని. నా కళ్ళనుండి నువ్వు ఎప్పుడూ తప్పించుకోలేవని గుర్తుపెట్టుకో....! నీ రెటమతాన్ని భరించటానికి నేనిప్పుడు నీ భర్తను, ఈ విషయం అసలు మర్చిపోవొద్దు" కర్పూరికవైపు కసిగా చూస్తు హెచ్చరించాడు లలిత్. అప్పుడు కూడా అంతకుముందు లాగానే భయంగా, జాలిగాబిహేవ్ చేస్తే వదిలేశేవాడే కర్పూరికను. కానీ...అలా కాకుండా రోషంగా, పొగరుగా తలెగరేయటంతో అతనికి పెద్దకోపం వచ్చింది.

చప్పున ఆమె కూర్చున్న మంచముమీద కూర్చొని, ఆమె మొఖాన్ని రెండు చేతులలో బిగించి, కర్పూరిక గింజుకుంటున్నా వదలకుండా, పెదవులమీద పదే పదే గాఢంగా చుంబించాడు. నిస్సహాయురాలిలా ఉండిపోయింది కర్పూరిక. లలిత్ పైకి లేచి, ఆమెవైపు విజయగర్వంతో చూస్తూ ... నా ఆజ్ఞను అతిక్రమించినందుకు ఇది తీయటి నా మొదటిశిక్ష! ఇకముందుకూడా ఇలాంటి తీయటి శిక్షలు వేయించుకోవాలని కోరిగ్గావుంటే .... ఇక అది నీయిష్టం! కానీ ... ఒక్క విషయం. ఇకముందు శిక్షలు ఇలా సింపుల్‌గానే ఉండవ్. నీ ఒంట్లోని రక్తాన్ని మరిగించి నీకునువ్వే సిగ్గుపడేలా ఉంటాయి. "నాకు నువ్వు కావాలి!" అని నువ్వే నన్ను అడిగేలా ఉంటాయి. అలా అడుగుతున్నప్పుడు కుంచించుకు పోతున్న నీ మోమును చూస్తూ నేను పడిన ఆవేదనంతా మర్చిపోవాలి."

లలిత్ ఉత్సాహంగా ఇంకా ఏదో చెప్పబోతున్నాడు. "స్టాపిట్! స్టాపిట్!" కోపంతో పెద్దగా అరిచింది కర్పూరిక. ఆమె మొహం కందగడ్డలా ఉంది. అయితే లలిత్ ఏమాత్రం తొణక్కుండా .... "భేష్! నీలోనూ చాలా పౌరుషం ఉందే ....? ఈ పౌరుషాన్ని చివరంటా ఇలాగే నిలబెట్టుకో .... బాగుపడతావ్. లేదా నా 'గెలుపు' ఖాయం" నవ్వుతూ అన్నాడు లలిత్.

"నో ... అలా ఎన్నటికీ జరగదు. నీ కలలు కల్లలవుతాయి." ఆడపులిలా గర్జించింది కర్పూరిక.

"భేష్! ఆ పట్టుదలమీదనే ఉండు. నీ శరీరాన్ని పువ్వులా కాపాడుకోవచ్చు. నా బిడ్డనూ నాకు సలక్షణంగా అందించవచ్చు" చెప్పి తన గదికెళ్ళిపోయాడు లలిత్.

తన గదిలోకి వెళ్ళగానే లలిత్‌ని నిలువెల్లా నీరసం ముంచెత్తింది. మంచానికడ్డంగా పడిపోయాడు. తలనరాలు చిట్లిపోతున్నంత బాధగా వుంది. మగవాడు కనుక పైకి దిగులు కన్పించకుండా ధీరువులా కర్పూరిక ఎదుట నటిస్తున్నాడేతప్ప, ఆమె దగ్గరనుంచి అవతలకి రాగానే నిలువెల్లా నీరసం, దుఃఖం, అతన్ని బాధిస్తున్నాయి. తన బ్రతుక్కి అర్థం ఏమిటో అర్థంగాక, సతమతమవుతున్నాడు.

ఒక బండరాయికి, ఒక మూర్ఖురాలికి, తన హృదయాన్ని అర్పించి ఎంత మోసగొట్టుకోవల్సి వస్తున్నదో అర్థమై కుమిలిపోతున్నాడు.

"అసలు కర్పూరిక ఉద్దేశ్యం ఏమిటి? ఆమెలో అసలు మార్పు వస్తుందా? లేక తన ప్రయత్నాలన్నీ వృధాయేనా? డెలివరీ అయ్యేవరకూ తను కఠినంగా ప్రవర్తించితే ఆ తర్వాత బిడ్డనుచూసి ఆమే మారుతుందని ఆశ పడ్తున్నాడు. తన ఆశ ఫలిస్తుందా? అప్పుడుకూడా కర్పూరిక మారకపోతే .... తనేంచేయాలి? తనసలు బ్రతగ్గలడా?" కణతలు నొక్కుకుంటూ అనుకోసాగాడు. ఎంత నిగ్రహించుకున్నా ఆగకుండా, అతని కళ్ళు ధారాపాతంగా వర్షించసాగాయి. అలా ఎన్నో కన్నీళ్ళు ఖర్చయి పోయాకగానీ... అతని మనస్సు శాంతించలేదు. నిద్రాదేవి

వరించలేదు అతన్ని.

ఉదయం టిఫిన్ పెడుతూ ... జ్యోతుల్లాంటి కళ్ళతో ఉన్న మనుమడ్నిచూసి "ఏమిట్రా నానీ? కళ్ళలా ఉన్నాయేం? ఒంట్లో బావుందా అసలు?" అడిగింది లలిత్ నానమ్మ.

"బాగానేవుంది మామ్మా!" నీరసంగా జవాబిచ్చాడు.

"ఏంబాగో ఏమో?" బాధగా గొణుక్కుంటూ మనుమడి నుదురు తాకి చూసింది. కొంచెం వేడిగా ఉందంతే.

"నువ్వు బాలా తెలివితక్కువగా ప్రవర్తించావని అన్పిస్తున్నదిరా నానీ! అంత ఇష్టంలేని పిల్లను దేవురించి పెళ్ళిచేసుకునేఖర్మ నీకేంబట్టిందిచెప్పు? లేనిపోని బాధలు కొని తెచ్చుకున్నావు. నేను నిన్నిలా చూడటానికా బ్రతికున్నది?" ఆమె గొంతులో బాధ, నిష్ఠూరం, రెండూ విన్పించాయి. ఆమె పలికిన చివరి వాక్యానికి లలిత్ కన్నుల నుండి రెండు కన్నీటి చుక్కలు టప, టప రాలి టిఫిన్ ప్లేటులో పడ్డాయి.

అప్పుడే అక్కడికెందుకో రాబోయిన కర్పూరిక కళ్ళబడిందాదృశ్యం. మనుమడ్ని చూసి బాధగాఅన్న మామ్మ మాటలుకూడా కర్పూరిక చెవులబడటంతో, ఒక్క క్షణం కర్పూరిక మనస్సు మెత్తబడింది. ఆ వృద్ధురాలు అలా బాధపడుతుంటే గిల్టీగాకూడా ఫీలయింది. కానీ... మరుక్షణంలోనే ఏదో దెయ్యం ప్రవేశిస్తు ఉంటుం దామెలో.

"ఏమ్మా! ఏంకావాలి? రా! అక్కడే ఆగిపోయావేం? నీ భర్తకు నువ్వొచ్చి వడ్డించుకుంటే నాకిశ్రమ తప్పుతుంది. ఇంకా ఎంతకాలం ఈ ముసిల్ది చాకిరి చెయ్యగలదు చెప్పు?" కర్పూరిక నుద్దేశిస్తూ అంది మామ్మ. కర్పూరిక మాట్లాడలేదు. విసురుగా ప్లేటులో చేయి కడుక్కొని వెళ్ళిపోయాడు లలిత్. అతనలా అసహ్యంగా వెళ్ళిపోవటం తనను అవమానించినట్లే భావించింది. కర్పూరిక.

కర్పూరిక ముఖం బాధతో కమిలిపోవటం గమనించి "పిచ్చిపిల్లా! అలా బాధపడటం దేనికిచెప్పు. ఇది నీఇల్లు, నీ సంసారం! వాడిలో నీకు నచ్చని గుణమేదైనా ఉంటే, మెడలొంచయినా సరే, వాడ్ని నీకనుగుణంగా మార్చుకో...! దాన్ని విచ్చరమూ కాదనం. అంతేకాని ఇలా బద్ధశత్రువులుగా ఉండటం ఏం బాగోలేదు తల్లీ! లాలనగా నచ్చజెప్పబోయింది మామ్మ.

"అసలు ఆ మనిషంటేనే ఇష్టం లేనప్పుడు ఎలా మార్చుకోను? ఏది మార్చుకోను? నాకసలు పెళ్ళి అంటేకూడా ఇష్టంలేదు." కోపంగా చెప్పింది కర్పూరిక.

"ఎందుకని?" కాస్త విసుగ్గా అడిగింది మామ్మ. దానికిమాత్రం సమాధానం చెప్పలేకపోయింది కర్పూరిక. "నీకసలు తెలిస్తేగా నువ్వు చెప్పటానికి" గంభీరంగా పలికి అక్కడినుండి వెళ్ళిపోయింది మామ్మ. ఆమెమీద కోపం రాకపోయినా... ఎందుకో కోపం వచ్చి .... చర చర తన గదిలోకి వెళ్ళి దిండు గలీబు లాగి, బ్లేడుతో పనిగట్టుకొని మరీ చించి, దానిలోని దూదినంతా కసిగా ఆ గదంతా విసిరేయసాగింది.

"అది నీ బాబుగాడి సొమ్మనుకుంటున్నావా? అలా చేస్తున్నావ్" గుమ్మంలో లలిత్ స్వరం వినబడి నిటారుగా అయింది.

"సిగ్గులేకపోతేసరి! అన్నీ వెధవ పనులే. ముందాదూదంతా జాగ్రత్తగా ఎత్తు." ఘాటుగానే హెచ్చరించాడు లలిత్.

"నేనెత్తను!" పొగరుగా అంది కర్పూరిక

"ఎత్తవూ ....?" రెట్టించాడు.

"ఎత్తను!"

"నువ్వసలు మంచిగా మాట వినవు. నాకుతెల్సు. పనిష్మెంట్ ఇస్తేతప్ప ఎత్తవా?" కోపంగా అన్నాడు. అయినాసరే! నిర్లక్ష్యంగానే చూసింది కర్పూరిక

ఒక్కొక్క అడుగే వేస్తూ సమీపించాడు. "రాత్రి ఇచ్చినతీయటి ముద్దులిస్తానని భ్రమ పడుతున్నావేమో? ఇలాంటి వెధవ పనికి అలాంటి ముద్దులు వేస్ట్‌చేయను. ఆ విషయం బాగా గుర్తుపెట్టుకో. ఇప్పుడది బుద్ధిగా ఎత్తకపోతే ఏం చేస్తానో తెల్సా?"

"ఏంచేస్తావేం?" అన్నట్లు పొగరుగా తలెగరేసింది కర్పూరిక. "ఇదిగో! దీనితో నీ తాట వలిచి, ఇంక కొద్దిరోజుల్లో నీ గర్భంనుండి బయటపడే నా బిడ్డకు చెప్పులు కుట్టించుకుంటాను." బెదిరింపుగా అన్నాడు. అతనివైపుచూసి భయంతో కంపించింది.

అతను పాంట్‌కి పెట్టుకున్న బెల్టును ఊడదీస్తు కన్పించాడు. అతనిని చూస్తుంటే అతనన్నంతపనీ చేసేలా ఉన్నాడని భయపడి, మనస్సులో శాపనార్థాలు! పెడుతూనే గబ, గబ, దూదంతా ప్రోగుచేసింది. లలిత్‌కి నవ్వొచ్చినా కంట్రోల్ చేసుకున్నాడు.

అంతా ప్రోగుచేసి, అవమానభారంతో ముక్కుపుటాలు ఎగరేస్తు లలిత్‌ని చుర, చుర చూస్తు నిల్చుంది, ఆవేశంతో ఆమె గుండెలు కూడా ఎగిసిపడుతున్నాయి. పల్చని నైలాను పమిటలోనుండి అందమైన, ఎత్తయిన ఆమె వక్షస్థలం లలిత్‌ని రెచ్చగొడ్తోంది! అలాగే ఇంక కొన్ని క్షణాలు అక్కడే ఏం చేసేవాడో కాని వెంటనే అక్కడినుండి తప్పుకున్నాడు.

ఆ రాత్రికి మామ్మ ఎంత బ్రతిమాలినా భోంచేయకుండా పడుకుంది కర్పూరిక. లలిత్ బాగా ప్రొద్దుబోయిన తర్వాత ఇంటికొచ్చాడు. భార్య భోంచేయలేదన్న విషయాన్ని మామ్మ ద్వారా విని-వెంటనే కర్పూరిక దగ్గరికొచ్చాడు. ఏదో పుస్తకం చదువుతోంది. కర్పూరిక.

"భోంచేయలేదట?" విసుగ్గా అడిగాడు. జవాబివ్వలేదు. "మాట్లాడవేం? అన్నంమీద అలిగేవాళ్ళంటే నాకసహ్యం! బుద్ధిగా వచ్చి భోంచేయి. నువ్వు పసుబుండి కోరి, కోరి నీ ఆరోగ్యం పాడుచేసుకుంటే ఇక్కడ బాధపడేవాళ్ళు ఎవరూ లేరు. కానీ ఆ పని నా బిడ్డను నాకందించిన తర్వాతచేయి. అప్పుడు మేమెవ్వరం నిన్ను తినమని బలవంతం చేయం" కోపంగా అన్నాడు లలిత్.

నాకక్కరలేదు"! ఎందుకో కాస్త దూకుడు తగ్గించింది కర్పూరిక.

"మాట్లాడవేం ? ఎందుకులేదు" ? మరోసారి రెట్టించాడు "ఏమో"? విసుగ్గా చెప్పింది కర్పూరిక.

"నీకొకటి తెల్సి ఏడ్చింది కనుకనా ?" హేళనచేసి– "మర్యాదగా వెంటనే వచ్చి భోంచేయి. లేదా నేనే నీ నోట్లో కూరవల్సివస్తుంది జాగ్రత్త. అలా మోజుగా ఉంటే చెప్పు. అలాగే చేస్తాను" అతను గంభీరంగా అనాలని ప్రయత్నించినా, అతని గొంతులో కాస్త చిలిపిదనం తొంగి చూసింది. రుస, రుసలాడుతూ డైనింగ్ హాల్లోకి వచ్చింది.

"నాక్కూడా పెట్టు మామ్మా...! ఈవిడగారు బెట్టు తీస్తే తప్ప, ఏ పనీ సక్రమంగా చేయదు" కుర్చీలో కూర్చుంటూ అన్నాడు. మామ్మ నవ్వుకుంటూ అక్కడినుండి అవతలికి వెళ్ళిపోయింది ఏదో పని ఉన్నట్లుగా. అన్నీ టేబులుమీదనే ఉన్నాయికదా! వాళ్ళే వడ్డించుకు తింటారులే! అని ఆమె ఉద్దేశ్యం.

"నేనూ తీయగలను!" రోషంగా అంది కర్పూరిక. "ఏమిటి... నువ్వా బెట్టు తీస్తావా ? ఆఁ... తీయాల్సిందే పమిటను" వెక్కిరించాడు. అప్పుడెందుకో చప్పున తన పమిటవైపు చూసుకొని, సిగ్గుతో కుంచించుకుపోయింది. నైలాను పమిట జారిపోయి వక్షస్థలం నగ్నంగా ఉంది. లలిత్ చిలిపిగా నవ్వుతూ వడ్డించుకోసాగాడు. పమిట సరిజేసుకొని విస, విసలాడుతూ ఒకేసారి అన్నికలిపి ముద్దచేసుకొని ఉక్రోషంగా తినసాగింది కర్పూరిక. లలిత్ ఇల్లెగిరిపోయేలా నవ్వాడు. అతని నవ్వుకు సర్వెంట్, మామ్మ కూడా, అక్కడకు పరిగెత్తుకొచ్చి, విస్తుపోయారు.

"ఛీ ..! దెయ్యాలకొంప...!" చేయి కడుక్కొని చిర, చిరలాడుతూ తన గదిలోకి వెళ్ళిపోయింది కర్పూరిక. వాళ్ళను చూడగానే లలిత్ నవ్వు తక్కున ఆగిపోయింది. క్షణంలోనే గంభీరంగా మారిపోయిన అతని మోమునుచూసి. పలకరించటానికి ధైర్యం చాలక మామ్మ, ఆమెవెంట సర్వెంట్ కూడా మౌనంగా నిష్క్రమించారు.

* * * *

కర్పూరికను చూడటానికి తల్లి, దండ్రులు, చెల్లెలు కావ్య కూడా ఎంతో సంబరంగా వచ్చారు. వాళ్ళను కనీసం మర్యాదకోసమైనా పలకరించకపోగా... ఏవేవో మాటలతో తూలనాడింది. శంకరంగారి మొహం రక్తం లేనట్లు పాలిపోవటం చూసిన లలిత్ ఉగ్రుడై, భార్యమీద చేయి చేసుకోబోయాడు.

"అలాంటి రాక్షసిమీద చేయి చేసుకొని, నీ చేతులనెందుకు పాడుచేసుకుంటావ్ బావా ?" హేళనచేస్తు మాట్లాడింది కావ్య. ఆ అమ్మాయి అలా అంటుందని ఏ ఒక్కరూ ఊహించలేను. అందుకే నోట మాటరానట్లు ఉండిపోయారు.

"పదండి నాన్నగారూ ! ఇలాంటి కూతుర్ని కన్నందుకు మీరు–ఇలాంటి భార్య దొరికినందుకు బావ సిగ్గుపడటం లేదేమో కానీ... ఇలాంటి తోబుట్టువు

మాకుందని చెప్పుకోటానికి మాకు మాత్రం చాలా సిగ్గుగా ఉంది...!" మొహమంతా అసహ్యాన్ని నింపుకొని మాట్లాడి, అక్కడినుండి స్పీడుగా వెళ్ళిపోయింది కావ్య.

పాలిపోయిన మొహాలతో వెనుదిరిగారు కర్పూరిక తల్లి దండ్రులు. వెళ్తున్న వాళ్ళను దిగులుగా చూశారు లలిత్, మామ్మలు. వాళ్ళు వెళ్ళగానే ముసుగుదన్ని పడుకొంది కర్పూరిక.

భార్యమీద విపరీతమైన కోపం వచ్చింది లలిత్‌కి. ఎంతో శాంతమూర్తి అయిన మామ్మకు కూడా ఆరోజు కర్పూరిక ప్రవర్తన ఎంతో వెగటుగా అన్పించి భోజనానికి రమ్మనమని కూడా పిలవలేకపోయింది.

ప్రతిరోజూ మూడు పూటలా టిఫిన్‌కీ, భోజనానికీ కూడా పిలవందే ఆ గది నుండి బయటకురాదు కర్పూరిక. ఆ రోజు కూడా అలాగే పిలుస్తారని ఆశించిన కర్పూరికకు చాలా ఆశాభంగమైంది.

ఎవరూ పిలవకుండా కామ్‌గా భోంచేసి పడుకున్నారు. ఉక్రోషంతో అలాగే పస్తు పడుకుంది కర్పూరిక. ఆరోజేకాదు ! ఆ మరునాడు కూడా ఎవరూ పిలవలేదు. కర్పూరికకు ఆకలి దంచేస్తున్నది. కానీ వెళ్ళి తినటానికి రోషం అడ్డొచ్చి అలాగే నిస్త్రాణగా పడుకొంది.

"ఈ పూటనైనా పిలిచేద్రా ? అది పంతంగా ఊరుకుందని, మనమూ ఊరుకుంటే ఎలా....? అసలే కడుపుతో ఉన్న పిల్ల. ఆ పాపం మనకెందుకురా తండ్రీ" మనస్సును కంట్రోల్ చేసుకోలేక, మనుమడితో అంది మామ్మ.

"ఏం ఫర్వాలేదు ! తినకపోతే చస్తుందిలే దానికిలేని పాపం మనకు మాత్రం ఎక్కడినుండి వస్తుంది ? పోతే పోనీయ్ ! ఆ బిడ్డను కూడా. ఈ మహాతల్లి బుద్ధులే వస్తే.... అప్పుడింకా జుట్టు పీక్కోవల్సి వస్తుంది నేను" అతని మాటలు విని అవాక్కయిపోయింది మామ్మ. పెద్దగా అనడంవలన అతను మాట్లాడిన ప్రతిమాట, కర్పూరిక చెవులకు కూడా సోకింది. అతని గొంతులోని బాధను కక్షను అర్ధం చేసుకొని గాఢంగా నిట్టూర్చింది మామ్మ.

ఇక మూడోరోజు– మామ్మ మరీ వత్తిడి చేయటంతో భార్యను పిలవక తప్పలేదు లలిత్‌కి. 'నాకొద్దని' రాష్‌గా చెప్పటంతో, రెండోసారి బ్రతిమాలకుండా పంతంగా ఇవతలికొచ్చేశాడు. అతను రెండు మూడుసార్లు పిలుస్తాడని అప్పుడు వెళ్ళొచ్చని బింకంగా ఉన్న కర్పూరిక పని ఇరకాటంలో పడిపోయింది.

ఒక ప్రక్క ఆకలి ! మరోప్రక్క పంతం ! పగలంతా ఎలాగో నిగ్రహించుకున్నా, ఇక ఆ రాత్రికి ఆకలికసలుండలేక పోయింది.

అందరూ నిద్రపోయాక నిర్ధారించుకున్నాక మెల్లగా డైనింగ్ టేబుల్ దగ్గరకుచేరి, డిష్‌లోని అన్నాన్ని ఏమీ కూర కలుపుకోకుండానే... ఆత్రంగా తిని, రెండు అరిటిపళ్ళు కూడా అవురావురుమంటూ తిని, ఒక వాటర్ బాటిల్ ఎత్తి పట్టుకొని గడ, గడ త్రాగేసి, తలెత్తిచూసి నిశ్చేష్టురాలైంది !

ద్వారం దగ్గర నిలబడి, కర్పూరికవైపే చూస్తూ గమ్మత్తుగా నవ్వుతున్నాడు లలిత్. అతనలా చాలాసేపటినుండి చూస్తున్నాడని ఊహించలేక పోయింది కర్పూరిక.

"దాహంవేస్తే వచ్చాను!" తడబాటును సరిచేసుకొని, నిర్లక్ష్యంగా చెప్పింది. లలిత్ పక, పక నవ్వుతూ "నీ అబద్ధం చాలా అందంగా ఉంది. ఆ అన్నం, అరటి పళ్ళు పిల్లి తిన్నదా? తిండితిన్నావులేగాని, ఇప్పటికైనా ఆతని విలువ గ్రహించావా? మొండితనంతో, అర్థంలేని మూర్ఖత్వంతో, బ్రతకటానికి ప్రయత్నంచేస్తే ఇలాగే దెబ్బతింటావ్. ఇప్పుడెలా అయితే ఆకలికి తట్టుకోలేక దొంగతనంగా తిన్నావో... ఇక ఏదైనా ఇంతేనని బాగా గుర్తుపెట్టుకో!" గూడార్థంగా పలికాడు లలిత్.

"నేనేమీ దొంగతనంగా తినలేదు. నా ఇంట్లో నా ఇష్టమొచ్చినప్పుడు తింటాను" ఆమెకు తెలియకుండానే చప్పున అనేసింది.

"ఓహ్...! ఇది నీ ఇల్లా? భలే గమ్మత్తుగా వుందే! ఇది నీ ఇల్లనుకొని, 'వీడు' నీ భర్తనుకొని చాలా లక్షణంగా సరసారం చేస్తున్నావ్ కదూ?" వ్యంగ్యంగా మాట్లాడాడు లలిత్. సమాధానం చెప్పలేక, కోపంతో చిందులు వేస్తూ తన గదిలోకి వెళ్ళి పడుకుంది.

తెల్లారాక లలిత్ డైనింగ్ హాల్లోకొస్తూ కర్పూరికకు వినపడేలా "మామ్మా! రాత్రుళ్ళు చాలా జాగ్రత్తగా ఉండండి. మన ఇంట్లో ఒక పెద్ద పిల్లి తయారై, అన్నీ తినేస్తోంది!" పెద్దగా అన్నాడు మామ్మతో. మనుమడి నవ్వుచూసి, ఆమెకంతా అర్థమైపోయింది.

"నీలాంటి అల్లరి ఎలుకని పట్టటానికే అది వస్తున్నదేమోరా?" సరదాగా అంది మామ్మ.

"అదుగో! అందుకే నాక్కోపం వచ్చేది" చిరుకోపంగా అన్నాడు లలిత్. మామ్మ నవ్వింది.

టిఫిన్ చేస్తుండగా కళ్యాణి వచ్చింది. ఏదో మొక్కుబడిగా కర్పూరికను పలకరించి, ఆ తర్వాత లలిత్ గదిలో దూరింది. ఒకటే కబుర్లు! ఒకటే నవ్వులు! ఆ ఇంట్లో ఎవరూ లేనట్టే వాళ్ళిద్దరూ ప్రవర్తిస్తుంటే, కర్పూరికకు వళ్ళంతా కారం రాసుకున్నట్లుగా అన్పించింది.

"పరాయి మగాడితో అలా ప్రవర్తించటానికి కళ్యాణికి సిగ్గెలాలేదు? ఆ లలిత్‌కిమాత్రం ఆవేంబుద్ధులు? మనస్సులో అనుకుంది. కానీ... వెంటనే "నీలాంటి భార్యను కట్టుకుని ఆతనేం సుఖపడుతున్నాడు? అందుకే అతనిదారి అతను వెదుక్కుంటున్నాడు. అందులో తప్పేముంది?" అంతరాత్మ మందలించేసరికి చెవులు, నోరుకూడా మూసుకొని పడుకుంది.

* * * *

"అందరికళ్ళుగప్పి, చాలా జాగ్రత్తగా వెళ్ళిపోగలుగుతున్నానన్న ఆనందంతో

కర్పూరిక ఉత్సాహంగా ట్రైనెక్కి కూర్చుంది. "త్వరగా బయల్దేరితే బాగుండు!" ననుకుంటూ తలెత్తి చూసిన కర్పూరిక రాయిలా బిగుసుకుపోయింది. తనవైపే తీవ్రంగాచూస్తూ నిలబడిన లలిత్‌ని చూసి, నోరు తడిచేసుకోవల్సి వచ్చింది! తన చుట్టూ వున్న ప్రయాణీకుల్ని చూసి, కాస్త ధైర్యం తెచ్చుకుంది. మనస్సులో ఒక ఉపాయం చటుక్కున మెరిసింది.

"ఊఁ.... దిగు!" గర్జించాడు. కర్పూరిక తనను కాదన్నట్లు చూసింది. రెక్కబట్టి లాగాడు లలిత్. "నేను రాను....! ఇతనేవరో రౌడీ! నన్ను వెంబడిస్తున్నాడు. దయచేసి నన్ను కాపాడండి!" అందరివైపు చూస్తూ దిగులుగా చెప్పింది.

"ఏయ్! ఆ అమ్మాయిని వదులు!" ఒకరిద్దరు కర్పూరికను సానుభూతిగా చూస్తు లలిత్‌ని హెచ్చరించారు. మిగతావారు ఆదొక చోద్యంగా చూస్తున్నారు.

"ఎందుకు వదలాలి? ఆమె నా భార్య" కోపంగా అన్నాడు లలిత్. "అంతా అబద్ధం! అతనెవరో నాకు తెలీదు. నన్ను కాపాడండి!" రుద్ధస్వరంతో చెప్పింది.

"ఏయ్! ఏమిటా దౌర్జన్యం? ఆ అమ్మాయిని వదులు!" ఒక యువకుడు కోపంగా అన్నాడు.

అప్పటికీ ఆ పెట్టెలోని ప్రయాణీకులందరూ ఇలాటి సీనుల గురించి రక, రకాలుగా వాఖ్యానిస్తున్నారు.

"వదలకపోతే?" నిర్లక్ష్యంగా పలికాడు లలిత్. "వదలకపోతే పోలీసుల చేతుల్లో ఒళ్ళు హూనమవుతుంది...." ఆ యువకుడు హేళనగా అన్నాడు.

"ఈ ఫోటోలు పోలీసులకు చూపిస్తే, ముందు ఆమె ఒళ్ళు, ఆ తర్వాత నీ ఒళ్ళు హూనమవటం ఖాయం!" జేబులోని ఫోటోలని తీసి చూపిస్తు అన్నాడు లలిత్. ఆ ఫోటోలవైపు చూసిన కర్పూరిక పైప్రాణాలు పైనే ఎగిరి పోయాయి. లలిత్ చేతిలోని ఫోటోలని చూసి అక్కడున్నవారందరూ కర్పూరికను తిట్టి పోయసాగారు.

"తాళి గట్టిన భర్తను పట్టుకొని రౌడీ అంటానికి నీకు బుద్ధెక్కడ లేదమ్మాయ్ ఫో! భర్తతో బుద్ధిగా వెళ్ళు! చదువుకున్న పిల్లలా కూడా కన్పిస్తున్నావ్! ఇవేం చేష్టలు?" ఒక వృద్ధుడు కర్పూరికను తీవ్రంగా మందలించాడు.

తిరపతిలో తీయించుకున్న తమ పెళ్ళి ఫోటోలని నవ్వుకుంటూ జేబులో పెట్టుకొని "ఊఁ.... దిగు...!" చేయిపట్టి క్రిందకు దించి స్టేషన్ బయటకు నడిపించి, కారులో కూలేసి స్టార్టు చేశాడు. కారు ఇంటికి చేరేవరకూ ఏం మాట్లాడలేదు లలిత్. బితుకు, బితుకు మంటున్న గుండెలతో కూర్చుంది కర్పూరిక.

కారు ఇంటి ముందాగగానే ఖంగారుగా ఎదురొచ్చారు మామ్మ. కర్పూరిక తలొంచుకొని గబ, గబ తన గదిలోకెళ్ళి తలుపులేసుకుంది. ఏదో మాట్లాడాలని ప్రయత్నించిన మామ్మకు మాట్లాడవద్దని సైగచేసి, వెళ్ళి కర్పూరిక గది తలుపులమీద చప్పుడు చేశాడు.

భయం భయంగానే తలుపులు తీసింది. ఎదురుగా లలిత్! అతన్ని చూడగానే బెల్టు గుర్తొచ్చి గుండె వేగంగా కొట్టుకోసాగింది.

"ఇదంతా భయమేనా? లేక నేను బహుమతి ఇవ్వబోతున్నందుకు కులుకా?" ఆమె ముక్కుమీదనుండి గొంతుదాకా చేత్తో సన్నగా రాస్తూ అన్నాడు. అతని పాంటుకి బెల్ట్ ఉందేమోనని గాభరాగా చూస్తోంది కర్పూరిక.

"మాట్లాడవేం? నా హెచ్చరికలంటే నీకంత నిర్లక్ష్యమన్నమాట!" ఉన్నట్లుండి అతన్ని గొంతులోకి కఠినత్వం వచ్చేసింది.

"నా కళ్ళుగప్పి ఎక్కడికి వెళ్ళాలని నీ ఉద్దేశ్యం?" కర్పూరిక కళ్ళల్లో కళ్ళుపెట్టి క్రూరంగా అడిగాడు.

"ఇంకెప్పుడూ వెళ్ళను!" ఎప్పుడూ నొక్కి తగ్గని కర్పూరిక అతని నడుముకున్న బెల్టును చూడగానే ఖంగారుగా చెప్పింది. అందుకు లలిత్ గమ్మత్తుగా నవ్వుతూ "ఇప్పుడు దీన్ని ఉపయోగించనులే!" అన్నాడు. అతని మాటల్లోని శ్లేష అర్థంకాలేదు కర్పూరికకు.

"మంచము దగ్గరికి పద ...!"

"ఎందుకు?" పెదాలు తడుపుకుంటూ అడిగింది. "రేప్ చేయటానికి" నింపాదిగా చెప్పాడు లలిత్.

"ఛీ...! నీకు సిగ్గులేదూ? నాకిష్టం లేదని చెప్పినా, నా వెంట పడటానికి."

"నాకెందుకు సిగ్గు? అది నీకుండాలికాని .... అదీ పోగొట్టుకున్నావ్! అందుకే ఇలా బిహేవ్ చేస్తున్నావు. నీ 'ఇష్టమేమిటో' నాకొక్కడికే బాగా తెల్సు! అయినా నీ ఇష్టంతో నాకు పనేంటి?" అల్లరిగా నవ్వాడు.

"మరి దేనితో పనినీకు?" హేళన చేసింది కర్పూరిక.

"దేనితోనంటే ... దీనితో ..." ఆమె పమిటను ఒక్కలాగు లాగాడు. నగ్న వక్షస్థలాన్ని రెండు చేతులతో కప్పుకుంది కర్పూరిక.

"ఇంత సిగ్గు ఉన్నదానివైతే ఆ పనిచేయవు!" కసిగా ఆమెను ముద్దాడాడు.

"నీ అధరాలు అదిరినా లాభంలేదు! ఇలాగే నువ్వు చేసిన తప్పు ఒక్కొక్క దానికి ఒక్కోవిధంగా శిక్షిస్తూ నీలోని ఆవేశాన్ని, కోరికల్ని ఒకేసారి పూర్తిగా చల్లార్చకుండా కొస్త కొస్తగా నేను ఆస్వాదిస్తూ నిన్ను పూర్తిగా పిచ్చిదాన్ని చేసి ఆనందిస్తాను! నేనెలాఅసంతృప్తితో ఫీలవుతున్నానో ... నువ్వూ అంతకు రెట్టింపు అసంతృప్తితో ఫీలవ్వాలి. నాకేం మగాడ్ని! కావాల్సిన సుఖం మార్కెట్లో దొరుకుతుంది. కానీ .... నువ్వో ....?"

నిస్సహాయంగా చూస్తూండిపోయింది కర్పూరిక. ఆమెతో నిమిత్తం లేకుండానే ఆమె కళ్ళనుండి నీళ్ళు కారసాగాయి. అతను వెళ్ళిన తర్వాతనైనా జాకెట్ బటన్స్ పెట్టుకోవాలని గానీ, పమిటనుకప్పుకోవాలనిగానీ ఆమెకుతట్టలేదు. పిచ్చిచూపులు చూస్తూ వుండిపోయింది. సత్తువంతా ఎవరో తోడేసినట్లుగా ఉందామెకు.

ఒంట్లోని రక్తం మరగుతున్నట్లు, నరాలు చిట్లిపోతున్నట్లు, తన శరీరం తన వశం తప్పుతున్నట్లు ఏవేవో బాధలు ఒంట్లో. 'ఫలానా' అని చెప్పలేని వింత నరకం! అలాంటి స్థితిలో గిలగిల్లాడడం కర్పూరికకదే మొదటిసారి!

నిట్టూర్పుల శోభలు, పొగిలి, పొగిలి రగులుతున్న పరితాప అగ్నికణాలు.

ఆమెనాస్థితిలో చూసిన లలిత్ హృదయం ఒక్కక్షణం ద్రవించింది, కానీ... కర్పూరిక తననవమానిస్తున్న తీరు గుర్తుకు రాగానే కాఠిన్యం ఆక్రమించింది.

"ఇకముందుకూడా ఇలాగే వుంటాయి నా పనిష్మెంట్లు. నీవందుకు ఇష్టపడితే నాకేం అభ్యంతరంలేదు. కాకపోతే నాకు కాస్త శ్రమేకదా?" తమాషాగా భుజాలెగరేసి ఠీవిగా ఆ గదినుండి నిష్క్రమించాడు.

అతను నిష్క్రమించాకకానీ పూర్తి స్పృహలోకి రాలేకపోయింది కర్పూరిక. వచ్చాక సిగ్గుతో, అవమానంతో ముడుచుకుపోయింది. జాకెట్ బటన్స్ పెట్టుకొని, పమిట వేసుకొని, మంచముమీద గువ్వలా ముడుచుకుని పడుకుంది.

గుండెనెవరో ఇనుప పిడికిళ్ళమధ్య నలుపుతున్నట్లు ఒకటే బాధ. అది ఛాతీలో నెప్పో, మనస్సులోని క్రూరమైన బాధో, తెలియనంతగా వుంది.

అప్పటికప్పుడు లలిత్‌ని సమీపించి, అతనిమీద రాక్షసిలా పడి అతని శరీరమంతా తన పంటిగాట్లతో గాయపరచాలని బాగా కోరిగ్గా ఉంది. కాని మంచములో నుండి లేచి, నడిచివెళ్ళే ఓపిక లేక అలాగే వుండిపోయింది.

కాసేపటికి లలిత్ పాలగ్లాసుతో తిరిగొచ్చాడు. "లే...! లేచి పాలుత్రాగు!" సున్నితంగానే హెచ్చరించాడు. "పెంకితనం చేయక లే! వేడి లేకపోతే త్రాగాలనిపించదు," భుజంపట్టి అన్నాడు. కర్పూరిక కళ్ళు తెరవలేదు.

"నాకు అనవసరంగా కోపం తెప్పించక లేచి త్రాగు, ఇంకా 'ముద్దులమోజు' తీరలేదా?" మామూలు స్వరంతో అన్నాడు.

'ముద్దులమోజు' అనేమాట వినపటటంతోనే చప్పున లేచి కూర్చుని, గ్లాసందుకొని గడ,గడ త్రాగేసి పడుకుంది, ఆప్యాయంగా మూతి తుడిచి, బ్లాంకెట్ కప్పి ఇవతలికొచ్చాడు లలిత్.

"తానిలా ప్రతిక్షణం ఆతనికి సునాయాసంగా లొంగిపోతూ, కీలుబొమ్మలా బ్రతికేకంటే ... ఒకేసారి చావటం మేలు!" మనస్సులో అనుకొని, ఒక్కఉదుటున లేచింది. ఫాన్‌వైపు, తను కట్టుకున్న చీరవైపు చూసింది. కాని .... వెంటనే తను అనుకున్న పని సాధించాలన్న పట్టుదల మనస్సులోకి రావటంతో .... ఆ ప్రయత్నం విరమించుకుంది.

"అతని బిడ్డను అతనెలాగైనా చూసుకోకుండా చేయటమే తన ధ్యేయం; అప్పటివరకూ తను బ్రతికే ఉండాలి! ఆ తర్వాతకూడా బ్రతికి అతన్ని సాధించాలి!" కసిగా అనుకొని తృప్తిగా నిద్రపోయింది కర్పూరిక.

* * * *

"నానీ! రోజూ ఎవరో అమ్మాయితో, ఏదో ఒక టైములో కన్పిస్తూనే ఉన్నా వట డాక్టరాంటికి. ఎవరాపిల్ల?" కాస్త కోపంగానే అడిగింది మామ్మ.

"పలకవేంరా? అలా నవ్వుతావెందుకు?"

"ఇప్పుడావిషయం ఎందుకులే మామ్మా! బాగా ఆకలిగా ఉంది. త్వరగా వడ్డించు!" కాస్త విసుగ్గా అన్నాడు లలిత్.

"నీ వరస నాకేం నచ్చలేదురా!" కోపంగా అందామె.

"నా పెళ్ళాం వరస నచ్చుతున్నదా?" వెక్కిరింతగా అన్నాడు. ఆమె కామ్‌గా ఉండిపోయింది.

లలిత్ నుష్టుగా భోంచేసి, తన గదిలోకెళ్ళిపోయాడు. ఆమె నిట్టూరుస్తూ ఒక చోట కూలబడిపోయింది. ఈ సంభాషణంతా కర్పూరిక చెవులబడింది. కాని .... ఆ విషయం వాళ్ళకు తెలియదు. ఏదో తెలియని బాధతో, కసితో ఊగిపోయింది. ఈసారి చాలా పకడ్బందీగా ప్లాను సిద్ధం చేసుకుంది.

పనిమనిషిని తీసుకొని ఎప్పటిలా డాక్టర్ చెకప్‌కోసం హాస్పిటల్‌కి చేరింది. ప్రతి పదిహేను రోజులకొకసారి తప్పక డాక్టర్‌తో చెకప్ చేయించుకోవాలని లలిత్ హెచ్చరించాడు. అలాగే పనిమనిషిని తోడుతీసుకొని, ఇష్టం లేకపోయినా వెళ్ళి వస్తోంది, ఈరోజూ అలాగే పనిమనిషిని సాయం తీసుకొని హాస్పిటల్‌కి చేరింది. అలా అయితే అతననుమానించడని భావించింది.

లోపల డాక్టరు టెస్ట్ చేసేదాకా పనిమనిషి వరండాలోని బెంచీమీదనే కూర్చుంటుండెప్పుడు. అలాగే కూర్చుంది. ఎంతసేపు కూర్చున్నా కర్పూరిక బయటకు రాకపోవటంతో, అనుమానంగా లోపలకువెళ్ళి డాక్టరు కూర్చునే గదిలోకి తొంగి చూసి, ఆశ్చర్యపోయింది. ఆమె ఎవరో పేషంట్‌కి 'ప్రిస్క్రిప్షన్' రాస్తోంది.

"అమ్మా! కర్పూరిక అమ్మగారేరమ్మా?" మెల్లగా అడిగింది. "ఆమె వెళ్ళి అరగంటయిందిగా! నువ్వింకా బయటే ఉన్నావా? ఆమె నీకు కనిపించలేదా?" విస్తుపోతూ అడిగింది డాక్టరు.

"బయటి కసలు రానేలేదమ్మా! నేనక్కడే కూర్చుని ఉన్నానుగా! ఇంకా రాలేదేమిటా అని అనుమానం వచ్చి ఇప్పుడు మీ కాడకొచ్చాను."

"నీ మొహం! నువ్వెక్కడ నిద్రపోతున్నావో? అయినా ... నీతోవచ్చి, నిన్ను కలవకుండా ఎలా వెళ్ళిపోతుందబ్బా? ఉండు ... అయినా ఒక్కసారి లోపలి కెళ్ళి చూసి వస్తాను" అంటూ వెళ్ళి ఆమె చూసొచ్చి లేదని చెప్పింది. దాంతో పని మనిషి గుండెల్లో రాయి పడింది. ఇంటికి తానొక్కతే వెళితే లలిత్‌బాబు ఏమంటాడో! భయపడింది. కాని .... కర్పూరిక విషయం డాక్టర్‌తో చెప్పటానికి సందేహించి, గిర్రున వెనుదిరిగి, బయటికొచ్చి ఆటోఎక్కి కూర్చొని అడ్రసు చెప్పింది. ఆమె గుండెలు భయంతో బిగుసుకు పోతున్నాయి.

ఎప్పటిలా ముందువైపుకు రాకుండా హాస్పిటల్ వెనుక వైపున ఉన్న మరో

ద్వారంగుండా కర్పూరిక బయటికి వెళ్ళటం పనిమనిషి గ్రహించలేకపోయింది. అలా వెళ్తుందేమోనని ఏమాత్రం అనుమానం వచ్చినా జాగ్రత్త పడేదే! డాక్టరుకూడా ఏమీ ఊహించక పోవటంవలన మామూలుగా టెస్ట్‌చేసి ఇవతలికొచ్చేసింది. బట్టలు సవరించుకొని ఆమే వస్తుందిలే అని డాక్టరు ముందుగా బయటికొచ్చింది.

ఇంటికి చేరగానే లలిత్‌తో ఖంగారుగా చెప్పేసింది పనిమనిషి. అప్పుడతను లక్కీగా ఇంట్లోనే ఉండటం అతని అదృష్టంగా భావించారు మామ్మ, పనిమనిషి కూడా.

ఆఘమేఘాలమీద కారులో బయల్దేరాడు లలిత్. చక్రంమీద అతని చేతులు కసిగా బిగుసుకుంటున్నాయి. కళ్ళల్లో ఎర్రజీరలు తొంగిచూస్తున్నాయి! మొహం క్రూరంగా మారింది. పట్టుదలతో బస్టాండ్, రైల్వే స్టేషను అన్నీ ప్రతి అంగుళం గాలించి, శోధించి వదిలాడు. కాని ... ఎక్కడా కర్పూరిక జాడలేదు. పోలీసు కంప్లైంట్ ఇద్దామని అనుకున్నాడు మొదట. కాని ... మరలా ఎందుకో సందేహించి పిచ్చి స్వరూపంతో ఇంటికి చేరాడు.

ఒంటరిగా వచ్చిన మనుమడ్ని చూసి - "అమ్మాయి కనిపించలేదా?" ఆత్రంగా అడిగింది మామ్మ. తల అడ్డంగా వూపి, పైకెళ్ళబోయాడు, ఆమె మనుమడ్ని కౌగలించుకొని బావురుమంది.

"ఊరుకో మామ్మా! ఒక పీడ విరగయిందని సంతోషించు ....!"

"నువ్వు మనస్ఫూర్తిగానే ఆ మాట అంటున్నావట్రా ....?" బాధతో కమిలి పోయిన అతని మోము వైపు చూస్తూ అడిగింది మాట్లాడలేకపోయాడు లలిత్.

"బాబూ! వాళ్ళ అమ్మా వాళ్ళింటికి, స్నేహితురాలింటికి కూడా వెళ్ళొచ్చావయ్యా?" జంకుగానే అంది పనిమనిషి.

అప్పుడు ఆ ఆలోచన వచ్చి, స్ప్రింగ్‌లా చెప్పకుండానే మామూలుగా వెళ్ళినట్టు వెళ్ళి పరిశీలించాడు. కాని... కర్పూరిక ఎక్కడా కన్పించలేదు, అర్ధరాత్రి దాకా పిచ్చివాడిలా వెదికి, వెదికి ఇంటికి తిరిగొచ్చాడు. మామ్మ భోంచేయమని బ్రతిమాలినా విన్పించుకోకుండా, నిస్త్రాణగా పడుకుండిపోయాడు.

అతని ఆశల పల్లకి కూలిపోయింది. అలాగే ఒక పావుగంట నిరాశగా గడిపి, ఆ గదిలో ఊపిరాడనట్లనిపించి, టెర్రస్ మీదకు చేరాడు.

యధాలాపంగా టెర్రస్ ఒక మూలకు చూసిన అతని భ్రుకుటి ముడి పడింది. ఆ మూల ఏదో చాప చుట్టలా ఉండటం, మధ్యలో ఒకసారి కాస్త కదిలినట్లు అనిపించటంతో అనుమానంగా ఆ వైపుకు వెళ్ళాడు. ఆ చీకట్లో ఆ ఆకారం ఏమిటో అర్థం కాలేదతనికి, ఆ ఆకారాన్ని సమీపిస్తుంటే లలిత్ కాళ్ళు ఎందుకో కాస్త వణికాయికూడా. అలాగే మెల్లగా సమీపించాడు.

* * * *

బాగా దగ్గరికి వెళ్ళి చేయి వేసేసరికి ఆ ఆకారం ఏమిటో అర్థమై, అమితంగా ఆశ్చర్యపోయాడు, "ను....వ్వా....? నువ్వు.... ఈ చీకట్లో...ఇక్కడా...?" లలిత్ స్వరం తడబడింది కూడా.

ఆ చీకట్లో కర్పూరిక మోములోని మార్పులు కన్పించటం లేదుగానీ, ఆమె విపరీతమైన భయంతో కంపించిపోతున్నదని మాత్రం గ్రహించగలిగాడు లలిత్.

"మాట్లాడవేం...? ఇక్కడెందుకున్నావ్ ...? ఈ క్రొత్త నాటకం మరలా దేనికి నాంది ...?" కోపంగా అడిగాడు. కర్పూరిక గొంతు పెగలటంలేదు. అప్పటి వరకూ తను పడిన శ్రమంతా గుర్తొచ్చి, కోపంతో అతని పిడికిళ్ళు బిగుసుకున్నాయి.

"రాస్కెల్! నన్ను గాభరాపెట్టి, వినోదించటం మొదలెట్టావా? నన్నొక చవట వెధవ క్రింద జమ కట్టావన్నమాట! నిన్ను...నిన్ను...." ఆమె గొంతును తన రెండు చేతులతో బిగించాడు. వివేకం వెన్ను తట్టకపోతే ఆ మరుక్షణంలో కర్పూరిక శవంలా మారిపోయేదే. కానీ ... అతను కోపాన్ని కంట్రోల్ చేసుకో గలిగాడు.

క్రిందకు ఈడ్చుకొచ్చినట్లుగా మొరటుగా ఆమెను క్రిందకు నడిపించి, తన గదిలోకి తోసి, తలుపులు బిగించాడు. భయంతో బల్లిపిల్లలా గోడకు అతుక్కుపోయింది కర్పూరిక. శరీరం చెమటతో తడిసి, ముద్దయిపోతోంది.

ముందుగా ఆమె జుట్టుపట్టి తన గుండెల దగ్గరకి లాక్కున్నాడు. గింజుకో బోయిన ఆమె నోటిని మూస్తూ "అరిచావంటే....తాట వలుస్తాను జాగ్రత్త!" బెదిరించాడు.

"చావనైనా చస్తాను కానీ....నీకు మాత్రం ఈ రోజు లొంగేదిలేదు!" మొండి ధైర్యం ప్రవేశించిందామెలో.

"నిన్ను లొంగదీసుకోవాలని నేనేమీ ముచ్చట పడటంలేదు. కాని ... ఇదిగో! ఇలా ... నిన్ను ముద్దను చేసేస్తానంటూ" కర్పూరిక శరీరాన్ని పూర్తిగా తన కౌగిట్లో బంధించి అందిన చోటల్లా కసిగా ముద్దులుపెడ్తూ, ఏమేమో చేస్తూ ఆమెలోని 'స్త్రీత్వం' మీద దెబ్బతీయసాగాడు. అలా ఒక పావుగంట తన ఇష్టం వచ్చినట్లు ఆమె శరీరాన్నంతటినీ ముద్దులతో ముంచెత్తి, ఆమె ఆ అలజడిని తట్టుకోలేనంతటి బలహీనురాల్ని చేసి, అప్పుడు పైకిలేచి, రెండడుగులు వేశాడు.

అతను ఊహించని విధంగా ఆడపులిలా అతని మీదకు లంఘించి, అతని గుండెలమీద పిడికిళ్ళతో గుద్దుతూ "నిన్ను ... నిన్ను మాత్రం .... ఊరికే వదులుతాననుకుంటున్నావా? నిన్ను .... నిన్ను...నేనూ పాడుచేస్తాను. నీ నరాలు చిట్లిపోయేలా నిన్ను రెచ్చగొట్టి ... నా .... కోరి..."

"ఏం ఆగిపోయావేం? రా ... నన్నూ రేప్‌చేయి! నీ కోరిక అదేగా? నాకంటే ఏ విషయంలోనూ నువ్వూ తీసిపోకూడదనేగా నీ పట్టుదల. రా ...! మరి నీ ప్రతాపాన్ని నిరూపించుకో!" హేళనగా మాట్లాడుతూ, రెచ్చగొడ్తూ .... షర్ట్‌విప్పి

అవతలకి పడేశాడు. ఆ తర్వాత బనీను ... ఆ తర్వాత పాంట్ ...

కర్పూరిక గుండెలు ఆవేశంతో ఎగిసి పడ్తున్నాయి. మనిషి నిలువెల్లా ఊగిపోతున్నది. ఆమె ఏమైపోతున్నదో ఆమెకే తెలియని విచిత్రావస్థ ...!

కర్పూరికను గమ్మత్తుగా చూస్తూ .... "రా! ఇక నీయిష్టం వచ్చినట్లు చేసుకో! నీ 'కసి' ఎలా తీర్చుకుంటావో తీర్చుకో! సందేహించకు. పరాయివాడ్నేమీ కాదుగా! నీ భర్తనేగా ...! నువ్వు సుఖపడి, నన్నూ సుఖపెట్టు. ఆడది ఏదైనా చేయగలదని ఈ విషయంలో నువ్వే మొదటగా నిరూపించు. కమాన్!" అంటూ, అతన్ని చేతుల్లు అండర్‌వేర్‌ని కూడా క్రిందకు జార్చటానికి సిద్ధపడ్డాయి.

అప్పటికే అతని అర్ధనగ్న శరీరాన్నిచూస్తూ, తనను తను కంట్రోల్ చేసుకోలేక, అతని అనురాగాన్ని, దాంపత్య జీవితంలోని మధురిమను అందించమని అడగటానికి నోరురాకవుంది. గట్టిగా కళ్ళు మూసుకొని "గెటవుట్ ...! గెటవుట్ ఫ్రమ్ హియర్!" పెద్దగా అరిచింది.

లలిత్ గమ్మత్తుగా నవ్వుతూ విప్పిన బట్టల్ని ఒక్కొక్కటే వేసుకుంటూ "ఏం ... ఆగిపోయావేం? ఏదో చెయ్యాలని ముందుకొచ్చావుగా! ఇటు చూడూ! మగవాడికంటూ కొన్ని హద్దుల్ని, ఆడదానికంటూ కొన్ని హద్దుల్ని ... ఆ సృష్టే ఏర్పరిచింది. ఎవ్వరూ దాన్ని అతిక్రమించలేరు. అలా అనుకోవటం నీ అవివేకమే అవుతుంది. ఈ విషయం బాగా గుర్తుంచుకో! అంతేకాదు! మరోవిషయంకూడా బాగా గుర్తుంచుకో ...! నీ వయస్సుకనుగుణంగా, ప్రకృతి సహజంగా, నీలో బుసలు కొడుతున్న కోరికల్ని బలవంతాన అణుచుకోవటం చాలా అనర్థాలకి దారి తీస్తుంది. నిన్ను నువ్వు గ్రహించాకకూడా, ఎందుకింత మూర్ఖంగా ప్రవర్తిస్తున్నావో నాకర్థంగావటంలేదు? నీ వీక్షణంలో కోరిక ఉధృతం గానే ఉంది. అవునా? అయితే కేవలం కామదృష్టితోనేనని నేననటంలేదుగానీ ... అలసంటూమాత్రం, నేను కావాలని ఉందికదూ?"

"షటప్ ...! పిచ్చిగా వాగకు. కండలు తిరిగిన నీ శరీరంకోసం నేనేమీ వెంపర్లాడడంలేదు. అలా భావించితే నీ తెలివితక్కువతనమే అవుతుంది" రోషంగా అంది కర్పూరిక.

"నాకు తెల్సు! ....; నీ ఓటమిని నువ్వు భరించలేవు, ఆ ఓటమిని భరించే శక్తి వచ్చేదాకా నీ 'ఖర్మ' అంతే! నీ ఖర్మ బాగుపడాలంటే ... నేనూ నా జీవిత కాలాన్ని చాలా కోల్పోవల్సి వస్తుందేమో? అయినా ఫర్వాలేదు. ప్రయత్నించి చూస్తాను" ఎంత గంభీరంగా మాట్లాడాలని ప్రయత్నించినా, అతని గొంతులో 'జీర' తొంగి చూసింది.

* * * *

సంఘటన తర్వాత మనస్సులో ఏమనుకుందో, ఏమోగాని, చాలా బుద్ధిగా ఉంటోంది కర్పూరిక. కర్పూరికలోని ఆ మార్పును చూసి, ముఖ్యంగా లలిత్ చాలా

సంతోషించాడు. పై సంఘటనకు సంబంధించిన అసలు విషయం తెలిస్తే లలిత్, కర్పూరిక విషయంలో అలా మెత్తబడి పోయేవాడు కాదేమో?

*   *   *   *

ఆ రోజు హాస్పిటల్లో పనిమనిషి కన్నుగప్పి బయటపడి మామ్మ చూడకుండా ఇంటి టెర్రస్ మీదకు చేరింది కేవలం లలిత్‌ని 'రిస్క్' పెట్టాలని మాత్రమేకాదు! మరొక 'ప్లాన్' కూడా ఉంది.

హాస్పిటల్‌నుండి రహస్యంగా స్టేషన్ చేరినా, మరెక్కడకు చేరినా, వెంటనే ఆ విషయం అతనికి తెలుస్తుంది కనుక .... ఎలాగైనా తన 'జాడ' కనుక్కోగలడు. లలిత్ సామర్థ్యం మీద అలాంటి నమ్మకముంది కర్పూరికకు. అందుకే అలా చేయకుండా, అతనిని తప్పు దోవ పట్టించాలన్న యోచనతో, టెర్రస్ మీద ఒక మూల ముడుచుకొని కూర్చుంది. అతను వెదికి, వెదికి ఇంటికి చేరి, నీరసంతో పడుకున్న తర్వాత, అర్థరాత్రి సమయంలో జాగ్రత్తగా ఆ ఇంటినుండి పారిపోవొచ్చని ఆమె ప్లాను! అలా అయితే, తెల్లారేలోగా లలిత్ కళ్ళు గప్పి, సునాయాసంగా మాయం కావొచ్చని ఆశపడింది. కానీ, అనుకోని విధంగా లలిత్ టెర్రస్ మీదకు రావడంతో, ఆమె ప్లానంతా పూర్తిగా తల క్రిందులైంది! లలిత్ అప్పుడు కనుక అలా రాకపోతే, మరి కొద్ది సేపట్లో, టెర్రస్ దిగి ... చీకట్లో కల్సిపోయి, ఆ తర్వాత తగిన జాగ్రత్తలతో, ఆ ఊరినుండి మాయమయ్యేది. కానీ, అలా జరగలేదు! అలా జరక్కపోవడం కర్పూరిక దురదృష్టమో, లేక లలిత్ అదృష్టమో మరి? ఆ విషయాన్ని కాలమే రుజువు చేయాలి.

*   *   *   *

ఇక కర్పూరికలో తనాసించిన మార్పు వస్తున్నదన్న సంబరంతో ... తను విధించిన చాలా రెస్ట్రిక్షన్స్‌ని సడలించి, ఆమెను ఫ్రీగానే బయటికెళ్ళనిస్తున్నాడు. లలిత్ చేసిన పెద్దతప్పు అదే! ఆ అవకాశాన్ని బాగా వినియోగించుకుంది కర్పూరిక. అతనికి జ్వరం వచ్చినప్పుడు ... అతని అందానికి విచలితురాలై ముద్దుపెట్టుకోవటం, తపనగా చూడటం, అదంతా నటన కాకపోయినా, అతని జ్వరానికి ముందు మారినట్లు అతన్ని నమ్మించటం, అతనికి సపర్యలు చేయటం ... ఇవన్నీమాత్రం ఆమె ప్లానులో ఒక భాగమే! అంత గొప్పగా నటించి, లలిత్‌ని పిచ్చివాడ్ని చేసింది.

లలిత్,-అతని ఫ్రెండ్స్, కర్పూరిక తల్లిదండ్రులుకూడా, కర్పూరికకోసం నలుమూలలా గాలించారు. కానీ వాళ్ళ ప్రయత్నాలన్నీ వృథా అయ్యాయి. లలిత్ దాదాపు పిచ్చివాడిలా తయారయ్యాడు. కర్పూరిక కనుక కన్పిస్తే తన బిడ్డసంగతి దేవుడెరుగు ముందు ఆమెను నరికి ప్రోగులు పెట్టాలన్నంత వెర్రి ఆవేశం అతని కొస్తున్నది! అయితే, ఆమె లభ్యమైతేగా...?

అందరినీ ఒకే అనుమానం పట్టి పీడిస్తున్నది. కర్పూరిక అలా వెళ్ళి ఏమి సాధించాలని? అసలు ఒంటరిగా బయటి ప్రపంచంలోకి అడుగిడి ఎలా బ్రతుకుతుంది? అందులోనూ గర్భిణీస్త్రీ. అసలు బ్రతికే ఉంటుందా? లేక ఆత్మహత్య చేసుకుంటుందా ...?

ఆ పిల్ల ఖర్మానికి ఆ పిల్లను వదిలేయకుండా బలవంతంగా పెళ్ళి చేసినందుకు.... అప్పుడు కర్పూరిక తల్లిదండ్రులు చాలా పరితపించారు

"మీరేం దిగులు పడకండి! ఆమె ఆత్మహత్య అసలు చేసుకోదు! ఆ విషయం నాకు బాగా తెల్సు. కేవలం నా సంతోషాన్ని 'కాలరాయటం' కోసమే, అలా చేసింది తప్ప, తనను తను శిక్షించుకోటానికి ఏ మాత్రం కాదు!"

అతని మాటలకు శంకరంగారు చాలా బాధపడుతూ— "మాకు-అదీ, నువ్వూ సమానమే బాబూ! నిన్నింతగా బాధపెడ్తున్నది మా కూతురైనందుకు మేమెంతగా కుమిలిపోతున్నామో నీకు తెలియదు బాబూ? అలాంటిది నిజంగా ఒకవేళ వచ్చినా, ఇక ముందు విచారించం బాబూ! దాని విషయంలో ఇవే మా చివరి కన్నీళ్ళు..." కూతురిమీద నున్న కోపాన్ని, అసహ్యాన్ని, వెళ్ళగక్కారాయన. ఆ పెద్దాయన అలా బాధపడుతుంటే లలిత్ హృదయం పశ్చాత్తాపంతో, బాధతో, వేయి వ్రక్కలైంది.

"బావతో ఒక అయిదు నిమిషాలు మాట్లాడి వస్తాను. మీరెళ్ళండమ్మా...!" కావ్య గంభీరంగా అంది. ఆ పిల్ల గొంతులోని గంభీరతకు విస్మయం చెందారు.

"ప్లీజ్! మీరు వెళ్ళండి నాన్నా! బావొచ్చి నన్ను డ్రాప్ చేస్తాడులే!..." మరోసారి అంది.

వాళ్ళు వెర్రిమొహాలేసుకొని ఇంటికి చేరారు. "బావా....! నీ గదిలో కెళ్దాం...!" కావ్య అంది, మామ్మ మౌనంగా అక్కడినుండి తప్పుకుంది. అసలు కర్పూరిక వెళ్ళినప్పటినుంచీ, ఆమె చాలా మౌనమూర్తిలా ఉంటున్నది.

మామ్మ, లలిత్‌లు ఒకరిని ఒకరు పలకరించుకోవటానికే భయపడుతున్నారు. ముందుగా ఏ అగ్నిగోళం బ్రద్దలవుతుందో, ఆ వేడి సెగల్ని ఎవరు భరించవల్సి వస్తుందోనని ఎవరికి వారే ముందు జాగ్రత్త పడుతున్నారు.

మూగ ప్రతిమలా కావ్యననుసరించాడు లలిత్. "ఆ అమ్మాయి ఏం మాట్లాడుతుందన్న" అనుమానం, భయం అతని గుండెల్లో గూడు కట్టుకున్నాయి. పైకి మాత్రం నిబ్బరంగానే ఉన్నట్లు నటించాడు.

"నేనూ కూర్చుంటాను బావా!" అంటూ, మంచము ఒక అంచున కూర్చుంది. కొంచెము దూరంలో అదే మంచముమీద లలిత్‌కూడా కూర్చున్నాడు.

"సహనానికైనా ఒక హద్దంటూ ఉంటుంది కదు బావా?" ఉపోద్ఘాతంగా అడిగింది కావ్య. "అవునన్నట్లు" తల వూపాడు. "ఆత్మాభిమానానికికూడా కదూ?"

"అవునన్నట్లు" దానికీ తల వూపాడు. ఆ పిల్ల అడిగే తీరుకి లలిత్ లోలోన అమితంగా ఆశ్చర్యపోతున్నాడు. "మరి నువ్వు నీ విషయంలో అలాంటి హద్దులన్నింటినీ ఎందుకు చెరిపేసుకుంటున్నావ్?" నిర్భయంగానే ప్రశ్నించింది. కావ్యకు సమా

ధానం ఎలా చెప్పాలో తెలియక, తికమకగా చూశాడు లలిత్.

"నువ్వు సమాధానం చెప్పకపోయినా, నాకు తెల్సులే! అక్కమీదున్న 'ప్రేమ' వలనేకదూ! కానీ... బావా! ఒక విధంగా ఆలోచిస్తే నీది ప్రేమకాదు. 'పిచ్చి' అని అన్పిస్తోంది! ఆ పిచ్చి నిన్ను కబళించకుండా నీకు....నేను సహకారం అందిస్తాను బావా! అక్క... అదే ఆ రాక్షసిమీద 'ప్రతీకారం' తీర్చుకోవాలని నీకు లేదూ?" అతని ముఖ కవళికల్ని జాగ్రత్తగా గమనిస్తూ అడిగింది.

ఆమె పలికిన ఆ చివరి వాక్యానికి అతనిలో ఆవేశం పెల్లుబికింది. **పళ్ళు పట** పట లాడిస్తూ "ఉంది కావ్యా!" గట్టిగా అన్నాడు.

"అయితే వెంటనే ఎట్టి ఆలశ్యం చేయకుండా, నన్ను పెళ్ళిచేసుకో...! **అటు** నీ 'ప్రతీకారమూ' తీరుతుంది. ఇటు నా తీయని కోరికా నెరవేరుతుంది" మెరుస్తున్న కళ్ళతో అంది,

"కావ్యా! నువ్వు... ఏమిటి మాట్లాడుతున్నది?" ఆశ్చర్యంగా, ఖంగారుగా, **అడిగాడు.**

"నేను మాట్లాడుతున్నది కరెక్టేబావా! నీ కోసమే వికసించిన ఈ పుష్పాన్ని ఆనందంగా స్వీకరించుబావా!"

"కావ్యా! 'మతి' ఉండే మాట్లాడుతున్నావా?" కాస్త కోపంగా, మంద లింపుగా అడిగాడు లలిత్.

"మతి పోగొట్టుకోకూడదనే బావా నా ఈ తాపత్రయమంతా...." చిన్నగా నవ్వుతూ అంది.

"కా....వ్యా!" నిశ్చేష్టుడై చూశాడు లలిత్. "ప్లీజ్ బావా! నన్ను కాదనకు! చిన్నపిల్లనని ఆవేశంలో ఉన్నానని సందేహించకు బావా! నీ దృష్టిలో చిన్నదాన్నే కావొచ్చు. కానీ నా దృష్టిలో నేను శారీరకంగా, మానసికంగా కూడా చాలా ఎదిగాను బావా! నిన్ను తొలిసారి చూసిన క్షణం ఎలాంటిదోగానీ నా మనస్సు, శరీరం కూడా, నా ఆధీనంలో ఉండటంలేదు! ఈ అలజడిని, ఈ తీయటి ప్రేమను భరించటం ఇక నావల్లకాదు! ఒక ఆడపిల్ల ప్రాణానికి సమానంగా ప్రేమించకపోతే... ఇలా నోరు తెరిచి అడగదు. ఈ విషయంగ్రహించు! అక్కను నువ్వెలా ప్రేమిస్తున్నావో, నేనూ నిన్నలాగే ప్రేమిస్తున్నాను! ప్రేమించటం నేరం కాదుగా?! అందుకే నువ్వు అక్కను అంతగా ప్రేమిస్తున్నావని తెల్సికూడా నాలోని 'అసూయ'ను బయట పడనివ్వకుండా జాగ్రత్తపడ్డాను! కనీసం మీ ఇద్దరైనా అన్యోన్యంగా ఉంటేనన్నా నా పరిస్థితి ఎలా వుండేదో కాని? ఆ మూర్ఖురాలు నిన్నంత అన్యాయం చేసిన తర్వాత కూడా, నీవిలా బాధపడుతుంటే చూడలేక, నన్ను నేను కంట్రోల్ చేసుకోలేక ఇలా ప్రాధేయపడుతున్నాను. బావా ప్లీజ్ నా బాధను అర్థం చేసుకోవటానికి ప్రయత్నించు! నీ అభిప్రాయాలను, నీ! ఆశల్ని, ఆశయాల్ని, ఎప్పుడూ గౌరవిస్తాను! నన్ను నమ్ము! నాకు నీ హృదయంలో అక్కకిచ్చినంత కాకపోయినా కాసింత

ఇస్తేనన్నా చాలు బావా...!" కావ్య గొంతుబొంగొరుగా మారింది.

లలిత్ నోటమాటరానట్లు ఉండిపోయాడు. "ఈ అమ్మాయి అసలు కావ్యేనా?" అని అనుమానం వస్తోందతనికి.

"మాట్లాడరేం బావా?" సంబోధన బహువచనంలోకి మారిపోయింది.

"నేనేమిటో, నా మనస్సేమిటో, తెల్సి కూడా నువ్విలా పిచ్చిగా ఆలోచించటం, మనస్సు పాడుచేసుకోవటం ఏం బాగోలేదమ్మా కావ్యా....!" బాధగా అన్నాడు లలిత్.

'అమ్మా' అన్న లలిత్ సంబోధనకి రోషంగా, కోపంగా, చూసింది కావ్య. దెబ్బతిన్న ఆడపులి గుర్తొచ్చింది లలిత్‌కి ఆ అమ్మాయిని చూస్తుంటే.

"నిజం కావ్యా! నిన్నెప్పుడూ ఆ దృష్టితో చూడలేదు. అసలు నా భార్యగా కర్పూరికను తప్ప, మరొకర్ని ఎప్పుడూ ఊహించుకోలేను! ఇది నా బలహీనత కావ్యా! ఏం చేసేది చెప్పు?" లలిత్ స్వరం చాలా నిస్సహాయంగా ఉంది.

"ఇంతేనా నువ్వు చెప్పేది?" ఎర్రబడ్డ కళ్ళతో అడిగింది. "ఇంతకంటే ఏం చెప్పను చెప్పు? నువ్వు చిన్నపిల్లవు. ఆవేశంలో ఉన్నావు ఇప్పుడు నేనేం చెప్పినా నువ్వు వినే స్థితిలోలేవు. దయచేసి ఇంటికి వెళ్ళిపో! అంకుల్‌వాళ్ళు ఎదురు చూస్తుంటారు" నచ్చచెప్పబోయాడు లలిత్. కానీ కావ్య కోపంతో రెచ్చిపోయింది.

"నేను... నేను చిన్నపిల్లనా? ఒక ఆడదాని గుండె లోతుల్ని చూడటం చేతగాలేదు కనుకనే, మా అక్కా అలా వెళ్ళిపోయి ఉంటుంది. లేకపోతే ఆరడుగుల అందమైన మగాడ్ని భర్తగా కాదని ఏ స్త్రీ అలా వెళ్ళిపోతుంది?" పరిహసించింది కావ్య.

"కావ్యా!" కోపంగా పిలిచాడు లలిత్. అతనికలా ఆవేశం తెప్పించటమే కావ్య నిశ్చయం! అందుకే మరింత రెచ్చగొట్టే విధంగా మాట్లాండి.

"అరవటం కాదు! మగతనం చూపించాలి. పదహారేళ్ళ అద్భుత సౌందర్యరాసి, ఏ తుమ్మెద అఘ్రాణించని ఈ పూబాల.... ఎదురుగా నిలబడి ప్రేమను అర్థిస్తుంటే ఏ మగవాడు అంగీకరించకుండా ఉండగలడు? పైగా "నువ్వు చిన్నపిల్లవు! ఆవేశంలో ఉన్నావని" అంటుంటే నీ మగతనం మీదనే నాకు నమ్మకం పోయింది"

"కా...వ్యా!" అతనిని ఎక్కడ దెబ్బకొట్టాలో అక్కడే కొట్టింది కావ్య. అందుకే అంత పెద్దగా అరుస్తూ ఆమె భుజాల్ని కసిగా నొక్కిపట్టుకున్నాడు. దాంతో అతని స్పర్శకు నిలువరించుకోలేనట్లుగా మంచముమీద వెనక్కి వాలిపోయింది. ఆ పడిపోవటంతో ఆమె వేసుకున్న జార్జెట్ ఓణీ కాస్తా పూర్తిగా ప్రక్కకు తొలిగిపోయింది. ఎత్తయిన ఆమె 'ఎదను' చూశేసరికి, అతనిలో ఏదో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. ఆమె అలాగే పడుకొని చూస్తోంది! చప్పున చూపుల్ని విడదీసుకొని, అక్కడినుండి లేచాడు. పచ్చగా, మెత్తగా మెరుస్తున్న ఆమె పొట్ట, మెడ

మాత్రం అతని మదిలో మెదులుతూనే వుంది. అయినా బలవంతంగా మనస్సును అరికట్టుకుంటూ వెనుదిరిగాడు లలిత్.

కావ్య నవ్వు వినబడి మరలా ఆగిపోయాడు. "నేనిందాక అంటే ఏదో పెద్ద మగాడిలా ఆవేశపడిపోతివే....! ఇదేగా ని మగతనం ?" హేళన చేసింది.

"యూ డెవిల్ ! ఏమిటి నువ్వు కూసేది...? నేను... నేను మగాడ్ని కాదా? నేను మగాడ్ని అవునో, కాదో.... ఇప్పుడే తేల్చితే తప్ప, నీ తిక్క, పొగరు అణగవులే" అంటూ ... ...

టెన్త్ పూర్తిచేసి, ఇంకా కాలేజీలోకూడా చేరని ఆ పిల్ల అలా కమాండ్‌గా, అలా పెద్ద పెద్ద డైలాగులతో బిహేవ్ చేస్తుంటే ప్రపంచములోని ఏడు వింతల్లో ఆదొక వింతలా అన్పించింది లలిత్‌కి. కావ్య గురించి ఎవరైనా అలా చెబితే, చస్తే నమ్మేవాడుకాదు లలిత్.

"ఆడపిల్ల, మగపిల్లాడికంటే శారీరకంగా, మానసికంగాకూడా చాలా త్వరగా ఎదుగుతుందని" పుస్తకాలలో చదివాడు, విన్నాడు. కానీ .... కావ్యలా అంత త్వరగా ఎదుగుతుందని ఏనాడూ అనుకోలేదు. ఈనాడు ప్రత్యక్షంగా చూసేసరికి, బుర్ర తిరిగిపోతున్నదతనికి. ఆమెకంటే దాదాపు ఏడెనిమిదేళ్ళు పెద్దయిన తనే ఆమెముందు ఎంతో చిన్నవాడిలా, మరుగుజ్జులా అన్పిస్తోంది లలిత్‌కి.

"ఆలోచనలకు అనకట్టవేసి త్వరగా పదబావా" కావ్య విసుగ్గా హెచ్చరించటంతో ... యాంత్రికంగా అడుగులు వేశాడు లలిత్.

* * * *

కావ్య భవిష్యత్తు గురించి, తను చేసిన ఘోరమైన తప్పుగురించి, విపరీతంగా ఆలోచించటంవలనో ఏమో ... లలిత్ జబ్బు మనిషిలా తయారయ్యాడు. కర్పూరిక విషయాన్ని తాత్కాలికంగా మర్చిపోయాడు. ప్రస్తుతం కావ్య విషయమే అతనిలో 'వణుకు' పుట్టిస్తున్నది.

ఏ క్షణంలో వచ్చి శంకరంగారు విరుచుకు పడతారోనని భావించిన లలిత్ అలా ఏమీ జరక్కపోయేసరికి ఆశ్చర్యపోయాడు. అదంతా కావ్య మంచితనమేనని గ్రహించి, మరింత పశ్చాత్తాపంతో కుమిలిపోయాడు.

అతన్ని ఏవిధంగానూ నిందించకపోగా... అతని ఇంటికి వచ్చి, అతనికి సపర్యలు చేయటంతో, మరింతగా కుమిలిపోవల్సి వచ్చింది లలిత్.

"నన్ను క్షమిస్తావా కావ్యా? చాలా తొందర పడ్డాను ..." ఆమె మొహంలోకి సూటిగా చూడలేక తల దించుకొని అడిగాడు లలిత్.

అప్పుడామె అతనికిచ్చే కాఫీలో పంచదార కలుపుతూంది. "ఎందుకు క్షమాపణలు ? ఆ తప్పును ఇద్దరం కల్సే చేశాంగా? నిన్ను అలా రెచ్చగొట్టింది నేనేగా! అందుకు 'ఫలితాన్ని' ఆడపిల్లగా నేను భరించక తప్పదు బావా! నిన్ను నేనేమీ నిందించ దల్చుకోలేదు" గంభీరంగా అంది. కానీ ఆమె కళ్ళుమాత్రం కన్నీటిని

దాచలేకపోయాయి. ఆ దృశ్యం లలిత్ కళ్ళబడింది.

"ఇక నేవస్తాను బావా! నా గురించి ఆలోచించి ఆరోగ్యం పాడు చేసుకోకు! నువ్వు బాధపడితే నేను అసలు చూడలేను. ఆ రోజు నిన్ను అలా అవమానించినందుకు నిజంగా చాలా సిగ్గు పడ్తున్నాను! కానీ ఒక్క విషయం! తెలిసో, తెలియకో, చిన్నపిల్లలా మాత్రం నేనలా బిహేవ్ చేయలేదు! పూర్తిగా వికసించిన హృదయంతోనే అలా కోరాను...." చెప్పి, గబ గబ, అక్కడినుండి వెళ్ళిపోయింది కావ్య.

"నీ ఇష్టప్రకారమే కావ్యను చేసుకుంటాను మామ్మా...!" గంభీరంగా చెప్పి అక్కడినుండి పరిగెత్తినట్లుగా తన గదిలోకి వెళ్ళిపోయాడు లలిత్.

ఆ ఆనందంతో వెంటనే శంకరంగారికి కబురు చేసిందామె. మొదట ఆయన సందేహించినా, కావ్య అభిప్రాయాన్ని స్వయంగా అడిగి తెల్సుకున్న తర్వాత సంతోషంగానే అంగీకరించారు. ఇక మామ్మ ఆనందానికి అవధుల్లేవు.

కావ్యను ఇంటికి రప్పించుకొని బుగ్గలు పుణికి ముద్దుపెట్టుకుంది. మనుమడి జీవితం బంగారుమయం కాబోతున్నదన్న ఆనందం ఆమెను ఉక్కిరి, బిక్కిరి చేస్తున్నది హడావుడి, హడావుడిగా కావ్యకు కావల్సినవన్నీ కొనేయసాగింది.

మొదటిసారి వివాహం ఆమె చూడకపోవటం వలన, ఈసారి చూడగల్గుతున్నానన్న ఆనందం ఆమెను ఒకచోట నిలువ నీయటంలేదు.

సిగ్గును ప్రక్కకు పెట్టి, కావ్య లలిత్‌ని ఒంటరిగా కల్సుకొంది, వివాహం రెండు జీవితాలకు సంబంధించిన సమస్య కనుక, సూటిగానే అడిగింది.

"బావా! నాకు అన్యాయం జరిగిపోయిందన్న బాధతోనో, లేక జాలితోనో అయితే దయచేసి నన్ను వివాహం చేసుకోవద్దు! మనస్ఫూర్తిగా నన్ను ప్రేమించగలననుకుంటేనే చేసుకో. చేసుకోపోయినా నిన్ను నిందించనుగానీ, చేసుకున్నాక నీ ప్రేమ నాకు లభ్యం కాకపోతే మాత్రం నా గుండె ఆగిపోతుంది. ఆ విషయం బాగా గుర్తుంచుకో! బాగా ఆలోచించుకొని ముందుకడుగేయి. వేసిన తర్వాత వెనక్కితీసుకోలేము"

ఆమె స్వరంలోని గంభీరతకు, విజ్ఞతకు ఎంతగానో ఆశ్చర్యపోయాడు "ఈ అమ్మాయి అసలు తనెరిగిన కావ్యేనా? అని అనుమానం వచ్చిందతనికి.

"ఏం బావా! మాట్లాడవేం?"

"నాకిష్టమే కావ్యా!"

నమ్మలేనట్లు చూసింది కావ్య, లలిత్ ఆమె భుజాలుపట్టి, బాగా దగ్గరగా తీసుకుంటూ-

"ఇంకా సందేహమా? అదెవరు...?" తెలియనట్లు అమాయకత నటించింది కావ్య,

"అదెవరంటే...? ఇది" సంతోషంతో విచ్చుకున్న ఆమె పెదాల తీపిని

ఆస్వాదిస్తు, కొంటెగా పలికాడు.

"బా....వా" అంటూ, మత్తుగా గొణిగి, లతలా అతన్ని అల్లుకుపోయింది కావ్య. ఆ ఇద్దరి మధ్యను 'గాలి' కూడా చొరబడలేకపోయింది.

"బావా ! ఇది కలగాదు కదూ ! నిజమేకదూ" వివశురాలై అడిగింది కావ్య.

"కలకాదు మరదలా ! నిజమే !" ఆమె చెవిని చిలిపిగా కొరుకుతూ అన్నాడు లలిత్.

"హాస్యంకాదు బావా ! నేను నిజంగా అడుగుతున్నాను. నన్నెప్పుడూ దూరం చేయవుకదూ ! ఆరోజు నేనన్న మాటల్ని మనస్సులో పెట్టుకోవుకదూ" దిగులుగా భయంగా అడిగింది కావ్య.

"ఛా ! ఈ బావ నీ కళ్ళకు అంత దుర్మార్గుడిగా కన్పిస్తున్నాడా కావ్యా ?" బాధగా అడిగి, ఆమెను ఆర్తిగా తన గుండెలకేసి బలంగా అదుముకున్నాడు.

"నేను... నేను నిజంగా చాలా అదృష్టవంతురాల్ని బావా ! జీవితాంతము నిన్ను పూజిస్తాను...." సంతోషం, కృతజ్ఞత, ఆమె గొంతులో నిజాయితీగా తొంగి చూశాయి.

"నువ్వు పూజ చేస్తు కూర్చో ! నాకు వైరాగ్యమొచ్చి అడవుల వెంట పడతాను" సరదాగా అన్నాడు లలిత్.

"ఛా....! పో ఏం మాటలవి ?" ముద్దుగా విసుక్కొంది కావ్య.

"ఎక్కడికి పోను ? కావ్య నాయిక సందిట్లో ఇరుక్కుపోయిన పూర్ ఫెలోని"

"ఇరుక్కుపోయావా ? అతుక్కుపోయావా ?" పక. పక నవ్వుతూ అడిగింది కావ్య.

"రెండూను" లలిత్‌కూడా పెద్దగా నవ్వాడు. ఆ జంట నవ్వులకు మామ్మ హృదయం సంతోషంతో పొంగిపోయింది.

* * * *

అనుకున్నప్రకారం లలిత్, కావ్యల వివాహం నిర్విఘ్నంగా జరిగిపోయింది. గుండెల్లో మరోసారి అగ్నిపర్వతాలు బ్రద్దలవుతున్నా, సంతోషాన్ని 'అరువు' తెచ్చుకొని ఆ వివాహవేడుకలో పాల్గొంది కళ్యాణి.

ఒకప్రక్క కావ్యనుచూసి మురిసిపోయారు. మరోప్రక్క కర్పూరికను తల్చుకొని మనస్సులో ఏడ్చారు శంకరం దంపతులు. కళ్యాణికూడా చాలా బాధపడింది.

"చేజేతులా ఆనందాన్ని జారవిడుచుకున్న దౌర్భాగ్యురాలు !" మనస్సులో అనుకుంది.

"ఇక లలిత్ బాధ వర్ణనాతీతం !" "ఎక్కడున్నావు కర్పూరీ ? జీవితాన్నెందుకు ఇలా ఛిన్నాభిన్నం చేశావు ? చివరకు నన్నొక స్వార్థపరుడిలా తయారుచేసి వినోదిస్తున్నావా ? నీకోసం కన్నీళ్ళు కార్చనా ? చిన్నారి కావ్యకోసం నవ్వులు చిందిరనా ? ఎలా నా బ్రతుకు ?" మనస్సులో క్రుళ్ళిపోయాడు.

ఆ వివాహాన్నిచూసి అందరికంటే ఎక్కువ ఆనందించింది మామ్మ. అయితే ఆమెకుకూడా కావ్య లలిత్‌ల మధ్య జరిగిన సంభాషణ, దాని పర్యవసానం తెలియదు. ఆ నిజం వాళ్ళిద్దరి గుండెల్లోనే ఉండిపోయింది. ఇకముందుకూడా ఎప్పటికీ అలాగే ఉండిపోవాలని వాళ్ళు నిశ్చయించుకున్నారు. అయితే కళ్యాణికి కాస్త అనుమానం వచ్చింది. కానీ .... ఆమె మౌనంగానే ఉండిపోయింది.

కళ్యాణి ఒక అపూర్వ ప్రేమికురాలు. అందుకే తను ప్రేమించిన లలిత్‌ని అరాలడిగి బాధించదల్చుకోలేదామె.

లలిత్ వివాహానికి ఎంత బాధపడ్డాడో, ఎంత భయపడ్డాడో.... కావ్యను వివాహం చేసుకున్నాక అవేమీలేవు. ఆమెతో వివాహ జీవితం అంత ఆనందంగా సాగిపోతుందని కలలో గూడా ఊహించలేదు లలిత్. ప్రతిక్షణం మధురంగా గడిచిపోతోంది. వెన్నెల నదిలో పన్నీటి స్నానం చేస్తున్నట్లు ఫీలవుతున్నాడు లలిత్.

ఒక్కక్షణం కూడ భర్తను వదలదు కావ్య. ఆమె శరీరంలోని అణువణువునే కాదు ! మనస్సులోని అట్టడుగు పొరల్ని గూడా స్పృశించగలిగాడు లలిత్. లలిత్‌ని భర్తగానేకాదు ! ఒక్కోసారి పసిపాపాయిలాగా కూడా లాలిస్తుంది కావ్య. అసలు కావ్య ప్రతిక్షణం భర్తకేవిధంగా ఆనందాన్ని సమకూర్చాలా అనే ఆలోచిస్తుంది. భర్తకు భార్య ఎన్నివిధాలా సుఖాల్ని అందించగలదో తెలియనివాళ్ళు కావ్య దగ్గర నేర్చుకోవాల్సిందే.

"తనను ప్రేమించే భార్య దొరికితే మగవాడి జీవితం ఇంత ఆనందంగా వుంటుందా ?" అని పదే, పదే ఆశ్చర్యపోతున్నాడు లలిత్. స్వర్గమంటే మరెక్కడో లేదనిపిస్తోందతనికి. అయితే అంత ఆనందంలో కూడా అప్పుడప్పుడు కర్పూరిక గుర్తొచ్చి, మనస్సు ఒక్కక్షణం 'కలత' చెందుతుంది. కావ్య చాలా తమాషాగా ఆ క్షణాన్ని పసిగట్టి... అతని మనస్సును వెంటనే 'డైవర్టు' చేస్తుంది. ఆమె నైపుణ్యానికి మరింతగా ఆశ్చర్యపడుతుంటాడు లలిత్.

శంకరంగారు, శాంతాదేవి కూడా కావ్య విజ్ఞతను, సంసారాన్ని చక్కదిద్దుకునే ఆ తీరుకి ఎంతో ముచ్చటపడుతుంటారు. ఇక మామ్మయితే నాకు 'ముని మనుమడ్ని' ఎప్పుడు అందిస్తారని ఒకటే గోల !

* * * *

లలిత్ ఇంటినుండి బయటపడిన కర్పూరిక హైద్రాబాద్ చేరింది. అక్కడ ఎన్నో అనాథ శరణాలయాలున్నాయని లోగడ విన్నది. అందుకే ఆ ధైర్యంతోనే కట్టుబట్టలతో కొంత డబ్బుతో, చేరగలిగింది. కానీ ఆ నగరంలోకి అడుగిడగానే, ఆమె అంచనాలన్నీ తలక్రిందులయ్యాయి. భాగ్యనగరం గురించి ఎంతో ఉన్నతంగా వూహించిన కర్పూరిక బాగా 'డీలా' పడిపోయింది.

ఎలాగో అష్టకష్టాలుపడి అనాథశరణాలయంలో చేరింది. అనాథశరణాలయమంటే ఒక దేవాలయమని. పూర్తి రక్షణ ఇచ్చే ఒక తపోవనమని ఇలా ఎన్నో

విధాలుగా భావించిన కర్పూరిక అక్కడి కుళ్ళు వాతావరణము, కుటిల రాజకీయము చూసి, నిశ్చేష్టురాలైంది! ఆడదానికి రక్షణ ఇవ్వటం మాట అటుంచి, ఆమె 'మానం'తో వ్యాపారం చేయటం, ఏకంగా శరణాలయానికే విటులు రావటంచూసి భయంతో వణికిపోయింది.

"వాళ్ళతో మంచిగా ఉండటం మినహా, తాను చేయగలిగింది ఏముంది? బయటికెళ్ళి ఎక్కడ వుంటుంది? ఎలాగో అక్కడేవుండి, నెమ్మదిగా ఉద్యోగ ప్రయత్నం చేసుకుంటే, డెలివరీ కాగానే, ఆ పీడాకాస్తా వదిలించుకొని, ఇక ఆ తర్వాత నిశ్చింతగా బ్రతకొచ్చని" మనస్సులో అనుకొంది.

గర్భిణీస్త్రీ కావటంతో ఆమె జోలికెవరూ రావటంలేదు! ఎందువలనోగాని కర్పూరిక అంటే కాస్త అపేక్షనే చూపిస్తున్నది అధికారిణి. అయితే కర్పూరిక చేసిన ఒకేఒక్క పెద్దపొరబాటు "ఏమిటంటే?" అనాధ శరణాలయంలోకి అడుగిడగానే....ఎంతో ఉన్నతంగా వూహించి తనగురించి పూర్తిగా ఆమెకు చెప్పుకోవటమే...

కేవలం పాత స్నేహితురాలిని, అనాధ శరణాలయాన్ని, నమ్ముకొని వచ్చిన తన తెలివితక్కువతనంమీద అప్పుడు కోపమొచ్చింది కర్పూరికకు. ఆ పాత స్నేహితురాలి అడ్రసు మారిందో ఏమో; ఆ అమ్మాయినసలు కనుక్కోలేకపోయింది. ఆ అమ్మాయి నాన్నగారి సాయంతో, ఏదోవిధంగా 'జాబ్' సంపాదించుకోవచ్చన్న కర్పూరిక ఆశ నిరాశ అయింది.

కన్న తల్లిదండ్రుల్ని, ఆత్మీయుల్ని, కట్టుకున్న భర్తను వదిలి కేవలం అతనిమీద 'కక్ష' సాధించాలన్న మూర్ఖత్వంతో, నీలాగా ఇలా ఎవరైనా ఈ నరక కూపంలోకి అడుగిడతారా? అని తోటి అమ్మాయి మందలిస్తుంటే, అప్పుడు కాసేపు బాధపడింది కర్పూరిక. మరలా ఆ తర్వాత మామూలే! లలిత్‌మీద 'దెబ్బ' తీసిన తన అతితెలివికి సంతోషిస్తూ, ప్రస్తుతం పడుతున్న కష్టాల్ని మర్చిపోవటానికి ప్రయత్నిస్తోంది.

"అమాయకురాలా? మూర్ఖురాలా?" అని శరణాలయంలోని అమ్మాయిలు కొందరు విస్తుపోతుంటారు కర్పూరికనుచూసి.

"డెలివరీ కాగానే ఏదో విధంగా ఇక్కడినుండి బయటపడాలి? లేకపోతే... తనుకూడా అందరిలా... అమ్మో! అలా జరగటానికి వీల్లేదు." మనస్సులో ఇలా భయపడుతూనే రోజులు గడిపింది కర్పూరిక.

నెలలు నిండాయి! ప్రసవ సమయం సమీపించింది. అప్పుడు ఆ ప్రసవ వేదనను అనుభవిస్తు కూడా లలిత్‌ని ఎన్నో విధాలుగా మనస్సులో తూలనాడింది. తన ఈ 'దుస్థితి' అంతటికీ కారణం! ఆ మాయదారి లలిత్తేనని ఆమె అభిప్రాయం. అందుకే అటువంటి సమయంలో కూడా లలిత్‌ని ద్వేషించకుండా ఉండలేకపోయింది.

కాన్పు కష్టం కావటంతో, 'సిజేరియన్' చేసి బిడ్డను తీయవల్సి వచ్చింది. కర్పూరిక కెందుకో 'స్పృహ' పోయింది. ఆ అవకాశాన్ని చక్కగా 'సద్వినియోగం' చేసుకుంది శరణాలయ అధికారిణి.

కర్పూరికకు 'స్పృహ' రాగానే బిడ్డ కోసం... పక్కలో తడుముకుంది. కానీ బిడ్డ కన్పించలేదు. ఖంగారుపడింది. డెలివరీ అయ్యే ముందు క్షణం వరకూ, ఆ బిడ్డను ఎంతగా ద్వేషించినా, అప్పుడు మాత్రం... తను తొమ్మిది నెలలుమోసి కన్న. ఆ పసిగుడ్డును చూసుకోవాలని తెగ తాపత్రయపడిపోయింది. అయితే ఆమె ఆశ 'నిరాశ' అయింది. అధికారిణి చెప్పిన సమాధానం విని, మరలా స్పృహ తప్పింది కర్పూరిక.

"నీకెలాగూ ఆ బిడ్డంటే అసహ్యమని చెబుతూ వచ్చావుగా కర్పూరికా! ఆ బిడ్డను ఏదో విధంగా వదిలించుకోవాలనే కదా ఇంత దూరం శ్రమపడి వచ్చావు. ఆ బిడ్డ 'నీడ'ను కూడా భరించలేనిదానివి ఎలా పెంచగలవులే? అని, ఎవరో పాపం బిడ్డలు లేనివాళ్ళు అడిగితే దానమిచ్చాను. వాళ్ళ దగ్గర నీ బిడ్డ అల్లారు ముద్దుగా పెరుగుతుంది. వాళ్ళు మన శరణాలయానికి 'డొనేషన్' కూడా ఇచ్చారు కర్పూరికా! నేను చేసినపని బాగోలేదూ? ఇక నీ భర్తమీద నువ్వు 'కక్ష' సాధించినట్లే....!" చెప్పి ఒక వెకిలి నవ్వొకటి నవ్విందామె.

ఆమె మాటలకు తట్టుకోలేక స్పృహతప్పింది. కాసేపైన తర్వాత స్పృహ వచ్చింది. ఇక ఆ అధికారిణిని తిట్టటం ప్రారంభించింది కర్పూరిక. ఆమె ఏం మాట్లాడకుండా నిబ్బరంగా నుంచొంది.

పిచ్చిపట్టిన దానిలా అరుస్తు, ఏడుస్తు, కుమిలిపోయింది. కర్పూరిక స్థితి చూస్తుంటే మిగతా వారికి బాగా జాలి వేసింది.

నాకీశాస్తి జరగవలసిందే. ఏతల్లీ ద్వేషించని విధంగా తను ద్వేషించింది. అతడి బిడ్డను అతనికి దూరం చేయాలని అనుకుందేతప్ప, ఇలా పూర్తిగా వదులుకోవాలనుకుందా? ఈ అభిప్రాయం లలిత్ దగ్గర ఉన్నప్పుడు ఉండేది. కానీ... శరణాలయానికి వచ్చాక, తన మనస్సు మారిపోలేదూ! అయ్యో! ఆ బిడ్డకోసం లలిత్ ఎంత ఆరాటపడిపోయాడు...? ఎంత సహనం వహించాడు? ఈ దుర్మార్గురాలిలా చేసిందేమిటి? ఎంతధైర్యం? తన అభిప్రాయం అడగకుండానే ఈపని చేసిందంటే... ఎంతకైనా సమర్థురాలే; మైగాడ్! .... ఈ పాముల పుట్టలో ఇక వుండకూడదు. దీని బండారం ఏదో విధంగా బయట పెడదామంటే తన చరిత్రకూడా బయటపడుతుంది. అప్పుడు అందరూ తననే నిందిస్తారు. "నువ్వసలు ఆడదానివేనా? అని హేళన చేస్తారు. తనంటే సానుభూతి లేకపోగా .... రాళ్ళతోకొట్టి అవమానిస్తుంది సమాజం. లలిత్‌కి తెలిస్తే అసలు బ్రతకనివ్వడుకూడా. తల్లిదండ్రులుకూడా ముఖాన ఉమ్మేసి, తలుపులు బిగించుకుంటారు."

ఇలా ఆలోచిస్తూ మరోసారి తన బిడ్డను ఎవరికిచ్చారో దయచేసి చెప్పమని శరణాలయ అధికారిని ప్రాధేయపడింది.

వాళ్ళెవరో నార్త్ ఇండియన్స్‌అనీ, వాళ్ళ అడ్రసు తనకసలు తెలియదనీ,

అబద్ధమాడిందామె. ఎంత బ్రతిమాలినా తెలియదంటే, తెలియదని నిర్లక్ష్యంగా, కోపంగా, సమాధానమిచ్చింది. కోపం వచ్చినా కంట్రోల్ చేసుకుంది కర్పూరిక. అంతకంటే ఇక చేసేదిమాత్రం ఏముందికనుక ?

భర్తదగ్గరకు వెళ్ళిపొమ్మనమని లోగడ చాలాసార్లు మందలించిన తోటి అమ్మాయి 'శారద' ఓదార్పుగా కర్పూరిక భుజంమీద చెయ్యేసి ఇప్పుడు బాధపడి మాత్రం ప్రయోజనమేముంది కర్పూరికా ? బంగారు బొమ్మలాంటి బిడ్డను పోగొట్టుకున్నావు. ఆ పాప జుట్టు ఎంత బాగుందో ? వీపు మీదైతే, నా అరిచేయంత పుట్టుమచ్చ వుంది. పోలికలు నీ భర్తవో, నీవో, సరిగ్గా తెలియలేదు నాకు. అసలా రాక్షసి సరిగ్గా చూడనిచ్చిందా ? పిల్లలు లేనివాళ్ళకు దయతలచి ఇచ్చానని చెప్తున్నది కదూ ! అదేంలేదు ? అవి చెప్పేవన్నీ అబద్ధాలే ! ఎంతో కొంత డబ్బుకు అమ్మేసి వుంటుంది. ఇలా లోగడ కూడా చాలాసార్లు జరిగింది. బిడ్డల్ని అమ్మటం, కొనటం కూడా ఒక పెద్ద బిజినెస్ అయిపోయింది. దీనికి, అలాంటి ముఠాకి, సంబంధముంది. నేనందుకే నిన్ను అంతగా హెచ్చరించాను. నువ్వు వినకపోతివి. ఇప్పుడైనా కనీసం మనస్సు మార్చుకొని, నీ వాళ్ళ దగ్గరికి వెళ్ళిపో...!" సున్నితంగా మందలించింది.

అంతా శాంతంగానే విన్నా శారద మాట్లాడిన ఆ చివరి వాక్యం వినటంతోనే, మరలా ఆవేశపడిపోయింది కర్పూరిక ఎప్పటిలాగే.

"ఇక నేను చస్తే అక్కడకు వెళ్ళేదిలేదు. చావైనా, బ్రతుకైనా నేనే భరిస్తాను."

"నీ ఇష్టం....! నీ 'ఖర్మ' ఎలా వుంటే అలా జరుగుతుంది" విసుగ్గా అంది శారద. ఇక ఆ క్షణానే... దారి తెన్నూలేని 'గమ్యాన్ని' వెదుక్కుంటూ, ఆ వాతావరణం నుండి బయటపడింది కర్పూరిక.

* * * *

పిచ్చిదానిలా ఎన్నో ఆఫీసుమెట్లు ఎక్కి, దిగింది కర్పూరిక. కానీ ఒక్కరూ దయతలచి జాబ్ ఇవ్వలేదు. పగలల్లా ఆఫీసుల చుట్టు తిరగటం. రాత్రిళ్ళు రైల్వే స్టేషన్లోని వెయిటింగ్ రూములో పడుకోవటం అక్కడివాళ్ళకు కూడా అనుమానమొచ్చి అదోలా చూడసాగారు. అలా రెండు, మూడు రోజులు గడిచిపోయాయి ! పచ్చి బాలింత కావటంతో పాలిండ్లు నొప్పిచేసి అదొక క్రొత్త బాధ ఎదురైంది.

అలా ఆ బాధను భరిస్తూనే ఉద్యోగ ప్రయత్నానికి బయల్దేరి అబిడ్స్‌లో ఉన్న ఒక ప్రవేట్ కంపెనీలో చిన్న క్లర్క్ ఉద్యోగం సంపాయించుకుంది.

హిమాయత్‌నగర్‌లో అదొక రిటైర్డ్ ఆఫీసరు ఇల్లు, వాళ్ళ పిల్లలందరూ పెళ్ళిళ్ళయిపోయి దూర, దూరంగా వుంటున్నారు. ఆ వృద్ధ దంపతులు, వాళ్ళ మూడో కొడుకుకూతురు మాత్రమే ఉంటున్నారు. ఆ పాప వయస్సు ఆరేళ్ళు. చాలా ముద్దుగా ఉంది. వాళ్ళ ఇల్లు చాల పెద్దది. ఉంటున్నదేమో ముగ్గురే. అందువలన

రెండు మూడు గదులు ఖాళీగానే వుంటున్నాయి. ఆ విషయం ఎవరి ద్వారానో తెల్సి, అడిగితే, వాళ్ళు ఫ్రీగా ఉండటానికే ఒప్పుకున్నారు. 'రెంట్' తీసుకోమంటే తీసుకోమన్నారు. వాళ్ళకు కావాల్సింది సరదాగా ఒక తోడు మాత్రమే.

ఆ రిటైర్డ్ దంపతుల ఇంట్లోకి వచ్చిన కొద్దికాలంలోనే వాళ్ళ అభిమానాన్ని, ప్రేమను, బాగా చూరగొన్నది కర్పూరిక. ఆమెను వాళ్ళ బిడ్డలా భావించి ఆదరిస్తున్నారు.

కర్పూరికకు అప్పుడప్పుడూ లలిత్, కనీసం రూపమైనా చూడని తన బిడ్డ, తల్లిదండ్రులు, చెల్లెళ్ళు, కళ్యాణి గుర్తొచ్చి, మనస్సు బాధపడుతుంటుంది. వాళ్ళను ఒక్కసారిచూస్తే బాగుండుననిపిస్తుంటుంది. కానీ .... వాళ్ళెదురు పడటానికి మొహం చెల్లక, రోజుల్ని నిర్లిప్తంగా గడుపుతోంది.

* * * *

కాలం మరో పదేళ్ళు ముందుకు పరిగెత్తింది . ఈ పదేళ్ళకాలంలో చాలా మార్పులు జరిగిపోయాయి.

కావ్య, లలిత్‌లకి ఒక బాబు. ఆ బాబు కాన్వెంట్‌లోకూడా చేరాడు. ఆ బాబంటే వాళ్ళకు ప్రాణం. వివాహమై పదేళ్ళు గడిచినా ... వాళ్ళిద్దరిమధ్య అనురాగం, ప్రేమ, చెక్కుచెదరక, నిత్యనూతనంగానే వుంది వాళ్ళ దాంపత్యం. వాళ్ళకిప్పుడు కర్పూరికసలు గుర్తురాదు. కావ్యకసలే గుర్తుండదు. అది స్వార్థమని ఎవరైనా అన్నా ఒప్పుకోదామె. తొలిసారి మనస్సులో చోటు చేసుకున్న యువతి కనుక, ఎప్పుడైనా కాస్త గుర్తొస్తు వుంటుంది లలిత్‌కి. వెంటనే ఆమె ప్రవర్తించిన తీరు కళ్ళల్లో మెదిలి, అసహ్యమేర్పడుతుంద.

శంకరంగారు రిటైరయ్యారు. శిల్పకుకూడా వివాహం చేశారు. ఆ మాచ్ చూసింది లలిత్తే. అల్లుడంటే రోజు, రోజుకీ అభిమానం పెరుగుతున్నదేతప్ప కాస్త కూడా తగ్గలేదు. వాళ్ళకు మగపిల్లలు లేని లోటు లలిత్‌తోనే తీర్చుకుంటున్నారు. లలిత్ కొడుకన్నా వాళ్ళకు పంచప్రాణాలు. వాళ్ళకు కర్పూరిక దాదాపు రోజూ గుర్తొస్తూనే వుంటుంది. మనస్సు బాధపడుతుంది. అయితే వాళ్ళేమాత్రం తమబాధను బహిర్గతం చేయరు. గుండెలోనే సమాది చేశారు.

కళ్యాణి తన జీవితంలో ఇక వివాహ ప్రసక్తే లేదని తేల్చి చెప్పి, పట్టుదలగా ఎమ్.ఎస్.సి., బి.ఇడి. చదివి ఆ తర్వాత జాబ్ చేయటానికి 'టాంజానియా' వెళ్ళిపోయింది. అది కేవలం వంకని తెల్సు అందరికీ. కేవలం తనను చూడకుండా మనస్సును అరికట్టుకునే ప్రయత్నమే అదని లలిత్ అందరికంటే ముందుగానే గ్రహించాడు. ఎంత నచ్చజెప్పినా కళ్యాణి మనస్సును, నిర్ణయాన్నికూడా మార్చలేకపోయాడు. కళ్యాణి అలాంటి నిర్ణయం తీసుకోవటానికి తనే కారణమైనందుకు అతని మనస్సు ఎంతగానో క్షోభించింది.

* * * *

కర్పూరిక బ్రతుకులో ఏట్టిమార్పు లేదు. ఆ రిటైర్డ్ దంపతుల ఇంట్లోనే వుంటూ, జాబ్ చేస్తోంది. వాళ్ళ మనుమరాలు కాలేజీలోకూడా చేరింది.

వయస్సుకు మించిన వార్ధక్యం వచ్చి మీదపడిందామెకు. 'నా' అన్నవాళ్ళంటూ ఎవరూలేక, నిస్సారంగా గడుపుతోంది. అహంకారం, అతిశయం అన్నీ మంచులా విడిపోయాయి. గతంలో తను ప్రవర్తించిన తీరుకు ఎంతగానో సిగ్గుపడుతోంది. అయితే, ఇంకా ఏమూలో ఆమెలో కాస్త మూర్ఖత్వం కనబడుతూనే ఉంది. ఆ మూర్ఖత్వమే లేకపోతే, ఎప్పుడో లలిత్ దగ్గరకు వెళ్ళి తప్పక క్షమాపణలు కోరి వుండేది.

ఒకరోజు కర్పూరిక, ఇంటివాళ్ళ మనుమరాలు కల్సి షాపింగ్ కెళ్ళి వస్తున్నారు. ఒకచోట జనం గుంపులు, గుంపులుగా నుంచొని ఉన్నారు. ట్రాఫిక్ ఆగిపోయింది. ఏమిటో చూద్దామని వీళ్ళుకూడా వెళ్ళిచూశారు.

అక్కడి దృశ్యం చూడటంతోనే, కర్పూరికకు కళ్ళు బైర్లుకమ్మాయి. ఒక పదేళ్ళ పాపను ఎవరో దారుణంగా రేప్‌చేసి, చంపి, అక్కడ పడేశారు. చంపాలనే చంపారో, లేక రేప్ చేస్తేనే, ఆ చిన్నారి పాప తట్టుకోలేక మరణించిందో తెలియదు కానీ, మొత్తానికి ఆ పాప శవం మాత్రం అక్కడ పడివుంది.

"మైగాడ్ ...! ఎంత రాక్షసత్వం? పాపం! ఎవరిపాపో?" కర్పూరికతో వచ్చిన ఇంటివాళ్ళపాప 'క్రాంతి' బాధగా అంది.

ఆ మాటలేమీ వినేస్థితిలో లేదు కర్పూరిక. నిలబడే శక్తిలేక ఆ గుంపులోనే కూలబడిపోయింది. ఎవరో కాళ్ళతో తొక్కనుగూడా తొక్కారు.

పోలీసులకోసం కాబోలు! ఆ శవం అక్కడ నగ్నంగా పడివుంది. బోర్లా పడివుంది ఆ పాపదేహం. కూలబడిపోయినదల్లా ఉన్నట్టుండి సడన్‌గా లేచి, బాగా లోపలకు జొరబడి, ఆ పాప దేహాన్ని వెల్లికిలా త్రిప్పింది కర్పూరిక. అక్కడివారు ఆశ్చర్యపోయారు ఆమె చర్యకు.

ఆ పాప మొహాన్ని పరీక్షగా చూసిన కర్పూరిక మొహం రక్తంలేనట్లు పాలిపోయింది. క్రాంతికూడా విస్తుపోతూ కర్పూరికవైపు, ఆ పాప మొహంవైపు, మార్చి మార్చి చూసి ... "మైగాడ్! అచ్చం ఆ పాప కర్పూరిక ఆంటీలాగానే ఉంది! ఇదెలా సాధ్యం?" మనస్సులో అనుకుంది.

పదేళ్ళ వయస్సులో కర్పూరిక ఎలా ఉండేదో....ఇప్పుడాపాపకూడా అచ్చం అలాగే వుంది. కర్పూరిక నోట్లోనుంచి వూడిపడ్డట్టుగా వుంది.

ఆ పాప తప్పకుండా తనపాపే. ఇందులో అనుమానం లేదు. ఆనాడు శరణాలయంలోని అమ్మాయి శారద పాప గురించి చెప్పిన గుర్తుకూడా సరిపోయింది. అరిచేయంత పుట్టుమచ్చ పాప. తెల్లని వీపుమీద స్పష్టంగా కనబడుతోంది! పాప తన పాపే! తనపాపే ....! ఆ రాక్షసి ఆనాడు పాపను ఎవరికి ఇచ్చిందో ...? లేక అమ్మిందో ....? భగవాన్! నా బిడ్డ ఎలాంటి వాళ్ళ చేతికి చిక్కిందో? లేకపోతే

పాపనీస్థితిలో ఎందుకు చూడవల్సి వస్తుంది? దీనికంతటికీ కారణం తనుకదూ! ఆ చిన్నారి అంత ఘోరమరణం పొందటానికి .... తల్లే కారణమని తెలిస్తే ... తనను ఎంతగా తూలనాడతారో? ఏ తల్లీ చేయని పాపం చేసింది తను.

కర్పూరిక కళ్ళు దారాపాతంగా వర్షిస్తున్నాయి. "ఈపాప మీ పాపా?" చాలామందికి ఒకేసారి అనుమానమొచ్చి అడిగారు కర్పూరికను.

"కా .... దు ....!" బలహీనంగా ఉచ్చరించింది.

"అచ్చం మీలాగే వుంది! మీ పాపే అనుకున్నాం ....!"

"నేనూ ... అలాగే అనుకున్నా ఆంటీ!" అప్పుడు క్రాంతికూడా అంది.

"కా ...,ద ... మ్మా!" గుండెను చిక్కబట్టుకొని వెనుదిరిగింది. క్రాంతి కూడా ఆమె ననుసరించింది.

గదిలోకివెళ్ళి తలుపులు మూసుకొని, మంచముమీద వాలిపోగానే, అప్పటి వరకూ నిగ్రహించుకున్న దుఃఖము వరద గోదావరిలా ఉప్పొంగింది కర్పూరికలో.

మాటిమాటికీ తన మూర్ఖత్వం వలన బలైపోయిన పాప మృతదేహమే కళ్ళ ముందు మెదులుతూ చిత్రహింస ననుభవించింది కర్పూరిక. ఏ న్యాయస్థానమూ విధించని ఘోరమైన శిక్షను పాప మరణించి విధించింది. చట్టానికి దొరకని పరమ కిరాతకురాలు కర్పూరిక.

"భగవాన్! నా వలన ఎందరి జీవితాలు అల్లకల్లోలమయ్యాయి. నన్నింత మూర్ఖురాలిగా ఎందుకు పుట్టించావు తండ్రీ? పాప ఇలా అయింది. ఇక ఆ పాపతండ్రి లలిత్ నేను చేసిన గాయంతో ఎంతగా కుమిలిపోతున్నాడో? తన పాపకోసం ఎంతగా తపించిపోయాడు? పాపిష్టిదాన్ని నేను. నా మూలంగానే పాప బలైపోయింది. నా పంతమే నెరవేర్చుకోవాలన్న మూర్ఖపు పట్టుదలే నాకుండకపోయినట్లయితే .... నా బ్రతుకెలాగున్నా, కనీసం పాపైనా తన తండ్రిదగ్గర ఎంత అల్లారుముద్దుగా పెరిగేదో అయ్యో పాపా! ఇద్దరి ప్రేమను కావాలని దూరం చేసిన దౌర్భాగ్యురాలినమ్మా! నన్ను క్షమించకుతల్లీ! నన్నూ ... నీ దగ్గరకు చేర్చుకోమ్మా!"

ఒక్క ఉదుటున లేచి స్లీపింగ్‌పిల్స్ సీసా అందుకుంది. కాని వెంటనే కళ్ళ ముందు లలిత్ మోము ప్రత్యక్షమై ఆ ప్రయత్నం విరమించుకుంది.

ఒకప్పుడు లలిత్ అన్నట్టు...కర్పూరికలాంటి స్త్రీలు వాళ్ళ వాళ్ళ మూర్ఖత్వం నుండి శాశ్వతంగా బయట పడాలంటే వాళ్ళ జీవితంలో ఏదైనా ఒక గట్టి 'షాక్' తప్పక తగలాల్సిందే! అలా అయితేతప్ప వాళ్ళు మారరు. వాళ్ళలో మార్పురాదు. అలాంటి షాక్‌కి వాళ్ళయితేనే తట్టుకోగలరు. మామూలు వ్యక్తులయితే ఆ క్షణంలోనే ప్రాణాలుకూడా వదులుతారు.

ప్రస్తుతం కర్పూరిక తిన్న షాక్ సామాన్యమైనదా? అదే మరొక మామూలు స్త్రీ అయితే...ఇంకా జీవించి ఉండగలుతుందా? పాపను ఆ స్థితిలో చూడగానే, మరో

తల్లి గుండె అయితే, ఆ క్షణంలోనే పగిలిపోయేది.

గుండె ఆగక పోయినా, అంతకంటే రెట్టింపు బాధనే అనుభవించింది కర్పూరిక కూడా, అందువలనే వెంటనే లలిత్ దగ్గరకు బయల్దేరగలిగింది.

ఏ డాక్టర్లు ఇవ్వని ఘాటైన మందును పాప మరణించి ఇచ్చింది కర్పూరికకు

* * * *

కర్పూరిక ప్రయాణం చేసి, లలిత్ ఇంటిని చేరేసరికి బాగా 'అర్ధరాత్రి' అయింది. కావాలనే అలాంటి సమయాన్ని ఎన్నుకుంది, పగలైతే ... అందరినీ చూసి తాను ఎదుర్కోలేనన్న పిరికితనంతో, భయంతో, అలా చేసింది.

ఆ ఇంటిని సమీపించి, కాలింగ్ బెల్ మీద చేయి వేయాలంటే, కాళ్ళూ, చేతులు, శరీరం మొత్తం వణికింది.

"లలిత్ తను చేసిన 'ద్రోహాన్ని' మర్చిపోగలుగుతాడా? చూడగానే ఆవేశంతో మీదపడి గొంతు పిసికి పారేయడూ? పిసికితే పిసకనీయ్! అతని చేతుల్లో పోతే మరీ మంచిది! అతని అసహ్యాన్ని భరిస్తూ, బ్రతుకంతా బరువుగా గడిపేకంటే ఇదే మంచిది! అసలు పాప విషయం తెలిస్తే, తననెలాగూ వదలడు! తను అన్నిటికీ సిద్ధపడే కదా వచ్చింది? ఇక ఇప్పుడు భయపడటం దేనికని ?" మనస్సులో అనుకొని కాలింగ్‌బెల్ మ్రోగించింది కర్పూరిక.

కర్పూరిక గుండె వేగంగా కొట్టుకోసాగింది. తలుపు తీస్తున్న చప్పుడు వినిపించి, గోడను గట్టి ఆసరాగా చేసుకొని నిలబడింది.

తలుపుతీసి విసుగ్గా చూసిన లలిత్ నిశ్చేష్టుడయ్యాడు. ఎదురుగా కర్పూరిక. పైగా అదీ అర్ధరాత్రి సమయంలో ... ఇన్నేళ్ళ తర్వాత ... ఇలా ... "మైగాడ్ దెయ్యం కాదుకదా ...!" ఒక్కక్షణం అతను భయపడి, ఒక అడుగు వెనక్కికూడా వేశాడు.

"భయపడుతున్నావా లలిత్! నేను దెయ్యాన్ని కానులే! భయపడకు" చిన్నగా అంది కర్పూరిక.

లలిత్ ఏం మాట్లాడకుండా ఆమెనే వెర్రిగా చూస్తూ నిలబడ్డాడు.

"మాట్లాడవా లలిత్? నేనంటే అసహ్యంగా వుందికదూ! నేనిప్పుడు వెనుకటి కర్పూరికను కాను. నేను నిజం చెప్పినా నువ్వు నమ్మవులే! నాకుతెల్సు. నువ్వు నమ్మటానికి .... నమ్మేవిధంగా ప్రవర్తించాను కనుకనా ?" కర్పూరిక బాధపడుతూ పలికింది.

లలిత్ 'షాక్' తిన్నట్లు ఉండిపోయాడు. "క్షమించు లలిత్! నీకు బాగా నిద్రాభంగము కల్గించానుకదూ! ఏం చేసేది? పగలు అందరి ఎదుట పడలేక, ఇలా అర్ధరాత్రి రహస్యంగా వచ్చాను. నన్ను క్షమించానని ఒక్కమాట చెప్పవూ! ప్లీజ్!" అంటూ సడన్‌గా వంగి, అతని కాళ్ళమీద పడిపోయి, బావురుమంది కర్పూరిక.

ఆమె మాటల్ని మరోవిధంగా అర్థం చేసుకొని, గొంతులోకి బలవంతంగా

గొంతున్ని తచ్చుకొని "నేనిప్పుడు నీ భర్త లలిత్‌ని కాను! మరొకరి భర్తను. ఒక పుట్టిన కొడుకుకూడా ఉన్నాడు. నన్ను విసిగించకుండా త్వరగా వెళ్ళిపో!" గొళ్ళను గుర్కుంటూ పలికాడు లలిత్.

తూలిపోతూనే లేచి నిల్చుని "నన్ను పొరబాటుగా అర్థంచేసుకున్నావు లలిత్. నిన్ను వేధించాలని రాలేదు ... నన్ను నమ్ము! నీ భార్య ... నీ భార్య...." సందేహంగా ఆగిపోయింది.

"నా భార్య నీలాంటి నిర్భాగ్యురాలు కాదు" కర్పూరికవైపు అసహ్యంగా చూస్తూ అన్నాడు. అతని మాటలకు కర్పూరిక హృదయం గిలగిల్లాడింది.

"ఎవరు ఆ అదృష్టవంతురాలు? కళ్యాణేనా?" గొంతు పెగుల్చుకొని అడిగింది.

"కాదు! కావ్య!" కసిగా నొక్కి పలికాడు. దాంతో కర్పూరిక తల తిరిగిపోయింది.

"కా .... వ్యా ....?" సన్నగా గొణిగింది.

"అవును! నీ చెల్లెలు కావ్యే ....!" ఆమెవైపు హేళనగా చూస్తూ చెప్పాడు. కర్పూరిక కళ్ళనుండి టప, టప కన్నీళ్ళు రాలిపడ్డాయి! చప్పున తుడుచుకొని "చాలా సంతోషం లలిత్! నా చిన్నారి చెల్లే ఈ ఇంటి మహారాణి అయినందుకు, చాలా ఆనందంగా వుంది. అది చాలా అదృష్టవంతురాలు" కంపిస్తున్న స్వరంతో పలికింది కర్పూరిక.

"సంతోషించావుగా! ఇక వెళ్ళు!" కోపంగా అన్నాడు లలిత్.

"ల....లి...త్ !!"

"ఏమిటా చూపులు? త్వరగా వెళ్ళిపో! మరలా కావ్య లేచి చూసిందంటే పెద్ద గొడవవుతుంది. నీవంటే మరీ అసహ్యం తనకు. నేను గనుక, ఇంతసేపు మాట్లాడాను. ఆమె అయితే నీ ముఖాన ఉమ్మేసి, వెంటనే తలుపులు మూసేది..." విసుగ్గా మాట్లాడాడు లలిత్.

"ఒక్కసారి దూరం నుండైనాసరె కావ్యను బాబును, చూసి వెళ్తాను లలిత్! ప్లీజ్! ఈ ఒక్క కోరిక...." జాలిగా అడిగింది,

ఒక్క నిమిషం ఆలోచించి "సరే రా కామ్‌గా చూసివెళ్ళిపో!..." అన్నాడు లలిత్.

అప్పటి వరకూ బయటే నిలబడి వున్నారు ఇద్దరూ. లలిత్ ఒప్పుకున్నాక అప్పుడు ప్రాణంలేని బొమ్మలా అతన్ననుసరించింది.

వాళ్ళ బెడ్రూము ముందు నిలబడ్డారిద్దరూ. డబుల్‌కాట్ మంచంమీద కావ్య, ఆ ప్రక్కన బాబు, హాయిగా అదమరచి నిద్రపోతున్నారు! కావ్యను ఇల్లాలిగా చూడటం అదే మొదటిసారి కర్పూరికకు. ఆ గదిలోని ఫొటో ఫ్రేమ్‌లో తన ఫొటోకి బదులు, కావ్య ఫొటో వుండటం కూడా చూసింది కర్పూరికకు. ఒక్క క్షణం

తో మెలికలు తిరిగిపోయింది.

రమ్మన్నట్లు 'సైగ' చేశాడు లలిత్.

బాధను దిగమ్రింగుకుంటూ, బలవంతంగా వెనక్కి వచ్చింది.

"ఎందుకా ఏడుపు ?"

"ఇది ఏడుపుకాదు లలిత్ ! ఆనంద భాష్పాలు !" దగ్గద స్వరంతో చెప్పి పమిట చెంగుతో గట్టిగా కళ్ళు తుడుచుకుంది.

"ఇంకెప్పుడూ ఇలా రాకు ఈ రోజంటే నేను హాల్లో నవల చదువుతు కూర్చోబట్టి వెంటనే రాగలిగాను. అదే కావ్య అయితే నువ్వు చాలా అవమానాన్ని ఎదుర్కోవల్సి వచ్చేది. నన్ను ప్రశాంతంగా బ్రతకనివ్వు !"

లలిత్ మాట్లాడే ఒక్కొక్కమాట ఒక్కో మొండి బాకులా కర్పూరిక గుండెల్లో దిగబడుతున్నాయి.

"లలిత్ ! కళ్యాణిబాగుందా ?" అడగలేక అడిగింది 'ఆఁ' పొడిగా పల్కాడు. సమాధానం చెప్పటం కూడా అతని కిష్టం లేదని గ్రహించి, నిట్టూర్చింది.

"మా అమ్మా, నాన్న" భయపడుతూనే అడిగింది.

"ఇప్పటివరకూ బాగానే వున్నారు. ఇప్పుడు నువ్వు అక్కడకు కూడా వెళితే నీ పుణ్యమా అని కుమిలి చస్తారు" ఎంత శాంతంగా మాట్లాడాలని ప్రయత్నించినా అతనికి సాధ్యం కావటంలేదు.

నోటికి పమిటచెంగు అడ్డు బెట్టుకుంటూ "ఇక వెళ్తున్నా లలిత్ ! మరెప్పటికీ మీకు కన్పించను ఇలా వచ్చినందుకు నన్ను క్షమించు" పలికి, చప్పున రెండడుగులు వేసింది.

"నా బిడ్డనేం చేశావ్ ?" కర్పూరిక గుండెల్లో బాంబు పేల్చాడు లలిత్.

"ప్లీజ్ ! ఆ విషయాన్నిక మర్చిపో లలిత్ ! నేనేం చెప్పలేను" బాధతో మెలికలు తిరిగిపోతూ అంది కర్పూరిక.

"ఛీ... ఛీ... ! నువ్వసలు మనిషివికాదు. నిన్ను....నిన్ను" కోపంగా, అసహ్యంగా, అంటూ ఆమెను సమీపించి గొంతు పిసకబోయాడు లలిత్.

నిర్వికారంగా గొంతు అప్పగించి నిల్చుంది కర్పూరిక. వెంటనే చేతుల్ని వదిలేస్తూ- "నిన్ను చంపితే నా చేతులు కూడా మైలపడతాయి. పో ! ఇక్కడి నుండి వెంటనే వెళ్ళిపో ! నా జీవితంలో ఇక మరెప్పుడూ కన్పించకు...." తీవ్రంగా హెచ్చరించి కర్పూరికను బయటకుతోసి, చప్పున తలుపులు బిగించాడు. మూసిన ఆ తలుపులకు ఆనుకొని నిలబడి, కళ్ళు మూసుకున్నాడు.

"కర్పూరిక అతని బిడ్డతో అలా వస్తే తప్పక క్షమించి, ఆదరించగలిగే వాడేమో...? అప్పుడు ఆమె జీవితానికి 'ముగింపు తప్పక మరోలా ఉండేది!"


ఆప్కో పట్టు అందాలతో
సంక్రాంతికి
స్వాగతగీతి పాడండి
ఆప్కో అందాల మాలిక
అదే-సంక్రాంతికి స్వాగత గీతిక!
ధాన్యలక్ష్మి మీ ఇంట అడుగిడే
ఈ శుభ సమయంలో
ఆప్కో పట్టు చీరలతో
మీ ఇంట ఆ తల్లికి
స్వాగతం చెప్పండి!
సంక్రాంతికి
20%
ప్రభుత్వ రిబేటు
చేనేతలు
kiron/apco/87fs1/tc